# వ్యాసకౌముది

## 2010 - 2011

### వ్యాసాలు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 114

# విషయ సూచిక


| ఏడాది | నెల | వ్యాసం పేరు | వ్యాస రచయిత(త్రి) | పేజి |
|---|---|---|---|---|
| 2010 | 6 | భాష అక్షరాస్యత | డా కొడవటిగంటి రోహిణి ప్రసాద్ | 2 |
| 2010 | 7 | ఎక్కడ నుంచి ఎక్కడ దాక | సత్యం మందపాటి | 8 |
| 2010 | 9 | ద్విగుణిత అష్టావధాన విశేషాలు | శ్రీనివాస ఫణికుమార్ డొక్కా | 11 |
| 2010 | 12 | బ్రహ్మం గారి కాలజ్ఞానం నిత్యం జరిగే సత్యమేనా? | కర్లపాలెం హనుమంత రావు | 19 |
| 2011 | 3 | భారతీయ సంస్కృతి పరిణామ వికాసాలు వికారాలు | గొల్లపూడి మారుతిరావు | 22 |
| 2011 | 3 | తెలుగు జాతి తెలుగు భాష పూర్వాపరాలు | య స్పీ చారి | 29 |
| 2011 | 8 | కథ నాటకం సినిమా | గొల్లపూడి మారుతిరావు | 33 |
| 2011 | 9 | రేడియో నాటకం | గొల్లపూడి మారుతిరావు | 38 |
| 2011 | 10 | భారతీయ సంస్కృతి పరిణామ వికాసాలు వికారాలు | గొల్లపూడి మారుతిరావు | 45 |
| 2011 | 7 | పోతన గారి పోత | డా దూర్వాసుల వేంకట సుబ్బారావు (మూడు భాగాలూ) (2011 07 -2011 09 | 52 |
| 2011 | 8 | నిష్కళంక కవితా తపస్వి కూచి నరసింహ కవిగారు | డా ఏల్చూరి మురళీధరరావు(మూడు భాగాలూ)(2011 08 – 2011 10) | 76 |
| 2011 | 10 | మహాకవి శ్రీ గురజాడ | డా దూర్వాసుల వేంకట సుబ్బారావు (రెండు భాగాలూ) (2011 10 – 2011 11) | 82 |
| 2011 | 11 | నాకు తెలియని నా 'నారు' | ఎమ్వీయల్ గారి అబ్బాయి (రెండు భాగాలూ) (2011 11 – 2011 12) | 94 |
| 2011 | 12 | భారతీయ సంగీతంలో మహిళల పాత్ర – ఒక పరిశీలన | డా వై కృష్ణకుమారి (రెండు భాగాలూ) (2011 12 2012 01) | 107 |




# భాష, అక్షరాస్యత

కొడవటిగంటి రోహిణీప్రసాద్

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 15 వ ఉగాది రచనల పోటీల్లో బహుమతి పొందిన వ్యాసం

**ఈ మధ్య** తెలుగుభాష హోదాను గురించిన చర్చలూ, సమావేశాలూ జరుగుతున్నాయి. ప్రపంచంలో ప్రతివారూ ఎంతో సహజంగా చేసేపని ఎవరి మాతృభాషలో వారు మాట్లాడడం, భావాలను వ్యక్తం చెయ్యడం. భాషల మధ్య పోటీలు తలెత్తడం ఒక వింత ఆధునిక పరిణామం. ఈ సందర్భంలో అసలు భాష అంటే ఏమిటో, దాని ఉపయోగం ఎలా జరుగుతుందో కాస్త ఆలోచించవలసిన సమయం వచ్చిందనిపిస్తోంది. ఎందుకంటే నేటి ప్రపంచంలో తెలుగుతో సహా ప్రాంతీయభాషలన్నీ కొంత ఒత్తిడికి లోనవుతున్నాయి. ప్రపంచీకరణ ప్రభావాలకు అధికసంఖ్యాకులు గురి కానంతవరకూ తెలుగువంటి భాషలు అంతరించిపోయే ప్రమాదం ఇప్పట్లో లేదని అనిపిస్తున్నప్పటికీ భాషలకు మన జీవితాల్లో ఉన్న ప్రాముఖ్యత గురించి ఒకసారి సమీక్షించుకోవడం మంచిదే. భాషలనేవి సహజంగా ప్రకృతిలో తలెత్తేవి కావు కనక వాటికి సామాజికపరిణామాలతోనూ, నాగరికతతోనూ సంబంధం ఉండితీరుతుంది.

గతంతో పోలిస్తే ప్రపంచంలో వేలాదిగా ఉండిన మాండలికభాషలన్నీ అతిత్వరగా అంతరించిపోతున్నాయని భాషావేత్తలు ఆవేదన చెందుతున్నారు. వీటితోబాటు అరుదైన సాంస్కృతిక సమాచారంకూడా మరుగునపడిపోతోంది. ప్రాంతీయ భాషాభేదాలేకాక దేశభాషలుకూడా ప్రపంచీకరణ కారణంగా అంతరించిపోయే ప్రమాదం కనబడుతోంది. కంప్యూటర్ల వెల్లువలో ఎన్నో భాషలకు ప్రాచుర్యం తగ్గుతోంది. తెలుగువంటి భాషలను చదివేవారూ, రాసేవారూ క్రమంగా తగ్గిపోతున్నారు. ఎప్పటికప్పుడు సరఫరా అవుతున్న సమాచారాన్ని తమ మాతృభాషలో చదివి, నేర్చుకునే అవకాశాలు తగ్గుతున్నాయి. అందరికీ అర్థమయే సాంకేతిక పరిభాష తయారుకావటం లేదు. ఇవన్నీ భాషకూ, సంస్కృతికీ సంబంధించిన పరిమితులు.

అక్షరాలూ, లిపులూ అన్నీ కొన్నివేల ఏళ్ళ క్రితం ప్రాథమికస్థాయిలో మొదలైన కొత్తపద్ధతులే. పరస్పర సంభాషణకు పనికొచ్చిన భాషలు నోటిమాటలుగా మొదలై, చాలా శతాబ్దాలపాటు సామాన్య ప్రజలమధ్య మౌఖికస్థాయిలోనే కొనసాగాయి. శబ్దాలనూ, అవి సూచిస్తున్న సమాచారాన్నీ ఏదో ఒక రూపంలో నమోదు చెయ్యవలసిన అవసరం నాగరికత మొదలయాక కొంతకాలం తరవాతగాని తలెత్తలేదు. ఎందుకంటే మననం చేసుకున్న విషయాలను గుర్తుంచుకోవటానికి మంచి జ్ఞాపకశక్తి ఉండాలి. అది అందరికీ సాధ్యంకాదు. ఒకరు రాసిపెట్టిన సంగతులను ఇతరులు ఎంతకాలం తరవాతనైనా చదివి అర్థంచేసుకోవచ్చు. ఎన్నో తరాలుగా ఒకేచోట, ఒకేరకమైన జీవితాలు గడపసాగిన మానవజాతికి ఇలా లిఖితరూపంలో భద్రపరచిన సమాచారం విలువైనదిగా పరిణమించింది.

ఎటొచ్చీ సమాచారవ్యాప్తికి అక్షరాలే ఉపయోగించక్కర్లేదు. అక్షరాలనూ, లిపినీ ఉపయోగించకుండానే రంగుపూసలూ, ఈకలూ మొదలైనవాటితో ఆదిమతెగలు దూరప్రాంతాలకు సందేశాలు పంపుకునేవారు. దూరానున్నవారికి వినిపించే విధంగా డప్పులమోతలూ, కనిపించే విధంగా గాలిలోకి ఎత్తుగా లేచే పొగలూ మొదలైనవికూడా ఉపయోగించేవారు. ఆ తరవాత రాళ్ళమీదా, ఇతర వస్తువులమీదా బొమ్మలు చెక్కడం మొదలయింది.

గుర్తుంచుకోవలసిన సమాచారాన్ని రాసిపెట్టుకోవలసిన అవసరం బహుశా వ్యవసాయం కారణంగానే తొలిసారిగా కలిగి ఉంటుంది. పంట వివరాలనో, నాట్లకూ, కోతలకూ తగిన సమయాలనో నమోదుచెయ్యడానికి ప్రాథమికరూపంలో భవిష్యత్తులో పనికొచ్చే విధంగా సంకేతాలను ఏర్పాటు చేసుకుని ఉంటారు. ప్రపంచంలో అక్కడక్కడా రకరకాల లిపులు ఏర్పడ్డాయి. మెసపొటేమియా, ఈజిప్ట్, సింధునదీప్రాంతం, చైనా, మధ్యామెరికా మొదలైన ప్రాంతాల్లో వేటికవిగా అక్షర సముదాయాలు పుట్టుకొచ్చాయి. అక్షరాస్యత అనేది సామూహికవిజ్ఞానం లిఖితరూపంలో పోగుచెయ్యడానికీ, గుర్తుంచుకోవలసిన విషయాలను ప్రజల్లో వ్యాప్తిచెయ్యడానికీ పనికొచ్చిన సాధనం. ప్రపంచంలోని గొప్ప నాగరికతలెన్నో లిపులను జ్ఞానవ్యాప్తికై సమర్థవంతంగా ఉపయోగించుకో గలిగాయి. చరిత్ర వివరాలనూ, సామాజిక, చట్టసంబంధిత నిబంధనలనూ, వైజ్ఞానిక, సాంకేతిక విషయాలనూ, యుద్ధతంత్రాలనూ, లిపిబద్ధం చేసి, తరవాతి తరాలకు అందించిన అక్షరాస్య సమాజాలు అంతులేని పురోగతిని సాధించాయి. ఇదంతా చూసి లిపి ఆవిర్భావం అనేది నాగరికతకు ప్రతీకగా అనుకుంటాంకాని అది నిజంకాదు. దక్షిణామెరికా లోని ఆండీస్ పర్వతప్రాంతాల్లో విలసిల్లిన గొప్ప నాగరికతల్లో అక్షరాస్యత మచ్చుకైనా ఉండేదికాదు. అలాగే ఎంతో ప్రగతినీ, ఔన్నత్యాన్నీ సాధించిన రోమన్ సామ్రాజ్యం చివరకు హూణులవంటి బర్బరుల వల్ల నాశనపోయింది.

రాసే ప్రక్రియ మొదలయాక శబ్దాలకూ, వాటిని సూచించే సంకేతాలకూ నిర్దిష్టమైన సంబంధం ఏర్పడటానికి రకరకాల పద్ధతులు ఉపయోగపడ్డాయి. అలాగే లేఖన సామగ్రి తయారు కావటానికి కొంత సాంకేతిక ప్రగతి అవసరమైంది. ఎన్నో శతాబ్దాలుగా నోటి మాటలకే పరిమితమై ఉండిన భాషలన్నిటికీ, లిపులూ, నిబంధనలూ, తరవాత వ్యాకరణ నియమాలూ రూపొందాయి. ఒకరు రాసిపెట్టిన విషయాలను తక్కినవారు చదివి అర్థం చేసుకునేందుకు వీలుగా భాషలకు రూపురేఖలు ఏర్పడ్డాయి. అంతమాత్రాన ప్రతి భాషకూ ఒక లిపి తయారయిందని కాదు. మన దేశంలో తుళు, కొంకణీ మొదలైన మాండలిక భాషల్లాగే ప్రపంచంలోని కొన్ని మాండలికాలకు లిపి ఉండదు. ఈ భాషలు ఒక్కొక్క ప్రాంతానికే పరిమితమైనప్పటికీ ఇవి మాట్లాడేవారి సంఖ్య అంత తక్కువేమీ కాదు. వాటిలో ఉత్తమ సాహిత్యంకూడా తయారవుతుంది కాని ఏవో చారిత్రక కారణాలవల్ల వాటికి లిపులు ఏర్పడలేదు.

అక్షరం అంటే నశించనిది అని అర్థం. ఒకసారి ఏదైనా రాసి ఉంచితే అది శాశ్వతంగా నిలిచిపోతుందని ప్రాచీనులు భావించారు. రాతిమీద చెక్కినవైతే నిజంగా శిలాక్షరాలే. ఈ రోజుల్లో రాయడం, చదవడం అవసరమా, కాదా అనే ప్రశ్నే తలెత్తదు. ప్రస్తుతం మన జీవితాలు గడిచే పద్ధతినిబట్టి అక్షరాస్యత ఎంతో సహజమైనదిగా అనిపించడంలో శ్చర్యంలేదు. ఒకప్పటి సమాజం ఇలా ఉండేదికాదు. తమ అవసరాలనుబట్టి మనుషులు సృష్టించుకున్న "అసహజమైన" వ్యవస్థల్లో లిపికూడా ఒక అంశం.

తొలినాటి లిపులు ప్రపంచంలో కొన్ని ప్రదేశాల్లో మాత్రమే విర్భవించాయి. లిపి అనేది ముందుగా సుమేరియన్ నాగరికతలోనూ, మెక్సికోలోనూ స్వతంత్రరీతుల్లో తయారైందని పరిశోధకుల ఉద్దేశం. నాగరికతలోని ఇతర విషయాలలాగే ఒకచోట తయారైన లిపి త్వరలోనే పొరుగు ప్రాంతాలకు వ్యాపించడంతో తక్కినవారికి ఎక్కడికక్కడ మళ్ళీ లిపులను సృష్టించుకోవలసిన అగత్యం లేకుండా పోయింది. వివిధప్రదేశాల్లో ఈ అనుకరణ మక్కీకిమక్కీ పద్ధతిలోనూ, ఇతరుల స్ఫూర్తితో తమకు అనువైన పద్ధతిలోనూ కూడా జరిగిన సందర్భాలున్నాయి. ఆధునికయుగంలో టర్కీలోనూ, న్యూగినీ, అమెరికా వగైరాల ఆదిమతెగల భాషలకు ఇంగ్లీష్ (రోమన్) లిపిని వాడడం జరిగింది. అలాగే రష్యాలోని కొన్ని తెగలు రష్యన్ (సిరిలిక్) లిపిని అనుసరించాయి.

కొత్త లిపులని తయారుచేసుకోకుండా ప్రాచుర్యంలో ఉన్న అక్షరాలను వాడుకునే ఈ విధానం మక్కీకిమక్కీ పద్ధతి. ఇటువంటి అనుసరణలూ, అనుకరణలూ గతంలోనూ జరిగాయి. తొమ్మిదో శతాబ్దంలో గ్రీక్, హీబ్రూ లిపులను కొద్దిగా మార్చి రష్యన్ అక్షరాలను రూపొందించారు. అంతకు ముందు నాలుగో శతాబ్దంలో ఇంగ్లీష్‌తోసహా అనేక లిపులకు ఆధారమైన జర్మన్ అక్షరమాలను బిషప్ ఉల్ఫిలాస్ అనే వ్యక్తి ఎక్కువగా గ్రీక్ అక్షరాలనూ, కొన్ని రోమన్ అక్షరాలనూ కలిపి తయారు చేశాడు. క్రీ.పూ.1400 ప్రాంతాల క్రీట్‌లోని మినోవా నాగరికత తొలి గ్రీక్ అక్షరాలకు ఆధారం అయింది.

ప్రాచీనలిపులలో అప్పటివారు రాసినవన్నీ అసంపూర్తిగా, అస్తవ్యస్తంగా, చదవడానికి జటిలంగా ఉండేవి. మొదట్లో నమోదు చేసిన సమాచారమంతా టెలిగ్రాఫ్ భాషలాగా పేర్లకూ, అంకెలకూ, కొలతలకూ, లెక్కలకూ, కొన్ని విశేషణాలకూ మాత్రమే పరిమితమై ఉండేది. ఎంతో అవసరమనిపించిన విషయాలను మాత్రమే ఇలా కష్టపడి రాసేవారు. ఎందుకంటే నోటితో ఉచ్చరించే శబ్దాలన్నిటికీ ప్రతీకలైన అక్షరాలు తయారవడానికి ఎన్నో శతాబ్దాలు పట్టింది. ఒకవంక సమాజజీవితంలో పరిణామాలు జరుగుతూ ఉంటే, మనుషులమధ్య జరిగే వ్యవహారాలూ, వ్యాపారాలూ జటిలం అవుతూ వచ్చాయి. ఎందరో వ్యక్తులకు సంబంధించిన ఎన్నో విషయాలను లిఖితరూపంలో నమోదు చేస్తున్నప్పుడు అపోహలకూ, అపార్థాలకూ అవకాశాలు లేకుండా చూసుకోవలసివచ్చింది. ఈ రోజుల్లో అవసరాలనిబట్టి కొత్తరకాల కంప్యూటర్ భాషలు తయారవుతున్నట్టే ప్రాచీనయుగాల్లో నాగరికత పెరుగుతున్నకొద్దీ ఈ రకమైన ఒత్తిడివల్ల లిపులు మెరుగు పడక తప్పలేదు. మొదట్లో మత, న్యాయ, చట్టపరమైన వ్యవహారాలకు మాత్రమే పనికొచ్చిన అక్షర జ్ఞానమంతా దేవాలయాల్లోనూ, రాజప్రాసాదాల్లోనూ పనిచేసే చాలా కొద్దిమందికి మాత్రమే ఉండేది. క్రీ.పూ. 3000 ప్రాంతంలో మొదలైన సుమేరియన్ లిపిని చదివితే అదంతా రాచ, దేవాలయవ్యవస్థలకు సంబంధించిన అధికారుల రచనలుగా దర్శనమిస్తాయి. ప్రాచీన ఈజిప్ట్, క్రీట్, గ్రీస్, చైనా, ఉత్తర అమెరికా నాగరికతలన్నిటిలోనూ ఇదే కనిపిస్తుంది.

తొలి లిఖితసాహిత్యానికి ప్రజాస్వామికలక్షణాలేవీ ఉండేవి కావు. వృత్తిపరంగా రాయ, చదవ నేర్చినవారు ఒక్కొక్క చోటా 30, 40కి మించి ఉండేవారుకారు. సమాజంలో శ్రమవిభజన మొదలవడంతో అదనపు ఆహారోత్పత్తిని సాధించడం వీలైంది. కాయకష్టం చేసే వర్గం వేరవడంతో తిని, కూర్చోగలిగిన మరొక వర్గం ఏర్పడింది. ఇందులో కొందరు రకరకాల ప్రత్యేకవృత్తుల్లో నైపుణ్యం సంపాదించుకోగలిగారు. వాటిలో అక్షరాస్యత ఒకటి. వర్గాలమధ్య అంతరాలు ఏర్పడుతున్నకొద్దీ రాయడమనే నైపుణ్యానికి స్పష్టమైన వర్గస్వభావం రూపొందసాగింది. ఏం రాయాలో, ఎందుకు రాయాలో తెలిశాక రాసే విధానం దానికి తగినట్టుగానే తయారైంది. రచనా పద్ధతికూడా అందరికీ అర్థం కావలసిన అవసరం ఉండేదికాదు. అచ్చంగా పాలకవర్గాలకే పరిమితమైన నాటి అక్షరజ్ఞానమంతా వారి వర్గప్రయోజనాలు కాపాడటానికీ, అలగాజనాన్ని పన్నులూ మొదలైనవాటితో అణిచి ఉంచడానికీ ఉపయోగపడింది.

అక్షరాస్యత కొద్దిమందికే పరిమితం కావడంతో ఏదైనా నాగరికత అంతరించినప్పుడల్లా విలువైన అక్షరజ్ఞానం మరుగున పడిపోతూ ఉండేది. సింధునది లోయలో అద్భుతమైన నగరనిర్మాణ వ్యవస్థతో వర్ధిల్లిన నాగరికత ఆర్య భాషీయులతో సంపర్కం ఏర్పడ్డాక నాశనమైనట్టుగా పరిశోధకులు చెపుతారు. అక్కడి అవశేషాల్లో ముద్రికలమీద కనిపిస్తున్న లిపికీ, తరవాతి వేదకాలపు భాషకూ ఎటువంటి సంబంధమూ కనబడదు. క్రీ.పూ. 1200 ప్రాంతంలో అతి ప్రాచీన గ్రీక్ నాగరికత కుప్పకూలిన తరవాత వారి లిపి కూడా అంతరించిపోయింది. మళ్ళీ నిరక్షరాస్యతే మిగిలింది. తరవాత మరొక 400 ఏళ్ళకు అదే ప్రాంతంలో మరొక గ్రీక్ నాగరికత తలెత్తడం, తమకు అనువైన పద్ధతిలో వారు మెరుగైన అక్షరమాలను రూపొందించుకోవడం జరిగాయి. గతంతో పోలిస్తే వారి జీవనశైలిలోనూ, జీవితావసరాల్లోనూ కలిగిన మార్పుల దృష్ట్యా కొత్త పద్ధతిలో రాసే విధానం మరింత నిర్దుష్టంగా తయారైంది.

మనదేశపు తొలి లిపి క్రీ.పూ. 2400 నాటి సింధునాగరికతలో మొదలైనప్పటికీ అది తొలి వేదాలనాటికే (క్రీ.పూ. 1200) అంతరించిపోయింది. మౌఖికరూపంలో కొనసాగిన వేదసాహిత్యం లిపిబద్ధం కావడం అశోకుడి కాలంలోనే (క్రీ.పూ. 270) ఎక్కువగా జరిగింది. అదంతా బ్రాహ్మీ లిపిలో ఉండేది. తెలుగుతో సహా భారతీయభాషల అక్షరాలన్నీ బ్రాహ్మీ లిపినుంచే పుట్టుకొచ్చాయి.

ప్రపంచంలోని ఆధునిక లిపులలో ఎన్నోరకాలు కనిపిస్తాయి. ఇంగ్లీష్ వంటి భాషల్లో హల్లులకూ, అచ్చులకూ వేరువేరు అక్షరాలుంటాయి. ఏ మాట రాయాలన్నా 26 అక్షరాలలో అవసరమైనవాటిని పక్కపక్కనే రాస్తూపోవాలి. అచ్చు లేని హల్లులను క్, గ్ వగైరాలుగా ఉచ్చరించాలి. ప్రతి అక్షరాన్నీ ఉచ్చరించడానికి అచ్చులు కావాలి. తెలుగువంటి భారతీయ లిపుల్లో ఉచ్చరించగలిగిన సిలబిల్ అక్షరాలు రాయవచ్చు. అక్షరం స్వరూపం మారదుకాని గుణింతాలు మారుతూ ఉంటాయి. ఈజిప్ట్ వంటి కొన్ని ప్రదేశాల ప్రాచీన భాషల్లో అచ్చులు వాడేవారుకారు. అన్నీ హల్లులే. సందర్భాన్నిబట్టి పదాలను ఉచ్చరించాలి. ఛాయలు కొన్ని ముస్లిం పేర్లలో ఇప్పటికీ కనిపిస్తాయి. మహ్మద్, మహమద్, మహమ్మద్, ముహమ్మద్, మొహమ్మద్, మహ్మూద్, మెహమూద్ ఇలాంటివన్నీ కొద్ది వ్యత్యాసాలతో పలుకుతారు.

చైనా, జపాన్ మొదలైన భాషలన్నీ రేఖామాత్రంగా కనిపించే బొమ్మలవంటివిగా మొదలయాయి. కనబడుతున్న వస్తువులను వర్ణించడానికి చిత్రలిపిని వాడడం సులువు. కుక్క అనే పదాన్ని సూచించడానికి చిన్న కుక్కబొమ్మను గీయవచ్చు. చదివేవారు దాన్ని చూడగానే కుక్క అనో, తమ భాషలో అర్థాన్ని సూచించే మరొక మాటనో ఉచ్చరిస్తారు. మరొకపద్ధతిలో ఒక పదంలో వినబడే అక్షరాలనుబట్టి వాటికి ప్రతీకలైన బొమ్మలు గీసుకోవడం వీలు. ఉదాహరణకు వడగళ్ళు అనే మాట రాయడానికి ఒక గారె బొమ్మనూ, దాని పక్కనే కాసిని గళ్ళనూ గీసే పద్ధతి పెట్టుకోవచ్చు. ఈ బొమ్మలకూ, వడగళ్ళకూ సంబంధం లేకపోయినా వడనూ, గళ్ళనూ గుర్తించినవారు పదాలను కలిపి చదువుకోగలుగుతారు. కొన్ని లిపులు ఈ పద్ధతిలో రూపొందాయి. ఇవన్నీ వివిధప్రాంతాల్లో వివిధరీతుల్లో పరిణామం చెందాయి.

ఈ నాటి భాషల్లో ఎడమనుంచి కుడి వైపుకు రాసేవే ఎక్కువగా కనబడతాయి కాని ఉర్దూ, అరబిక్ వంటివన్నీ వ్యతిరేకదిశలో సాగుతాయి. తూర్పుదేశాల్లో నిలువుగా రాసే సంప్రదాయంకూడా ఉండేది. దీనికీ, ప్రాచీనులు తొలియుగాల్లో చేసిన ప్రస్థానాలకూ సంబంధం ఉందని కొందరంటారు. మొదట నమోదుచేసిన వివరాల్లో ప్రతిరోజూ సూర్యబింబం స్థానాన్ని సూచించేవారని ఈ ప్రతిపాదన చెపుతుంది. మనదేశంలో లిపి వాడిన వారిలో ఎక్కువమంది దక్షిణంగా ప్రయాణించారు కనక తమ ఎదుట తూర్పున ఉదయించే సూర్యబింబం స్థానాన్ని మొదటగా ఎడమకొసలో గీయవలసివస్తుంది. ఆ తరవాత రోజు గడిచినకొద్దీ కుడి వైపుకు రాస్తూ పోవాలి. మధ్యాసియాలో ప్రజలు ఉత్తరంగా వెళ్ళారనీ, చైనా మొదలైన ప్రాంతాల్లో పడమటి దిక్కుగా ప్రయాణించారనీ, కారణంగా అక్షరాలు రాసే పద్ధతి రూపొందిందనీ అంటారు. ఆదిమయుగాల్లో సూర్యుడిని ఆరాధించేవారు కనక ఇది నిజమేనేమో. మరొక సిద్ధాంతం ఈజిప్ట్‌లోని పెపైరస్ కాగితాలమీద ఆధారపడినది. నైల్ నది ప్రాంతంలో విరివిగా పెరిగే రెల్లుగడ్డివంటి పెపైరస్‌ను కాగితాల తయారీకి వాడేవారు. ఇది ఎండాక చుట్టచుట్టుకుని ఉండేది. కుడిచేత్తో రాసేటప్పుడు దీన్ని ఎడమచేత్తో తెరుస్తూ పోవాలి. ఇలా చెయ్యాలంటే కుడినుంచి ఎడమకు రాస్తూ పోవడమే వీలుగా ఉంటుంది. ఈ పరిస్థితులన్నిటిలోనూ నిజంగా ఏం జరిగిందో ఊహించాలే కాని ఖచ్చితంగా చెప్పడం వీలవదు.

అక్షరాలకు ప్రాణం ఉండదు. అవి శబ్దాలకు కేవలం సూచకాలు మాత్రమే. ఉచ్చారణకు కొంతవరకే తోడ్పడతాయికాని హావభావాలను పలికించలేవు. లిఖితసమాచారం మన మేధస్సుకు సహాయపడే ఊతకర్ర వంటిది. చిన్నప్పటినుంచీ నేర్చుకుంటాం కనక అక్షరాలను చదివి, మనసులోనో, బిగ్గరగానో ఉచ్చరిస్తూ పదాలను అర్థంచేసుకోవడం మనకు అలవాటవుతుంది. ఎందుకంటే ప్రపంచభాషల్లో వేటిలోనైనా అక్షరాల స్వరూపానికి స్వతహాగా అర్థమేమీ ఉండదు. ఎటువంటి వంకరగీతలు ఎటువంటి శబ్దాన్ని

సూచిస్తాయో ముందుగా నిబంధించిన సూత్రాలనే అందరూ పాటిస్తారు. ఇదొక షార్ట్‌కట్ పద్ధతి. ఇది ఎన్ని రకాలుగానైనా ఉండవచ్చు. వివిధప్రాంతాల్లో, వివిధయుగాల్లో అనేక పద్ధతులు మొదలై, వ్యాప్తిలోకి వచ్చాయి.

చైనా భాష వంటివాటిలో ఒకే అక్షరం ఒక పూర్తి పదాన్ని సూచిస్తుందంటే మనకు కొత్తగా అనిపిస్తుంది కాని నిజానికి అంకెల విషయంలో మనకూ అటువంటి ఏర్పాటే ఉంది. 4 అని రాసినప్పటికీ మనం దాన్ని నాలుగు అనే మూడక్షరాల పదంగానే పరిగణిస్తాం. కొన్ని భాషల్లో ఒక్కొక్క సంకేతమూ ఒక్కొక్క ఉచ్చరించదగిన శబ్దంగా పనికొస్తుంది. ఈ సంకేతాలు ఒక్కొక్కటీ చిత్రలిపి కావచ్చు. ఒకరకంగా చెప్పాలంటే ఇది శ్లేషపద్ధతి.

తెలుగులో ప్రాచీనకావ్యాల్లో అరసున్నా ఉండేదికాదు. ఎటొచ్చీ పూర్వకాలంలో తెలుగులో దాదాపు ఒకేలాంటి ఉచ్చారణ కలిగిన కొన్ని పదాలలో ఒకదాన్ని మామూలుగానూ, మరొకదాన్ని ముక్కుతో పలికేవారట. సందర్భాన్నిబట్టి ఏది ఎలా పలకాలో అందరికీ తెలిసేది. ఉదాహరణకు వాడు అంటే ఉపయోగించు, లేదా ఎండిపోవు అనే అర్థం ఉంది. మూడో అర్థంలో అతడు అనికూడా అనుకోవచ్చు. కానీ పండితులు మూడో సందర్భంలో మాత్రం వాఀడు అని రాయాలంటారు. ప్రాచీన కాలంలో లేని ఈ ప్రయోగం తరవాతి కాలంలో ఎందుకొచ్చిందో వివరిస్తూ తిరుమల రామచంద్రగారు కొన్ని విషయాలు రాశారు. పాత తెలుగులో వాండు అనే ప్రయోగం ఉండేది. ఇప్పటికీ రాయలసీమ మొదలైన ప్రాంతాల్లో బహువచనంలో వాండ్లు అనే అలవాటు కనబడుతుంది. ఈ వాండు అనే మాటను ఒక్కొక్కప్పుడు పూర్తి సున్నాతో వత్తి పలికేవారట. ఒక్కొక్కప్పుడు తేల్చి ముక్కుతో పలికేవారట. తేల్చి పలుకుతున్నప్పుడు అరసున్నా వాడాలి. ఆధునికయుగంలో భాష నేర్చుకోవడం పూర్తిగా పుస్తకాలమీదనే ఆధారపడుతున్న పరిస్థితుల్లో సరైన అర్థం తెలియడానికని అరసున్నా చేర్చే నిబంధన పెట్టుకుని ఉంటారు.

ఇలాంటి విషయాల్లో ఒక్కొక్కప్పుడు రాసినదానికీ, ఉచ్చారణకూ సంబంధం ఉండేది కాదు. రామచంద్రగారు 1065 నాటి శాసనంలోని ఈ పద్యాన్ని ఉదహరించారు.

"సకల వశుమతీశ మకుటలసద్రత్న

కిరణరుచి విరాజి చరణుణ్డయిన..."

ఇందులో చివరి పదాన్ని చరణుడయిన అనే చదవాలి. లేకపోతే ఆటవెలది నడక చెడిపోతుంది. ఇటువంటి పద్ధతుల కారణంగా మనకు ప్రాచీనకాలపు తెలుగు అక్షరాలు చదవడానికి కష్టంగా అనిపిస్తుంది. ఒకవేళ చదవగలిగినా ఈ అన్నమాచార్య రచనలాగా కొంత గందరగోళంగా అనిపిస్తుంది. "...అద్దమరాతిరి దాంకా నంద్దు నింద్దు నుండ్డి వచ్చి వొద్దురవోరా నీకు నింత్త వొలశి నొల్లములు..". ఇప్పటి తెలుగు ఉచ్చరించే పద్ధతిలో ఫోనెటిక్‌గా ఉంటుంది కనక మనకు అంత ఇబ్బందిగా ఉండదు. అయినా మామ, దోమ వగైరా పదాలను కోస్తా వారిలాగా తక్కిన తెలుగువారు మాఀవ, దోఀవ అనకపోవడం చూస్తూనే ఉంటాం.

లిపులవల్ల ఈనాడు ఎన్నెన్నో ఉపయోగాలున్నాయి కనకనే వాటి ఉచ్చారణ గురించి ఎంతో చెప్పుకోవడం వీలవుతోంది. కానీ ఆనాడైనా, ఈనాడైనా అక్షరాల ముఖ్యప్రయోజనం ప్రజలకు సమాచారాన్ని అందించడమే. రాసిపెట్టిన సమాచారం ఒకేసారిగా అనేకమందికి కనిపించినప్పుడో, అనేకసమయాల్లో అనేకతరాలకు అందుబాటులోకి వచ్చినప్పుడో సార్థకమవుతుంది. సామాజిక ప్రయోజనమే రాసినది చదవడంలోని ముఖ్యవిషయం. ఎందుకంటే ఎవరైనా ఇద్దరు వ్యక్తులు తమకు మాత్రమే అర్థమయే రహస్య లిపిలో సందేశాలు రాసి పంపుకోవచ్చు. అది ఇతరులకేమీ ఉపకరించక పోవచ్చు. ప్రపంచంలో వ్యాప్తి చెందినవన్నీ అందరికీ ఉపయోగపడే రచనా పద్ధతులే. నాగరికత పెరిగి విస్తరించడానికి ఇవి చాలా తోడ్పడ్డాయి.

పుస్తకాలలో మొదలైన లిపులూ, భాషలూ ఇతర ధునిక మాధ్యమాలలోకి పాకాయి. ఆధునికయుగపు టెక్నాలజీ దేశీయ, జాతీయభాషలకూ, సంప్రదాయాలకూ హాని కలిగిస్తుందనే మాట పూర్తిగా నిజంకాదు. ఆసక్తి ఉండాలేగాని కంప్యూటర్ల సామర్థ్యంవల్ల ఈ

రోజుల్లో ఎవరైనా తెలుగువంటి లిపుల్లో రచనలు చెయ్యవచ్చు. తెలుగు పదాలను ఉచ్చరించగలిగిన పిల్లలు కూడా వాటిని ఇంగ్లీషులో టైప్ చెయ్యగానే తెలుగు లిపిలో వాటిని అచ్చువెయ్యగల సదుపాయం కంప్యూటర్లలో ఉంది. అటువంటి సాధనం ద్వారా ఎవరైనా తెలుగు నేర్చుకోవచ్చు. అలాగే ఎక్కడెక్కడికో వెళ్ళి లైబ్రరీల్లో ప్రాచీన తెలుగు గ్రంథాలను వెతుక్కోనక్కర్లేకుండా డిజిటల్ లైబ్రరీల ద్వారా ఇంటర్నెట్ సహాయంతో వాటిని చదువుకోవచ్చు. పుస్తకాలే కాక, ఆడియో, వీడియో సౌకర్యాల ద్వారా సంస్కృతిక విశేషాలను భద్రపరుచుకోగలిగిన అవకాశాలు పెరుగుతున్నాయి. ఇతర సమాచారంతో బాటు భాషల చరిత్ర, వాటి పరిణామం మొదలైన వివరాలను తెలియజేసే సదుపాయాలుకూడా ఇంటర్నెట్ అందిస్తుంది. వాటిని ఉపయోగించుకోగలిగితే రాబోయే తరాలు భాషాసంస్కృతిని సంరక్షించుకోగలవు.

✡ ✡ ✡




# ఎక్కడినించి ఎక్కడిదాకా..

## సత్యం మందపాటి

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 15 వ ఉగాది రచనల పోటీల్లో ప్రసంశాపత్రం పొందిన వ్యాసం

**భాష అనేది ఒక నది లాంటిది.** అనంతంగా ప్రవహిస్తూనే వుంటుంది.

అలా ప్రవహిస్తున్నప్పుడు ఎన్నో కాలువలు, వేరే నది పాయలూ ఈ నదిలో కలుస్తూనే వుంటాయి. వాటిని కలుపుకుని, ఇంకా పెద్దదయి ప్రవాహాన్ని పుంజుకుంటుంది. దీనికి అడ్డుపడటం కూడా ఎవరికీ సాధ్యం కాదు.

అలాగే ఒక భాష మిగతా భాషల్లోని పదాలను, అందాలను చేర్చుకుంటూ విస్తృతమవుతుంది.

ఉదాహరణకి ఇంగ్లీషునే తీసుకుందాం. ఇంగ్లీషు భాషలో పరభాషల్లోనించీ వచ్చిన మాటలు వేల సంఖ్యలో వున్నాయి. లాటిన్ ఫ్రెంచ్ జర్మన్ ఇటాలియన్ గ్రీక్ మొదలైన యూరోపియన్ భాషల్లోనించే కాక ఆసియా భాషల్లో నించీ కూడా వచ్చి ఎన్నో పదాలు ఇంగ్లీషు పదాలుగా మారిపోయాయి. అంతేకాదు, మన భారతీయ పదాలు కూడా ఎన్నో ఆంగ్లంలో చేరిపోయాయి. కొన్ని పదాలు భాషాంతరం చేసేటప్పుడు మార్పులు చెందటం కూడా జరిగింది.

తమిళంలో నించీ కాష్ (కాసు), మేంగో (మాంగా), కేటమరాన్ (కట్టమరాన్) మొదలైనవి, తెలుగులో నించీ బాండికూట్ (పందికొక్కు), హిందీలో నించీ గురు... ఇలా ఎన్నో వున్నాయి. ఈ పదాలు ఇంగ్లీషులో అలా కలిసిపోయి, ఇంగ్లీషు పదాలయిపోయాయి. అంతేకాని ఇంగ్లీష్ భాషని సంకరం చేయలేదు, ఆ భాష పేరుని కూడా మార్చలేదు.

మన తెలుగు భాషలో పరభాషా పదాలు వచ్చేస్తున్నాయనీ, సంకరం చేసేస్తున్నాయనీ అనుకునేవాళ్ళున్నారు. పైన చెప్పిన ఉదాహరణ చూస్తే ఆ విషయం గురించి భయపడనఖ్ఖర్లేదనిపిస్తుంది.

మన తెలుగులో కూడా ఎన్నో పరభాషా పదాలు చేరిపోయాయి. తెలుగు ద్రవిడ భాష అవటం వల్ల, తల ముక్కు కాలు కన్ను అమ్మ అత్త అన్న మామలాటివెన్నో తమిళంలోనించీ తెలుగులోకి వచ్చేశాయి. ద్రవిడదేశంలో ఉత్తరాదిన వుండటం వల్ల కష్టం సుఖం సంతోషంలాటి ఎన్నో సంస్కృత పదాలు తెలుగు పదాలుగా మారిపోయాయి.

పరదేశాలనించీ వచ్చిన పదాల్లో పర్షియన్, అరేబియన్ మొదలైనవే కాక, ఇంగ్లీషులోనించీ ఎన్నో పదాలు చేరి తెలుగు పదాలుగా మారిపోయాయి. ఉదాహరణకి పోలీసు, రైలు, రైలుస్టేషన్, సిగ్నల్, బస్‌స్టాండ్, టెలిఫోన్, టీవీ, రేడియో, ప్రెషర్ కుక్కర్, గాస్ సిలెండర్, పెట్రోల్... వీటికి తెలుగు పదాలు లేనంతగా తెలుగులో కలిసిపోయాయి. మరి తెలుగు సంకరమయిపోయిందా? ఆ ధాటికి

కొట్టుకుపోయిందా? ఏమీ అవలేదు... ఇంకా విస్తృతమయింది. కనీసం పేరు కూడా మార్చుకోలేదు. పైన చెప్పినట్టు కృష్ణా నదిలో ఎన్నో కాలువలు కలిసినప్పుడు, అవి ఆ నదిలో అంతర్భాగమయిపోయి కృష్ణా నదిగానే ప్రవహిస్తాయి కానీ, కృష్ణా నది పేరుని ఏలూరు కాలువగానో, బందరు కాలువగానో మార్చవు. అలాగే తెలుగు తెలుగులాగానే వుంటుంది.

ఏ భాషలోనైనా మార్పులు ఇంకొక రకంగా కూడా వస్తాయి. అవి తరాల అంతరాలను బట్టి వస్తాయి. ఉదాహరణకి ద్రవిడ భాషలోనించీ వచ్చిన కొన్ని తెలుగు పదాలను, క్రీస్తు పూర్వం కవయిత్రి రంగాజమ్మ వాడినప్పటి నించీ ఇప్పటిదాకా ఎన్నో రూపాంతరాలు చెందింది. అచ్చ తెలుగు పదాలను ద్రవిడ పదాలతో కలుపుకున్నది తెలుగు. నన్నయ భారతం వ్రాస్తూ, తెలుగుని సంస్కృత పదభూయిష్టం చేయటంతో, సంస్కృత పదాలెన్నో తెలుగులో కలిసి తద్భవాలు ఉద్భవించాయి. తెలుగులో గ్రాంధిక భాష చోటు చేసుకుంది. మహారాజుల ప్రాపకంతో ఆ తెలుగు భాష గ్రాంధిక పథంలో ముందుకు సాగింది. గిడుగు రామ్మూర్తిగారి వల్ల వాడుక భాష ముందుకు వచ్చి, ఎక్కువ పల్లె పదాలను, సామాన్య పదాలనూ, అచ్చ తెలుగు పదాలనూ సంతరించుకున్నది. ఆయన వెలిగించిన దీపానికి చేతులడ్డం పెట్టి, ఇంకా ముందుకు తీసుకువెళ్ళాడు గురజాడ అప్పారావు.

మధ్యే మధ్యే తెలుగు భాషలో ప్రాంతీయమైన యాస కూడా చేరి, తెలుగు బాష తీయదనాన్ని మరింతలు చేసింది. మనమేదో ఆంధ్రా, తెలంగాణా, రాయలసీమ యాసలు అంటామే కానీ అది పూర్తిగా నిజం కాదు. ఒకే ప్రాంతంలో కూడా రకరకాల యాసలు వున్నాయి. దీక్షగా పరిశీలిస్తే, గుంటూరు తెలుగుకీ కృష్ణా జిల్లా తెలుగుకీ తేడా కనిపిస్తుంది. అలాగే కాకినాడ తెలుగుకీ వైజాగ్ తెలుగుకీ తేడా కనిపిస్తుంది. వరంగల్ తెలుగుకీ, మహబూబ్ నగర్ తెలుగుకీ తేడా కనిపిస్తుంది. అమెరికాలో కూడా టెక్సస్ ఇంగ్లీష్‌కీ, న్యూయార్క్ ఇంగ్లీష్‌కీ ఎంతో తేడా వుంది కదూ. అలాగే.

ఈ వ్యావహారిక భాష, తెలుగుని మొన్నమొన్నటిదాకా బాగా నడిపించింది. ఇప్పుడూ కొంచెం కుంటుతున్నా, నడుస్తూనే వుంది. ప్రస్తుతం తెలుగు ఎలా వుందో చూద్దాం.

ప్రపంచం మొత్తంలోనూ, సినిమా ప్రభావం మన భారతదేశంలో వున్నంతగా ఇంకే దేశంలోనూ కనపడదు నాకు. మనకి సినిమాలు తప్ప ఇంకేదీ అఖ్కర్లేదు. ముఖ్యంగా తెలుగునాట ఈ సినిమా ప్రభావం, ప్రాభవం ఇంకా ఎక్కువ. జనం సినిమాల్లోనే జీవిస్తున్నారు. పక్కన వున్న తమిళనాడు, కేరళలలోలాగా, మనకి ప్రతివారం ప్రతి వూళ్ళోనూ కర్ణాటక సంగీత కచేరీలు, సాంఘిక నాటక ప్రదర్శనలూ మొదలైన ఇతర సరదాలూ వ్యాపకాలూ కనపడవు, ఎక్కడో హైదరాబాద్‌లాటి నగరాల్లో నెలకి రెండో మూడో తప్ప. టీవీలోనూ సినిమా కబుర్లే, సినిమా పాటలే, సినిమా డాన్సులే. పార్టీల్లోనూ, క్లబ్బుల్లోనూ, బయట కాన్సర్ట్‌లలోనూ కూడా సినిమా పాటలే. సినిమా డాన్సులే. తెలుగువారి జీవితం సినిమాలకే అంకితమయిపోయింది.

వాటి ప్రభావం ఎంతగా వుందంటే, ఈనాటి తెలుగు సినిమాల్లో ఏ భాష మాట్లాడితే అదే బాల్యం నించీ కౌమారం దాకా ప్రజలకి అలవాటయిపోతున్నది. మరి అది ఎలాటి తెలుగో చూద్దాం.

పాటలు పాడేవారు చాలమంది తెలుగువారు కాదు. వాళ్ళ తెలుగు చాల వరకూ అర్థం కాని తెలుగు. అర్థం లేని తెలుగు. ఒత్తులు అనేవి ఎక్కడా కనపడవు. ఇక మాటల కొస్తే, మాటల రచయితలు ఒకళ్ళో ఇద్దరో తప్ప చక్కటి తెలుగు వ్రాసేవాళ్ళు అరుదయిపోయారు. మరి తెలుగు స్కూళ్లో చదువుకునేవాళ్ళు తగ్గిపోవటంతోనూ, హైదరాబాద్ భాషా ప్రభావంతోనూ చాలమంది తెలుగు హీరోలకి తెలుగు రాదు. వచ్చినా ఉచ్చారణ సరిగ్గా వుండదు. ఒక హీరో 'నేను పెళ్లి చేసుకుంటాను' అంటే, ఇంకో హీరో 'నాకేమీ అరదం కాదు' అంటాడు. సినిమా పేర్లు కూడా అదుర్స్, మొగుడ్స్ అండ్ పెళ్ళామ్స్ అని పెట్టే దాకా వెళ్ళింది మన తెలుగు సినిమా.

ఇక టీవీ చూద్దామా అంటే 'యాంకర్లు' మాట్లాడే భాషలో తెలుగు పదాలు తక్కువ. 'విష్ యు హేపీ బాత్ డే అండీ' అంటుంది. దాంట్లో అండీ ఒక్కటే తెలుగు మాట. అంటే తెలుగు యాంకర్ ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్న దన్నమాట, చివరలో ఒక్క తెలుగు మాట వాడి.

తెలుగు భాష తెలుగుతనాన్ని కోల్పోతున్నదా? లేదా తెలుగు భాషా జీవన స్రవంతిలో ఇదొక పరిణామమా?

ఈలోగా ఇంటర్నెట్‌లో తెలుగు వచ్చేసింది. అంటే సైబర్ తెలుగన్నమాట. దానితో ఇంగ్లీష్ పదాలు విస్తృతంగా తెలుగులోకి చొచ్చుకు వచ్చేశాయి. ఇంగ్లీషు పదాలని తెలుగు పదాలతో కలిపి, తెలుగు ఫాంట్లు వాడుతూ అవి వ్రాస్తుంటే ఒక పక్క హాస్యం వస్తున్నది, ఇంకో పక్క తెలుగు భాషాంతర విన్యాసం చేస్తున్నది.

'దీనికి రెండు బిడ్లు వచ్చాయి' అని చదివాక నాకేమీ అర్థం కాలేదు. బిడ్డలేమో అనుకున్నాను. తర్వాత అర్థమయింది 'ఈ కాంట్రాక్ట్‌కి రెండు బిడ్స్ వచ్చాయి' అని.

'సీమాంధ్రలో రైల్రోకోలు'. ఏదో 'కోలుకోలోయన్న కోలోకోలు' తెలుసు కానీ, ఈ కోలేమేటో కాసేపు బుర్ర పగలగొట్టుకుంటే కానీ అర్థం కాలేదు.

ధోనీ 'పిచ్చు చదవటంలో పొరపాటు చేసినందుకే ఓడిపోయాం' అన్నాడు.

'ఇక్కడ క్లిక్ చేయండి' 'సెర్చి ఇంజను' లాటి ఇంగ్లీషు తెలుగు కొన్నాళ్ళు ఎక్కువగా వచ్చింది.

అమెరికాలో తెలుగువాళ్ళు కొందరు ఇంటర్నెట్ తెలుగుకి, తెలుగులోనే భాష్యం చెబుతున్నారు. ఇది ఇంకొక మార్పు. ఇంటర్నెట్‌ని అంతర్జాలం అనే పేరుతో ప్రసిద్ధం చేస్తున్నారు. ఇప్పుడు ఇంటర్నెట్ పత్రికలనీ, గూగుల్ వార్తలనీ, యాహూ తెలుగునీ చూస్తే ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.

పత్రములు, గుంపులు, నా ఖాతా, శోధించు, ఈ పేజీని సవరించు, ముఖ్య కథనాలు, అన్ని కథనాలు, మరిన్ని కథనాలు, సహాయం, ఉపయోగ నిబంధనలు, గోప్యత, సాధన పట్టీ, ఇంకా చదవండి, స్పందనలు... ఇలా మళ్ళీ తెలుగు వచ్చేస్తున్నది.

ఈ సైబర్ తెలుగు ఇంకో వందేళ్ళల్లో మరి ఎలా వుంటుంది?

మీరూ, నేనూ ఇంకో వందేళ్ళు ఆగి అప్పుడు చూద్దాం ఎలా వుంటుందో!

0 0 0

# వ్యాస కౌముది



## మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ. వద్దిపర్తి పద్మాకర్ గారి ద్విగుణిత అష్టావధాన విశేషములు

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

| | |
|---|---|
| **స్థలము :** | **హిందూ టెంపుల్ ఆఫ్ అట్లాంటా** |
| **తేదీ:** | **ఆగష్టు 07 2010 శనివారం (మధ్యాహ్నం 2:30 - 4:30)** |

**పృచ్ఛక వర్గం:**

| | |
|---|---|
| **సమస్యాపూరణ:** | శ్రీమతి.కంభంమెట్టు శాంతకుమారి గారు (ఏలూరు) |
| | శ్రీ.నేమాని సోమయాజులు గారు |
| **దత్తపది :** | శ్రీ.ఓలేటి నరసింహ రావు గారు, శ్రీ.మేడూరి కిషోర్ గారు |
| **వర్ణన:** | శ్రీ.పోణంగి రవి గారు, డాక్టర్.సోమయాజుల కాశీవిశ్వనాథం గారు |
| **ఆశువు:** | డాక్టర్.పెమ్మరాజు వేణుగోపాల రావు గారు, |
| | డాక్టర్.పూడిపెద్ది శేషుశర్మ గారు |
| **న్యస్తాక్షరి:** | శ్రీ.భగవతి సుబ్బారావు (గోపి) గారు |
| **పురాణపఠనం:** | శ్రీమతి.షీల లింగం గారు, శ్రీ.సునీల్ కాటేపల్లి గారు |
| **వ్యస్తాక్షరి:** | శ్రీ. మూల సిద్దారెడ్డి గారు ( ముంబై తెలుగు అసోసియేషన్ ) |
| **అప్రస్తుత ప్రసంగం:** | శ్రీ. శ్యాం సుందర్ యెల్లం రాజు గారు, శ్రీ డొక్కా ఫణి గారు. |

**సమస్యాపూరణ:**

**శాంత కుమారి గారిచ్చిన సమస్య :**

***చిటికెన వ్రేలి యుంగరము సీతకు కంకణమాయె భూవరా !***

**పూరణ:**

పటుతర రామ నామము శుభప్రద కావ్యమటంచు నమ్మి సం
కటముల కోర్చి దుఃఖము సుఖమ్మును రెండును నొక్కటంచు ము
న్నటివలె కానరాదు గద, ప్రాణము మాత్రము నిల్పె నెట్లొ,నీ
*చిటికెన వ్రేలి యుంగరము సీతకు కంకణమాయె భూవరా !*

**సోమయాజులు గారిచ్చిన సమస్య :**

***సంధ్యావందన మాచరింపుము విలాసంబొప్పు కౌగిళ్ళలో !***

**పూరణ:**

నింధ్యానించెద చిత్తమందున భవానీవాణి శర్వాణి యో
వింధ్యాశైల నివాసినీ శుభకరీ విద్యాకరీ శ్రీకరీ
వంధ్యాదూర జగత్ప్రసిద్ధ హృదయా వారాహియంచున్ వెసన్
*సంధ్యా,వందన మాచరింపుము విలాసంబొప్పు కౌగిళ్ళలో !*

దత్తపది :

కిషోర్ గారిచ్చిన పదాలు : *సాయుజ్య, సామీప్య, సారూప్య, సాలోక్య*

చెప్పవలసిన అంశం : కాశీక్షేత్రపాలకుడైన కాలభైరవ స్తుతి (సంస్కృతంలో)

వందేహం వర వారణాశి నిలయం శైవాత్మ *సాయుజ్య*దం
శ్రీ *సామీప్య* నివాస భాస రసికం చిద్దేహ విభ్రాజితం
శ్రీ మత్ పన్నగ భూషణాత్మక కృపా *సారూప్య* సౌఖ్యాత్మకం
భంభంభం వటునాయకం హృది పునః *సాలోక్య*తాం భావయే !

నరసింహ రావు గారిచ్చిన పదాలు : *క్లింటన్, బుష్, ఒబామా, మైత్రి*
చెప్పవలసిన అంశం : సీతాపహరణ ఘట్టం

లేరా యీ వరమాల నీవె విజయ *క్లింటన్నుగా* తీసికోరా
రారా యిటు హుష్షు బుష్షనుచు శ్రీ రమ్యాంగి సీతాంబికన్
వైరూప్యంబు *నొబామ* యంచు భవతా ప్రారబ్ధముంబూని
యేరా, రక్షోధిప ! తస్కరించెదవు చాల్చాల్ *మైత్రి*గావింపుమా !

వర్ణన:

రవి గారి అంశం : *కోటికుంకుమార్చన సందర్భంగా శ్రీ లక్ష్మీ మాత వర్ణన*

వరలక్ష్మీ చక్రమ్మును

గురుతరమగు భక్తి, కోటి కుంకుమ తోడన్

సరభసముగ నర్చింతుము

వరదాయిని నొసగుగాదె వరములు శుభముల్ !

కాశీ విశ్వనాథం గారి అంశం : *బారిష్టర్ పార్వతీశం విమాన ప్రయాణ వర్ణన*

ద్వారమెక్కడ నున్నదో వలను పడదు

రెష్టరూమది నిజమైన రెష్టరూము

కాగ భావించి యందున వేగజేరి

నీలి నీళుల చిత్రాల తేలియాడు !

న్యస్తాక్షరి :

సుబ్బారావు గారి న్యస్తములు :

మొదటి పాదం రెండవ అక్షరం : *ర్థ*

రెండవ పాదం పదకొండవ అక్షరం : *యా*

మూడవ పాదం మూడవ అక్షరం : *మం*

*నాలుగవ పాదం న్యస్తం లేదు.*

చెప్పవలసిన అంశం: భారతార్థంలో (మత్తకోకిల ఛందస్సులో)

బద్ధకమ్మును వీడరా వర భారతమ్మును చూడరా
ఔద్ధతిన్ విడనాడరా మరి యాద నిల్పుము భీముడా
యుద్ధమందున ధార్తరాష్ట్రుల నోడబోవక కూల్చరా
సిద్ధిబొందుము కృష్ణభక్తుడ శ్రీలు, రాజ్యములందరా !

వ్యస్తాక్షరి : సిద్ధారెడ్డి గారు, భాగవతంలోని రుక్మిణీ కల్యాణం లోని, పోతనగారి రుక్మిణి వర్ణన నుండి ఒక పద్యపాదాన్ని ఇచ్చారు. ఆ పాదము :

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| జ | ల | జ | న | య | న | ము | ఖ | ము | చం | ద్ర | స | ఖ | ము |

అవధానిగారు అవలీలగా ఈ అంశాన్ని పూరించారు.

పురాణ పఠనం :

సునీల్ గారు *"వామనుడు త్రివిక్రమునిగా ఎదిగిన "* ఘట్టాన్ని పురాణపఠనం చెయ్యమన్నారు.
అవధానిగారు పోతనగారి పద్యాలనుటంకిస్తూ చక్కని ప్రవచనాన్ని వినిపించారు.

షీల గారు *"వెంకటేశ్వరుని కృష్ణునితో పోల్చే "* ఘట్టాలని పురాణ ప్రవచనం చెయ్యమన్నారు.
అవధానిగారు "వకుళ మాలిక" ను వివరిస్తూ, అడిగిన అంశంలోని అంతరార్థాలని, పురాణ రహస్యాలను వివరిస్తూ, ఎంతో చక్కగా ప్రవచించారు.

ఆశువు:
వేణుగోపాల రావు గారడిగినది : *అసలు మీకు ఇంత ధారణ వున్నదని మొట్టమొదటి సారి మీకెప్పుడు తెలిసింది? అప్పటి మీ మనోభావాలని ఇప్పటికిప్పుడు ఓ పద్యంగా చెప్పండి..*

*(పృచ్ఛకులు ప్రశ్న పూర్తిచేయకముందే, అవధానిగారు శరవేగంతో పద్యాన్నిమొదలెట్టి పూర్తిచేసేసారు.)*

శతకము వ్రాసినాడ వరసంగతి దానిని కోలుపోవ, యా
శతకములోని పద్యములు చక్కగ ధారణ చేసినాడ ప్ర
స్తుత మిది కారణమ్ము కవిశూరులు నన్నును మెచ్చి చూడగన్
కృతకము లేక కావ్యములు కేవల మాశువుతోడ చెప్పగన్ !

వేణుగోపాల రావు గారడిగిన రెండో ప్రశ్న *: మనకి ఎన్నోవిశ్వాలు ఉన్నాయి. వంద సంవత్సరముల తరువాత ఒక భారతీయుడు ఖగోళ సంచారం చేస్తూ, భూమిని పోలిన మరో గ్రహం మీద దిగి, అయ్యో ఇక్కడికొచ్చానే అని భ్రమ పడ్డాడు. అతనెందుకు భ్రమ పడ్డాడో, ఒక పద్యం గా చెప్పండి. ( ఈ పద్యం రెండు సెకన్లలో మొదలై, ఏడు సెకన్లలోపు పూర్తయిపోయింది. హాలంతా కరతాళధ్వనులతో నిండిపోయింది. )*

గురుడున్, శుక్రుడు, చంద్రుడున్, బుధుడు, యర్కుండున్, కుజుండున్, శనై
శ్చరుడున్, రాహువు, కేతువున్, నిరత సంచారంబు చేవచ్చిరా,
స్ఫురదిందీవరలోచనుండనుచు, విస్ఫూర్తిన్ వెసన్ చూచి యా శనై
శ్చరునింగాంచి మనంబు నందునను ఆశ్చర్యాకుటుంబుండుగాన్!

శేషు శర్మ గారడిగిన ప్రశ్న: *హనుమంతుడు అట్లాంటా కోవెలలో రాముడు,సీతల విగ్రహాలు కనబడక బాధపడితే, ఆ మారుతీ విలాపం ఎలా ఉంటుందో వర్ణించండి.*

*(అద్భుతమైన వేగంతో, చక్కటి రాగంతో ఈ పద్యం అవధానిగారు చెబుతూ ఉంటే, ప్రేక్షకులు ఎంతో తన్మయత్వానికి లోనయ్యారు.)*

రాముడు రాముడే యగును రాముని సాటిగ వచ్చు దైవమున్
క్షేమము క్షేమమిచ్చెడి ప్రసిద్ధుని వేరొకనిన్ కనబోను నేను, యా
శ్యామల గాత్రుడీయెడను యక్కట కానగరాడు సుమ్ము, నే
నేమని కొల్చువాడను, వనేచరమూర్తి నటంచు నేడ్వగన్
రాముడు, శ్యాముడొక్కడను ప్రార్థన మాలపనమ్ము చేసి యిం
దేమరి కాననౌ గద మహిన్ భగవంతుడొకండె సుమ్మనన్ !

శ్యాం యెల్లంరాజు గారి అప్రస్తుత ప్రసంగంనుండి కొన్ని ప్రశ్నలు, సమాధానాలు:

ప్రశ్న: అవధానిగారూ, మీ ఆవిడ బజారెళ్ళి నాలుగు కూరలు తెమ్మంటే కొన్ని మర్చిపోయారట. ఎందువల్లంటారు?

సమాధానం: అప్పుడు నాపక్క మీరుండి మాట్లాడుతూండడవే కారణం. అయినా మా ఆవిడ నా చేత ఇల్లాంటి పనులన్నీ చేయించడానికి ఆవిడేవన్నా అమెరికా వచ్చిందనుకున్నారా?

ప్రశ్న : అవధానయ్య అనే సినిమా తీద్దామని వుంది, మీరు హీరోగా. మరి, హీరోయ్‌న్ గా ఎవరిని పెట్టుకుందావంటారు?
సమాధానం: హీరోయిన్ మాట అటుంచి, విలన్ గా మాత్రం మిమ్మల్నే బుక్ చేద్దాం. అయినా నేను హీరోనైతే, నా భార్యే హీరోయిన్ను.

ప్రశ్న : అవధానిగారూ, మా ఆవిడ నన్ను అవధానిగా చూడాలనుకుంటోంది, ఎలా సాధ్యపడుతుందో చెప్పండి?

సమాధానం: నాయనా, అది అయ్యే పనికాదుగానీ, ఆవిణ్ణి ఈ జన్మలో పుణ్యంచేసుకోమను వచ్చే జన్మలో అవధాని భర్తగా లభిస్తాడు. అయినా, మీరూ నాటకాలు వేయిస్తున్నారటగా,
అందుకని అవధానాలు చేస్తున్నట్టే.

ప్రశ్న: వచ్చేసారి మీ స్థానంలో ఒక సూపర్ లాప్ టాప్ కూచోబెట్టి అవధానం చేయిద్దామనుకుంటున్నాం.

సమాధానం: మంచిది నాయనా, మళ్ళీ, దాన్ని ఆపరేట్ చెయ్యడానికి కూడా నేనే కావాలి, అదీ చిత్రం !

ఫణి డొక్కా అప్రస్తుత ప్రసంగంనుండి కొన్ని ప్రశ్నలు, సమాధానాలు:

ప్రశ్న: అందరి పెళ్ళిలోనూ, అరుంధతిని చూపిస్తారు కదా, మరి అరుంధతి పెళ్ళిలో ఏం చూపించారండీ?

సమాధానం : అద్దాన్ని చూపించారు నాయనా.

ప్రశ్న: పాలవాడెదురొస్తే ఎవరికి మంచిది? మనకా? వాడికా ?

సమాధానం : ఖచ్చితంగా మీకే. మీరెదురొస్తే వాడికారోజంతా తిప్పలేగా.

ప్రశ్న : మీ వూరిపేరు(గణపవరము)లో "ణ" కి తలకట్టు ఉండదు. ఎందుకు?

సమాధానం: ఇప్పుడు "అణ" లు చెల్లుబాటులో లేవుగా. అందుకే. అయినా తలకట్టు మాటెలావున్నా, అమెరికాలో తల పై జుట్టున్నవాళ్ళే అరుదుగా కనిపిస్తున్నారు.

ప్రశ్న: అవధానిగారూ, మీరు "నశ్యాక్షరి" అంశం చేర్చుకుంటే బావుంటుంది అవధానంలో..

సమాధానం: నాయనా, నీకో చిత్రం చెబుతా. అన్ని దానాల్లోనూ ఇచ్చేవాడి చెయ్యి పైనా, తీసుకునే వాడి చెయ్యి కిందా వుంటే, ఒక్క నశ్యం విషయంలో మాత్రం, తీసుకునేవాడి చెయ్యి పైనుంటుంది. (అంటూ ఓ చమత్కారమైన పద్యం చెప్పారు నశ్యం పుచ్చుకునే వారిమీద) .

ఇలా ఆద్యంతం రసవత్తరంగా,ఛలోక్తులతో, చక్కని పద్యాలతో, ప్రవచనాలతో, జరిగిన ఈ అవధానంలో పాలుగొన్న వారంతా అదృష్టవంతులు. ****

# బ్రహ్మం గారి కాలజ్ఞానం ...
# నిత్యం జరిగే సత్యమేనా?

కర్లపాలెం హనుమంతరావు

'బ్రహ్మం తాత చెప్పింది, నిత్యం జరిగే సత్యమిది' అని బాపు గారి చిత్రం బాలరాజు కథలో ఒక పాట శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ( 1610-1693) కాలజ్ఞాన తత్వాలను భోధించిన యోగి. కొంత మంది దృష్టిలో సాక్షాత్ దైవ స్వరూపులు. బ్రహ్మం గారు తన కాలజ్ఞానములో భవిష్యత్తు గురించి చెప్పిన చాలా విషయాలు నిజమయ్యాయి అని కొంత మంది నమ్మకం. కర్ణాటక రాష్ట్రం, స్కందగిరి పర్వతసానువులో స్థితమైన పాపాగ్ని మఠం (ప్రస్తుతం ఇది చిక్‌బళ్ళాపూర్ జిల్లాలోని కళవారహళ్ళి లో వుంది ) జన్మించిన వీరబ్రహ్మం, కడప జిల్లా లోని కందిమల్లాయపల్లిలో బ్రహ్మంగారు గా మారి సజీవ సమాధి అయారు. కందిమల్లాయపల్లె తర్వాతి కాలములో బ్రహ్మంగారి మఠంగా ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలో ఏ వింత జరిగినా ఇది బ్రహ్మం గారు తన కాలజ్ఞానంలో నాడే చెప్పారు అంటూ ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటూ ఉండటం పరిపాటి అయింది. కాలజ్ఞానం లో చెప్పినవన్నీ పొల్లు పోకుండా ఇప్పటివరకు నిజంగా జరిగాయని సాధారణ జనాలలోనే కాదు, బాగా చదువుకుని శాస్త్ర పరిశోధనా రంగంలో చురుకుగా పనిచేసే మేధావులని పిలవబడే వాళ్ళలో కూడా ఒక రకమయిన విశ్వాసం ప్రబలంగా వుంది. పెద్ద పెద్ద శాస్త్రవేత్తలే నమ్ముతుండగా లేనిది ... అరకొర చదువులు సాగించే వారు బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని హేళన చేయటం తగునా ?-అని ఎదురు దాడికి దిగే వారికి ఒక నమస్కారం చేసి అసలు బ్రహ్మం గారి కాలజ్ఞానం లోని శాస్త్రీయత పాలు ఎంత ? అనే దృష్టి కోణంతో ఒక సహేతుకమయిన విమర్శన చేయటమే ఈ వ్యాసం ఉద్దేశం.

'మతం- శాస్త్రీయత' అనే మూసలో ఏకపక్షంగా 'శాస్త్రీయత'నే నమ్మే విజ్ఞాన శాస్త్రం బ్రహ్మంగారి దార్శనికతకు 'మతం' ముద్రని తగిలించి మొండిగా 'తప్పు' అనటం ఎంత వరకు న్యాయం ? విశ్వాసాలు -వాస్తవాలు రెండింటికీ శాస్త్రీయతను జోడించి 'నిజాలు' చెప్పిన బ్రహ్మంగారి మాటల్ని, ఆయన తాత్వికతను సైన్సు తప్పుపట్టటం తప్పు కాదా? అంటూ నిరంతరం సమాజాన్నుంచి విజ్ఞాన శాస్త్రానికి ఎదురయే ప్రశ్నలకి తగు సమాధానమిచ్చే ప్రయత్నం చేయటమే ప్రస్తుతం ఈ వ్యాసం లక్ష్యం.

విజ్ఞాన శాస్త్రంలో కాలజ్ఞానం అంటూ ప్రత్యేక విభాగం ఏదీ లేదు. ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల ఆధారంగా కొన్ని రాశుల్ని పరిశీలించి, వాటి మధ్య ఉన్న ఖచ్చితమైన, నమ్మదగిన, ఋజువుకు నిలవగల అవినాభావ సంబంధాల ఆధారంగా వ్యవస్థ కొంతకాలం తర్వాత ఎలా ఉండగలదో విజ్ఞానశాస్త్రం ముందే చెప్పగలదు. దీనినే కాలజ్ఞానం అంటే పేచీ లేదు. గంటకు 100 కి.మీ. వేగంతో ఇవాళ మధ్యాహ్నం బయలుదేరిన ఒక కారు ఎక్కడా ఆగకుండా వెళితే రేపు మూడు గంటల సమయానికి సరిగ్గా 2,400 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది ...అంటే ఢిల్లీ దాటి ఉంటుంది. రేపు జరగబోయే సంఘటనను ఇవాళే ఎవరయినా చెప్పగలరు. దీనినే

కాలజ్ఞానం అంటే పేచీ లేదు. వాతావరణ పీడనం, గాలిదిశ, గాలిలో నీటి శాతం, అలల తీవ్రత వంటి రాశుల మధ్య ఉన్న వాతావరణ శాస్త్ర సంబంధ నియమాల ఆధారంగా తుఫాను ఎప్పుడొస్తుందో ...ఎంత పరిమాణంలో వస్తుందో దాదాపు కచ్చితంగా ముందే ఊహించి వాతావరణ శాస్త్రవేత్తలు చెప్పగలరు. దీనిని కాలజ్ఞానమన్నా ఇబ్బంది లేదు. వాతావరణంలోకి విడుదలవుతున్న కాలుష్యాల పరిమాణం, వేగం ఆధారంగా భూ వాతావరణం ఓ దశాబ్దం లేదా శతాబ్దం తర్వాత ఎలా ఉండబోతుందో చాలామటుకు నమ్మదగిన భవిష్యవాణిని విజ్ఞాన శాస్త్రం వినిపిస్తునే వుంది. ఇదీ కాలజ్ఞానమే కదా చెప్పుకున్నా తప్పు పట్టవలసిన పని అసలే లేదు. జనాభా పెరుగుదల రేటు ఆధారంగా రాబోయే వంద సంవత్సరాల తరువాత జనసాంద్రతను మనం లెక్కించ గలుగుతున్నామా లేదా ! ఇవాళ ఖర్చవుతున్న ఇంధన పరిమాణం ధారంగా మరెంతకాలం పెట్రోలు నిల్వలు మనకందుబాటులో ఉండబోతున్నాయో, ఇంకెంతకాలం మంచినీటి నిల్వలు సజావుగా మనం వాడుకోవటానికి వీలవుతుందో అంచనాలు వేసుకుని మరీ జాగ్రత్త పడాలనుకుంటున్నాము. ఫలాని దిశలో, ఫలాని వేగంతో రాకెట్టును పంపితే ఇంతకాలం తర్వాత చంద్రుని మీదకు మన మానవుడు లేదా వ్యోమశకటం వెళ్ళగలుగు తుందని సుక్ష్మాంశందాకా సమయాన్ని లెక్కగట్టి మరీ ఆ రకంగానే ప్రయోగాలు చేసి విజయాలు సాధిస్తున్నాం మనం. గ్రహణాలు ఎప్పుడొస్తాయో, తదుపరి ధూమ శకటం ఎప్పుడు కనిపిస్తుందోనని లెక్కించటం లాంటి భవిష్యత్ దర్శనాలనన్నింటిని మనం కాలజ్ఞానమే అనుకోవాలంటే పేచీ పడాల్సిన పనేముంది?

కానీ ఏ ప్రయోగాలూ చేయకుండా, ఎలాంటి పరిమాణాత్మక విలువల మధ్య సంబంధాలను రాబట్టకుండా ఫలానా విధంగా మానవ సంబంధా లుంటాయనీ, ఫలాని విధంగా భౌతిక పరిస్థితులుంటాయనీ, ఫలాని విధంగా రాజ్యాధికారం, పాలన ఉంటాయనీ చెప్పడం ఆధారం లేని వ్యవహార మవుతుందా కాదా! పైగా చెప్పినవన్నీ నిజం కాకుండా కేవలం ఏ పది శాతమో, పాతిక శాతమో నిజమైతే అలాంటివాటిని కాకతాళీయంగా జరిగిన సంఘటనల క్రిందే పరిగణించాలి కానీ మహిమలు మహాత్మ్యాలు అని ప్రచారం చేయటమే ప్రమాదకరం. జనచేతనను నిద్రపుచ్చే ఇలాంటి ప్రయత్నాలనే విజ్ఞాన శాస్త్రం ఎప్పుడూ నిరసిస్తూ వస్తోంది.

ఓ శాస్త్రవేత్త చెప్పిన సూత్రం యాభయ్ శాతం సార్లు ఋజువై, యాభయ్ శాతం సార్లు విఫలమయితే విజ్ఞానశాస్త్రం దాన్ని తృణీకరిస్తుంది. ఆఖరికి 99 సార్లు విజయం సాధించి, ఒక్క విషయంలో విఫలమయినా దాని స్థానంలో కొత్త సూత్రాలను శాస్త్రం అన్వేషించే పనిలో వుంటుంది. నోబెల్ బహు మతి పొందిన రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనా చాలా ప్రయోగాల ఋజువులకు నిలబడినా ఒకటి రెండు విషయాల్లో గుడ్లు తేలేసింది. 'పోనీలే పాపం! రూథర్ ఫర్డ్ వాదనలు అడపా దడపానే కదా తప్పుపోయాయి' ...అనే సానుభూతితో ఆయన నమూనానే అంతిమ పాదార్థిక విజ్ఞానమని విజ్ఞాన శాస్త్రం సర్దుకుపోయిందా ? నీల్స్‌భోర్ సూత్రాలు, ఆలోచనలు, పరిశోధనల ఆధారంగా రూధర్ ఫర్డ్ నమూనాలోని లొసుగుల్ని పరిహరించిన దాకా శాస్త్రం నిద్ర పోలేదు. ఆ మాట కొస్తే శాస్త్రమనేది ఎప్పుడూ నిద్ర పోదు. ఎప్పటికప్పుడు పరిమితులను అధిగమిస్తూ, ఋజువులకు మరింత చక్కగానిలబడ గలిగే వాదనలను, విషయాలను అన్వేషించే పనిలో తలమునకలయి వుంటేనే అది విజ్ఞాన శాస్త్రం అనిపించుకుంటుంది. బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పారని మనం చెప్పుకుంటున్న వాటిలో ఎన్ని నిజంగా జరిగాయి?జరగని వాటిని గురించి మనం ఎందుకు చెప్పుకోవటం లేదు? ఈ కోణంలోనుంచి కూడా ఆలోచించ గలిగితే హేతువాదికి మనం ఆపాదిస్తున్న దైవత్వం ఆయన వ్యక్తిత్వానికి ఎంత విరుద్ధంగా వుంటుందో అర్థమవుతుంది.

ప్రకృతి ఒకరి అదుపు ఆజ్ఞలలో నడిచేది కాదు. ప్రకృతి నడకను సశాస్త్రీయంగా చూసి ప్రయోగాల ద్వారా రూఢి చేసుకుని ఫలాని సంఘటనలు జరుగు తాయని చెప్పి ఒప్పించ గలిగిన వాటిని మాత్రమే విజ్ఞాన శాస్త్రం నమ్ముతుంది. బ్రహ్మంగారు చెప్పినట్టు అన్నీ జరగలేదు. జరిగినవి కూడా ఆయన చెప్పినట్టే జరగలేదు అందుకే ముందు ముందు జరగబోయే వన్నీ బ్రహ్మంగారు ఎప్పుడో

చెప్పారని... బ్రహ్మంగారు చెప్పినట్లే ముందు ముందు జరుగుతాయని ఏ ఆధారాలు లేకుండా నమ్మటాన్ని విజ్ఞాన శాస్త్రం గుడ్డి నమ్మకం క్రిందకే జమగడుతుంది.

ఇంక 'మతం - శాస్త్రీయత' అనే మూసలో ఏకపక్షంగా 'శాస్త్రీ యతను' మాత్రమే నెత్తికెత్తుకునే విజ్ఞాన శాస్త్రం బ్రహ్మంగారి 'దార్శినికత'కు మతం ముద్రను తగిలించి మొండిగా బ్రహ్మం మాట తప్పుఅనటం ఎంత వరకు సహేతుకత ?-అని ప్రశ్న.

మతం-శాస్త్రీయత అనేవి జంటపదాలు కాక పోగా.. రెండు పరస్పర విరుద్ధాంశాలు. మారే శాస్త్రాల సమిష్టి పరిజ్ఞానం శాస్త్రీయత కాగా, మారడానికి ఇష్టపడని నియంతృత్వ బంధనం మతం. 'మతంలో' అక్కడక్కడా ఉన్న మంచిని స్వీకరిస్తూనే ఏకపక్షంగా శాస్త్రీయతను నమ్మడం అందరికీ మంచిదని విజ్ఞాన శాస్త్రం అభిప్రాయం. బ్రహ్మంగారికి ఆపాదించబడ్డ 'కాలజ్ఞానం' అనే అతీంద్రియ శక్తి ఆయన పరిశీలనా దృష్టికి, దార్శినికతకు, మేథస్సుకు మాత్రమే తార్కాణం తప్ప మతానికి కాదు. ఆయన 'కాలజ్ఞానం' శాస్త్రీయత అనే గీటురాయి ఆధారంగా లేదు. అది కేవలం ఊహా జనితం. అడపాదడపా మాత్రమే వాస్తవానికి దగ్గరగా వచ్చిన భవిష్య వాణి ఆయనది. అందుకే మిడతంభొట్లు జ్యోతిష్యాన్ని నిరాధారంగా నమ్మటాన్ని విజ్ఞాన శాస్త్రం ఒక అంధ విశ్వాసం క్రింద జమగడుతున్నది.

అంటే బ్రహ్మంగారి దార్శినికతను విజ్ఞాన శాస్త్రం 'గుడ్డి'గా కొట్టి పారేస్తుందా ? అంటే అవుననే జవాబు చెప్పాల్సి వుంటుంది.

విజ్ఞాన శాస్త్రం దేనినీ గుడ్డిగా కొట్టి పారేయదు. అలాగని దేనినీ గుడ్డిగా నెత్తికెత్తుకోదు . 'ఏ సూత్రాల ధారంగా, ఏ ప్రాతిపదిక మీద నిలబడి బ్రహ్మంగారు అలా సెలవిచ్చారో తెలియజేయండి' అని వినమ్రంగా అభ్యర్థిస్తుంది . వివరణ శాస్త్రీయంగా ఉంటే వాదనను స్వీకరిస్తుంది .

బ్రహ్మంగారు విజ్ఞాన శాస్త్రానికి శత్రువు కాదు. ఆయన పట్ల శత్రు వైఖరి తీసుకోవాల్సిన అవసరం విజ్ఞాన శాస్త్రానికి లేదు. 'నిజాలు' చెప్పే ఎవరినీ తప్పుపట్టవలసిన అవసరం ఉండదు. చెప్పిన వాటిలో కొన్నే నిజాలున్నా తప్పు పట్టవలసిన అవసరం అంతకన్నాఉండదు . శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి చరిత్రలో ఉన్న స్థానాన్ని విజ్ఞాన శాస్త్రం తక్కువగా చూడటం లేదు. ఎక్కువగా చూడటాన్నే ప్రశ్నిస్తున్నది. బుద్ధుడు, బ్రహ్మంగారు వంటి వారి దార్శినికతను ఆయా చారిత్రక పరిమితులుకు కుదించి వుంచినంత వరకు ఎవరికీ అభ్యంతరం ఉండదు.

ఒక పెద్ద రాయిని, ఒక చిన్న రాయిని ఒకేసారి వదిలేస్తే.. పెద్ద రాయి ముందు, చిన్నరాయి తర్వాత పడతాయని అరిస్టాటిల్ క్రీ.పూ. 4వ శతాబ్దంలో చెప్పాడు. అలా పడవని, రెండూ ఒకేసారి పడతాయని గెలీలియో మహనీయుడు క్రీ.శ.16వ శతాబ్దంలో...దాదాపు రెండువేల సంవత్సరాల తర్వాత... ప్రయోగపూర్వకంగా రుజువు చేశాడు. అరిస్టాటిల్ మీద వ్యక్తి ఆరాధనతో ఆయన చెప్పినట్లే ముందూ, వెనక రాళ్ళు పడతాయని నేటికీ మొండిగా వాదిస్తానంటే అది ఛాందస వాదమని విజ్ఞాన శాస్త్రం తప్పు పడుతుంది. నిరూపణ తర్వాత మారడానికి సిద్ధపడితే సంతోషిస్తుంది. భూమి బల్ల పరుపుగా వుందని నమ్మే వాళ్ళు ఇప్పటికీ వున్నారు. ఒక సంఘమూ పెట్టుకున్నారు. బ్రహ్మం గారు చేప్పిందే జరుగుతుందని ...జరిగే వాటినే బ్రహ్మంగారు చెప్పారని ఇప్పటికీ మేము ఈ ఆధారాలు లేకపోయినా కేవలం ఆయన మీదున్న భక్తితో నమ్ముతా మనే వారిని విజ్ఞాన శాస్త్రం మాత్రం ఏమి చేస్తుంది? అయ్యో పాపం' అని జాలిపడటం తప్పు!




# భారతీయ సంస్కృతి - పరిణామ వికాసాలు - వికారాలు

## గొల్లపూడి మారుతి రావు

*(ఇటీవల బరంపురంలో జరిగిన తెలుగు మహాసభల్లో సాహితీ సమావేశాలకి కీలకోపన్యాసం ఇచ్చిన గొల్లపూడి మారుతి రావు గారి ప్రసంగపాఠం)*

**చరిత్ర కాలం రాసుకున్న ఆత్మకథ అన్నారెవరో.** కాలం చేతనున్న కలం సంస్కృతి అంటాను నేను. కాలం రాస్తున్న కాగితం కళ. కాలం దస్తూరీ సంప్రదాయం. ఇది చాలా ఆలోచనతో చేసిన అన్వయం. వ్యక్తికీ వ్యక్తికీ దస్తూరీ మారుతుంది. సంప్రదాయ సరళీ అంతే. కాని కాగితం నిక్షిప్తమవుతుంది. పాతబడుతుంది. కాని పాడుబడదు. రచన చేసే కలం అతి ముఖ్యమయింది - సంస్కృతి. అన్ని రంగాల మేళవింపు సంస్కృతి. సాహిత్యం, సంగీతం, శిల్పం, వృత్తులు, జానపద కళలు, జీవన విధానాలు, నైతిక విలువలు, సమిష్టి జీవనం - అన్నిటి సమగ్ర రూపం సంస్కృతి. ఇందులో మానవ సంబంధాలు, వనరులు, నీటి పారుదల, సామాజిక స్పృహ, నిబద్ధత, న్యాయ వ్యవస్థ - ఒకటేమిటి? జీవన యోగ్యం చేసే అన్ని పార్శ్వాల విశ్వరూపం - సంస్కృతి.

మా మిత్రుడు ఎన్.ఆర్.నందితో నేనెప్పుడూ తగాదా పడేవాడిని - అతని నాటకం "మరో మొహంజొదారో" గురించి. ఒక వ్యవస్థలో కేవలం నైతిక పతనానికి సంబంధించిన ఇతివృత్తమది. కాని శీర్షిక ఒక సంస్కృతికి సంబంధించినది. అదిన్నీ శిధిల సంస్కృతికాదు. మొహంజొదారో, హరప్పా, పాంపే ఆనాటి ఉజ్వలమైన సంస్కృతీ వైభవానికి ప్రతీకలు. వాటి శైధిల్యానికి కాదు. - ఆదిశంకరులు, రామకృష్ణ పరమహంసని జీవిత అశాశ్వతత్వానికో, మృత్యువుకో అభిజ్ఞులుగా ఉదహరించం. ఒక గొప్ప సందేశానికీ, ఒక ఉద్యమ ఔన్నత్యానికీ, ఒక సిద్ధాంత ప్రభుత్వానికీ సారధులుగా ఉదహరిస్తాం. వెనకటికి కప్పల తక్కెడగా ఉన్న ఓ ఇంటి కథకి 'వియత్నాం వీడు' అని పేరు పెట్టారు. మా మిత్రుడొకాయన బాధపడ్డాడు. 'అయ్యా వియత్నాం ఒక సామ్రాజ్యవాదుల దౌష్ట్యాన్ని తట్టుకుని తమ అస్థిత్వాన్ని నిలుపుకున్న వియత్నాం దేశం resilience కి ఉదాహరణగా చెప్పుకోవాలి' అన్నాడు. నిజం Taj Mahal represents genius of that period, not its decay.

ఓ పెద్దాయన - మహా పండితుడు నన్ను సాగనంపడానికి తన ఇల్లు దాటి చాలాదూరం నడిచి వస్తున్నాడు. నేను ఇబ్బంది పడి 'ఇక మీరు ఆగండి' అన్నాను. ఆయన నవ్వి "ఆత్మీయుల్ని చెమ్మ ఉన్న చోటువరకూ సాగనంపాలి. పదండి" అన్నాడు.

ప్రపంచ చరిత్రలో మానవుడి వలసలన్నీ నీటి వనరుకి సమీపానే ఏర్పాటు చేసుకున్నాడు. ఏ చిన్న గ్రామమయినా ఏదో చిన్న నీటి వనరుకి సమీపానే వెలుస్తుంది. అలనాడు కణ్వుడు తను పెంచిన శకుంతలని అత్తారింటికి పంపుతూ - ఆశ్రమ ద్వారం దగ్గర కాక నదీ తీరందాకా వచ్చి సాగనంపడంలో ఉద్దేశం ఇదేనేమో. జీవాశ్రయం ఆత్మీయుడికి అందిందని రూఢి చేసుకున్నాక హితుడు ఆగిపోవచ్చునట.

ఇవి సంస్కృతీ వైభవాన్ని చాటే ప్రతీకలు. *మనకి చాలా తెలీవు. సుఖం ఏమిటంటే తెలియవన్న విషయం తెలియక పోవడం. ఇంకా సుఖం ఏమిటంటే తెలియక పోవడం వల్ల మరేం నష్టం లేదన్న ధీమా తెలుసు.*

ఈ రెండు రోజులూ జరిగే సదస్సులన్నీ ఆయా విషయాల్ని అతిక్లుప్తంగా, స్థాళీపులాక న్యాయంగా విశేషిస్తాయి. వింగడిస్తాయి. వివరిస్తాయి. ఈ కీలకోపన్యాసం ఆ ప్రక్రియకి కేవలం నాంది మాత్రమే కాక - ఒక poser గా ఉండాలని ఆశిస్తున్నాను. ఆలోచనకు ఆలంబన కావాలని ప్రయత్నిస్తున్నాను. అదే ఈ ప్రసంగ లక్ష్యం.

మధ్యధరా సంస్కృతికి తూర్పున ఉన్న కొన్ని దేశాలలో - చైనాను కూడా కలుపుకుని పరిశీలిస్తే - సంస్కృతీ వైభవానికి పెద్ద పీట భారతదేశానిదే, కారణం - ఆయా కాలాలలో మానవ జీవన వికాసానికి అవసరమైన, చైతన్యవంతమైన జీవితానికి ఆలంబన కాగల ఎన్నో మెలుకువలనూ, పరిణతులనూ ఆయా దశలలో జాతి కనుగొంటూ, కలుపుకుంటూ ముందుకు సాగడమే This is highly evolved civilization.

వీపు గోక్కోవడం అతి ప్రాథమికమైన పని. అందని భాగంలో సుఖంగా గోక్కోడానికి కర్రకి చిన్న కుచ్చు - ఆ మాత్రపు తెలివితేటలకి, అవగాహన, అవసరానికి - మనిషి ఏర్పరచుకున్న సౌకర్యానికి - నిదర్శనం. ఆ కుచ్చుని జపాన్, సైబీరియాల్లో దొరికే అతి లలితమైన సేబుల్ అనే జంతువు వెంట్రుకలతో చేసుకోవడం పరిణతికి ఉదాహ్దలన. ఇది ఆ జాతి సంస్కృతిని ప్రతిఫలిస్తుంది.

ఇటలీలో నేపుల్స్ సమీపంలో వెసూవియస్ అనే అగ్నిపర్వతం బద్దలు కావడం వల్ల లావాలో భూస్థాపితమైన పాంపే పట్టణం 1500 సంవత్సరాల తర్వాత బయటపడింది. నేను స్వయంగా చూశాను. సమష్టి జీవనంలో మనిషి తన బతుకుని సుగమం చేసుకునే పరికరాల దగ్గర్నుంచి, గృహనిర్మాణం దగ్గర్నుంచి, నీటి సరఫరా కాలువల్నీ, స్నానాల గదుల్నీ ఏర్పరచుకున్న మొదటి శతాబ్దపు రోమన్ సామ్రాజ్య సంస్కృతీ వైభవం అది.

వీటన్నింటి కంటే భారతీయ సంస్కృతిని ఒక మెట్టుపైన నిలబెట్టడానికి కారణం ఏమిటి? నాకు తెలిసిన - దేవుడు. 'దేవుడు' అనగానే చాలామంది భుజాలు తడువుకోవచ్చు. నేను చెప్పేది నల్లనివాడు పద్మనయనమ్ములవాడో, భుజంగధారీ, ఝటాజూటధారీ - మరెవరో కాదు. ఈ 'దేవుడు' మనం అలవాటు పడిన ఇప్పటి denominational దేవుడు కాదు. చాలా శతాబ్దాల లజ్జుగుజ్జుల తర్వాత క్రమంగా compartmentalize అయిపోయిన దేవుళ్ళు వీళ్ళు. నేను చెప్పే దేవుడికి మరో పేరు 'విశ్వాసం'. ఆలోచనకి అందని, అవగాహనకి లొంగని శక్తి - అంటే సరిపోతుంది.

సంస్కృతిలో తొలినాటి దేవుడు - మానవ జీవనానికి ఆధారమైన ప్రాథమిక ప్రాణశక్తి. అగ్ని. జీవనాన్ని ఏ మాత్రం జీవనయోగ్యం చేసుకోవాలన్నా అవసరమైన శక్తి ఇది. ఎక్కడ దొరుకుతుంది? ఎక్కడయినా దొరుకుతుంది. ఏ నిత్యాగ్నిహోత్రుని ఇంటికి వెళ్ళినా అగ్నిని సిద్ధంగా ఉంచుకుంటాడు. అందరి అవసరాలూ తీర్చే custodian అతను.

కాలపరిమితి తెలియని అతి ప్రాచీనమయిన ఋగ్వేదంలో పది మండలాలలో, 1128 సూక్తాలలో సుమారు 50 శాతం అగ్నిహోత్రం ప్రసక్తే ఉంది It is the elemental force for the earlier man. It was his God.

"అగ్నిమీలే పురోహితం యజ్ఞస్యదేవ మృత్విజం హోతారం రత్నధాతమం" అందరి క్షేమం కొరకు అగ్నిని ప్రార్థించుచున్నాను - అంది ఆనాడు వేదం.

(గమనిక: ఇవన్నీ తెలిసి చెపుతున్న విషయాలు కావు. తెలుసుకుని చెపుతున్నవి. నా ఆలోచనలను సమర్థించుకునే ఆధారాలను వెదుక్కుని పొందుపరిచినవి)

ఇది స్వానుభవంతో మానవుడు ఏర్పరచుకున్న విశ్వాసం. తనకు తెలియని - తన అదుపులో లేని శక్తి అది. అజ్ఞానమనే ఆ చీకటి వెనుక - కేవలం ఆలోచనలో మెరిసే గుర్తు. శతాబ్దాలు గడిచాక ఆలోచన అవగాహన బాగా సానదేలాక - పోతన్నగారు అద్భుతంగా వివరించారు. 'లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుదినలోకంబైన పెంజీకటి కవ్వల ఏకాకృతి వెలిగే వెలుగు' - విశ్వాసం అద్భుతమైన కళగా, కవిత్వంగా రూపుదిద్దుకున్న దశ ఇది. ఆలోచనకి నగిషీపట్టి, చిలవలూ పలవులూని, అపురూపమైన రూపం ఇచ్చిన glorious మజిలీ ఇది. కప్పదాటు వేస్తున్నాను. మన్నించండి.

ప్రాథమికంగా reflexes తో మాత్రమే జీవించే మానవుడికి - ఆలోచనతో అన్వయించుకోగల సత్యాలుకాక 'విశ్వాసాలు' అవసరమయాయి. అవి చాలు అతని జీవికకి. అటుపక్క బూచాడు ఉన్నాడు. అంటే పసివాడు చీకట్లోకి వెళ్ళడు. ఈ అన్నం తింటే ఆకాశం మీంచి చందమామ దిగివచ్చి నిద్రపుచ్చుతాడు. అంటే పసివాడు నమ్ముతాడు. ఎదురు చూస్తాడు. చెప్పే అమ్మమీద విశ్వాసం. 'చెప్పడం'లో సమస్యలకి పరిష్కారం లేదు. నమ్మడంలో ఉంది. అమ్మకీ తెలీదు - మొన్న మొన్నటిదాకా ఆకాశంలో ఉన్న చందమామ - నీరూ, ప్రాణ వాయువూ లేని భయంకరమైన గ్రహమని.

శతాబ్దాలుగా 'దేవుడు' అనే విశ్వాసాన్ని - అద్భుతమైన muse గా హిందూ దేశం చేసినంత విస్తృతంగా మరేదేశమూ - కాదు - మరే మతమూ - కాదు మరే సంస్కృతీ చెయ్యలేదు. చెయ్యలేదు కూడా. అందుకే ఈ సంస్కృతికి ఇంత విస్తృతి. ఇంత సాంద్రత. ఇంత resilience. మరొక్కసారి - నేను గుళ్ళల్లో దేవుళ్ళ గురించి మాట్లాడడం లేదు. మన జీవనంలో సర్వే సర్వత్రా అన్ని రకాల వ్యావృత్తులలోనూ అల్లుకుపోయిన omnipotent, omniscent శక్తి మాట నేను చెప్పేది. సంస్కృతీ వికాసానికి ఆలవాలమయిన 'దేవుడు' గురించి నేను మాట్లాడుతున్నాను. తొలినాటి మేధావులు, జిజ్ఞాసువులూ, కళాకారులూ - పోనీ ఇవన్నీ పెద్దమాటలు - ఆనాడు గుహల్లో రాతిమీద బొమ్మలు చెక్కిన ఆది మానవుల దగ్గర్నుంచి ఆది శంకరులదాకా - ఒక్క భారతీయ సంస్కృతిలోనే మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలకూ ఈ విశ్వాసంతో ముడిపెడుతూ వచ్చారు. ఆలోచనకు ప్రమేయంలేని శతాబ్దాల మానవుడూ ఈ empirical విజ్ఞానాన్ని - కేవలం విశ్వాసం అనే పెట్టుబడితో, నిబద్ధతతో అనుసరిస్తూ వచ్చాడు. నెలకి మూడు వానలు, సంవత్సరానికి ఆరు రుతువులూ, సుభిక్షంగా రెండు పంటలూ, శాంతియుత సహజీవనం - అలనాటి మానవుడి ఆలోచనతో సాధించుకున్నది కాదు, నిబద్ధతతో నిలుపుకున్నది. 'తెలిసి'కాదు తెలియాల్సిన అవసరం కూడా లేదని సంప్రదాయాన్ని కొనసాగించడం వల్ల. ఇప్పుడు ఈ వ్యాసంలో మొదటి వాక్యాన్ని ఇక్కడ గుర్తుచేస్తాను కాలం రాసుకున్న ఆత్మకథలో కలం దస్తూరీ సంప్రదాయం.

తరతరాలుగా ఈ విశ్వాసానికి ఒదిగి, అవలంభించి, అనుసరించి, అనుస్పందించి - ఒక గొడుగుని చేసుకుని జీవించడానికి ఓ అందమయిన పేరు ఉంది - ధర్మం. సామాజిక నీతి, స్పృహ. ఒక నియతి Dharma is a loaded word – denoting the generalized code pf conduct of the human kind, of a community of a society, of a generation. It is all – pervasive and ever lasting.

"ధర్మమా విష్టితం జగత్" అన్నది వాల్మీకి ఉవాచ.

అతి స్థూలమయిన ప్లేన్‌లో - ఈ 'ధర్మం' నీడలోకి - ఈ రెండు రోజులూ మన పెద్దలు చర్చించే విషయాలన్నీ వస్తాయి.

మిగతా సంస్కృతులకు ఇంత విస్తృతి లేదు. ఇంత విస్తృతికి ప్రయత్నించలేదు ఆ vision ఆయా సంస్కృతులు ఆశించలేదు. కాస్త గర్వంగా చెప్పాలంటే ఆశించారేమోకాని సాధించలేదు. మొజార్ట్‌కి, బిథోవెన్‌కీ, డిలన్ థామస్‌కీ, ఎడ్విన్‌లు త్యాన్స్‌కీ, థామస్ ఆల్వా ఎడిసన్‌కీ ఏసు ప్రభువుకీ, దేవుడికీ, భక్తికీ ఏమీ సంబంధం లేదు. మళ్ళీ మళ్ళీ చెపుతున్నాను. నేను denominational దేవుడి గురించీ, మతం గురించీ మాట్లాడడం లేదు. కేవలం prejudice తో నా ఆలోచనల్ని పక్కకి తోసేస్తారేమోనన్న భయంతో - మళ్ళీ చెపుతున్నాను.

అలనాడు ఒక్క రోమన్ సంస్కృతిలోనే - మన వైభవం ఛాయలు - దాదాపు అంతే ఉన్నతంగా కనిపిస్తాయి. కాని ఇంత సమగ్రంగా కాదు. అందుకనే రోమన్ శిల్పకళ, సాహిత్యం, చిత్రలేఖనం, వ్యక్తి సౌందర్యం అన్నీ మతంతో ముడిపడ్డాయక్కడ. మైకెలాంజిలో, రాఫేల్, లియొనార్డో డివిన్సీ - ఇలా ఎన్నయినా ఉదాహరణలున్నాయి. మరిచిపోవద్దు - ఆ కారణంగానే ఇవాళ విశ్వవ్యాప్తమైన క్రైస్తవ మతానికి - వాటికన్‌కి - అది కేంద్రమయింది. అంతే సమగ్రంగా ప్రపంచ వ్యాప్తమయింది. ఇక్కడే మరొక్కమాట. ఇస్లాం ప్రపంచ మతాల్లోకెల్లా evolved మతం. సాకారం లేని పరబ్రహ్మాన్ని ఆరాధించే మతం. కేవలం ఆలోచనలోనే పరమాత్మకి పెద్ద పీట వేసిన అంతం. అయితే ఛాందసత్వం నేడూ వేస్తున్న వెర్రితలలు ఈ ఔన్నత్యాన్ని మరుగు పరుస్తున్నాయి. అయితే ఆ దౌర్భాగ్యం ఎంతోకొంత అన్ని మతాలకూ వర్తిస్తుంది.

మళ్ళీ మన కథకి వస్తే - తెలియని చీకటిలోంచి తెలిసిన, కావలసిన 'శక్తులను నిజ జీవితంలో అన్ని పార్శ్యాలకు వ్యాపింపజేసిన ఘనత ఈ సంస్కృతిది' అన్నాను. బడే గులాం ఆలీఖాన్ పాడినా, భీమ్ సేన్ జోషి పాడినా, హీరాబాయ్ బరోడేకర్ పాడినా, బాలమురళీకృష్ణ పాడినా ఆ తుమ్రీలో, ఆ దోహాలో, ఆ అభంగ్‌లో, ఆ జావళిలో 'మాలిక్' ఉన్నాడు. రవివర్మ వేసినా, నికోలాయ్ రోరిక్ వేసినా, దామెర్ల రామారావు వేసినా అతి నేలబారు చిత్రంలో కూడా ఈ జాతి సంస్కృతి ప్రతిఫలిస్తుంది. ఒక ముగ్ధ 'సంస్కారం' ఉంటుంది. ఆ సంస్కారానికి మన సంస్కృతికీ దగ్గర దారి ఉంటుంది. పాటలో తాదాత్మ్యం, శిల్పకళలో సంప్రదాయం నిర్మాణంలో వాస్తు - అన్నిటికీ మూల ధాతువు - సంస్కృతి. భోజనం చేస్తూండగా పొలమారితే - కంఠ నాళంలో పొరమారి వాయునాళంలోకి ఆహారం వెళ్ళి ప్రాణానికిముప్పు వస్తుందేమోనని ఆముదం దీపం వెలుగులో మీ చిన్నతనంలో మీ అవ్వ 'ఇష్టదైవం పేరు, నచ్చిన మనిషి పేరు' చెప్పమనడంలో విశ్వాసం వాటా ఉంది. పండగకి ముంగిట పెట్టే బియ్యపు పిండి ముగ్గులో కీటకాలకు ఆహారం ఉంది. గొబ్బిళ్ళకి ధనుర్మాసంలో అవసరమైన anti – septic కవచం ఉంది. Anti septic ధర్మం కారణంగానే తులసి 'తల్లి' అయింది. త్యాగరాజు కీర్తనల్లో అజరామరమయింది. కార్తీకమాసంలో ఉపవాసాలకు - వర్షరుతువులో పరోక్షంగా ఆరోగ్య పరిరక్షణ సూత్రాలున్నాయి. (ఇదే ఋతువులో మరో మతం - ఇస్లాం కూడా - రంజాన్‌కు ఉపవాసాలను నిర్దేసిస్తుంది). జీవితంలో ప్రతీ అంశానికీ మన ఆలోచనతో ప్రమేయం లేని - సర్వే సర్వత్రా - తరతరాల మానవుడు అంగీకరించిన, అనుసరించిన ధర్మం ఉంది. అయ్యప్ప సిద్ధాంతంలో శివకేశవ అభేదం ఉంది. ఒక మండలం పాటు ఆరోగ్య ప్రణాళిక ఉంది. ఇది ఫక్తు ఐహికం. ఇలా అన్నిటికీ అన్వయాలున్నాయి. దస్తూరీ సరిగా చూసుకు జీవించు. నీ జీవితం జీవన యోగ్యం అవుతుంది - అనే సందేశం ఉంది.

30 ఏళ్ళ క్రితం నాకు తలమీద సొరియాసిస్ వచ్చింది. నేను తెలివైన మాథమాటికల్ ఫిజిక్స్ పట్టాపుచ్చుకున్న ఆధునిక మానవుడిని. అప్పుడే సినిమాల్లోకి వస్తున్నాను. నుదుటి మీదకి క్రమంగా వ్యాపిస్తోంది. చర్మవ్యాధులలో డాక్టర్ బి.సి.రాయ్ అవార్డ్ అందుకున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ తంబయ్యగారిని కలిశాను - కష్టం మీద ఇంటర్వ్యూ సంపాదించి. చిన్నలుంగీ, షర్టుతో అతి ప్రశాంతంగా ఉన్నాడాయన. నన్ను పరీక్ష చేసి నువ్వుల నూనె తలకి రాసుకుని ఎండలో పదినిముషాలు కూర్చుని స్నానం చెయ్యమన్నాడు. గొప్ప డాక్టరు కనుక ఇవ్వకపోతే నామోషీ కనుక - ఓ మందు రాసి ఇచ్చాడు.

నువ్వుల నూనె రాసుకుని ఉదయం ఎండలో నిలబడి - 'హిరణ్య వర్ణాం హిరణీం సువర్ణ రజతస్రజాం.." చేస్తే ఎలాంటి చర్మరోగమయినా సూర్యుడు పోగొడతాడని మా నాయనమ్మ చిన్నతనంలో చెప్పింది. సూర్య సప్తం ఎంతసేపు? పదినిముషాలు. తంబయ్య చికిత్స పది నిముషాలు. ఎండలో నిలబడి హిందూ పేపరు చదువుకున్నా, అనూరుడినీ, సప్తాశ్వరూఢుడైన సూర్యుణ్ణి పొగిడినా అదే ఫలితం. సూర్యుడి తొలికిరణాలలో సౌర శక్తి చర్మ వ్యాధిని నిర్మూలిస్తుంది. మొదటిది విశ్వాసం. సింబల్. విచిత్రమేమిటంటే ఆధునిక కాలంలో తంబయ్య మీద నాకున్నదీ విశ్వాసమే! ఆయన ఆల్ఫా కిరణాలు, బీటా కిరణాల గురించి ఉపన్యాసం ఇవ్వలేదు. పద్ధతిని

నిర్దేశించాడు. ఆ వివరాలకి వెళితే నీకనవసరం అంటాడు. తెలిసి సాధించేదేమీ లేదు కనుక. అంతే. తొలినాటి 'విశ్వాసాల' విషయమూ అంతే. అదే తరతరాల సంప్రదాయం మనకిచ్చింది.

మొన్న మొన్ననే పూరీ జగన్నాథుడి ఆలయానికి వెళ్ళాను. ఆలయం మీద బూతు బొమ్మలు కనిపించాయి. వెంటనే తాపీ ధర్మారావుగారు జ్ఞాపకం వచ్చారు. 'దేవాలయం మీద బూతు బొమ్మలు' మీద వారు రాసిన పుస్తకం గుర్తుకొచ్చింది.

మనిషి 'విశ్వాసం' పెట్టుబడిగా - అతిథి మర్యాదల దగ్గర్నుంచి, చర్మవ్యాధి నివారణ దగ్గర్నుంచి, 33 కోట్ల దేవతల్ని ఆరాధించేదాకా - ఇందులో పందులూ, కుక్కలూ, గాడిదలూ (వసుదేవుడు పట్టుకున్న కాళ్ళు), సాలెపురుగులూ, పాములూ, ఏనుగులూ, క్రిములూ, కీటకాలూ - అన్నీ ఉన్నాయి. అన్నిటినీ ఒకే గొడుకు కిందకి తీసుకువచ్చిన సంస్కృతీ వైభవం ఈ దేశానిది. సమస్త జీవరాశినీ గౌరవించి గౌరవించి, ఆదరించి సహజీవనం నెరపాలన్న సూత్రానికి ఈ సంస్కృతి వేసుకున్న పునాదులివి. దురాశ పెరిగి కృత్రిమ ఎరువుల వాడకం ద్వారా సీతాకోకచిలుకలు పంటకి దూరమయి పరాగ సంపర్కం తగ్గిపోయిందని శాస్త్రజ్ఞులు వాపోతున్న వార్త చదివాను.

ఈ వైభవాన్ని తన్మయత్వంతో, తాదాత్మ్యంతో అనూహ్యమైన muse చేసిన శంకరాచార్య, వివేకానంద, భగవాన్ రమణులు, తొండరప్పడి ఆళ్వార్, కబీర్ - వీరందరినీ ప్రవక్తల్నీ, అవధూతల్నీ చేసుకున్నాం.

ఇంత సమగ్రమయిన frame work లో తప్పనిసరిగా ఎన్నో అపశ్రుతులుంటాయి అవకాశవాదులుంటారు. కొందరు over – zealous మేధావులు, వ్యక్తులు, వ్యవస్థలు, స్వాములు, బాబాలు వీటిని చొరరాని బంధిఖానాలు చేశారు. తప్పుడు అన్వయాలు కల్పించారు. అద్భుతమైన సామరస్యానికి కారణమైన పునాదుల్ని బలహీన పరిచారు. అడ్డుగోడలు కట్టారు. అయితే సుభిక్షంగా సాగవలసిన పాలనా వ్యవస్థలోనే - ఇంత అవినీతి, అరాచకం, భ్రష్టత ఉండగా - శతాబ్దాలుగా చెల్లుబాటవుతున్న ఇంత విస్తృతమైన కాన్వాస్‌ని సొమ్ము చేసుకుని, వమ్ము చేసిన మహానుభావులు ఎందుకుండరు? అయితే విజ్ఞతతో మూల సూత్రాలను ఫోకస్‌లోకి తెచ్చుకోవడం తప్ప మరో మార్గం లేదు.

ఈ ప్రపంచంలో ఏ మతానికయినా ప్రధాన లక్ష్యం - ఆ సమాజంలో మనిషి జీవితాన్ని జీవనయోగ్యం చెయ్యడమే. ఇప్పుడు నేను మన దేవుళ్ళ గురించీ, మన మతాల గురించే మాట్లాడుతున్నాను.

విశ్వాసాన్ని పెట్టుబడిగా empirical సత్యాల్ని కాపాడుకుంటూ ధర్మాన్నీ - తద్వారా Earth's Life Supporting Systems నీ కాపాడుకుంటూ పురోగమించే స్థాయినుంచి మనిషి 'ఆలోచన'కు పెద్దపీట వేసే స్థాయి వచ్చింది. ఇది గొప్ప పరిణామం. టెస్టు ట్యూబుల్లో ప్రాణాన్ని పెంచడమే కాక - ఈ మధ్య కొత్తగా జన్యు కణాల్ని కనుగొన్నారని విన్నాం. చంద్రమండలం మీద కాలు మోపి ఆరువందల ఏభై సంవత్సరాల అన్నమయ్య కవితకి - 'చందమామ రావే జాబిల్లి రావే' అన్న పిలుపుకి విడాకులిచ్చాక ఇది అనూహ్యమైన పురోగతి.

కాని మనకి తెలియని బిలియన్ల గ్రహాలున్నాయి. కొన్ని లక్షల సంవత్సరాలు ఈ గ్రహం మీదే ప్రాణవాయువు లేదు. ప్రాణి లేదు. సరే. అప్పటి విశ్వాసాలకు తాడూ బొంగరం లేదని, అవన్నీ మనల్ని తప్పు తోవపట్టించే మూర్ఖపు ఆలోచనలనీ 'ఆలోచన' చేసే స్థాయికి మనం ఇప్పుడు వచ్చాం. అవగాహనలో ఎన్నడూ లేనంత పురోగతిని సాధించాం.

అయితే - పాంటు, షర్టు, సూటు వేసుకున్న మనం నాలుగు తరాల కిందట tropical వాతావరణంలో మన తాత గావంచా కట్టుకోవడాన్ని వెక్కిరించనక్కరలేదు. అర్థం చేసుకోగలిగితే - తంబయ్యకీ మా నాయనమ్మ ఆలోచనకీ సయోధ్యని వెదకగలిగితే - అనూరుడి రథం కదలికకీ సోరియాసిస్‌కీ 'లంకె' దొరుకుతుంది.

మా తాత విశ్వాసానికి వెనక గల 'ఉద్దేశం' మనకి ఇప్పుడు దొరక్కపోవచ్చు. అలాగే ఎండలు మండించే దేశంలో ట్వీడ్ సూటూ, టై కట్టుకున్న మనల్ని చూసి రానున్న ఆరో తరం పగలబడి నవ్వవచ్చు. 150 సంవత్సరాల పరదాస్యం ప్రసాదించిన వెర్రితల అని ఈ తరంలోనే చాలామంది ఒప్పుకోకపోవచ్చు.

ఆనాటి విశ్వాసాలు సమాజ ధర్మాల్ని insulateచేసి కాపాడాయి. ఈనాటి మన తెలివితేటలు కొన్ని వేల సంవత్సరాల భూమి సమాజ ధర్మాన్ని retard చేస్తున్నాయి. రేపటి తరాల నిధుల్ని కొల్లగొడుతున్నాయి.

ఈ చిన్న వ్యవధిలో, ఈ చిన్న ప్రసంగంలో ఇంత బృహత్తరమైన విషయాల్ని చర్చించడం సాధ్యం కాదు. విశ్లేషించడానికి నాకు శక్తీ చాలదు. భూమి పరిణామ శీలాన్ని విశ్లేషించాలంటే కొన్ని లక్షల సంవత్సరాలను పరిమాణం, సంస్కృతీ వికాసం - అత్యల్పం. హాస్యాస్పదం.

మరి ఎందుకీ గొడవ? ఎందుకీ కంఠశోష? ఈ మధ్య ఛానళ్ళు తిప్పుతూంటే వేంకటేశ్వర సుప్రభాతం బూతు అని ఎవరో చర్చిస్తున్నారు. కాళికాదేవి మహిషాసురుడిని చంపడంలో కుల వివక్ష ఉందని ఎవరో అంటున్నారు. అమ్మని చూస్తూ ఏ బిడ్డా స్థనాల ఆకర్షణ గురించి ఆలోచిస్తాడనుకోను. తన ఉపాధికీ, ఆకలికీ పాథేయాలుగా చూస్తాడు. ఈ దృష్టి బేధంతో చూస్తే శంకరుడే స్వయంగా చెప్పాడని భావించే 'సౌందర్య లహరి' అంతా బూతే. మూక కవి అంత భ్రష్టుడు మరొకడు ఉండడు. పూరీ జగన్నాధుడిని మనం దర్శించనక్కర్లేదు - అది బూతుమయం కనుక.

శ్రీరాముడు ఏ బ్లేడుతో గెడ్డం గీసుకున్నాడు? సీతాదేవి అవసరాలకు దండకారణ్యంలో 'టాయ్‌లెట్'ని నిర్మించారా? విశ్వామిత్రుడు గెడ్డాన్ని శుభ్రంగా ఉంచుకోడానికి పేల దువ్వెన వాడేవాడా? లాంటి ఆలోచనలు perversions. Intellectual decadence. కొన్ని సంవత్సరాల పాటు కదలకుండా కొండ గుహల్లో కూర్చుని తపస్సు చేసుకునే ఋషులు తమ శరీర రుగ్మతలకి కేవలం శరీరాన్ని అదుపులో ఉంచుకోడానికి సాధించుకున్న యోగాసనాలు అమెరికా ఇంగ్లీషులో మనకి వారు బోధ చేస్తే అప్పుడు అర్థమౌతుంది.

ఈ మధ్య కథలు, పాత్రలు, స్తుతులూ, దేవుళ్ళూ, మతపరమైన సింబల్స్ - వీటిపై చర్చలు వింటున్నాం. రచనల్ని చూస్తున్నాం. ఛానల్స్ విరగబడి చేసే ప్రసారాలు చూస్తున్నాం. మన ముత్తాత గోచీకి కొత్త అన్వయం వెదకడంలాంటిదే ఇదని నా ఉద్దేశం. ఆనాటి తరానికి ఇవి ఎందుకు, ఎలా అవసరమయాయో, వాటి ప్రయోజనం - అర్థం ఏమిటో ఈ ప్రసంగంలో ముందు వివరంగా చర్చించడానికి కారణం ఇదే.

నిజానికి పురాణాల్ని వెక్కిరించే రచనలు - నాకు తెలిసి - మన తరంలోనే ఇద్దరు చేశారు. ఇద్దరూ మహానుభావులు. ఒకాయన గొప్పపాత్రికేయులు - నార్ల. మరొకాయన మహారచయిత - చలం. సావిత్రి, పురూరవ వంటి నాటకాలు పురాణాలను వెక్కిరిస్తూ రాయడం వెనుక స్ఫూర్తి ఏమిటని 45 సంవత్సరాల క్రితం ఒక సావనీర్‌లో వ్యాసానికి చలంగారికి ఉత్తరం రాశాను. ఆయన సమాధానం ఇది: "ఆ నాటకాలన్ని బుద్ధిలేక రాశాను. ఇంకెన్నటికీ అలాంటి పని చెయ్యను"

నా అభిప్రాయం. We need a not destroy the institutions.. వీలయితే, సాధ్యమయితే కొత్త వ్యవస్థల్ని సృష్టిద్దాం. అవి ఒక తరం, ఒక సమాజం, ఒక కాలం నిర్ణయించిన సత్యాలు కావు. శతాబ్దాల విలువలకి ప్రతీకలు. అప్పటికవి ested values. ఆ విలువలకిప్పుడూ కాలదోషం పట్టిందా? భేష్, కొత్త విలువల్ని ప్రోదు చేద్దాం. కాలక్రమేణా ఇవీ పాతబడతాయి. పాడుబడతాయి. ఆరేడు తరాల తర్వాతివారు మనల్ని చూసి నవ్వుకోవచ్చు. నవ్వితే నవ్వనివ్వండి ఇవాళ మనమిలా ఉండడానికి మన కారణాలు మనకున్నాయి. పరిణామ శీలాన్ని ఒక్కరయినా బేరీజు వేయగలిగితే అది చరిత్ర అవుతుంది. అది కాలం రాసుకున్న సిసలైన ఆత్మకథ అవుతుంది.

ఆఫ్ఘనిస్తాన్‌లో భామియన్ బుద్ధవిగ్రహాల లాగ ఆవిలువల్ని మనం ఇప్పుడు నేలమట్టం చేయనక్కరలేదు. అక్కరలేదని చెప్పడానికే ఈ వ్యాసం. మొదటినుంచీ ఈ సంస్కృతిలోని 'దేవుడి' గురించి ఇంత విస్తృతంగా చెప్పవలసి వచ్చింది. ఈ సత్యాల్ని denominational పరిధుల్ని పక్కకి నెట్టి ఆలోచిస్తే సమాధానాలు దొరుకుతాయేమో! ఒక తాపీధర్మారావో, ఒక చెలమో తారసపడేదాకా ఆగుదాం. మనకి అక్కరలేని, ఇప్పుడు చెల్లని కిందటి దశాబ్దపు నాణెం ఒక చరిత్రని చెపుతుంది. ఒక వ్యవస్థని వివరిస్తుంది. ఒకనాటి సంప్రదాయానికి సూచిక అవుతుంది. మించి – మన మేధస్సు పురోగతికి మార్గదర్శి అవుతుంది.

Institutions should not be judged – as you do not judge a morning – an afternoon or an evening. ఉదయం పరిణామం. కాలానికి సంకేతం. అయితే ఉదయం నువ్వు చేసే పనిని చర్చించవచ్చు. విమర్శించవచ్చు. పదిగంటల దాకా పడుకోవడం సోమరితనం. పన్నెండుదాకా పడుకోవడం అనారోగ్యం. రాత్రంతా మేలుకోవడం విడ్డూరం. వికారం. విపరీతం. కాని మరో అయిదేళ్ళ తర్వాత – అమెరికాతోనో, ఆస్ట్రేలియాతోనో సయోధ్య నేర్పరుచుకున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే వ్యక్తి విధిగా రాత్రంతా పనిచేస్తాడు. పగలు నిద్రపోక తప్పదు. అలవాట్లు మారతాయి. అవసరాలు ఆ అలవాట్లను నిర్ణయిస్తాయి. మా తాత బతికుంటే ఆయన దృష్టిలో ఇది అరాచకం. కాని మనకాలానికి అవసరం. అయితే ఏనాడయినా ధర్మం మారదు. జీవన సరళి మారుతుంది.

ఇవి నా ఆలోచనలు. ఎవరికయినా వీటితో విభేధించే హక్కు ఉంది. కాని సరైనవనిపిస్తే ఇంతకంటే మేధావుల సమావేశం దొరకదన్న ప్రలోభంతో ఈ నాలుగు మాటలూ చెప్పాలనిపించింది.

ఆదర్శ సొసైటీ భవనాన్ని కూల్చండి. అక్కడ అవినీతి పేరుకుంది. కాని ఆదర్శాల్ని కూల్చనక్కరలేదు. అవి ఎప్పుడూ మారుతూ, పారుతూ ఉంటాయి.

ఆఖరుగా – ఒక్కటే మనవి –

When you defy you don't learn
When you deify you refuse to learn
When you define you begin to learn.




# తెలుగుజాతి - తెలుగు భాష పూర్వాపరాలు

యస్వీ చారి

క్రీస్తు పూర్వం నాలుగు - ఏడవ శతాబ్దాల మధ్య కాలంలో ప్రాచీన సాళ్వ సామ్రాజ్య నేపథ్యంలో తెలుగుజాతిని అన్యాయంగా, అవాస్తవికంగా ఓ దేశద్రిమ్మరి తెగగా పరిగణించే వారు. అలనాటి ఉత్తర భారత దేశంలోని యమునా నదీతట ప్రాంతాల్లో నివసించిన వారినే 'ఆంధ్రులు' అని పిలిచే వారు. ఆ సమయంలో వారు నాగ, యక్షులనే ఆటవికులతో కలిసిమెలిసి జీవిస్తూ వుండేవారట. ఆనాటి ఆంధ్రులు మాట్లాడిన వాడుక భాషనే ఆంధ్ర భాషగా గుర్తించటం జరిగింది.



కాని తదనంతర కాలగమనంలో నేటి కళింగ ప్రాంతమయిన ఒరిస్సాలోని భువనేశ్వరం తన ఆధిపత్యంలోకి రాగానే విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు హంపీ - కళింగ ప్రాంతాలని కలిపిన భువన విజయ సూచకంగా శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామాల్లోని శివలింగాలని ప్రతీకగా తీసుకుని తనంతట తానే త్రిలింగ దేశాధిపతిగా ప్రకటించుకున్నాడు. తద్వారా విజయనగర సామ్రాజ్యం త్రిలింగ దేశంగా రూపాంతరం చెందింది. అదే నేపథ్యంలోనే ప్రాంతీయ భాషా ఐక్యత నిమిత్తం త్రిలింగ పదధ్వని పరిఢవించేలా శ్రీకృష్ణదేవరాయలే ఆంధ్ర భాషను తెలుగు భాషగా మార్చాడన్న విషయాన్ని చరిత్ర వక్కాణిస్తోంది. పైగా 'తెలుగదేల యన్న దేశంబు తెలుగేను తెలుగువల్లభుండ!' .. అంటూ తన గొప్పని తానే చాటుకున్నాడాయన.

ఆ విధంగా నేడు భారత దేశంలో జనం అధికంగా మాట్లాడే హిందీ భాష తర్వాత రెండో స్థానంలో నిలిచి వుంది మన తెలుగు భాష! అదే పథంలో దక్షిణ దేశ భాషలన్నిటిని కూడా మించిన నాగరికతా వైభవాన్నిసంతరించుకున్న భాష కూడా మన తెలుగు భాషేనని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు.

ఉత్తర భారతావనిలోని యమునానదీ తీరం వెంటే విస్తరించిన సాళ్వ సామ్రాజ్యంనుంచి అలనాటి ఆంధ్రులు వింధ్యా పర్వత సానువులను దాటి నేటి చత్తీస్‌ఘడ్, ఒరిస్సాలగుండా బంగాళా ఖాతం తీరాలని ఆశ్రయిస్తూ దక్షిణాదికి వలస వెళ్ళిన ఆర్యులుగా ప్రశస్తి గావించబడ్డారు. వారు ఆవిధంగా ఏర్పరుచుకున్న స్థావర సముదాయమే నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోస్తా ఆంధ్ర ప్రాంతంగా చెప్పబడుతోంది. అదే సమయంలో కొందరు పాండిచ్చేరి, తమిళనాడులకు కూడా వెళ్ళి స్థిరపడటం జరిగింది. అందుకే నాటినుంచే

కాకుండా యిప్పుడు కూడా తమిళనాడు, పాండిచ్చేరిలలో తెలుగు వాళ్ళని 'వడుగు...' 'వడుగార్' అని పిలువటం జరుగుతోంది. తమిళంలో 'వడుగు' అంటే 'ఉత్తరాది' అనీ 'వడుగార్' అంటే 'ఉత్తర దేశస్తుడ' నీ అర్థం !.

అది కాకుండా మనందరి ఊహాతీతంగా బర్మాదేశంలోని 'తిలోంగ్' అనే ఓజాతికి చెందిన వ్యక్తులు కూడా తెలుగువారిగా పరిగణించబడుతున్నారన్న వాస్తవాన్ని మనం గుర్తుంచుకోవాలి. అదే క్రమంలో మలేసియా, సింగపూరు దేశాల్లో కూడా తెలుగు వాళ్ళు స్థిరపడటం జరిగింది.

ఇతర దేశాలకి వలసలు అలా వుండగా మనదేశంలోనే దక్షిణ పశ్చిమ రాష్ట్రాలకి వలసలు వెళ్ళిన ఆంధ్రులలోని మరికొందరు విడి విడి గుంపులుగా ఏర్పడి తూర్పు కనుమల ప్రాంతాల్లో ఆశ్రయం సంపాదించుకున్నారని, అలా తూర్పు కనుమలని ఆశ్రయించిన వారంతా చెల్లాచెదురుగా అరేబియా సముద్ర తీరాలని వెన్నంటి నేటి మహారాష్ట్ర, తెలంగాణ, రాయలసీమ, కర్నాటక రాష్ట్రాల్లో స్థిర పడి పోయారని చరిత్రకారులు భావిస్తూ వచ్చారు. మహారాష్ట్రకి వలస వెళ్ళిన మనవారి పేరిట ముంబాయికి దగ్గరలోవున్న ఓ లోయని 'ఆంధ్రావేలీ' అని పిలువటం జరిగింది. ఈరాష్ట్రంలోని ఓ నదిని 'ఆంధ్రీనది' అని పిలుస్తారు. అదే విధంగా కర్నాటకలో 'తుంగభద్రా' నదిని 'హంద్రీ' అని పిలువటం జరుగుతోంది. అలాగే క్రీ.పూ 200'కి చెందిన బళ్ళారి కళాఖండాలలో 'ఆంధ్ర ప్రతాపం' అన్న శిలాక్షారాల్ని కనుగొనటం జరిగింది.

ఆ విధంగా తూర్పు కనుమలని ఆశ్రయించి స్థిరపడిన ఆంధ్రులని మాత్రం 'నామ' మాత్రమే 'ద్రవిడులు'గా పరిగణించటం జరుగుతోంది. కాని పౌరాణిక ఆధారాల ద్వారానూ చారిత్రిక ఆధారాల వల్లనూ నేటి కోస్తా ఆంధ్ర ప్రాంతమే అలనాటి 'ఆర్య' సంతతికి చెందినదిగా భావించబడుతోంది. అందుకే ఆంధ్ర ప్రాంతానికి చెందిన తెలుగు వారు దక్షిణాదికి చెందిన వారుగా ఖచ్చితంగా పరిగణించబడటంలేదు. పైగా చరిత్ర పరంగా కానీ సాంస్కృతిక పరంగా కానీ కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రజలు కలిసిమెలిసి జీవించారనుకోవటానికి మనకు నిదర్శనాలు కనిపించవు. కేవలం శ్రీకృష్ణదేవరాయల పాలనలో క్రీ.శ. 1509-1529ల మధ్య కాలంలో మాత్రమే ఈ మూడు ప్రాంతాల జనం ఓ ఇరవయ్ ఏళ్ళు కలిసి జీవించారు.

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొన్ని జిల్లాలు ఒరిస్సాలోనూ నాటి మద్రాసు రాష్ట్రంలోనూ వుండగా రాయల సీమకు చెందిన కొన్నిజిల్లాలు మైసూరు రాష్ట్రంలోవుండేవి. కాని అప్పుడు కూడా నేటి తెలంగాణలోని కొన్ని జిల్లాలు నిజాం రాజు ఆధీనంలో వుండగా మరికొన్ని జిల్లాలు బొంబాయి రాష్ట్రంలో వుండేవి. 1948లో నిజాం నవాబు లొంగుబాటు అనంతరం కూడా హైదరాబాద్ రాష్ట్రం అలాగే కొనసాగింది. 1953 లో మద్రాసు నుంచి విడిపోయి కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆ తర్వాతనే 1956 లో సమైక్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. అలనాటి విజయనగర సామ్రాజ్య కాలం తర్వాత మళ్ళీ అప్పటినుంచే తెలుగు జాతి సమైక్యజీవనం తిరిగి ప్రారంభమయ్యింది.

ఇక సాంస్కృతిక పరంగా పరిశీలిస్తే మహాభారతంలో కౌరవులకు సహకరించిన ముఖ్యులుగా ఆంధ్రులని విశ్లేషించారు. ఓనాటి రాజసూయ యాగ సందర్భంలో సహదేవుని బల పరాక్రమాన్ని ఎదురుకోలేని వారిలో పాండ్య, ఓఢ్ర,కళింగ, ఆంధ్ర రాజులు అప్రదిష్ట పాలయ్యారట. అదే విధంగా శ్రీకృష్ణుడి చేత చాణూరుడనే ఆంధ్రుడు హతగ్రస్తు డయ్యాడని ఓ భాగవత గాథ వెల్లడిస్తోంది. రామాయణ గాథానుసారం ఆంధ్రులు విశ్వామిత్ర మహర్షికి చెందినవారిగా తెలుస్తోంది. ఓ నరమేధ యాగ సందర్భంలో యజ్ఞ పశువుగా నిలిచిన 'సునస్సేపు' అనే వ్యక్తిని కాపాడి అతన్ని దత్తత తీసుకున్నారట శ్రీ విశ్వామిత్ర మహర్షి. ఆ 'సునస్సేపు' అన్న బలిపశువు కూడా ఓ ఆంధ్రుడేనని ఆ కావ్య గాథ నిర్ధారించింది.

నన్నయ తర్వాత విరాటపర్వ ఆంధ్రీకరణలో ప్రారంభదశలో 'ఆంధ్ర కవితా విశారదుండు విద్యాదాయితుండు నరించే మహితాత్ముడు నన్నయ భట్టు దక్షతన్' అంటూ ఆదికవి 'నన్నయ'ని కీర్తించాడు మహాకవి తిక్కనామాత్యుడు. అదే వ్యాస భారతంలో సహదేవుడు ఆంధ్రులను పరాజితుల్నిచేస్తాడు.

అదే విధంగా వాల్మీకి రామాయణంలో కూడా కిష్కింధ కాండ 41వ శ్లోకంలో సుగ్రీవుని నోట ఆంధ్ర శబ్దమే వినిపిస్తుంది. అలాగే 'నృసింహ పురాణం' 17 వ పద్యం చరణం 'శేషోన్నయం ఆంధ్ర భాష సుజనోత్సవ మొప్పగ నిర్వచించి .. ' అంటూ మొదలవుతుంది. ఆ రకంగా ఎందరో కవులు కేవలం ఆంధ్ర భాషా శబ్దాన్నే ఉపయోగించారు. తెలుగు భాష అనే పదం ఎక్కడా కనిపించదు. మరి ఇన్ని శతాబ్దాల కాలం ముందూ వెనుకల్లో నేడు యిన్ని గొడవల్ని సృష్టిస్తోన్న తెలుగేమయివుంటుందో అనే భావన మాత్రం ఓ ఊహాతీత పరిణామంగా నిలిచి పోయింది.

అదలా వుండగా ఆంధ్రులు తొలిదశలోని ఆదివాసి తెగకి చెందినవారిగా వెలువడిన చారిత్రిక అంశాలలో గురుదేవుడు ఆపస్థంభ మహర్షి ప్రకటిత ఆపస్తంభసూత్రాలద్వారా ఆంధ్రజాతికి చెందిన బ్రాహ్మణులకు విశేష ప్రాచుర్యం లభించింది. మౌర్యవంశాధీశుడైన అశోక చక్రవర్తి కాలం నుంచే ఆంధ్ర బ్రాహ్మణులకు గౌరవాదరణలు పెరిగాయి.

ఇక పోతే తెలుగు రాచరిక చరిత్ర శాతవాహనులతో ప్రారంభమయ్యింది. దాంతో ఒక రకంగా రాజ్యాధికారం సిద్ధించగానే ఆంధ్రులు ఆటవిక తెగకి చెందిన వారన్న అపవాదు కాస్తా అంతరించి పోయింది. ఆ శాతవాహన రాజులు కష్ణా తీరంలోని 'అమరావతి'ని రాజధానిగా చేసుకుని మన తెలుగునేలని దాదాపు 450 ఏళ్ళు పాలించారు. శాతవాహనుల తర్వాత తెలుగునేలని తమిళనాడుకి చెందిన పల్లవ రాజ వంశీయులు, వారి అనంతరం చాళుక్యులు కైవసం చేసుకున్నారు. ఆ తమిళ ప్రభావాన్ని తెలుగు నేలనుంచి తొలగించిన ఘనత మళ్ళీ తెలుగు జాతికి చెందిన కాకతీయులకే దక్కింది. ఓరుగల్లుని రాజధానిగా చేసుకుని పాలించిన వారి కీర్తి విశ్వ వ్యాప్తినందుకుంది. ఆ తర్వాత శ్రీకృష్ణ దేవరాయల కాలంలో తెలుగు జాతి తన కీర్తి ప్రతిష్టలని మరింత పెంపొందించుకుంది.

ఇక భాషాపరంగా చూస్తే ప్రాచీన ప్రబంధ కావ్యాల్లో కూడా ఆంధ్ర జాతి ప్రస్తావన వచ్చింది. మహాభారత, రామాయణ భాగవత పురాణాల్లోనూ బుద్ధుని జాతకచక్ర గాథల్లోనూ ఆంధ్రుల ప్రసక్తి తీసుకు రాబడింది. ఆర్యుల కాలం నాటి సంస్కృత భాష ప్రయోగాలు కేవలం ఉభయ గోదావరి జిల్లాల్లో మాత్రమే గోచరిస్తాయి. మిగతా జిల్లాల్లో మాట్లాడే వారి భాషలో సంస్కృత పదాలు వినిపించవు.

'కుమార సంభవం' కావ్యంలో 'మనుమార్గ కవితా లోకంబున ఆంధ్ర విషయంబున దేశి కవితని బుట్టించిరి తెనుగున జన చాళుక్య రాజులు మొదలుగా బలువుర్..' అన్న కవి సార్వభౌముడు 'నన్నెచోడుని' పద్యమే అందుకు నిదర్శనంగా మనం గమనించాలి. ఆరకంగా కోస్తా ఆంధ్ర ప్రాంతానికి చెందిన కవులు సంస్కృత భూయిష్టమైన కవితా ప్రాభవాన్ని ఎన్నుకున్నారు. ప్రాకృత వాంఙ్మయంలో, ప్రాచీన నాట్యగాన పద జాలంలో ఐతరీయ బ్రాహ్మణీయంలో కేవలం ఆంధ్ర శబ్దమే వినిపిస్తుంది. తెలుగు అన్న పదం మనకెక్కడా వినిపించదు. అందు వల్లనే కోస్తా ఆంధ్రులు మాట్లాడే తెలుగు భాషకూ యితర ప్రాంతాల్లోనివారు మాట్లాడే తెలుగుకూ సంభాషణా పరంగా ఎంతోతేడా ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

అయితే తెలంగాణా ప్రాంతానికి చెందిన ప్రాచీన కవిశ్రేష్టులు మాత్రం అచ్చ తెలుగు పద ప్రయోగాన్ని ఎన్నుకున్నారు. ఆ విషయాన్నిచూస్తే 'నన్నయ్య' 'భారతం'లోనూ 'పోతన' 'భాగవతం'లోనూ వున్నతేడా ఎంతో సులభంగా కనిపిస్తుంది.

అంతే కాకుండా 'పాల్కురి సోమన' 'ద్విపద' పద్య సాంప్రదాయాన్ని సృష్టించి తెలుగును మరింత మనోరంజకం గావించాడు. నేటి 'గేయ సంప్రదాయం' కూడా ఆ ద్విపద సంప్రదాయం నుంచే పుట్టిందని ప్రత్యేకంగా వివరించనవసరం లేదు. ఆయన కృతి 'బసవ పురాణం' అతి సామాన్యుడికి కూడా సులభంగా బోధపడుతుంది

ముఖ్యంగా సాహిత్య రంగంలో తెలుగు భాషకున్న కీర్తి ప్రతిష్ఠలు మరే భాషకూ లేవన్నది జగద్విదితం! తెలుగు పద్య సాహిత్యం దాదాపుగా సంస్కృతాన్ని మించిపోయింది. మనోహర కీర్తనా సాహిత్యం, తనదంటూ వెలుగొందిన నాట్య శాస్త్రం, అబ్బుర పరచే శిల్పకళా నైపుణ్యం తెలుగు వారికి ఎనలేని గౌరవాన్ని సంపాదించిపెట్టాయి. చివరకు కుతుబ్ షాహి, నైజాం రాజుల ముస్లిం రాజుల పాలనా కాలంలో కూడా తెలుగు కళామతల్లికిగల ఆదరణకి లోటు రాలేదు.



అందుకే

**తెలుగు జాతి గీతకర్త శంకరంబాడి తెలుగు జాతిగీతం**

*అమరావతీ నగర అపురూప శిల్పాలు,*
*త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు,*
*తిక్కయ్య కలములోని తియ్యందనాలు,*
*నిత్యమై.. నిఖిలమై*
*నిలచి యుండేదాక...*
*మా తెలుగు తల్లికి మల్లెపూదండ !*
*మా కన్నతల్లికి మంగళారతులు !*




# కథ - నాటకం - సినీమా (కథా నిర్మాణ ప్రక్రియ)

*గొల్లపూడి మారుతిరావు*

**నాటకంలో, సినిమాలో** కథని వెదకడం పెరుగులో పాలను వెదకడం లాంటిది. వెనకటికి మా మిత్రుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మ నన్ను కథ రాయమంటూ ఆయనే కథకి బారసాల చేశాడు - 'కాకీ చొక్కాలో కాఫీ చుక్క' అంటూ. న్యాయంగా కాకీ చొక్కా 'మీద' కాఫీ చుక్క అని ఉండాలికదా? అయితే కాకీ చొక్కాలో కాఫీ చుక్క కథే రాశాను. ఇప్పుడి క్రమశిక్షణతో ఉన్న సైనికుడిలాగ కథ - నాటకం - సినిమాలో కథా నిర్మాణ ప్రక్రియ గురించే చెప్పబోతున్నాను.

కథలో కథ అహం బ్రహ్మాస్మి. నాటకంలో అద్వైతం. సినీమాలో కథ విశిష్టాద్వైతం. త్రివేణీ సంగమంలో సరస్వతీ నదిలాంటిది సినిమాలో కథ. కలం పట్టుకుని రాసిన కథ చెప్పే కథకి బాహ్యరూపం. అసలు కథని చెప్పడమే ఆనవాయితీ. ఎప్పుడో నా చిన్నతనంలో విన్నాను - కథ బ్రహ్మదేవుడి ఆఖరి వ్యసనం అని. చాలారోజులు దీని అర్థం పూర్తిగా అవగాహన కాలేదు. మెల్లగా లొంగింది. కన్నూ ముక్కూ చెవులూ అన్నీ తయారుచేసి ప్రాణం పోసేముందు బ్రహ్మదేవుడు చెయ్యవలసిన ఆఖరి పని - ఆ బొమ్మకి ఓ కథని జతచేయడం. ఇతనెవరు?ఏం చేస్తాడు? ఎందుకు చేస్తాడు? ఎలా చేస్తాడు? ఎలా బతుకుతాడు? ఎప్పుడు పోతాడు? ఎలా పోతాడు? అన్నిటితో కథని నిర్ణయిస్తాడు. బ్రహ్మదేవుడు నుదిటిన రాస్తాడు. రచయిత కాగితం మీద. ఇలా కొన్ని కోట్ల కథలు పుంఖానుపుంఖంగా అనునిత్యం రాస్తున్న గొప్ప రచయిత బ్రహ్మదేవుడు. నాస్తికులయినా ఈ ఆలోచనలో చిన్న ముచ్చటని గుర్తుపడతారనుకుంటాను.

రాసే కథ ఇతివృత్తం. నాటకంలో కథ అన్వయం. సినీమాలో కథ అంతర్వాహిని. కాగితం మీద కథ చెపుతుంది. నాటకంలో కథ సూచిస్తుంది. సినీమాలో కథ చూపిస్తుంది. కాగితం మీద కథ ఆలోచనదాకా ప్రయాణం చేస్తుంది. నాటకంలో కథ ఆలోచన నుంచి ఆవేశానికి నిచ్చెన వేస్తుంది. సినీమాలో కథ ఒక స్పందనకు ఆలంబన అవుతుంది. స్థూలంగా ఈ మూడు పనులూ - ఈ మూడు ప్రక్రియలూ ఆయా ప్లాన్స్‌లో చేస్తున్నా ఈ ప్రక్రియల స్కోప్ ద్వారా ఈ మాత్రం ప్రత్యేకించి చెప్పుకోవచ్చు Story is a narrative. Play is an interpretation. Film is representation.. కథ ఆలోచనదాకా ప్రయాణం చేసే dimensional ప్రక్రియ. సినీమా multi-dimensional. మరి నాటకం? ఈ రెంటి మధ్యా నిలిచే - రెండింటికీ చేతులు జాచే ప్రక్రియ. కొంత ఇదీ, అదీ - వెరసి రెండూ కానిది. అయితే రెండింటి ఛాయలూ ఏ కొంతో ఉన్నది.

చిన్న ఉదాహరణ. కథకుడు చెపుతున్నాడు. కోనేటిరావు మంచివాడు. పరోపకారి. సజ్జనుడు. మీ మనసు అలాంటి బొమ్మని మనస్సులో ఏర్పరచుకుంటుంది. పాఠకుడి అనుభవం అలాంటి కోనేటిరావుని వెదుక్కుంటుంది. అంతకు మించి రచయిత సహకారం లేదు. అది దాని పరిమితి.

నాటకం కోనేటిరావుని మీ ముందు నిలబెడుతుంది. ‘ఇదిగో, ఈయనే కోనేటిరావు‘ అని చూపిస్తుంది. కాని ‘ఈయనే మంచివాడు‘ అని చెప్పదు. మరేం చేస్తుంది? కొన్ని సింబల్స్‌ని వెదుక్కుంటుంది. Theatre represents truth.

ఒకాయన స్టేజి మీదకి వచ్చాడు. ”కాంతమ్మా, వంట చేస్తున్నావా?” కాంతమ్మ మాట్లాడింది. ”రండి బాబాయిగారూ, ఇప్పుడే మొదలెట్టాను. మీరు శ్రమ తీసుకుని మా కోసం ఆ క్యూలో నిలబడి చక్కెర రేషన్ తీసుకున్నారటగా, ఆయన చెప్పారు”

”మీ కోసమే కాదమ్మా. మాకూ చక్కెర కావాలిగా? పనిలో పని. చేస్తే అరిగిపోతానా?”

Theatre Qualifies. ఇక్కడ చక్కెర క్యూ ఆలంబన. చేసిన సహాయాన్ని ప్రేక్షకుడు చూడలేదు. కాంతమ్మ చెప్పగా విన్నాడు. ప్రేక్షకుడి ముందు కోనేటిరావు కనిపిస్తున్నాడు. ఆయన ‘పరోపకారం‘ వినిపిస్తోంది. ఆయన మంచితనాన్ని గ్రహించడానికి నాటక రచయిత ‘ఊతం‘ ఇచ్చాడు. కోనేటిరావు మంచితనం అర్థమయింది.

ఇక సినీమాలో ఈ గజిబిజిలేదు. తెగేసి తేల్చుకోవడమే. కళ్ళ ముందు రేషన్ షాపు ఉంది. కోనేటిరావు శ్రమ తెలుస్తోంది. కనిపించే దృశ్యమది. మాట బాడ్ సినిమా.

నలభై యేళ్ళు కోనేటిరావు పేవ్‌మెంట్ మీద నడుస్తున్నాడు. కీచుమని కారాగిన శబ్దం వినిపించింది. ఆగాడు. ఓ గుడ్డివాడి ముందు కీచుమని ఎవరో బ్రేక్ వేశారు. అందరూ షాక్ అయారు. డ్రైవరు విసుక్కుంటున్నాడు. ఈ నలభైయేళ్ళ మనిషి - మన కోనేటిరావు - గుడ్డివాడి చెయ్యి పుచ్చుకుని రోడ్డు దాటించాడు. గుడ్డివాడు రెండు చేతులూ కలిపి దండం పెట్టాడు. కథలో రెండు విశేషణాలను దృశ్యంగా చూపింది సినిమా.

ఒక విశేషణ వాచ్య రూపం కథ. సూచనా రూపం నాటకం. దృశ్యరూపం సినీమా. కథ చెప్పేది రచయిత. నాటకాన్ని విశ్లేషించింది ప్రయోక్త. దృశ్యాన్ని మనముందు నిలిపేది దర్శకుడు.

”కళ్ళకు కట్టినట్టుగా కథ రాశాడండి” అనడం మనం వింటూంటాం. పలుకుబడిలో ఆ మాట బాగానే ఉంది కాని నిజానికి అది తప్పు. రచయిత ఊహించిన దృశ్యాన్ని మీరు కళ్ళకి కట్టించుకున్నారు. కట్టేంత స్పష్టత emphasis రచయిత ఇచ్చాడు. ఆ ప్రయత్నం ఫలించడంలో మీ ప్రయత్నమూ ఉంది. ”మీ” అంటే పాఠకుడు. కళ్ళముందు కట్టిన ఆ దృశ్యం - రచయిత కలం చెప్పిన కథకి మీ మనస్సు - అనగా మీ ఆలోచన, అనుభవం కట్టిన మూర్తి The initiation belong to the writer. The initiative belongs to the reader. The ‘initial’ is the story.. కళ్ళకి కట్టడం కథ యొక్క రెండో ప్లేన్. మొదటి దశ కేవలం చెప్పడం. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాట పాడింది. మీ చెవులకి వినిపించింది. అది జరిగిన సంఘటన. ఆ విన్నది బాగుంది. అది మీ మనస్సు ఏర్పరుచుకున్న అభిప్రాయం. మరొకసారి బూతుమాట వినిపించింది. మీకు అసహ్యం కలిగింది. రెండో ప్లేన్‌లో ఆ అనుభూతిని మీ మనస్సు తిరస్కరించిన సందర్భమది.

నాటకం మరొక అడుగు ముందుకు వేస్తుంది. ఎదురుగా పాత్ర ఆ పని చేస్తోంది. మీరు చూస్తున్నారు. ఇక్కడ మీ స్పందనకి ఆలంబన దృశ్యం. ఈ కోనేటిరావు మంచివాడని మీరు నిర్ణయించుకున్నారు. నాటకంలో దృశ్యం మీ నిర్ణయానికి ఆలంబన. సినిమాకి ఇదేం గొడవలేదు. అదింకా బలమైన, నిర్దుష్టమైన, నిలదీసే దృశ్యం. ”ఇప్పుడే తాలూకా ఆఫీసు నుంచి వస్తున్నాను. గుమాస్తా వెయ్యి రూపాయలు లంచం అడిగాడు” అని నాటకంలో కోనేటిరావు చెపుతాడు. సినీమాలో తాలూకా ఆఫీసులో వంకర నవ్వుతో వెయ్యి రూపాయలు అడిగే గుమాస్తా మీ కళ్ళముందున్నాడు Play is a suggestion. Cinema is emphasis. The immediacy of a visual negates the need for audience to surmise.

కథ, నాటకం, సినీమా ఒక తల్లి పిల్లలు. ఒకే కడుపున పుట్టినవారు. అయితే నాటకం, సినీమా కవలలు. ఒకేసారి కలిసి పుట్టినవారు Identical twins.. అతి చిన్న తేడాలున్నాయి. ఒకటి కలం చెప్పే దృశ్యం. మరొకటి కళ్ళకి చూపే దృశ్యం. మొదటి ప్రక్రియకి ఆలంబన సన్నివేశం. రెండో ప్రక్రియకి - షాట్. నాటకం - సూచన. సినీమా - నిర్దేశన.

దీనికి మళ్ళీ సాంకేతికపరమైన పరిమితులున్నాయి. నాటకం - చీకటి హాలులో - 20, 40 అడుగుల వేదిక మీద జరిగే ప్రదర్శన అనుకుందాం. స్టేజి మీద ఆరుగురు నటులున్నారు. ఇద్దరు ఘర్షణ పడుతున్నారు. ఇద్దరు ఎగదోస్తున్నారు. ఇద్దరు సమాధాన పరుస్తున్నారు. ప్రేక్షకులకు ఆరు విభిన్నమయిన choices ఉన్నాయి. ఘర్షణ పడే ఇద్దరు నటులు సామర్ధ్యం మేరకి, ప్రేక్షకుడి సంస్కారం మేరకి, ఆ సమస్యపట్ల అతని ఆసక్తి మేరకి ఆ సన్నివేశం అతని దృష్టిలో నిలుస్తుంది. ప్రయోక్త ఆదృష్టిని ఆశిస్తున్నాడు. ప్రేక్షకుడు ఇన్ని పరిమితులకు లోబడి - ఆ మేరకి ప్రయోక్తతో ఏకీభవించడమో, విభేదించడమో చేస్తున్నాడు. దేశంలో అవినీతిని ఇద్దరు దుయ్యబడతున్నారు. సామాన్య ప్రేక్షకుడు వాళ్ళతో తాదాత్మ్యం చెందుతూ ఆవేశపడతాడు. ముందు కూర్చున్న ముఖ్య అతిథి అనే రాజకీయ నాయకుడు - తేలుకుట్టిన దొంగలాగా వంకర చూపులు చుస్తాడు. వాళ్ళని విడదీసే ఇద్దరూ ఇతనికి ఆపద్బాంధవులు The appeal in a theatre – in spite of the choices created by the director of the play – is essentially subjective.

ఇక్కడ ఆగి సినీమాకి వస్తే - సినీ దర్శకుడు కెమెరా వెనక నిలబడేటప్పటికే ఆ subjective choice చేసేసుకున్నాడు. ఆరుగురితో ఉన్న దృశ్యాన్ని ఏ సందర్భంలో ఎలా చూపాలో అతని చేతిలో పని. ప్రేక్షకుడి ప్రమేయం లేదు. ఏ విషయం ఎంత కావాలో, ఎక్కడ కావాలో, ఏ మోతాదులో కావాలో ఒక లూజ్ షాట్, ఒక మిడ్ షాట్, ఒక రూం - ఇలా రకరకాల సాధనాలతో తన అదుపులో ఉంచుకోగలడు. ప్రముఖ ఫ్రెంచి దర్శకుడు గొదార్ద్ ఓ మాట అన్నాడు. A cinema narrates truth 24 times per second అని. సినీమలో 24 ఫ్రేములు కదిలితే తెరమీద బొమ్మ కదులుతుంది. సినీమాలో ఒక క్లోజ్ షాట్ - సమాచారం. రెండోసారి అదే క్లోజ్ షాట్ - నొక్కి చెప్పడం. మూడోసారి - సమర్ధన. నాలుగోసారి - ప్రచారం. అయిదోసారి - ఉద్యమం. ఆరోసారి - పునరక్తి, విసుగుదల. మరిచిపోవద్దు. అది కూడా ఒక మూడే! అదిన్నీ దర్శకుడు చెప్పాలనుకున్న విషయమే కావచ్చు.

కాగితం మీద కథ - రచయిత చెప్పే విషయం. స్టేజి మీద కథ - నాటక ప్రయోక్త చెప్పదలచిన కథ interpretation.. సినిమాలో కథ దర్శకుడు నిర్దుష్టంగా చెప్పదలచిన కథ విశ్వరూపం. తెరమీద కథ Limitless. It is the last word.. ఏ అకిరా, కురోసోవా, ఏ సత్యజిత్ రే చేతుల్లోనో ఓ గొప్ప తైలవర్ణ చిత్రం అవుతుంది. ఏ మొహబూబ్, ఏ ఆర్సన్ వెల్స్ చేతుల్లోనో గొప్ప కావ్యమౌతుంది. ఏ బాలచందర్, ఏ విశ్వనాథ్ చేతుల్లోనో అనుభూతి అవుతుంది. ఏ గోవింద నిహలానీ, ఏ టి.కృష్ణ చేతుల్లోనో గురిపెట్టిన తుపాకీ అవుతుంది. ఏ సంజయ్ లీలా బన్సాలీ, ఏ రాఘవేంద్రరావు చేతుల్లోనో మత్తుమందు అవుతుంది. వెరసి - కథకు ఇవన్నీ రకరకాల interpretations. రకరకాల dimensions.

ఇప్పుడు కాగితం మీద కథకీ, తెరమీద కథకీ ఉన్న తేడా, పరిమితుల గురించి ఓ కథ చెపుతాను.

నా జీవితంలో నేను మొట్టమొదటిసారిగా రాసిన సినీరచన - కథకాదు. స్క్రీన్ప్లే కాదు. మాటలు కావు. ఓ నవలకి వెండితెర అనుసరణ.

ప్రముఖ రచయిత్రి కోడూరి కౌసల్యాదేవి నవల 'చక్రభ్రమణం' ఆధారంగా వెండితెరమీద కథ నేను చేసిన పని. అంటే కాగితం మీద ఉన్న కథను సినీమా కథ చేయడం. ఒక్కొక్కప్పుడు ఇది కత్తిమీద సాము. కవలపిల్లలలో ఉన్న అతి చిన్న విభేదాన్ని కూడా తుడిచేసే శస్త్ర చికిత్సలాంటిది.

నవల పదిమందీ చదువుకునేది. ఇదివరకే ప్రఖ్యాతిని సాధించినది. సినీమా పదిమంది చూసేది. నవల చదవని మరెన్నో లక్షల మందిని ఉద్దేశించింది. చదివిన వారు తమకు తెలిసిన ఇతివృత్తాన్ని, పాత్రీకరణల్ని తెరమీది ప్రక్రియనుంచి ఆశిస్తారు. ఆహ్వానిస్తారు.

చదవనివాళ్ళు సినీమాగానే చూసి బేరీజు వేసుకుంటారు. కథనం - ఈ రెండు వర్గాలనూ తృప్తి పరిచేదిగా ఉండాలి. ప్రసిద్ధ నవలను తెరకి ఎక్కించడంలో ఉద్దేశం అదే అప్పటికే ఎందరినో ఆకర్షించిన ఓ కథని మరెందరో ఆనమించే సినీమాగా తెరమీదకి మలచడం.

'చక్రభ్రమణం' నవల నా తొలి చిత్రం 'డాక్టర్ చక్రవర్తి' అయింది. స్థూలంగా కథ ఇది. చక్రవర్తి అనే డాక్టరు, రవీంద్ర స్నేహితులు. రవీంద్ర భార్య మాధవి. మాధవి అంటే చక్రవర్తికి విపరీతమైన ప్రేమ. ఎందుకు? తన చెల్లెలిని గుర్తుచేస్తోంది కనుక. ఈ కారణాన్ని నవలా రచయిత్రి సాధ్యమైనంతగా దాచారు. ఆ ప్రేమని తన భార్యపట్ల మోజుగా అర్థం చేసుకుంటాడు రవీంద్ర. అదీ కథకి ముడి. మిత్రుల మధ్య, మాధవితోనూ వైమనస్యం, రవీంద్ర తాగుడు మరగడం, పెళ్ళాన్ని పుట్టింటికి పంపెయ్యడం - విషయం తెలిసిన చక్రవర్తి రవీంద్ర అనుమానాన్ని పోగొడతాడు. మాధవి పట్ల తన ప్రేమ ఒక అన్నకి చెల్లెలి పట్ల ప్రేమ వంటిదని వివరిస్తాడు. నవల సుఖాంతమవుతుంది. పాఠకులు ఆదరించారు. అప్పట్లో నేను ఆంధ్రప్రభలో పనిచేస్తున్నాను. నవలా పోటీల్లో తొలివిడతలో ఈ నవలని ఎంపిక చేశాము. తర్వాత ప్రధాన న్యాయనిర్ణేత త్రిపురనేని గోపీచంద్. కౌసల్యా దేవి నవలకి ప్రథమ బహుమతి దక్కింది. దరిమిలాను నేను ఆంధ్రప్రభని వదిలి రేడియోకి వచ్చాను. అన్నపూర్ణా నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావుగారు నన్ను పిలిచి ఇదే నవలను వెండితెరకి అనుసరణ చేయమన్నారు ఇది యాదృచ్ఛికం.

చదువుకునే కథలో పాత్రలు, సన్నివేశాలే ఉన్నాయి. చూసే కథలో నటులున్నారు. స్టార్సున్నారు. వారందరూ లబ్ధప్రతిష్టులు. ప్రేక్షకుల మనస్సులో ఇతిమిద్ధమైన ముద్రవేసినవారు. అక్కినేని లక్షలాది తెలుగు ప్రేక్షకులకి ధీరోదాత్తుడు. నిజాయితీపరుడు. ఆయనకి ప్రేక్షకులలో ఒక ఇమేజ్ ఉంది. అలాగే రవీంద్రగా వేసిన జగ్గయ్యకి. ఇక మాధవిగా సావిత్రి ప్రేక్షకుల అభిమాన తార.

కథలో చక్రవర్తి మాధవిని చూసినప్పుడల్లా - రచయిత్రి మాటల్లో - హృదయం ఆర్ద్రమవుతుంది. మనస్సు ఆనందంతో ఉప్పొంగుతుంది. ఆమెతో మాట్లాడాలనిపిస్తుంది. హృదయం పరవశమౌతుంది. ఇవన్నీ సుఖవంతమైన attitudes.. జారుడు మెట్లు. వ్రాయడానికి సుఖంగా, దాచగలిగినంత దాస్తూ, అతి సున్నితమైన 'ముడి'ని అల్లుతూ ముందుకు సాగే రచయిత్రి గడుసుతనం చెల్లుతుంది. నవలలో ఎక్కడో ఈ ఉప్పొంగడానికి కారణం స్త్రీ పురుషుల మధ్య ప్రేమకాదని అన్నాచెల్లెళ్ళ మధ్య అనురాగమని రచయిత్రి కుండబద్దలు కొట్టేసింది. 'అమ్మో' అని పాఠకులు మురిసిపోయారు. రవీంద్ర నిట్టూర్చాడు. మాధవి తృప్తిపడింది. నిరపాయకరంగా, అహింసాయుతంగా - ఆఖరి పేజీదాకా కథ నడిపి మార్కులు కొట్టేసింది రచయిత్రి. అది చెప్పే కథ.

చూసే కథలో మాధవి అంటే చక్రవర్తికి వల్లమాలిన ప్రేమ అని చెప్పాలి. దృశ్యంలో ఏం చూపాలి? అక్కినేని అనే హీరో చెల్లెలిలాంటి సావిత్రి అనే హీరోయిన్ బుగ్గలు పుణికాడా? భుజం మీద ఆర్ద్రంగా చెయ్యివేశాడా? ఆప్యాయంగా చేతులు పట్టుకున్నాడా? అతని మనస్సులో భావాన్ని దాచిపెట్టి (నవలలో లాగ) ఈ పట్టుకున్న చేతులలో స్త్రీ వ్యామోహం లేదని, కేవలం తోబుట్టువు పట్ల అనురాగం వంటి భావన ఉన్నదని ప్రేక్షకునికి ఎలా తెలియజేస్తాం? పరాయిమనిషి భార్యతో పన్నెండు రీళ్ళ చనువుని 'పెద్దమనిషి' తరహాగా దృశ్యంలో చూపుతూ ఎలా సమర్థించడం? పైగా ఆయన అక్కినేని. ఎదురుగా ఉన్నది పరాయి వ్యక్తి భార్య. ప్రేక్షకులు తెరలు చించే అపశృతి ఇది. మరి నవలలో అసలయిన ముడీ, రుచీ ఇదే కదా?

ఆరునెలలు ఈ విచికిత్స నాకూ మధుసూదనరావుగారికీ సాగింది. ఇక్కడ ఓ గొప్ప తాయెత్తు ఉంది. కథలో గడుసుదనం పొసగనప్పుడు దాచకుండా తేల్చి చెప్పే కథకుడి నిజాయితీని ప్రేక్షకుడూ హర్షిస్తాడు. అర్థం చేసుకుంటాడు. ఒకటే సూత్రం. నవలలో లేని పెద్ద మార్పుని తప్పనిసరిగా సినీమాకి చేశాం. నవలలో రచయిత్రి సూచనగా చెప్పి వదిలేసిన చెల్లెలికి ప్రాణం పోశాం. ఈమె సుధ. ఈవిడే హీరోగారి చెల్లెలు. ఈవిడంటే ఆయనకి వల్లమాలిన ప్రేమ. చెప్పలేదు. చూపించాం. తల్లిలేని పిల్లని తనే తల్లీ తండ్రీ అయి పెంచాడు. పెళ్ళి చేశాడు. ఆమె కాన్సర్‌తో కన్నుమూసింది. అతని గుండె పగిలింది. ఇప్పుడు మరొకావిడ కంటబడింది. మాధవి. ఆమెలో తన చెల్లెలికున్న లక్షణాలేమిటి? ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా 'పోలిక'ని సినీమా మీడియంలో ఒక వీణపాటలో కుదించాం. "పాడమని

నన్నడగవలెనా పరవశించి పాడనా?" అంది చెల్లెలు ఒకప్పుడు. అదే వీణ పాట పాడుతూ "పాడమని నన్నడగతగునా, పదుగురెదుటా పాడనా?" అంది ఈమె. సినీమా వంటి సెన్సిటివ్ మీడియంలో ఈ సామ్యం గొడ్డలి. చక్రవర్తి తుళ్ళిపడ్డాడు. తన చెల్లెలు మరో రూపంలో కళ్ళ ముందు సాక్షాత్కరించింది. తికమక లేదు. హీరోయిన స్థానంలో చెల్లెలి డబల్ ప్రింట్ వేశాం. ఒకసారి కాదు. మళ్ళీ మళ్ళీ. "బాబూ! సందేహం వద్దు. మా హీరో - ఓ అన్న - ఈ మాధవిలో తన చెల్లెల్ని చూస్తున్నాడు" అని నొక్కి చెప్పాం.

హీరో కళ్ళు చెమర్చాయి. హృదయం పొంగింది. ప్రేక్షకులూ అర్థం చేసుకున్నారు. ఆయన పక్క నిలిచారు. కథ నల్లేరు మీద బండిలాగ నడిచింది. ఇక కథలో ముడి ఎవరికి? ఒక్క రవీంద్ర - అంటే మాధవి భర్తకి. ఒక దశవరకూ మాధవీ చక్రవర్తిని అపార్థం చేసుకుంది. ఆమెకి తన ఆవేదనని వివరించాడు. చెల్లెలి కథ చెప్పాడు. ఇప్పుడు కథలో హీరో వ్యక్తిత్వాన్ని హీరోయిన్ దృష్టిలో బతికించుకున్నాం. అది ఇంటర్వెల్. ఇక మిగిలింది రవీంద్ర. తన ప్రవర్తనని అనుమానిస్తున్నాడని తెలియగానే చక్రవర్తి వివరించవచ్చుకదా? నిజం చెప్పొచ్చుకదా? చెపితే సినీమా అయిపోతుంది కదా? ఇది మెలోడ్రామా పులుముడు. తెలుగు ప్రేక్షకులు రకరకాలుగా అనుభవించి, లొట్టలు వేస్తున్న తాంబూలం. సినీమాకు కొంగుబంగారం. "ప్రపంచం అర్థం చేసుకోలేని ఈ అనురాగం మన మధ్యనే ఉండనీ చెల్లెమ్మా.." ఈ మాటలు అరిగిపోయేవరకూ అంతా రాశారు. దీనికి పిసలైన హక్కుదారుడు ఆత్రేయ. ఆయనా రాశాడు. మరీ సుఖం. ప్రేక్షకులు ఉండనిచ్చారు. సినీమా రాణించింది. చక్రవర్తి పెద్ద హిట్.

దీన్ని తర్డ్ పార్టీ సస్పెన్స్ అంటారు. ప్రేక్షకులతో కథా రచయిత రహస్యాన్ని పంచుకోవడం. ఇక సస్పెన్స్ పాత్రలకే The audience's ego is kindled and he is amused and be grateful to the narrator for the exalted position he is placed in. తన కిచ్చిన పెద్దరికాన్ని, కథనంలో తాను పాల్గొనడాన్ని ప్రేక్షకుడీని ఆనందపరుస్తుంది. 50 ఏళ్ళు అనితర సాధ్యంగా సస్పెన్స్ సినీమాలను తీసి ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన మాంత్రికుడు ఆల్ఫ్రెడ్ హిచ్ కాక్ కొంగు బంగారం ఇదే థర్డ్ పార్టీ సస్పెన్స్. గొప్ప ఉదాహరణ - డయల్ ఎమ్. ఫర్ మర్డర్. సొగసయిన, అద్భుతమైన చిత్రం. హంతకుడు హీరోయిన్‌ని ఎలా చంపాలనుకున్నాడో మనం చూశాం. చివరకు అనుకోకుండా హీరోయిన్ చేతుల్లో ఎలా ప్రాణాలు పోగొట్టుకున్నాడో మనకి తెలుసు. కథనంలో పరిశోధకుడు - నిజానికి దగ్గరికి వస్తున్న కొద్దీ మనం కితకితలు పెట్టినట్లు ఆనందిస్తాం. ఇది పజిల్ లాంటిది. సమాధానానికి దగ్గరకి వస్తున్నకొద్దీ మన ఉత్సాహం పెరుగుతుంది. హత్యని భర్తే తలపెట్టాడు. అది మనకి తెలుసు. చివరికి పాత్రలకి తెలిసిపోయింది. ముగింపు. ఆనందం.

ఒక్క రెండు సినీమాలలోనే ప్రేక్షకులనీ సస్పెన్స్‌లో వదిలేశాడు హిచ్ కాక్. ఆ రెండూ - సైకో, ది రేర్ విండో. హాలీవుడ్ చరిత్రలో 51 సంవత్సరాల తర్వాత - ఇప్పటికీ 'సైకో' గొప్ప కళాఖండం. దాని నమూనాలు ఎన్ని వచ్చాయో! 'ది రేర్ విండో'లో కౌంటర్ షాట్ లేదు. అంటే ఎదుటి వ్యక్తి కథనం లేదు. ఇదో మహా కావ్యం. ఏతావాతా, తెరమీద కథని చెప్పడంలో ఒడుపులివి.

కాగితం మీద కథనం కథకుడు కోరిన 'ముసుగు'కి లొంగుతుంది. తెరమీది కథనంలో ఒకొక్కప్పుడు ఈ 'ముసుగే' లోపం అవుతుంది. ప్రేక్షకుడు తనని మోసం చెయ్యడాన్ని గుర్తుపడతాడు.

అతని మనస్సు కలుక్కుమంటుంది. ఆ సినీమాని నిరాకరిస్తాడు. కథకునికి పాఠకుడు లోకువ. సినీమా కథనంలో ప్రేక్షకుడు నిరంకుశుడు. ఎందుకంటే Cinema is a democratic art, by far.

కథ - నాటకం - సినీమాలలో మూడింటిలోనూ కథ ఉంది. కథా కథనం ఉంది. ప్రక్రియ పరిమితులున్నాయి. స్వరూప స్వభావాలలో విభేధం ఉంది. వైరుధ్యం ఉంది. గొప్ప నైపుణ్యం ఉంది. ఒడిసి పట్టుకున్న నేర్పరి చేతుల్లో అది మంత్రదండం అయే అవకాశం ఉంది. లొంగకపోతే వెర్రివాడి చేతిలో గురితప్పే రాయి అయే ప్రమాదమూ ఉంది. వెరసి - కథ, నాటకం, సినీమాలలో కథ మనిషిలో 'ఆత్మ'లాంటిది. వెదికితే దొరకదు. కానీ లేకపోతే వాటి అస్థిత్వమే లేదు.

***




# రేడియో నాటకం

## గొల్లపూడి మారుతీరావు

**దాదాపు నలభై అయిదు సంవత్సరాల క్రితం విశాఖపట్నం** హిందూ రీడింగ్ రూంలో ఓ సభ జరిగింది. వేదిక మీద ముగ్గురే ఉన్నారు. ప్రముఖ కవి, విమర్శకులు అబూరి రామకృష్ణారావుగారు ఆ సభ అధ్యక్షులు. నేను రేడియో నాటకం గురించి అనర్గళంగా మాట్లాడాను. పోణంగి శ్రీరామ అప్పారావుగారు స్టేజి నాటకం గురించి ఇంకా అనర్గళంగా మాట్లాడారు. చివరికి అబ్బూరి లేచి నిలబడ్డారు. "ఇదా రేడియో నాటకానికీ, స్టేజి నాటకానికీ తేడా? ఏమయిన, నాకేమో రేడియో నాటకమే గొప్పదనిపిస్తోంది. ఎందుకంటే బాగోలేకపోతే రేడియో వెంటనే ఆపేసుకోవచ్చు. స్టేజి నాటకానికి ఆడియన్సులో ఇరుక్కొంటాం" అన్నారు.

ప్రేక్షకులంతా పక్కుమని నవ్వారు. కానీ నాకు మాత్రం ఆ మాట చురకలాగా తగిలింది. చాలా సందర్భాలలో రేడియో ప్రసారాల మీద జరిగే బోధనా తరగతులలో ఉద్యోగులతో ఈ విషయం చెప్పకుండా ఉండను. అనవసరమనిపించినా, విసుగు పుట్టించినా ఎవరితో ప్రమేయం లేకుండా రేడియో ఆపేసుకునే శ్రోత సౌకర్యమే రేడియో ప్రయోక్తకి సవాలు. ఈ వెసులుబాటే ఆ మాధ్యమానికి ఒక హెచ్చరిక, ఓ కనువిప్పు - ఇంకా చెప్పాలంటే ఒక హద్దు.

అయితే ఈ పరిమితి ప్రసారానికి మాత్రమే పరిమితం. సజావయిన ప్రసారం కలిగించే ప్రభావానికి కాదు. ముందు ఈ ప్రసారానికి ఉండే బాధకాల్ని పరిశీలిద్దాం. ఇది కేవలం ఒక శ్రవణేంద్రియం ద్వారానే అలరించే ప్రక్రియ. నిజానికి పంచేంద్రియాలలో 'అలరింపు' విషయంలో - వినే వ్యక్తి ప్రయత్నాన్ని ఎక్కువగా ఆశించే ఇంద్రియం - చెవి. విన్నదాన్ని విచక్షణ, అభిరుచి పరీక్షించాకే దాని అలరింపు. విన్న విషయం ఆలోచనగా మారి, అనుభూతిగా తర్జుమా అయిన తర్వాతే దాని మంచి చెడ్డలు. కుక్క అరిచింది. ఉలిక్కిపడ్డాం. మన పెంపుడు కుక్క అరిచింది. ప్రాణం లేచి వచ్చింది. The sound has to qualify the thought. ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి పాడుతోంది. మనకి స్వర్గం. అమెరికా శ్రోతకి ఆ మాధుర్యం అందకపోవచ్చు. బీటిల్స్ కొందరికి రొదగా అనిపించవచ్చు. శబ్దాన్ని ఫిల్టర్ చేసిన స్థాయి తరువాతే అనుభూతి ప్రమేయం.

ఇక రంగస్థలం మీద ప్రదర్శన, తెరమీద చిత్రం - రెండు ఇంద్రియాలను పరిపుష్టం చేస్తున్నాయి. గొప్ప దృశ్యం శబ్దానికి ఊతం. గొప్ప ఆలంబన కళ్ళ ముందు దర్శనమిస్తోంది. అంతకంటే - ముఖ్యమయిన విషయం - రంగస్థల నాటకాన్ని, చిత్రాన్ని చూడాలని

ఇష్టపడే, నిర్ణయించుకున్న ప్రేక్షకులే వాటిని ఆస్వాదించబోతున్నారు. వారు Captive audiences. ఆ ఆనందానికి సిద్ధపడే సామాజికుడి initiative ఆ మాధ్యమానికి గ్యారంటీ.

మరి రేడియో ఎవరిని అలరిస్తోంది? డ్రాయింగ్ రూంలోనో, మరమరాల దుకాణం దగ్గరో, కిళ్ళీ కొట్టు దగ్గరో, పార్కు బెంచీ దగ్గరో, పడక గదిలోనో, రోడ్డు పక్కనో - ఎక్కడయినా, ఎప్పుడయినా, ఎలాగయినా శ్రోతకి అందుతుంది. ఆ కార్యక్రమాన్ని అందుకునే ప్రయత్నం లేదు. ప్రయత్నం జరగాలనే పట్టింపు లేదు. నాటకం చూడాలంటే మొదట సామాజకుడి మనస్సు ఆ నాటకం వేపు మళ్ళాలి. టిక్కెట్టు కొనుక్కోవాలి. ఆ అనుభూతికి సిద్ధపడుతూ ఆడిటోరియంలో కూర్చోవాలి. తెర లేచే సమయానికి ప్రేక్షకుడి ఉద్దేశమూ, ప్రదర్శకుడి లక్ష్యమూ ఏకీకృతమవుతాయి. ఇద్దరి మధ్యా ఒక anticipation ఉంది. ఒక ఒప్పందం ఉంది. ఒక ప్రయత్నం ఉంది. రెండు జ్ఞానేంద్రియాలను ఇద్దరూ సంధించారు. ఒక సమన్వయం. ఒక సమ్మేళనం. అనుభూతికి చక్కటి ఆలంబన. ఇది నాటకానికీ, సినీమాకీ వర్తిస్తుంది.

రేడియో ప్రసారాన్ని అందుకోడానికీ ఏ కొద్దిమందో సిద్ధపడినా, ఎక్కువమంది కమిటెడ్ శ్రోతలు కారు. కాగా, అబ్బూరి వారు ఉటంకించిన సౌకర్యం ఉండనే ఉంది. రేడియోలో నాటిక ప్రసారం ప్రారంభమయింది. వంటగదిలో పొయ్యి మీద పాయసం తయారవుతోంది. ఇల్లాలి శ్రద్ధ ఆ మేరకి పలచబడింది. నాటిక బాగా సాగుతోంది. కానీ ఆఫీసులో ఇన్స్పెక్షన్. ఆ మేరకు నాటిక మీద శ్రద్ధ తగ్గింది. మనవడు బండి దిగాడు. ఆ పసివాడి పలకరింత నాటికని బలితీసుకుంది.

రేడియో వెయ్యి రకాలయిన ఆకర్షణలతో, అవసరాలతో, ఆటుపోటులతో సతమతమయే దైనందిన జీవితంలో నిస్సహాయంగా చొచ్చుకు వచ్చే - బలహీనమయిన వినోదం. 'బలహీనం' అనడానికి కారణం - ప్రసారలోపం కాదు. ఇతరత్రా వ్యావృత్తులలో మునిగితేలే శ్రోత ప్రయత్నానికి గల 'హద్దు'లు.

ప్రపంచ ప్రఖ్యాత ఏంకర్ రాబర్ట్ ఫాస్ట్ (నాకంటే ఏడు రోజులు పెద్ద) తన చిన్నతనంలో - అంటే - 1947 ప్రాంతంలో రేడియో గురించి రాస్తూ ఇలా అన్నాడు; "Any sense of togetherness and community was more a function of radio.. Than of, say, newspapers, because even the individual listener in a room knows that he or she is part of a shared experience"

ఇప్పుడా shared experience టీవీలు దోచుకున్నాయి. వాటి తాకిడికి వార్తాపత్రికలే గజగజలాడుతున్నాయి. టీవీలు కూడా అచిరకాలంలో రూపు మార్చుకుని - కార్లల్లో, రోడ్లమీదకి, సెల్‌ఫోనుల్లోకి వచ్చేశాయి. ఇవాళ రోడ్డుపక్క బస్సు స్టాండులో కూర్చుని 20 రకాల సినిమాలను సెల్ ఫోనుల్లో చూడగలిగిన సౌకర్యం వచ్చేసింది shared experience క్రమంగా isolated, captive experience అయి కూర్చుంటోంది.

సరే. ఇప్పుడు ఆ దేశాలలో రేడియో ఏం చేస్తోంది? టీవి ప్రభంజనం దైనందిన జీవితాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న నేపథ్యంలో - రేడియో పాత్ర ఒక్క పనికి పరిమితమయిపోయింది. విదేశాల్లో ఆఫీసుకి బయలుదేరే ప్రతీవ్యక్తీ రేడియోని తలుచుకుంటూనే కారెక్కుతాడు. ఎందుకు? దారిలో రోడ్లు ఏ అడ్డంకులూ లేకుండా ఉన్నాయా లేక ఏ రోడ్డులోనయినా ఏక్సిడెంటు జరిగిందా రేడియో చెపుతుంది. ఒకవేళ ఏక్సిడెంటు అయితే మరే రోడ్డున వెళ్ళడం శ్రేయస్కరమో రేడియో సూచిస్తుంది. ఆ రోజు వాతావరణాన్నీ, ఉష్ణోగ్రతనీ చెపుతుంది. రేడియో మిగతా మాధ్యమాలకి తలవొంచి - దారి తప్పుకుని ప్రస్తుతం 'పోలీసు' పాత్రని నిర్వహిస్తోంది!

ఇది - ఇతరత్రా - ఆకర్షణలు పెరుగుతున్న నేపథ్యంలో - ఒక మాధ్యమంగా దానికున్న లిమిటేషన్. ఇక కార్యక్రమాలు అనగా - ప్రసంగాలూ, సంగీతం, నాటకం - అది రెండో పార్శ్వం.

రేడియో ప్రసారం వినే ప్రక్రియ. ప్రసంగానికీ, వ్యాసానికీ తేడా ఉంది. "భారత దేశంలో 2010 నాటికి జనాభా 8.45 బిలియన్లు దాటుతుంది. ఇది అమెరికా జనాభాకంటే 52 శాతం ఎక్కువ. అయితే ఇందులో 3.74 బిలియన్లు -" ఇలా చెప్పుకుపోవడం వ్రాసే వ్యాసం - చెవిటివాడిముందు శంఖం. వ్యాసాన్ని మైకు ముందు చదవడం చాలా విసిగెత్తించే పని. చదివే ఉపన్యాసకుడు ఎదురుగ్గా నిలబడినా ప్రేక్షకుడిలో ఆసక్తిని రేపడు. అతని సృజనాత్మకత - అది ఏస్థాయిలో ఉన్నా ప్రేక్షకుడు ఆసక్తిని కలిగిస్తుంది. ఆ గొంతు మాట్లాడడం లేదు. ఏదో పాఠం చదువుతోంది. అతి సుళువుగా శ్రోత ఆసక్తిని గదిలో తచ్చాడే కుక్కపిల్ల మళ్ళించగలదు.

మాట్లాడే ప్రసంగం - శ్రోతకి చెప్పే ప్రసంగం నిలుస్తుంది. ఉదాహరణకి కేవలం ఉదాహరణకి -: "ఈ వాక్యం పూర్తయేసరికి ఈ దేశంలో ఇద్దరు పుడుతున్నారు. ఈ ప్రసంగం పూర్తయేసరికి ఈ దేశానికి ఓ అదిలాబాద్ జిల్లా చేరుతుంది. రేపటికి సగం ఒరిస్సా జనాభా ఈ దేశానికి జతపడుతుంది.." ఇలా సాగితే శ్రోత మనస్సులో ఓ 'బొమ్మ' ఏర్పడుతుంది. శ్రోత ఊహకి ప్రాసంగికుడు 'చోటు'ని కల్పిస్తున్నాడు The talk stimulates the listener's imagination. శ్రోతని తన ఆలోచనా వలయంలోకి ఎంతగా లాగుకోగలిగితే అంతగా ప్రసంగం రాణిస్తుంది. తన ఆలోచనకి అవకాశం కలిగిన కొద్దీ శ్రోత అహంకారానికి ఊతం దొరుకుతుంది. తన ఊహకి చోటుని కల్పించిన ప్రాసగికుడు మరింత దగ్గరవుతాడు. ఆ ప్రసంగం - కేవలం తన mental participation కారణంగా మేలైనదవుతుంది. ఇప్పుడు అతని గదిలో పరిసర వాతావరణాన్ని తనే జోకొడతాడు. కుక్కపిల్ల అరుపు విసుగనిపిస్తుంది. బయట ప్రపంచాన్ని కాస్సేపు మనస్సులో మూసేస్తాడు. ప్రసారకర్త గొంతు అతని ప్రపంచమవుతుంది - ఆ క్షణాన శ్రోతకీ, ప్రసారానికీ ఇది గగన కుసుమం. సంగీతానికి గ్రామరు లేదు. చక్కగా అలరించే గొంతు, అందమయిన గమకం, ఆహ్లాదాన్ని కలిగించే బాణీ - వీటన్నిటికీ తోడు ఆ కళాకారుడి ప్రాశస్త్యం - శ్రోత కూర్చున్న ఆ గదిని సంగీత ప్రాంగణంగా మారుస్తాయి.

అయితే రేడియోలో సంగీత రూపకానికీ, స్టేజిమీద సంగీత రూపకానికీ చాలా దూరం. చూసే రూపకం కన్నా వినే సంగీత రూపకం అలంకరణ unidimensional కావాలి. ఇది మరొక కథ.

ఇక రేడియో నాటకం ప్రయోక్తకి బలమయిన సవాలు. సంగీతాన్ని ఆస్వాదించడానికి - కొండకచో instinct చాలు. కాని నాటక శ్రోతకి - అదెంత ప్రాథమికమయినా - కొంత intelligence కావాలి. అరిస్టాటిల్ ప్రతిపాదించిన మూడు యూనిటీలు టైం, స్పేస్, యాక్షన్ - కేవలం శబ్దం ద్వారానే ప్రతిపాదించాలి. పాత్రల స్వభావాలు, వయస్సు, సన్నివేశం జరిగే స్థలం, పాత్రల వయస్సులూ, వారి ఆవేశాలూ, హావభావాలూ - వెరసి - ఇతివృత్తమంతా - ఒకే ఊతం - శబ్దం ద్వారానే శ్రోతకి చేరాలి. ఇది ఊహించలేనంత పెద్ద సవాలు. కేవలం శబ్దమే - ఆ నాటకం ఇతివృత్తం మీదా, ఎత్తుగడమీదా, సమస్య మీదా, సన్నివేశం ఆవిష్కరణ మీదా - శ్రోతకి ఆసక్తిని కలిగించాలి. ఇది uni-dimensional, మాధ్యమం జరపాల్సిన multi-dimensional కార్యం.

ఇంకా పెద్ద సవాలు - నాలుగు జ్ఞానేంద్రియాలతో ప్రమేయం లేని ప్రక్రియ - అన్ని జ్ఞానేంద్రియాలతో తన వ్యావృత్తులను నిర్వహించుకుంటున్న శ్రోతని తనవేపు ఆకర్షించుకోగలగడం. ఇది కత్తిమీద సాము.

ప్రసారంతో ఏ విధమయిన సయోధ్య అవసరంలేని శ్రోత పరీక్షకి నాటకం మొదటి క్షణాలు నిలవాలి. ఇక్కడ ఎక్కువమంది 'అబ్బూరి' వారి శ్రోతలే ఉండే అవకాశం ఉంది. అంటే రేడియో నాటిక మొదటి క్షణాలు ఓవర్ ఛార్జ్ అయి ఉండి తీరాలి. అంటే రచయిత పరపతో, నటుల ప్రాచుర్యమో, నాటకం ప్రతిష్టో - ఏదయినా లేక అన్నీ అయినా కారణం కావచ్చు. క్రమంగా శ్రోత తన చెప్పు చేతల్లోకి వచ్చాక నాటకం తన దారిని తను వెదుక్కుంటుంది. దురదృష్టం - కొండకచో - శ్రోతని ఆ కార్యక్రమం నష్టపోయిన విషయమూ ప్రసార కర్తకి వెదుక్కుంటుంది. దురదృష్టం - కొండకచో - శ్రోతని ఆ కార్యక్రమం నష్టపోయిన విషయమూ ప్రసారకర్తకి తెలియదు. ఇదే మాధ్యమం సవాలు.

ఈ సవాలును సమర్థవంతంగా దాటగలిగితే ఏమవుతుంది? మాధ్యమాన్ని ఒడిసి పట్టుకోగలిగిన రేడియో కార్యక్రమం - ఏం సాధించగలుగుతుంది? రేడియో నాటకం సరాసరి శ్రోత ఆలోచనకు నిచ్చెన వేసే ప్రక్రియ అని చెప్పుకున్నాం. అంటే ప్రయోక్త కృషికి తప్పనిసరిగా initiative ని జోడించే ప్రక్రియ. ఇది కేవలం ప్రాథమిక దశలో.

దమ్మున్న ప్రయోక్త - మాధ్యమాన్ని ఆయుధం చేసుకోగల ప్రయోక్త చేతిలో ఆలోచనను పదును పెట్టగల శ్రోత మరబొమ్మ అవుతాడు. ప్రయోక్త చేవకొద్దీ మరతుపాకీ కూడా కాగలడు. ప్రసారం ఒక ఆయుధమూ కాగలదు. ఒక నూతన ప్రపంచాన్నీ సృష్టించగలదు. ఇది దృశ్యానికి దక్కని - కేవలం శ్రవణ ప్రక్రియకి మాత్రమే అందే అదృష్టం.

ఆలోచనకి ఒక నియతి లేదు. ఒక పరిధీ లేదు. ఒక హద్దూలేదు శ్రోత మనస్సు అతని సంస్కారం మేరకి, శ్రోత ఆలోచనా ప్రపంచంలోకి ప్రయోక్త చొచ్చుకు రగలిగిన మేరకి - ఆ అనుభూతి పరిపుష్టం అవుతుంది. అవుతూనే ఉంటుంది. చేసుకున్నవాడికి చేసుకున్నంత. ఆలోచించగలిగినవాడికి ఆలోచించగలిగినంత

మనస్సులో 'బొమ్మ' రూపుదిద్దుకోడానికి ప్రయోక్త కొన్ని ఉపాధుల్ని ఏర్పరుస్తాడు. ఆ ఉపాధుల్ని ఆధారం చేసుకుని శ్రోత మనస్సు విజృంభిస్తుంది. తన ఆలోచనా పరిధిని పరుచుకుంటుంది. తన ఆలోచన మేరకి ఆ బొమ్మని భూతద్దంలో నిలుపుతుందా? కుంచిస్తుందా? రంగులు దిద్దుతుందా? వక్రీకరిస్తుందా? పారిహాసికని చేస్తుందా? - ప్రయోక్త దారిని నిర్ణయించాడు. శ్రోత నడుస్తున్నాడు. నిజంగా నడుస్తున్నాడా? పరుగులు తీస్తున్నాడా? లేదా వాయువేగ మనో వేగాలతో గాలిలో తేలిపోతున్నాడా? అది శ్రోత అదృష్టం. ప్రయోక్త సామర్థ్యం.

ఋషి భగవంతుడిని చూశాడు. నిర్వికార, నిరామయుడయిన భగవత్ స్వరూపాన్ని దర్శించాడు. బ్రహ్మానందమయ స్థితిలో ఉన్నాడు జీవుడు. ఆ స్థితిని వాచ్యం చెయ్యాలని ఋషి తాపత్రయం. ఏ భాష దేవుడిని మాటల్లో లొంగదీస్తుంది? ఏం చెపితే ఆ బ్రహ్మానందమయ స్థితి మామూలు మనిషికి అందుతుంది? ఆ మైకంలో తన అలౌకిక స్థితిని వర్ణిస్తున్నాడు. ఆలోచనలకి పొంతన కుదరడం లేదు, అయినా ఆలోచనల్లో ఒక నియతి ఉంది. "అది పూర్ణం. అయినా కాదు. ఆ పూర్ణానికి మరొక పూర్ణాన్ని కలిపితే అదీ పూర్ణమే.." ఇది ఒక అపూర్వమయిన అనుభూతిని ఆవిష్కరించడానికి ఋషి యొక్క muse.Infinite అయిన అనుభూతి finite అయిన మాటల్లో ఒదిగించాలని ఋషి ప్రయత్నం. వాటి మధ్య నుంచి ఏ కాస్తయినా ఆ అనుభూతిని గుర్తుపట్టగలిగితే ఆ మేరకి ఆ బ్రహ్మానందమయ స్థితి యొక్క స్థాయి ఎంతో కొంత అందుతుంది.

ఓ గొప్ప అనుభూతికి ఒక 'రూపాన్ని' ఇవ్వాలనుకున్న అనిర్వచనీయమైన exercise అది. ఇందులో విపర్యయం కూడా ఉంది. ప్రయోక్త తన స్థాయిమేరకి ఒక అనుభూతిని శ్రోతకి అందించాలని ప్రయత్నం చేశాడు. శ్రోత మనస్సు పరిపక్వ స్థాయిలో ఉంది. అతని సంస్కారం - అతని ఆలోచనా స్థాయిని exalted planeలో ఉంచింది. అప్పుడేమవుతుంది ప్రయోక్త కూడా ఊహించలేని స్థాయికి శ్రోత ఎదిగి పోతాడు. 'పోతన' మూడు గంటల సినీమా. కాని ఓ 'బాలయోగి'కి తాత్విక దర్శనాన్నీ, వైరాగ్య చింతననీ ప్రసాదించిన అపూర్వమయిన శయ్య అయింది. కారణం - ప్రయోక్త శ్రోతల మధ్య బంధుత్వానికి ఒక పరిధి లేదు. అది ప్రయోక్త సామర్థ్యమంత విశాలం. శ్రోత ఆలోచన, సంస్కారపు స్థాయి అంత ఉన్నతం.

ప్రయోక్త తన మాటల్లో నేలబారు స్వర్గాన్నే చిత్రించవచ్చు. కానీ శ్రోత తన ఆలోచనల్లో ప్రయోక్త అందించిన చిత్రాన్ని దాటి గొప్ప 'వైకుంఠా'న్ని ప్రతిష్ఠించుకోవచ్చు. The rapport between the creator of a sound play and his listener is volatile, plastic and peerless.

నేను 23వ ఏటి వరకూ తాజ్ మహల్ గురించి విన్నాను. జాషువా "ఒక్కొక్క రాతిలో నిమిడి యున్నవి షాజహాను భూభుక్కు నెడందలో నుడిగి పోయిన రక్తపుంజుక్కలలోని చక్కదనమ్ము.." చదివాను. రవీంద్రుడు A tear of melody glistening on the cheek of time' అంటే మురిసిపోయాను. క్రమంగా నా మనస్సులో ఒక అపూర్వమయిన తాజ్‌మహల్ రూపు దిద్దుకుంది. దానికి ఎల్లలు లేవు. అది రవీంద్రుని ఆలోచనంత ఉన్నతమయినది. జాషువా పద్యమంత హృద్యమయినది. అంతకుమించి నా ఆలోచనంత విస్తృతమయినది. ఆఖరికి నా 24 ఏట నిజమయిన తాజ్ మహల్‌ని చూశాను చూడగానే నా మనస్సు నీరసమయి, కృంగిపోయింది. ఈ తాజ్‌మహల్ నా మనస్సు దిద్దినంత గొప్పగా లేదు. ఇది నిర్మించింది లగాయతు క్షీణిస్తున్న కట్టడం. నా మనస్సులోది నా ఆలోచనల మేరకి నిత్యనూతనమవుతున్న కళాఖండం.

రేడియో నాటిక - ప్రయోక్త సామర్థ్యం మేరకి - శ్రోత ఆలోచనలు పెరగగలిగినంత రేంజ్, కారెక్టర్, డెప్త్ - వెరసి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుంటుంది. ఈ గొప్పతనం మరే మాధ్యమానికీ లేదు. కెమెరా చూపే ఐశ్వర్య రాయ్ ఆమె అందానికే పరిమితం. మన చూపు ఆ దృశ్యాన్ని క్వాలిఫై చేస్తుంది. మన చూపు నిర్దయగా ఆలోచనని వాస్తవానికి పరిమితం చేస్తుంది. కాని మనస్సులో రూపు దిద్దుకున్న వరూధినిలో వెయ్యిమంది ఐశ్వర్యారాయ్ లున్నారా? మార్లిన్ మన్రో ఉందా? గ్రేటా గార్బో ఉందా? ఏమో! ఆ శ్రోత మనస్సులో పక్కింటి అమ్మాయి ఉందేమో!

"నవరంగ్"లో కవి వంట పని చేసుకునే నేలబారు మనిషి - తన భార్యలో అతిలోక సుందరిని దర్శించుకున్నాడు. అది 'దర్శన'కి ఉన్న రేంజ్. ప్రయోక్త ఆలోచన fertility ని ఎరువుగా చేసుకుని శ్రోత మనోక్షేత్రంలో విశ్వరూపం దాల్చే అపురూప పారిజాత పుష్పం - ఆ అనుభూతి.

రేడియో నాటిక అబ్బూరి వారి మాటల్లో - విసుగుపుడితే - ఆపదలిస్తే పక్కకి వినయంగా తొలిగి పోవడానికి తలవొంచే మాధ్యమం. తలదూర్చి, తన్మయుడవాలని సిద్ధపడితే విశ్వరూపం దాల్చగలిగిన ever enlarging multi dimensional utopia.

●●●

మనస్సుని సూటిగా అలరించగల ఒక్క కారణానికే రేడియో నాటిక ఇతివృత్తానికి అవధిలేదు It can travel through time space, centuries and continents.. శ్రోత మనస్సులో విమానాన్ని సృష్టించవచ్చు, బంగారు గనిలోకి వెళ్ళవచ్చు, నదీ గర్భంలోకి పోవచ్చు, గుడిలో విగ్రహాలతో భక్తుడు ప్రసంగించవచ్చు, గాలితో కబుర్లాడవచ్చు. నిన్న, నేడు, రేపు ఏదయినా, లేక అన్నీ అయినా ఇతివృత్తంలో భాగం కావచ్చు.

ప్రముఖ కవి, రచయిత అనిశెట్టి సుబ్బారావుగారు "కర్రా చెప్పులు" అనే నాటిక రాశారు. యజమాని మీద కర్రా చెప్పులూ తిరగబడతాయి. ఆసక్తికరమయిన ఆలోచన. నేను 'రేపటి మనిషి' రాశాను. ఏదో సంజీవని కారణంగా చావులేని వాతావరణంలో ఒక హాస్య సంఘటన రేడియో నాటిక అయింది. "సహస్రబాహూ" అనే నాటిక ఆద్యంతమూ చీకట్లో నడుస్తుంది. అది శ్రోత ఆలోచనలో ముసురుకున్న చీకటి. ఊహకి మరో డైమెన్షన్.

రేడియో నాటిక పెద్ద ఆయుధం - నిశ్శబ్దం. నిశ్శబ్దం ఉత్కంఠని పెంచుతుంది. ఆదుర్దాని కలిగిస్తుంది. కావాలనుకుంటే ప్రశాంతతని ప్రతిఫలిస్తుంది. అలాగే సంభాషణల మధ్య వ్యవధి.

నేను రేడియోలో పని చేసే రోజుల్లో అలిటాలియా బహుమతిని గెలుచుకున్న "మేరథాన్" (Marathon) అనే గంట నాటకాన్ని విన్నాను. ఒలింపిక్స్ వంటి పరుగు పందెంలో ఓ ఆటగాడు పరిగెత్తుతున్నాడు. అతన్ని ప్రోత్సాహపరచడానికి పక్కనే కారులో అతని కోచ్ వెళుతున్నాడు. ఆటగాడికి అలసట, నైరాశ్యం, నిస్సహాయత, నిర్వేదం - ఇన్నీ తోసుకువస్తున్నాయి. అతని కృషికి ఇవేవీ భంగం

కల్పించకుండా కోచ్ అతన్ని ప్రోత్సహిస్తున్నాడు. "తన పరుగు తానకోసం కాదు - తన దేశంకోసం. దక్కే విజయం తనదికాదు - వ్యవస్థది. ఈనాటి కృషి ఒక జాతి చరిత్రకి వాటా ఉంది."

ఆటగాడు ఎంత వేగంగా పరిగెత్తుతున్నాడు? దారి పక్కన ఏదో పాటో మాటో తెలుస్తోంది. అయితే అతని వేగానికి ఆ మాట (పాట) ఒక్క క్షణం స్ఫుటమయి, అంతలో నీరసమయి, శబ్దం దూరమవుతోంది. ఆ శబ్దం అతని వేగాన్ని పరోక్షంగా కళ్ళముందు నిలుపుతుంది. వేగానికీ, ఫేడిన్ అయి అంతలో దూరమయే శబ్దానికి ఎలా సాపత్యాన్ని సాధించడం? అతి శాస్త్రీయంగా సాధించారు ప్రయోక్త, ఒక్కసారి కళ్ళుమూసుకుని ఏకాగ్రతతో శబ్దాన్ని వినగలిగితే "ఆరోగ్యం జాగ్రత్తబాబూ" అనే తల్లి మాట అంతలో వినిపించి దూరమవడం, అలాగే ఓ పాట - ఇవన్నీ ఆ పురుగుని ఆలోచనలో ప్రతిష్టిస్తాయి. కోచ్ ఉద్బోధ, ఆటగాడి సాధన ఇది భగవద్గీత. ఈ కార్యక్రమం జపాన్ లో తయారయింది. బి.బి.సి. దీన్ని ఇంగ్లీషులో పునర్నిర్మించింది. అయితే ఎఫెక్ట్స్‌ని చెయ్యలేక జపాన్ సౌండ్ ట్రాక్‌నే వాడుకుంది. ఆనాటి మా రేడియో ఉద్యోగ శిక్షణలో ఈ నాటకం వినడం ఒక భాగం. ఒక మామూలు సంఘటనకి ఒక జాతి ఆదర్శాన్ని సమీకరించిన అతి గంభీరమైన కార్యక్రమం. నా రేడియో జీవితంలో ఇప్పటికీ మరిచిపోలేని అనుభూతి. ఇది typical radio play in its pristine form.

●●●

శబ్దం ద్వారానే అనుభూతిని పంచుకునే శ్రోతకి రేడియో నాటిక పాఠం చెప్పకూడదు. వేదాంతాన్ని బోధించకూడదు. ఆదర్శాలను వల్లించకూడదు. శ్రోతని లోబరుచుకుని తనవాడిని చేసుకునే ప్రయత్నం - క్లుప్తంగా, చిన్న వాక్యాలతో జరగాలి. పెద్ద పెద్ద వాక్యాలు శ్రోత గ్రహణ శక్తిని పరీక్షకు పెడతాయి. మహత్తరమయిన ఎత్తుగడ విసిగిస్తుంది. క్లిష్టమయిన నేపథ్యం శ్రమ పెడుతుంది. అంతకు మించి శ్రోత సామర్ధ్యాన్ని ప్రశ్నిస్తుంది. ఎక్కువ పాత్రలు గజిబిజి చేస్తాయి. One golden rule of play writing is – begin with a crisis. దానిని 'ముడి' అంటాం. క్రమంగా దాన్ని విప్పుకుంటూ పోగలగాలి. లేదా కొత్త, గొప్ప, వింత ఆలోచన, సన్నివేశం, సందర్భం - శ్రోతని తనవేపుకు ఆకర్షిస్తుంది.

తగు మాత్రపు నేపథ్య సంగీతం, శబ్దానికి ఊతాన్నిచ్చే క్లుప్తమయిన ఎఫెక్ట్స్ శ్రోత ఆలోచనని బలపరుస్తాయి. రామారావు నడుస్తున్నాడు. బూట్ల చప్పుడు అసందర్భం. హంతకుడు కత్తి పట్టుకుని దగ్గరికి వస్తున్నాడు. ప్రతి అడుగూ ఉత్కంఠని పెంచుతుంది. సీత గదిలోంచి బయటకు వెళ్ళింది. తలుపు తెరిచి మూసే శబ్దం అనవసరం. సీత అతని జీవితంలోంచి శాశ్వతంగా బయటికి నడుస్తూ తలుపు మూసింది. ఈ మూత కేవలం శబ్దం కాదు. సంప్రదాయం మీద తిరుగుబాటు. సభ్యప్రపంచం మీద ఎక్కు పెట్టిన తుపాకీ. ఇక్కడ తలుపు మూయడానికి శబ్దమే శరణ్యం. అప్పుడా శబ్దం కొత్త అర్ధాన్ని సంతరించుకుంటుంది. ఔచిత్యాన్ని భంగం చేసే అర్ధం లేని శబ్దం - ఆలోచనని పలచబరుస్తుంది. క్రమంగా ప్రయోక్తమీదా, అతను అందించబోయే అనుభవం మీదా శ్రోతకి నమ్మకం సన్నగిల్లుతుంది.

ఎక్కువ చెప్పాలనే ఆదుర్దా, ఎక్కువ సన్నివేశాలూ, ఆలోచనలూ ఆ మేరకు నాటకాన్ని బలహీనం చేస్తాయి. రేడియో నాటిక డ్రాయింగు రూంలో శ్రోతయొక్క ఐచ్ఛికమయిన 'శ్రద్ధ'ని ఆహ్వానించే ప్రక్రియ. ఎదురుగా లేని ప్రయోక్త పట్ల శ్రోతకి మొహమాటం లేదు. కాగా, అబ్బూరివారి మెలిక ఉండనే ఉంది.

మరొక ముఖ్యమయిన విషయం. నిత్య జీవితంలో లాగానో, దృశ్య నాటకంలోలాగానో - పాత్రల సంభాషణలు - ఒకరి మాతకి మరొకరు సమాధానం చెప్పేవిగా ఉండనక్కరలేదు.

"మీ పేరు?"

"రామారావు"

"ఏ ఊరు?"

"నిడదవోలు"

ఇది - సాధారణంగా తొక్కేదారి.

"మీ పేరు?"

"ఇప్పుడది అవసరమా?"

లేదా

"అడగడానికి మీరెవరు?"

"చెప్పడానికి అభ్యంతరమా?"

ఇది కేవలం నమూనా. ప్రశ్నల మధ్య రేంజ్ శ్రోత ఆసక్తిని అలంకరిస్తుంది. ఆలోచన కదలాలి. ఇతివృత్తం పలకరించాలి. మాట క్రమంగా dimensional కావాలి. ఆలోచనకి కొత్తపదును అందాలి.

చీమ నుంచి బ్రహ్మదాకా - శ్రోత ఆలోచనని - అణువు దగ్గర్నుంచి ఆకాశం దాకా - 'ఆలోచన' అనే ఆలంబనతో విశ్వరూపాన్ని చూపించగల అతి విస్తృతమయిన పరిధిని ఆవిష్కరించే ఒకే ఒక్క ప్రక్రియ రేడియో నాటిక.

సినీ తెరమీద ఇంద్రలోకాన్ని చూపడానికి కోట్లు ఖర్చవుతుంది. కళ్ళముందు ఐఫిల్ టవర్‌ని నిలపడానికి బృహత్తరమయిన ప్రయత్నం కావాలి. కాని - నిన్నటి ప్రహ్లాదుడు - రేపటి రొబట్‌తో మెరీనా బీచ్‌లో కాస్సేపు ముచ్చటించే కొత్త సన్నివేశం - ప్రయోక్త ఊహించగలిగినంత వింతగా, శ్రోత అందుకోగలిగినంత కొత్తగా ఉంటుంది.

ప్రపంచంలో మరే మాధ్యమం ఆలోచనకీ, వ్యక్తి సంస్కారానికీ, ప్రయోక్త స్వేచ్ఛకీ - వెరసి అనుభూతికి దక్కే ఐశ్వర్యానికి ఇంత పెద్ద పీట వెయ్యదు. వెయ్యలేదు.

ఆ విధంగా - అన్ని మాధ్యమాలలో జీవితమంతా పనిచేసిన వాడిగా - ఇప్పటికీ - నేను రేడియో నాటకానికే - మొదటి స్థానాన్ని ఇస్తాను.




# భారతీయ సంస్కృతి - పరిణామ వికాసాలు - వికారాలు

## గొల్లపూడి మారుతీరావు

**చరిత్ర కాలం రాసుకున్న ఆత్మకథ అన్నారెవరో**. కాలం చేతనున్న కలం సంస్కృతి అంటాను నేను. కాలం రాస్తున్న కాగితం కళ. కాలం దస్తూరీ సంప్రదాయం. ఇది చాలా ఆలోచనతో చేసిన అన్వయం. వ్యక్తికీ వ్యక్తికీ దస్తూరీ మారుతుంది సంప్రదాయ సరళీ అంతే. కాగితం నిక్షిప్తమవుతుంది. పాతబడుతుంది. పాడుబడదు. రచన చేసే కలం అతి ముఖ్యమయింది - సంస్కృతి. అన్ని రంగాల మేళవింపు సంస్కృతి. సాహిత్యం, సంగీతం, శిల్పం, వృత్తులు, జానపద కళలు, జీవన విధానాలు, నైతిక విలువలు, సమిష్టి జీవనం - అన్నిటి సమగ్ర రూపం సంస్కృతి. ఇందులో మానవసంబంధాలు, వనరులు, నీటి పారుదల, సామాజిక స్పృహ , నిబద్ధత, న్యాయ వ్యవస్థ ఒకటేమిటి? జీవన యోగ్యం చేసే అన్ని పార్శ్వాల విశ్వరూపం - సంస్కృతి.

మా మిత్రుడు ఎన్.ఆర్.నందితో నేనెప్పుడూ తగాదా పడేవాడిని - అతని నాటకం "మరో మొహంజొదారో" గురించి. ఒక వ్యవస్థలో నైతిక పతనానికి సంబంధించిన ఇతివృత్తమది. కానీ శీర్షిక ఒక సంస్కృతికి సంబంధించినది. అదిన్నీ శిథిల సంస్కృతికాదు. మొహంజొదారో, హరప్పా, పాంపే ఆనాటి ఉజ్వలమైన సంస్కృతీ వైభవానికి ప్రతీకలు. వాటి శైధిల్యానికి కాదు. శంకరాచార్య, రామకృష్ణ పరమహంసని జీవిత అశాశ్వతత్వానికో, మృత్యువుకో అభిజ్ఞులుగా ఉదహరించం. ఒక గొప్ప సందేశానికీ, ఒక ఉద్యమ ఔన్నత్యానికీ, ఒక సిద్ధాంత ప్రభుత్వానికీ సారధులుగా ఉదహరిస్తాం. వెనకటికి కప్పల తక్కెడగా ఉన్న ఈ ఇంటికథకి 'వియత్నాం వీడు' అని పేరు పెట్టారు. మా మిత్రుడొకాయన బాధపడ్డాడు. 'అయ్యా, వియత్నాం ఒక స్రామాజ్యవాదుల దౌష్ట్యానికి, వారు సృష్టించిన అవ్యవస్థకి కాదు, 23 సంవత్సరాలు ఆ దౌష్ట్యాన్ని తట్టుకుని తమ అస్థిత్వాన్ని నిలుపుకున్న వియత్నాం దేశం resilience కి ఉదాహరణగా చెప్పుకోవాలి' అన్నాడు. నిజం Taj Mahal represents the genius of that period, not its decay.

ఓ పెద్దాయన - మహాపండితుడు నన్ను సాగనంపడానికి తన ఇల్లు దాటి చాలా దూరం నడిచి వస్తున్నాడు. నేను ఇబ్బంది పడి 'ఇక మీరు ఆగండి' అన్నాను. ఆయన నవ్వి "ఆత్మీయుల్ని చెమ్మ ఉన్న చోటువరకూ సాగనంపాలి. పదండి" అన్నాడు.

ప్రపంచ చరిత్రలో మానవుడి వలసలన్నీ నీటి వనరుకి సమీపానే ఏర్పాటు చేసుకున్నాడు. ఏ చిన్న గ్రామమయినా ఏదో చిన్న నీటి వనరుకి సమీపానే వెలుస్తుంది. అలనాడు కణ్వుడు తను పెంచిన శకుంతలని అత్తారింటికి పంపుతూ - ఆశ్రమ ద్వారం దగ్గర కాక నదీతీరందాకా వచ్చి సాగనంపడంలో ఉద్దేశం ఇదేనేమో. జీవాశ్రయం ఆత్మీయుడికి అందిందని రూఢి చేసుకున్నాక హితుడు ఆగిపోవచ్చునట. ఇవి సంస్కృతీ వైభవాన్ని చాటే ప్రతీకలు. మనకి చాలా తెలివి. సుఖం ఏమిటంటే తెలియవన్న విషయం తెలియక పోవద్దు. ఇంకా సుఖం ఏమిటంటే తెలియక పోవడం వల్ల మరేం నష్టం లేదన్న ధీమా తెలుసు.

ఈ రెండు రోజులూ జరిగే సదస్సులన్నీ ఆయా విషయాల్ని అతి క్లుప్తంగా, స్థాళీపులాక న్యాయంగా విశ్లేషిస్తాయి. వింగడిస్తాయి. వివరిస్తాయి. ఈ కీలకోపన్యాసం ఆ ప్రక్రియకి కేవలం నాంది మాత్రమే కాక – ఒక poserగా ఉండాలని ఆశిస్తున్నాను. ఆలోచనకు ఆలంబన కావాలని ప్రయత్నిస్తున్నాను. అదే ఈ ప్రసంగ లక్ష్యం.

మధ్యధరా సంస్కృతికి తూర్పున ఉన్న కొన్ని దేశాలలో – తేలికగా  చైనాను కూడా కలుపుకుని పరిశీలిస్తే – సంస్కృతీ వైభవానికి పెద్ద పీట భారతదేశానిదే. కారణం – ఆయా కాలాలలో మానవ జీవన వికాసానికి అవసరమైన, చైతన్యవంతమైన జీవితానికి ఆలంబన కాగల ఎన్నో మెలుకువలనూ, పరిణతులనూ ఆయా దశలలో జాతి కనుగొంటూ, కలుపుకొంటూ ముందుకు సాగడమే This is a highly evolving civilization.

వీపు గోక్కోవడం అతి ప్రాథమికమైన పని. అందని భాగంలో సుఖంగా గోక్కోడానికి కర్రకి చిన్న కుచ్చు – ఆ మాత్రపు తెలివితేటలకి, అవగాహన, అవసరానికి – మనిషి ఏర్పరచుకున్న సౌకర్యానికి – మించి కుశాగ్రతకి నిదర్శనం. ఆ కుచ్చుని జపాన్, సైబీరియాల్లో దొరికే అతి లలితమైన సున్నితమైన సేబుల్ అనే జంతువు వెంట్రుకలతో చేసుకోవడం పరిణతికి ఉదాహరణ. మరో పై మెట్టు.

ఇటలీలో నేపుల్స్ సమీపంలో వెసూవియస్ అనే అగ్నిపర్వతం బద్దలు కావడం వల్ల లావాలో భూస్థాపితమైన పాంపే పట్టణం 1500 సంవత్సరాల తర్వాత బయటపడింది. నేను స్వయంగా చూశాను. సమిష్టి జీవనంలో మనిషి తన బతుకుని సుగమం చేసుకునే పరికరాల దగ్గర్నుంచి, గృహనిర్మాణం దగ్గర్నుంచి, నీటి సరఫరా కాలువల్నీ, స్నానాల గదుల్నీ ఏర్పరుచుకున్న మొదటి శతాబ్దపు రోమన్ సామ్రాజ్య సంస్కృతీ వైభవం అది. ఇక మొహంజొదారోలో 4,500 సంవత్సరాల నాటి సింధునాగరకత వైభవం, ఆనాటి శిల్పకళా చాతుర్యం తెలుస్తుంది. ఈజిప్టు, మొసపటేమియాలలో 35 వేల మంది నివసించిన గ్రామ సమూహాలు,మట్టి కట్టడాలూ, ధాన్యం గోదాములూ తెలుస్తాయి.

వీటన్నింటికంటే భారతీయ సంస్కృతిని ఒక మెట్టుపైన నిలబెట్టడానికి కారణం ఏమిటి? నాకు తెలిసి – దేవుడు. 'దేవుడు' అనగానే చాలామంది భుజాలు తడుపుకోవచ్చు. నేను చెప్పేది నల్లనివాడు పద్మనయనమ్ములవాడో, భుజంగధారీ, ఝటాజూటధారీ – మరెవరో మరెవరో కాదు. ఈ 'దేవుడు' మనం అలవాటు పడిన ఇప్పటి denominational దేవుడు కాదు. చాలా శతాబ్దాల లజ్జు గుజ్జుల తర్వాత క్రమంగా Compartmentalize అయిపోయిన దేవుళ్ళు వీళ్ళు. నేను చెప్పే దేవుడికి మరో పేరు 'విశ్వాసం'. ఆలోచనకి అందని, అవగాహనకి లొంగని శక్తి.

సంస్కృతిలో తొలినాటి దేవుడు – మానవ జీవనానినికి ఆధారమైన ప్రాథమిక ప్రాణశక్తి. అగ్ని జీవనాన్ని ఏమాత్రం జీవనయోగ్యం చేసుకోవాలన్నా అవసరమైన శక్తి ఇది. ఎక్కడ దొరుకుతుంది? ఎక్కడయినా దొరుకుతుంది. ఏ నిత్యాగ్నిహోత్రుని ఇంటికి వెళ్ళినా అగ్నిని సిద్ధంగా ఉంచుకుంటాడు.

కాలపరిమితి తెలియని అతి ప్రాచీనమయిన ఋగ్వేదంలో పదిమండలాలో 1128 సూక్తాలలో సుమారు 50 శాతం అగ్నిహోత్రం ప్రసక్తే ఉంది It is the elemental force for the earlier man. It was his God.

అగ్నిమీలే పురోహితం యజ్ఞదేవ మృత్విజం హోతారం రత్న ధాతమం అందరి క్షేమం కొరకు అగ్నిని ప్రార్థించుచున్నాను – అంది ఆనాడు వేదం.

(గమనిక: ఇవన్నీ తెలిసి చెపుతున్న విషయాలు కావు. తెలుసుకుని చెపుతున్నవి. నా ఆలోచనలను సమర్థించుకునే ఆధారాలను వెదుక్కుని పొందుపరిచినవి)

ఇది స్వానుభవంతో మానవుడు ఏర్పరచుకున్న విశ్వాసం. తనకు తెలియని - తన అదుపులో లేనిశక్తి అది. చీకటి వెనుక - కేవలం ఆలోచనలో మెరిసే గుర్తు. శతాబ్దాలు గడిచాక ఆలోచన అవగాహన బాగా సానదేలాక - పోతన్నగారు అద్భుతంగా వివరించారు. 'లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుది నలోకంబైన పెంజీకటికవ్వల ఏకాకృతి వెలిగే వెలుగు'. విశ్వాసం అద్భుతమైన కళగా, కవిత్వంగా రూపుదిద్దుకున్న దశ ఇది. ఆలోచనకి నగిషీ పట్టి, చిలవలూ పలవులూ అల్లుకుని, అపురూపమైన రూపం ఇచ్చిన glorious మజిలీ ఇది. కప్పదాటు వేస్తున్నాను మన్నించండి.

ప్రాథమికంగా reflexesతో మాత్రమే జీవించే మానవుడికి - ఆలోచనతో అన్వయించుకోగల సత్యాలుకాక 'విశ్వాసాలు' అవసరమయాయి. అవి చాలు అతని జీవికకి. అటుపక్క బూచాడు ఉన్నాడు. అంటే పసివాడు చీకట్లోకి వెళ్ళడు. ఈ అన్నం తింటే ఆకాశం మీంచి చందమామ దిగివచ్చి నిద్రపుచ్చుతాడు. అంటే పసివాడు నమ్ముతాడు. ఎదురుచూస్తాడు. చెప్పే అమ్మమీద విశ్వాసం, 'చెప్పడం'లో సమస్యలకి పరిష్కారం లేదు. నమ్మడంలో ఉంది. అమ్మకీ తెలీదు - మొన్న మొన్నటిదాకా ఆకాశంలో ఉన్న చందమామ - నీరూ, ప్రాణవాయువూ లేని భయంకరమైన గ్రహమని.

శతాబ్దాలుగా 'దేవుడు' అనే విశ్వాసాన్ని అద్భుతమైన museగా హిందూ దేశం చేసినంత విస్తృతంగా మరే దేశమూ - కాదు - మరే మతమూ - కాదు మరే సంస్కృతీ చెయ్యలేదు. చెయ్యలేదు కూడా. అందుకే ఈ సంస్కృతికి ఇంత విస్తృతి. ఇంత సాంద్రత. ఇంత resilience. నేను గుళ్ళల్లో దేవుళ్ళ గురించి మాట్లాడడం లేదు. మన జీవనంలో సర్వే సర్వత్రా అన్ని రకాల వ్యావృత్తులలోనూ అల్లుకుపోయిన omnipotent, omniscent శక్తి మాట నేను చెప్పేది. సంస్కృతీ వికాసానికి ఆలవాలమయిన 'దేవుడు' గురించి నేను మాట్లాడుతున్నాను. తొలినాటి మేధావులు, జిజ్ఞాసువులూ, కళాకారులూ - పోనీ ఇవన్నీ పెద్ద మాటలు - ఆనాడు గుహల్లో రాతిమీద బొమ్మలు చెక్కిన తొలినాటి మానవుల దగ్గర్నుంచి ఆది శంకరులదాకా - ఒక్క భారతీయ సంస్కృతిలోనే మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలకూ ఈ విశ్వాసంతో ముడిపెడుతూ వచ్చారు. ఆలోచనకు ప్రమేయంలేని శతాబ్దాల మానవుడు ఈ empirical విజ్ఞానాన్ని - కేవలం విశ్వాసం అనే పెట్టుబడితో, నిబద్ధతతో అనుసరిస్తూ వచ్చాడు. నెలకి మూడువానలు, సంవత్సరానికి ఆరు ఋతువులూ, సుభిక్షంగా రెండు పంటలూ, శాంతియుత సహజీవనం - అలనాటి మానవుడి ఆలోచనతో సాధించుకున్నది కాదు,నిబద్ధతతో నిలుపుకున్నది. 'తెలిసి'కాదు. తెలియాల్సిన అవసరం కూడా లేదని సంప్రదాయాన్ని కొనసాగించడం వల్ల. ఇప్పుడు ఈ వ్యాసంలో మొదటి వాక్యాన్ని ఇక్కడ గుర్తుచేస్తాను. కాలం రాసుకున్న ఆత్మకథలో కలం దస్తూరీ సంప్రదాయం.

తరతరాలుగా ఈ విశ్వాసానికి ఒదిగి, అవలంభించి, అనుసరించి, అనుస్పందించి - ఒక గొడుగుని చేసుకుని జీవించడానికి ఓ అందమయిన పేరు ఉంది - ధర్మం, సామాజిక నీతి, స్పృహ. ఒక నియతి. Dharma is a loaded word – denoting the generalized code of the numan kind, of a community, of a society, of a generation. It is all – pervasive and ever lasting.

"ధర్మమా విష్టితం జగత్" అన్నది వాల్మీకి ఉవాచ. ఈ జగత్తుని ధర్మం నడిపిస్తోంది.

అతి స్థూలమయిన ప్లేన్‌లో - ఈ 'ధర్మం' నీడలోకి - ఈ రెండు రోజులూ మన పెద్దలు చర్చించే విషయాలన్నీ వస్తాయి.

మిగతా సంస్కృతులకు ఇంత విస్తృతి లేదు. ఇంత విస్తృతికి ప్రయత్నించలేదు. ఆ Vision ఆయా సంస్కృతులు ఆశించలేదు. కాస్త గర్వంగా చెప్పాలంటే ఆశించారేమోకానీ సాధించలేదు. మొజార్ట్‌కీ, బిథోవెన్ కీ, డిలన్ థామస్‌కీ, ఎడ్విన్‌లు త్యెన్స్‌కీ, థామస్ ఆల్వా ఎడిసన్ కీ ఏసు ప్రభువుకీ, దేవుడికీ, భక్తికీ ఏమీ సంబంధం లేదు. మళ్ళీ చెపుతున్నాను. నేను denominational దేవుడి గురించీ, మతం గురించి మాట్లాడడం లేదు.

అలనాడు రోమన్ సంస్కృతిలోనే - మన వైభవం ఛాయలు - దాదాపు అంతే ఉన్నతంగా కనిపిస్తాయి. కానీ ఇంత సమగ్రంగా కాదు. అందుకనే రోమన్ శిల్పకళ, సాహిత్యం, చిత్రలేఖనం, వ్యక్తి సౌందర్యం అన్నీ మతంతో ముడిపడ్డాయక్కడ. మైకెలాంజిలో, రాఫేల్, లియొనార్డో డివిన్సీ - ఇలా ఎన్నయినా ఉదాహరణలున్నాయి. మరిచిపోవద్దు - ఆ కారణంగానే ఇవాళ విశ్వ వ్యాప్తమైన క్రైస్తవ మతానికి - వాటికన్ కి - అది కేంద్రమయింది. ఇక్కడే మరొక్కమాట. ఇస్లాం ప్రపంచ మతాల్లోకెల్లా evolved మతం. సాకారం లేని పరబ్రహ్మాన్ని ఆరాధించే మతం. ఆలోచనలో ఆ ఉన్నత్యాన్ని పెద్ద పీట వేసిన మతం. అయితే ఛాందసత్వం నేడు వేస్తున్న వెర్రితలలు ఈ ఔన్నత్యాన్ని మరుగు పరుస్తున్నాయి. అయితే ఆ దౌర్భాగ్యం ఎంతో కొంత అన్నిమతాలకూ వర్తిస్తుంది.

మళ్ళీ మన కథకి వస్తే - తెలియని చీకటిలోంచి తెలిసిన, కావలసిన 'శక్తులను నిజ జీవితంలో అన్ని పార్శ్వాలకు వ్యాపింపజేసిన ఘనత ఈ సంస్కృతిది. బడే గులాం ఆలీఖాన్ పాడినా, భీమ్ సేన్ జోషి పాడినా, హీరాబాయ్ బరోడేకర్ పాడినా, బాలమురళీ కృష్ణ పాడినా ఆ తుమ్రీలో, ఆ దోహాలో, ఆ అభంగ్ లో, ఆ జావళిలో 'మాలిక్' ఉన్నాడు. రవివర్మ వేసినా, నికోలాయ్ రోరిక్ వేసినా, దామెర్ల రామావు వేసినా అతి నేలబారు చిత్రంలో కూడా ఈ జాతి సంస్కృతి ప్రతిఫలిస్తుంది. ఒక ముగ్ధ 'సంస్కారం' ఉంటుంది. ఆ సంస్కారానికి మన సంస్కృతికీ దగ్గర దారి ఉంటుంది. పాటలో తాదాత్మ్యం, శిల్పకళలో సంప్రదాయం, నిర్మాణంలో వాస్తు - అన్నిటికీ మూలధాతువు - సంస్కృతి. భోజనం చేస్తూండగా పొలమారితే - కంఠ నాళంలో పొలమారి వాయునాళంలోకి ఆహారం వెళ్ళి ప్రాణానికి ముప్పు వస్తుందేమోనని ఆముదం దీపం వెలుగులో మీ చిన్నతనంలో అవ్వ 'ఇష్టదైవం పేరు, నచ్చిన మనిషి పేరు' చెప్పమనడంలో విశ్వాసం వాటా ఉంది. పండగకి ముంగిట పెట్టే బియ్యపు పిండి ముగ్గులో కీటకాలకు ఆహారం ఉంది. గొబ్బిళ్ళకి ధనుర్మాసంలో అవసరమైన anti - septic కవచం ఉంది. anti - septic ధర్మం కారణంగానే తులసి 'తల్లి' అయింది. త్యాగరాజు కీర్తనల్లో అజరామరమయింది. కార్తీక మాసంలో ఉపవాసాలకు - వర్షరుతువులో పరోక్షంగా ఆరోగ్య పరిరక్షణ సూత్రాలున్నాయి. (ఇదే రుతువులో మరో మతం కూడా - రంజాన్ ఉపవాసాలను నిర్దేశిస్తుంది). జీవితంలో ప్రతీ అంశానికీ మన ఆలోచనతో ప్రమేయం లేని - సర్వే సర్వత్రా - తరతరాల మానవుడు అంగీకరించిన, అనుసరించిన ధర్మం ఉంది. అయ్యప్ప సిద్ధాంతంలో శివకేశవ అభేధం ఉంది. ఒక మండలం పాటు ఆరోగ్య ప్రణాళిక ఉంది. ఇది ఫక్తు ఐహికం. ఇలా అన్నిటికీ అన్వయాలున్నాయి. దస్తూరీ సరిగా చూసుకు జీవించు. నీ జీవితం జీవన యోగ్యం అవుతుంది - అనే సందేశం ఉంది.

30 ఏళ్ళ క్రితం నాకు తల మీద సొరియాసిస్ వచ్చింది. నేను తెలివైన మాథమాటికల్ ఫిజిక్స్ పట్టా పుచ్చుకున్న ఆధునిక మానవుడిని. అప్పుడే సినీమాల్లోకి వస్తున్నాను. నుదుటి మీదకి క్రమంగా వ్యాపిస్తోంది. చర్మవ్యాధులలో డాక్టర్ బి.సి.రాయ్ అవార్డ్ అందుకున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ తంబయ్యగారిని కలిశాను - కష్టం మీద ఇంటర్వ్యూ సంపాదించి, చిన్నలుంగీ, షర్టుతో అతి ప్రశాంతంగా ఉన్నాడాయన. నన్ను పరీక్ష చేసి నువ్వుల నూనె తలకి రాసుకుని ఎండలో పదినిముషాలు కూర్చుని స్నానం చెయ్యమన్నాడు. గొప్ప డాక్టరు కనుక - ఇవ్వకపోతే నామోషీ కనక ఓ మందు రాసి ఇచ్చాడు. నువ్వుల నూనె రాసుకుని ఉదయం ఎండలో నిలబడి -

హిరణ్య వర్ణాం హిరణీం సువర్ణ రజిత.. అంటూ సూర్యస్తవంచేస్తే ఎలాంటి చర్మరోగమయినా సూర్యుడు పోగొడతాడని మా నాయనమ్మ చిన్నతనంలో చెప్పింది. సూర్యాస్తమం ఎంత సేపు? పదినిమిషాలు. తంబయ్య చికిత్స పది నిమిషాలు. ఎండలో నిలబడి హిందూ పేపరు చదువుకున్నా, అనూరుడినీ, సప్తాశ్వరూఢుడైన సూర్యుణ్ణి పొగిడినా అదే ఫలితం. సుర్యుడి తొలి కిరణాలలో సౌర శక్తి చర్మవ్యాధిని నిర్మూలిస్తుంది. మొదటిది విశ్వాసం. సింబల్. తంబయ్య మీదనాకున్నదీ విశ్వాసమే! ఆయన ఆలా కిరణాలు, బీటా కిరణాల గురించి ఉపన్యాసం ఇవ్వలేదు. పద్ధతిని నిర్దేశించాడు. అంతే. అదే తరతరాల సంప్రదాయం మనకిచ్చినది.

మొన్న మొన్ననే పూరీ జగన్నాథుడి ఆలయానికి వెళ్ళాను. ఆలయం మీద బూతు బొమ్మలు కనిపించాయి. వెంటనే తాపీ ధర్మారావు నాయుడుగారు జ్ఞాపకం వచ్చారు. 'దేవాలయాల మీద బూతు బొమ్మలు' మీద వారు రాసిన పుస్తకం గుర్తుకొచ్చింది.

మనిషి 'విశ్వాసం' పెట్టుబడిగా - అతిధి మర్యాదల దగ్గర్నుంచి, చర్మవ్యాధి నివారణ దగ్గర్నుంచి, 33 కోట్ల దేవతల్ని ఆరాధించేదాకా - ఇందులో పందులూ, కుక్కలూ, గాడిదలూ (వసుదేవుడు పట్టుకున్న కాళ్ళు), సాలెపురుగులూ, పాములూ, ఏనుగులూ, క్రిములూ, కీటకాలు - అన్నీ ఉన్నాయి. అన్నిటినీ ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చిన సంస్కృతీ వైభవం ఈ దేశానిది. సమస్త జీవరాశినీ గౌరవించి, ఆదరించి సహజీవనం నెరపాలన్న సూత్రానికి ఈ సంస్కృతి వేసుకున్న పునాదులివి. దురాశ పెరిగి కృత్రిమ ఎరువుల వాడకం ద్వారా సీతాకోక చిలుకలు పంటలకి దూరమయి పరాగ సంపర్కం తగ్గిపోయిందని శాస్త్రజ్ఞులు వాపోతున్న వార్త చదివాను.

ఈ వైభవాన్ని తన్మయత్వంతో, తాదాత్మ్యంతో అనూహ్యమైన muse చేసిన శంకరాచార్య, వివేకానంద, భగవాన్ రమణులు, తొండరప్పడి ఆళ్వార్, కబీర్ - వీరందరినీ ప్రవక్తల్నీ అవధూతల్నీ చేసుకున్నాం.

ఇంత సమగ్రమయిన ఫ్రేం వర్క్‌లో తప్పనిసరిగా ఎన్నో అపశ్రుతులుంటాయి. అవకాశవాదులుంటారు. కొందరు over - zealous మేధావులు, వ్యక్తులు, వ్యవస్థలు, స్వాములు, బాబాలు వీటిని చొరరాని బంధిఖానాలు చేశారు. తప్పుడు అన్వయాలు కల్పించారు. అద్భుతమైన సామరస్యానికి కారణమైన పునాదుల్ని బలహీన పరిచారు. అడ్డుగోడలు కట్టారు. సుభిక్షంగా సాగవలసిన పాలనా వ్యవస్థలోనే - ఇంత అవినీతి, అరాచకం, భ్రష్టత ఉండగా - శతాబ్దాలుగా చెల్లుబాటవుతున్న ఇంత విస్తృతమైన కాన్వాస్‌ని సొమ్ము చేసుకుని, వమ్ము చేసిన మహానుభావులు ఎందుకుండరు? అయితే విజ్ఞతతో మూల సూత్రాలను ఫోకస్‌లోకి తెచ్చుకోవడం తప్ప మరో మార్గంలేదు.

ఈ ప్రపంచంలో ఏ మతానికయినా ప్రధాన లక్ష్యం - ఆ సమాజంలో మనిషి జీవితాన్ని జీవన యోగ్యం చెయ్యడమే. ఇప్పుడు నేను మన దేవుళ్ళ గురించీ, మన మతాల గురించే మాట్లాడుతున్నాను.

విశ్వాసాన్ని పెట్టుబడిగా empirical సత్యాల్ని కాపాడుకుంటూ ధర్మాన్నీ - తద్వారా Earth's Life supporting systems నీ కాపాడుకుంటూ పురోగమించే స్థాయినుంచి మనిషి 'ఆలోచన'కు పెద్ద పీట వేసే స్థాయి వచ్చింది. ఇది గొప్ప పరిణామం. టెస్టు ట్యూబుల్లో ప్రాణాన్ని పెంచడమేకాక - ఈ మధ్య కొత్తగా జన్యు కణాల్ని కనుగొన్నారని విన్నాం. చంద్రమండలం మీద కాలుమోపి ఆరువందల ఏభై సంవత్సరాల అన్నమయ్య కవితకి - 'చందమామరావే జాబిల్లిరావే' అన్న పిలుపుకి విడాకులిచ్చాక ఇది అనూహ్యమైన పురోగతి.

కానీ మనకి తెలియని బిలియన్ల గ్రహాలున్నాయి. కొన్ని లక్షల సంవత్సరాలు ఈ గ్రహం మీదే ప్రానవాయువు లేదు. ప్రాణి లేదు. సరే. అప్పటి విశ్వాసాలకు తాడూ బొంగరం లేదని, అవన్నీ మనల్ని తప్పు తోవ పట్టించే మూర్ఖపు ఆలోచనలనీ 'ఆలోచన' చేసే స్థాయికి మనం వచ్చాం. అవగాహనలో ఎన్నడూ లేనంత పురోగతిని సాధించాం.

అయితే - పాంటు, షర్టు, సూటు వేసుకున్న మనం నాలుగు తరాల కింద oropicalవాతావరణంలో మన తాత గావంచా కట్టుకోడాన్ని వెక్కిరించనక్కర లేదు. అర్థం చేసుకోగలిగితే - తంబయ్యకీ మా నాయనమ్మ ఆలోచనకీ సయోధ్యని వెదకగలిగితే - అసూరుడి రథం కదలికకీ సొరొయాసిస్‌కీ 'లంకె' దొరుకుతుంది.

ఆదిమానవుడు నగ్నంగా అడవుల్లో తిరిగాడు. ఆఫ్రికా అడవుల్లో - ఆరూషాకి దూరంగా అర్ధనగ్నంగా ఉన్నవారిని నేను చూశాను. మా తాత విశ్వాసానికి వెనక గల 'ఉద్దేశం' మనకి దొరక్కపోవచ్చు. అలాగే ఎండలు మండించే దేశంలో ట్వీడ్ సూటూ, టై కట్టుకున్న మనల్ని చూసి రానున్న ఆరోతరం పగలబడి నవ్వవచ్చు. 150 సంవత్సరాల ప్రదాస్యం ప్రసాదించిన వైరితల అని ఈ తరంలోనే చాలామంది ఒప్పుకోకపోవచ్చు.

ఆనాటి విశ్వాసాలు సమాజ ధర్మాల్ని Insulate చేసి కాపాడాయి. ఈనాటి మన తెలివితేటలు కొన్నివేల సంవత్సరాల భూమి సహజ ధర్మాన్ని retard చేస్తున్నాయి.

ఈ చిన్న వ్యవధిలో, ఈ చిన్న వ్యాసంలో ఇంత బృహత్తరమైన విషయాన్ని చర్చించడం సాధ్యంకాదు. విశ్లేషించడానికి నాకు శక్తిచాలదు. భూమి పరిణామ శీలాన్ని విశ్లేషించాలంటే కొన్ని లక్షల సంవత్సరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొన్ని బిలియన్ల గ్రహాల్ని విశ్వంలో మన పరిధి, మన జీవన పరిమాణం, సంస్కృతీ వికాసం - అత్యల్పం.

మరి ఎందుకీ గొడవ? ఎందుకీ కంఠశోష? ఈ మధ్య ఛానళ్ళు తిప్పుతూంటే వేంకటేశర సుప్రభాతం బూతు అని ఎవరో చర్చిస్తున్నారు. కాళికాదేవి మహిషాసురుడిని చంపడంలో కుల వివక్ష ఉందని ఎవరో అంటున్నారు. అమ్మని చూస్తూ ఏ బిడ్డా స్థనాల ఆకర్షణ గురించి ఆలోచిస్తాడనుకోను. తన ఉపాధికీ, ఆకలికీ పాథేయాలుగా చూస్తాడు. ఈ దృష్టి బేధంతో చూస్తే శంకరుడే స్వయంగా చెప్పడని భావించే 'సౌందర్య లహరి' అంతా బూతే. మూక కవి అంత భ్రష్టుడు మరొకడు ఉండడు. పూరీ జగన్నాధుడిని మనం దర్శించనక్కర లేదు - అది బూతుమయం కనక.

శ్రీరాముడు ఏ బ్లేడుతో గెడ్డం గీసుకున్నాడు? సీతాదేవి అవసరాలకు దండకారణ్యంలో 'టాయ్‌లెట్'ని నిర్మించారా? విశ్వామిత్రుడు గెడ్డాన్ని శుభ్రంగా ఉంచుకోడానికి పేల దువ్వెన వాడేవాడా?లాంటి ఆలోచనలు perversions. Intellectual decadence. కొన్ని సంవత్సరాల పాటు కదలకుండా కొండ గుహల్లో కూర్చుని తపస్సు చేసుకునే రుషులు తమ శరీర రుగ్మతలకి కేవలం శరీరాన్ని అదుపులో ఉంచుకోడానికి సాధించుకున్న యోగాసనాలు అమెరికా 'పేటెంట్'గా మనకి చేరితే రుచిగా ఉంటుంది. అజీర్ణానికీ, కీళ్ళ నొప్పులకీ అమెరికా ఇంగ్లీషులో మనకి వారు బోధ చేస్తారు.

ఈ మధ్య కథలు, పాత్రలు, స్తుతులూ, దేవుళ్ళూ, మతపరమైన సింబల్స్ - వీటిపై చర్చలు వింటున్నాం. మన ముత్తాత గోచీకి కొత్త అన్వయం వెదకడంలాంటిదే ఇదని నా ఉద్దేశం. ఆనాటి తరానికి ఇవి ఎందుకు, ఎలా అవసరమయామో, వాటి ప్రయోజనం - అర్థం ఏమిటో ముందు వివరంగా చర్చించడానికి కారణం ఇదే

నిజానికి పురాణాల్ని వెక్కిరించే రచనలు - నాకు తెలిసి - మన తరంలోనే ఇద్దరు చేశారు. ఇద్దరూ మహానుభావులు. ఒకాయన గొప్ప పాత్రికేయులు - నార్ల, మరొకాయన మహారచయిత - చలం. సావిత్రి, పురూరవ వంటి నాటకాలు పురాణాలను వెక్కిరిస్తూ రాయడం వెనుక స్ఫూర్తి ఏమిటని 45 సంవత్సరాల క్రితం ఒక సావనీర్‌లో వ్యాసానికి చలంగారికి ఉత్తరం రాశాను. ఆయన సమాధానం ఇది: "ఆ నాటకాలన్నీ బుద్ధిలేక రాశాను. ఇంకెన్నటికీ అలాంటి పనిచెయ్యను"

నా అభిప్రాయం. We need destroy the institutions వీలయితే, సాధ్యమయితే కొత్త వ్యవస్థల్ని సృష్టిద్దాం. అవి ఒక తరం. ఒక సమాజం, ఒక కాలం నిర్ణయించిన సత్యాలు కావు. శతాబ్దాల విలువలకి ప్రతీకలు. అప్పటికవి oested values. ఆ విలువలకిప్పుడు కాలదోషం పట్టిందా? భేష్. కొత్త విలువల్ని ప్రోదు చేద్దాం. కాలక్రమేణా ఇవీ పాతబడతాయి. పాడుబడతాయి. ఆరేడు తరాల తర్వాతి వారు మనల్ని చూసి నవ్వుకోవచ్చు. నవ్వితే నవ్వనివ్వండి. పరిణామ శీలాన్ని ఒక్కరయ్యినా బేరీజు వేయగలిగితే అది చరిత్ర అవుతుంది. అది కాలం రాసుకున్న సిసలైన ఆత్మకథ అవుతుంది.

ఆఫ్ఘనిస్తాన్‌లో భామియన్ బుద్ధవిగ్రహాలలాగ ఆ విలువల్ని నేలమట్టం చేయనక్కర్లేదు. అక్కరలేదని చెప్పడానికే ఈ వ్యాసం మొదటి నుంచీ ఈ సంస్కృతిలోని 'దేవుడి' గురించి ఇంత విస్తృతంగా చెప్పవలసి వచ్చింది. ఈ సత్యాల్ని denominational పరిధుల్ని దాటి ఆలోచిస్తే సమాధానాలు దొరుకుతాయేమో! ఒక తాపీ ధర్మారావో, ఒక చలమో తారసపడేదాక ఆగుదాం మనకి అక్కరలేని, ఇప్పుడూ చెల్లని కిందటి దశాబ్దపు నాణెం ఒక చరిత్రని చెపుతుంది. ఒక వ్యవస్థని వివరిస్తుంది. ఒకనాటి సంప్రదాయానికి సూచిక అవుతుంది. మించి - మనమేధస్సు పురోగతికి మార్గదర్శి అవుతుంది.

Institutions should not be judged – as you don't judge a morning – an afternoon or an evening.

ఉదయం పరిణామం. కాలానికి సంకేతం. అయితే ఉదయం నువ్వు చేసే పనిని చర్చించవచ్చు. విమర్శించవచ్చు. పదిగంటల దాకా పడుకోవడం సోమరితన. పన్నెండుదాకా పడుకోవడం అనారోగ్యం. రాత్రంతా మేలుకోవడం విడ్డూరం. వికారం. విపరీతం. కానీ మరో అయిదేళ్ళ తర్వాత - అమెరికాతోనో, ఆస్ట్రేలియాతోనో సయోధ్య నేర్పరుచుకున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే వ్యక్తి విధిగా రాత్రంతా పనిచేస్తాడు. పగలు నిద్రపోక తప్పదు. అలవాట్లు మారతాయి. అవసరాలు ఆ అలవాట్లను నిర్ణయిస్తాయి. మా తాత బతికుంటే ఆయన దృష్టిలో ఇది అరాచకం. కాని మనకాలానికి అవసరం. అయితే ఏనాడయినా ధర్మం మారదు. జీవన సరళి మారుతుంది. అందుకే ప్రతీ తరం, ప్రతీ మేధావీ భగవద్గీతకి ఎప్పటికప్పుడు అన్వయాన్ని చెపుతూవచ్చారు - అది జీవితానికి వర్కింగ్ గైడ్ కనుక. ఇంతకంటే మేధావుల సమావేశం దొరకదన్న ప్రలోభంతో ఈ నాలుగు మాటలు చెప్పాలనిపించింది. కూల్చనక్కరలేదు. అవి ఎప్పుడూ మారుతూ, పారుతూ ఉంటాయి.

ఆఖరుగా -

When you deify you refuse to learn
When you define you begin to learn

●●●




# పోతనగారి పోత

## డా.దూర్వాసుల వెంకట సుబ్బారావు

(ప్రారంభం)

**ఎన్నగరాని పుణ్యమో,** మన అదృష్టమో ఆంధ్రమాత ముగ్గురు మహారాజులను కన్నది. వీరు శాశ్వతమైన నరహరి సామ్రాజ్యాన్ని పాలించిన బమ్మెర పోతరాజు (1450), కంచెర్ల గోపరాజు (1630), కాకర్ల త్యాగరాజు (1767). వీరు భక్తి సామ్రాజ్యంలో సువృష్టి పంటలు పండించిన సుకవితా శిరోమణులు, సదా సజ్జన వందనీయులు, ప్రాతః స్మరణీయులు. ఈ ముగ్గురూ అశాశ్వతమైన నరసామ్రాజ్యాన్ని, ధనాన్ని తృణీకరించిన త్యాగధనులు. ఏమన్నారంటే:

"ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి.. సమ్మెట వ్రేటులంబడక సమ్మతి శ్రీహరి కిచ్చి (భా1-11), "ధనమదాంధుల కొలువేల తాపసులకు?" (భా2 - 21; పోతన) "ఇచ్చట నార్జించిన ధనమెచ్చటికెత్తుక పొయ్యే రయ్య యో" (రామదాసు) "నిధి చాలసుఖమో, రాముని సన్నిధి సేవ సుఖమో" (త్యాగరాజు). ఇంకో విశేషం వీరికి తారకబ్రహ్మోపదేశం చేసిన వారు యతీంద్రులే: పోతనకు చిదానంద యతి, గోపరాజుకి కబీరు, త్యాగరాజుకి రామకృష్ణానందయతి.

ప్రాచీన తెనుగు కవులలో విశేషంగా ఉదహరింపబడే వారిద్దరు: ఒకరు పోతన, రెండవవారు వేమన. పోతన భాగవతం మానవ సంబంధాలలో ఎన్నో మార్పులు తెచ్చినది. వైష్ణవ భక్తి భావోద్యమానికి భాగవతం నాంది. పోతన భాగవతం అవతరణ, ఆవిష్కరణ, కవితామాధురి, విశిష్టత క్లుప్తంగా వివరిస్తా ఈ వ్యాసంలో.

*<u>పోతన ఏ ప్రాంతం వాడైతేనేమి?</u>*

వీరశైవ మతాన్ని ఉద్రేకంగా ప్రచారం చేసిన పాల్కురికి సోమనాథునిది తెలంగాణాలోని ఓరుగల్లు; నేటి వరంగల్లు. దీనికి ముప్పయి మైళ్ళ దూర్మలో నున్న బమ్మెర గ్రామమే పోతన నివాసమని ఒక అభిప్రాయం. "మరలి కొన్ని దినంబులకు నేక శిలానగరంబునకు వచ్చి "(భా 1- 21) అని పోతనే చెప్పుకున్నాడు. ఈ ఏకశిలానగరంకి ప్రతినామము ఒంటి మిట్ట (ఒంటి - ఏక; మిట్ట - శిల్ప) అని. అది కడపకి దరిలో నున్నదని వేరొక వాదన. తెలంగాణా వాడని పద్నాలుగురు, కాదు కడపవాడని ఇరవై ఒక్కరూ వాదించుకున్నారు. అందులో ముఖ్యులు పురాణం హయగ్రీవ శాస్త్రి, కందుకూరి వీరేశలింగం, గురజాడ శ్రీరామమూర్తి, జయంతి రామయ్య, వావిలాల వెంకట శివావధాన్లు, వంగూరి సుబ్బారావు, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, చిలుకూరి వీరభద్రరావు, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు ప్రభృతులు. ఆఖరికి వావికొలను సుబ్బారావుగారు. పోతన ఏ ప్రాంతం వాడైననూ, సమస్తాంధ్రలోకమునకు ఆరాధ్యుడు, పూజ్యుడు, ప్రతీ గ్రామము వారు మా ఊరి వాడని ఎంచుట సంతోషకరము అని శలవిచ్చారు. దాంతో సద్దుమణిగింది.

*వంశము: గురువులు*

ఇంటిపేరు బమ్మెర. ఆపస్తంబసూత్ర, కౌండిన్యస గోత్రడని తన మొదటి కృతి వీరభద్ర విజయంలో వ్రాసుకున్నాడు పోతన. తండ్రి కేసన, తల్లి లక్కమ్మ - ఇద్దరూ శైవభక్తులే. అన్న తిప్పన, కుమారుడు మల్లన. మంత్రులు ఆ రోజుల్లో నియోగులే. మంత్రి కాకపోయినా, అలవాటు కొద్దీ పోతనామాత్యుడని వ్యవహరింపబడేవాడు. తండ్రినుంచే సంస్కృతం నేర్చుకున్నట్లు, తండ్రిని 'శంకరపాద యుగాంభోజ పారీణు'లని, వారి వంశగురువు ఇవటూరి సోమనాధయ్య అనిన్నీ, ఈ శైవాచార నిరతుని ప్రేరణ వలననే తాను వీరభద్ర విజయాన్ని రచిస్తున్నట్లు వ్రాసుకున్నాడు.

*పోతనకృతులు*

ఈ మహాకవి రచించినవి 1.వీరభద్ర విజయము 2. నారాయణ శతకము 3. భోగినీ దండకము 4. శ్రీమదాంధ్ర భాగవతం. వీరభద్ర విజయం శివుని కుమారుడు - వీరభద్రుని గురించి. పూర్తిగా శైవపరమే. భోగినీ దండకము సర్వజ్ఞసింగభూపాలుడు - వారకాంత భోగినిల ప్రేమ గురించి. అయితే అంతవరకు శివభక్తుడైన పోతన నారాయణ శతకం, భాగవతం విష్ణుపరంగా వ్రాయడానికి బహుశః ఆ రోజుల్లో భాగవత ప్రచారకుడు వల్లభాచార్యుని ప్రభావం కొంతైనా ఉండి తీరాలి. భాగవతం ప్రారంభంలో

*"చేతులారంగ శివపూజ సేయడేని*
*నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని*
*దయయు సత్యంబులోనుగా దలపడేని*
*కలుగనేటికి తల్లుల కడుపు చేటు"*

అని తన శైవ, వైష్ణవ భక్తి సామరస్య భావమును, అద్వైత భక్తి తత్వమును ఈ మహాకవి ప్రతిష్టించెను.

"శ్రీమన్నారాయణ కథా ప్రపంచ విరచనా కుతూహలం"తో గంగాస్నానం మహేశ్వరధ్యానంలో "కించి దుఃఖితలోచనుడై" ఉండగా "శ్రీరామచంద్రుని సన్నిధానంబు కల్పించుకుని", "హరికి, నందగోకుల విహారికి" అని ఎత్తుకుని ఆంధ్ర భాగవతాన్ని కృష్ణునికి సమర్పించుకున్నాడు పోతన. ఇది ఈ "అఖిల వేదాంత విద్యారహస్యవిదుండు, సహజ పాండిత్య విశారదుండ .. బుధజనహితుండు బమ్మెర పోతసుకవి" సంపాదించుకున్న అభేద భక్తికి, శివ, రామ, కేశవ, కృష్ణులంటే సమన్వయ, సామరస్య దృష్టికి దర్పణం.

పోతన కాలానికి మన గ్రంధాలన్నీ భాషాంతరీకరణాలే. ఉదాహరణకు వాల్మీకి రామాయణం, వ్యాసభారతం. అనువదింపబడనిది భాగవతమే. అందుకే ఆయన" తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ - దీనిం - దెనింగించి నా జననంబున్ సఫలంబు చేసెద పునర్జంబు లేకుండగన్ "భా 1-21) అని వ్రాసుకున్నాడు. ఈ జన్మరాహిత్యము పోతనకే కాదు. భాగవతాంధ్రీకరణమునకు కూడ. అందుకే పోతన భాగవతం సరసన నిలువగలిగే భాషాంతరములు నాటికీ నేటికీ లేవు. "నభూతో న భవిష్యతి."

*తెనుగు భాగవత అవతరణ*

తిక్కనగారికి కలలో హరిహరనాధుడు కనిపించి "భారత రచనా ప్రయత్నం, భవ్య పురుషార్ధతరు పక్వఫలమని" అన్నట్లే మహేశ్వర ధ్యాన నిమగ్నుడైన పోతనకు "మెరుగు చెంగటనున్న మేఘంబుకైవడి.. రాజుశేఖరుండగు రామభద్రుండమన్నా మాంకితంబుగా శ్రీ మహా భాగవతంబు దెనుంగు సేయుము" (భా 1 -16, 17) అని ఆనతీయగా:

*"పలికెడిది భాగవతమట*
*పలికించెడివాడు రామభద్రుడటనే*
*బలికిన భవహరమగునట*
*పలికెద వేఱొండు గాథపలుకగనేలా?"*

అన్న ఆలోచన కలిగింది. తిక్కనకు ఆరాధన ముఖ్యమైతే, పోతనకు భాగవత రచనలో భవబంధ విమోచన ముఖ్యం. వీరిద్దరూ నరేశ్వరులకు కాక, సర్వేశ్వరుణ్ణి కృతి పతిగా నిర్ణయించారు. తేటతెనుగుకి తిక్కనని, సంస్కృతానికి వాగను శాసనుడూ నన్నయ్యనుద్దేశించి తాను అందరిని మెప్పిస్తానని సవినయంగా పోతన ఇలా వివరించాడు.

*"కొందరకు దెనుగు గుణమగు*
*గొందరకు సంస్కృతంబు గుణమగు రెండుం*
*గొందరకు గుణములగునే*
*నందఱమెప్పింతు గృతుల నయ్యెడలన్."* (భా 1 - 20)

వ్యాసుని మూసలో వచ్చిన సంస్కృత భాగవతం కన్న, పోతన పోతలో పెరిగిన తెనుగు భాగవతానికే ప్రాచుర్యం ఎక్కువ అన్నది అతిశయోక్తికాదు.

ఇంగ్లీషులో విలియండోన్సు (1784), హెచ్. హెచ్. విల్సను (ఆక్సుఫర్డు, 1860), ఫ్రెంచిలో యూజీన్ బర్నాఫ్ (1852) సంస్కృత భాగవతాన్ని ఆధారంగా చేసుకుని వ్రాసినా, పోతన తెనుగు భాగవతానికి 14 ఇంగ్లీషు, 3 హిందీ అనువాదాలు వచ్చాయి. శ్రీ పురాణం వెంకట కృష్ణశాస్త్రిగారు 1843 లో తెనుగులో ముద్రించారు. తదుపరి 21 ముద్రణలు, 14 టీక తాత్పర్యాలు, పోతనపై 185 పైగా వ్యాసాలు, 25 సృజనరచనలు, ఎన్నో నాటకాలు, హరికథలు వచ్చినట్లు నిడదవోలు వెంకటరావుగారు 'పోతన' అనుబంధములో వివరించారు. వాహిని ఆధ్వర్యంలో 1942లో చిత్తూరు నాగయ్య, బి.యన్.రెడ్డిగారి దర్శకత్వంలో 'పోతన'గా నటించి మన అందరి మన్నలను పొందారు. వేయేల! ఆంధ్రలో ఆబాలగోపాలం పోతన భాగవతంలోని గజేంద్రమోక్షం, ప్రహ్లాద చరిత్రం పద్యాలు తరతరంగా వల్లించుకుని ఆనందిస్తారు. దీనికి కారణం పోతనగారి కవితా వైచిత్రి, సాహిత్య సౌందర్యమే.

*భాగవత రచన*

ఆరుద్ర అన్నట్లు "భాగవతమున భక్తి, భారతమునయుక్తి, రామకథయే రక్తి, ఓ..కూనలమ్మ" భాగవతము భక్తిమార్గాన్ని, అదే నా రాజమార్గమని తెలిపే పురాణం. రామాయణం కావ్యం, భారతం ఇతిహాసం, పోతన పూర్తిగా 12 స్కందాల భాగవతం వ్రాసి, తన కుమారుడు మల్లనకు అప్పగిస్తే, ఆయన రోజూ ఆ గ్రంధానికి పూజ చేసేవాడట. భాగవతంలోని " మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు బోవునే మదనములకు" అన్న పద్యాన్ని రాజైన సింఘభూపాలునికి వినిపించగా, ఈ మమకారాల ప్రాకారాలపై తనకి మక్కువ కలిగి, భాగవతాన్ని తనకి అంకితం చేయువలసిందని కోరాడట. కానీ పోతన వ్యవసాయం చేసుకుంటూ, బీదతనం అనుభవిస్తూ 'కాటుక కంటి నీరు' పద్యంలో 'అల్ల కర్ణాటక కిరాత కీచకుల కమ్మ త్రిశుద్ధి గనమ్మ భారతీ" అంటూ రాజాశ్రయాన్ని తిరస్కరించాడు అన్నమయ్యలాగే. అది సహించలేని రాజు భాగవతాన్ని పాతిపెట్టించాడనిన్నీ, దాని వలన కొన్ని భాగాలు నష్టపడగా, పంచమ స్కంధంలో ప్రథమా శ్వాసంలో 183, ద్వితీయా శ్వాసంలో 168 పద్యాలు గంగన, షష్ఠ స్కంధం పూర్తిగా 530 పద్యాలు సింగన, ఏకాదశస్కంధములో 127, ద్వాదశ స్కంధంలో 53 పద్యాలు నార్య పూరించారు. గంగన, సింగనలు పోతనను గురువుగా భావించి వినమ్రతతో ఆయన బాణీలోనే కావ్యరచన చేయగా, 'ప్రియ శిష్య'నని చెప్పుకుంటూ నారయ విశిష్టాద్వైతాన్ని ప్రవేశపెట్టాడు భాగవతంలో "ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి... "మొదలగు పరుష పద్యాలను కూడా ఇరికించాడు. పోతన వ్రాసిన సప్తమ, ఏకాదశ స్కంధాల్లో పద్యాలు రెండు చొప్పున సొంతం చేసి, ద్వాదశ స్కంధంలో ఎత్తి వ్రాశాడు ఈ ప్రియశిష్యుడు నారయ.

శ్రీకృష్ణలీలలే భాగవత కథావస్తువు. భాగవతాన్ని వెదుకుతే ఎన్నో వేదాంత గ్రంధాలు ఉట్టిపడతాయి. పరిక్షితు జీవనానికి ఏడురోజుల గడువే ఉందని, అతని కైవల్య ప్రాప్తికి తొమ్మిది రకాల భక్తి 1.శ్రవణం 2.కీర్తనం 3. స్మరణం 4. పాదసేవనం 5. అర్చనం 6. వందనం 7. దాస్యం 8 సఖ్యం 9.ఆత్మనివేదనమే రాచమార్గమని తెలియజేస్తూ మానవాళికే "పునర్జన్మ లేకుండగన్" ఈ భాగవతాన్ని తెనుగులో

పండించిన హాలికుడు పోతన. ప్రహ్లాద చరిత్రము, గజేంద్రమోక్షము, బలి - వామన చరిత్ర, అంబరీష చరిత, హరిశ్చంద్ర కథ, గోపికల భాగవత తత్వం, నరకాసుర వధ మనం చదువుకున్నవే. కాని అంతగా చదువనివైనా, చదివి తీరవలసినవి: కాలము, యుగలక్షణాలు, చతుర్వేద సృష్టి, గృహాశ్రమ ధర్మాలు, విమాన పర్యటన, జీవుని బాధలు, పిండోత్పత్తి, జననం (3వ స్కంధము); భూగోళ పరిమాణం, గ్రహములు, నరకబాధలు (5వ స్కంధము), వేదాంతం, మాయ, కలియుగ దోషాలు (11వ స్కంధము), యుగభేదాలు, తత్వవిచారణ, మోక్ష సాధన(12వ స్కంధము). కలియుగ లక్షణాలు వర్ణిస్తూ 12వ స్కంధములో శబల, కలాపగ్రామాల గురించి ప్రసక్తించారు. చదవాలేకాని ఇది నిక్షిప్తనిధి. ఇంకో విశేషం 1వ స్కంధంలో భారతంలో కొన్ని ఘట్టాలు, 9వ స్కంధంలో రామాయణం కూడా ఉన్నాయి. సంస్కృత మాలంలో 18,000 శ్లోకాలుంటే పోతన ఆంధ్రీకరణలో 30,000 ఉన్నాయి. ఈ గ్రంథ విస్తరణకు పోతనగారి నిరవధి భక్తి ఏ కారణము, ప్రహ్లాద చరిత్రము, గజేంద్రమోక్షం, వామనావతారాల్లో మనకి కండ్లకు కట్టినట్లు వివరించడమే. 'అందరూ ఒక ఎత్తు, అగస్త్యుల వార్క ఎత్తు' అన్నట్లు 'భాగవతమంతా ఒక ఎత్తు, దశమ స్కంధము ఒక ఎత్తు' అని చెప్పవచ్చు. మూలంకి నాల్గురెట్లు పెంచారు పోతన విష్ణు పురాణం, హరివంశం, శ్రీకృష్ణ లీలలు, ఋతువర్ణనలు, సూర్యచంద్రోదయాల వివరణతో. వీటన్నిటితో పోతనగారి చేతిలో భాగవతం బంగారమైనది.

*(మిగతా వచ్చే సంచికలో)*




# పోతనగారి పోత

## డా.దూర్వాసుల వెంకట సుబ్బారావు

(వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పోటీల్లో బహుమతి పొందిన వ్యాసం)

(క్రిందటి సంచిక నుంచి)

**పోతన కవిత్వం: మకుటాలు మాణిక్యాలు**

ఈయన సహజ పాండిత్య విశారదుడు. కావున తన పద్యాలన్నీ ద్రాక్షాపాకాలు, శులభగ్రాహ్యాలు. ఉదహరిస్తూ గజేంద్ర మోక్షం నుంచి స్థానబలిమితో నీటినున్న మొసలి, తనదైన నేలపై బలాఢ్యుడైన ఏనుగుల పోరాటం:

*కరిదిగుచు, మకరి సరసికి*
*కరిదరికిని, మకరి దిగుచు, కరిబెరయన్*
*కరి మకరి, మకరి కికరి*
*భారమనుచును అతలకుతల బహుతుల దురువదన్.*

నరకాసుర యుద్ధ సమయంలో కృష్ణుడు సత్యభామల చూపుల విలాసాల్ని:

*"హరి చూసిన, సిరి చూడడు (దు)*
*సిరి చూచిన, హరి చూడ సిగ్గును పొందున్*
*హరి యను, సిరియను తమలో*
*సరి జూపుల చూడ మరుడు సందడి సేయన్"*

ఇందులో వారి చూపుల విలాసాల్లో ఉండే ప్రేమ సిగ్గులను వర్ణించటమే కాక, మొదటి పాదంలో ఆఖరి అక్షరం'డు' ని 'దు' క్రింద మారుస్తే, హరికరుణ ఉన్నా, సిరి అంటే లక్ష్మి కరుణ ఉండదని చమత్కారము.

వామన చరిత్రలో మూడడుగుల పొట్టి వడుగు ఎలా వెళ్ళేడంటే:

*"వెడ వెడ నడకలు నడచుచు*
*నెడ నెడ నడుగిడక నదరి ఇల దిగబడగా*
*బుడి బుడి నొడువులు నొడువుచు*

*జిడిముడి తడ బడగ వడుగు సేరెన్ రాజున్"*

బలి "వడుగా ఎవ్వరి వాడ వెవ్వడవు సంవాసస్థలంబెయ్యది" అని అడిగి

"వరచేలంబులో మాడలో ఫలములో వన్యంబులో గోవులో

హరులో రత్నములో రథంబులో... కన్యలో.. కాంచనమో.. భూములో

ధరణీఖండమె కాక యే మడిగెదో.." కోరుకోమంటే -

వామనుడు "ఒంటివాడ నాకు నొకటి రెండడుగుల, మేర యిమ్ము" అని అంటాడు. తన గురువు శుక్రుడు వచ్చిన వటువు అసామాన్యుడు, విష్ణుమూర్తి అని హెచ్చరిస్తే, బలి "ఆదిన్ శ్రీ సతి కొప్పుపై, దనువుపై.." ఇలా ఆరు రకాలుగా అందవేసిన విష్ణువు చేయి తన చేతిక్రిందగుట ఎంతో విశేషం, రాజ్యం గీజ్యము పోయినా ఫర్వాలేదంటాడు. శ్రీ అన్నమాచార్యులు "ఇందరికి అభయంబులిచ్చు చేయి"లో ఆ చేతి మహిమ పదమూడు రకాలుగా వర్ణిస్తే, పోతన చేతిలో ఆరురకాలుగా వర్ణించబడ్డది. కమండలంలోంచి నీటి ధార రాకుండా శుక్రుడు అడ్డుపడటం, ఒక కన్ను పోగొట్టుకోవటం మనమందరం చదువుకున్నదే "హరియైన, హరుడైన, .. మేరువు తలక్రిందైన " అన్న శబ్దంతో బలి ధారపోసాడు:

మునిజన నియమాధారను, జనితాసురయవతి నేత్ర జలకణధారన్

వనజాక్షుండుగొనియె బలి వివర్జత ధారన్"

ఇంత గొప్ప విశేషాన్ని, చిన్న కంద పద్యంలో కండ్లకి కడుతూ చెప్పటం పోతనగారి పోతే. శ్రీ అన్నమాచార్యులు "బ్రహ్మ కడిగిన పాదము"లో పదమూడు రకాలుగా విష్ణుపాదాలని కీర్తిస్తే, పోతనగారి చిన్నవటువు "ఇంతింతై, వటుడింతయ్యై, మరియు దానింతై, నంభోవీథిపై.. నంతై, సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై" మూడు పాదాల్లో బలిని "పుట్టిల్లిదె" అని పాతాళలోకానికి పంపించాడు. ఇదంతా మన కండ్లముందే జరిగినట్లు స్ఫురింపజేస్తుంది. కృష్ణుడు కుచేలుడూ అడవికి వెళ్ళగా అప్పుడు వచ్చిన సుడిగాలి, హోరుమనేగాలి, పిడుగులు, మెరుపులు, ధారాపోత వర్షం, గాఢాంధకారం శబ్దార్థాలతో సమన్వయపరుస్తూ ఎంత చక్కగానో "ఘుమ ఘుమా రావ సంకుల ఘోర జీమూత పటల సంఛన్నా భ్ర భాగమనుచు (10-2-999) అన్న సీస పద్యంలో పోతన వర్ణించేడు. మనం చదువుకోవాలేగాని ఇటువంటి మకుటాలు, మాణిక్యాలు పోతన రచనల్లో కోకొల్లలు.

**కవితా మాధురి**

పోతనగారి పద్యాలు ఏవి చదివినా మన గుండెలకు హత్తుకుపోతాయి. మన కండ్లకు కట్టినట్లు రచించటమే కాకుండ, ఆయన కవితా మాధురిలో ఒక ప్రత్యేక విలక్షణం ఉంది. ఆ శైలి, వైచిత్రి ఆయనకే చెల్లింది.

"అలవైకుంఠపురంబులో నగరులో ఆ మూల సౌధంబుదా"

"సిరికంజెప్పడు శంఖు చక్ర యుగముంజేదోయి సంధింపడే" అని హడావుడిగ వెళ్ళే విష్ణుమూర్తినైనా సరే, లేదా మేల్కొన్న తెఱగున మెల్లనకనువిచ్చి క్రీగంట జూచుచు గిదికి నీల్గి... గ్రుక్క గ్రుక్కకు గుటుకు గుటుకు మనుచు" తల్లి పాలు త్రాగుతున్న పసికందులో పరమాత్మని సాక్షాత్కరింప జేసే సహజ పాండితిపోతనది.

**పోతన పోత: అనుకరణ**

ప్రాస, అనుప్రాసలకు పెట్టింది పోతన పేరే; కందాల్లో, వృత్తాలో ఎన్ని రకాలుగానో వాడేడు పోతన. ఉత్పలమాల నాల్గుపాదాల్లో పాదానికి రెండేసి (ద్విప్రాస) ప్రాసలతో వీనుల విందు చేసేడు పోతన:

"హారికి నంద గోకుల విహారికి జక్ర సమీర దైత్యసం

హారికి భక్త దుఃఖ పరిహారికి గోప నితంచినీ మనో

హారికి దుష్ట సంపదపహారికి ఘోషకుటీపయోంఘ్రుతా

హారికి బాలక గ్రహ మహాసుర దుర్వనితాప్రహారికిన్" (భా 1-29)

"శ్రీ రామా! శ్రీ రామా!

శ్రీ రామా! రామరామ! సీతారామా

శ్రీరామా! శ్రీరామా!

శ్రీరామా! రామ! రామ! రామ! శ్రీరఘురామ.

ఇలాగే "నీవపాకవుడవు, నీవ సూర్యందేవు, నీవచంద్రుడవు, నీతలజలము" (9-129)లో ఎన్నో ప్రాసలు వాడేడు పోతన. ఇంకో విశిష్టత లాటాను ప్రాస - ప్రహ్లాద చరిత్రంలో రెండు ఉదాహరణలు:

"కమలాక్షునర్చించు కరములు కరములు" (7-169)

"కంజాక్షునకు గాని కాయంబు కాయమే" (7-170)

అదే పదాన్ని వరుసలో వాడి, అవే సార్థకమైనవని, మిగతావి కావని, తాత్పర్యంలో ఆ భేదాన్ని సూచించటమే లాటాను ప్రాస. ఇది పోతన కవిత్వ సంపద. అందుకే పోతన పోతననుసరించిన కవులెందరో. మచ్చుకి కొన్ని ఉదాహరణలు:

"కంజాక్షునకు గాని.." రంగనాధరామాయణంలో "పతి కౌగలింపని పణతి కాయంబు"

"కమలాక్షునర్చించు.." భోజరాజీయంలో అనంతుడు "చూపులు విష్ణుమూర్తులమే ...."

"కనియెన్‌దాపస.." సింహాసనద్వాత్రింశికలో గోపరాజు "కనియెన్ భూపుత్ర..."

"మందారమకరంద.." పరతత్త్వరసాయనములో ఫణిభట్టు "కర్ణరంధ్రంబులా..."

"లలితోద్యానవనాంత.." అముక్తమాల్యదలో కృష్ణదేవరాయలు" లలితోద్యాన పరంపరాశుక"

"కాటుక కంటినీరు.." వెన్నెలకంటి సూరన "కాటుక కంటినీరుజను గట్టును బాసిన చీరకొంగు"

ఈ ప్రాస, లాటాను ప్రాసలను అభ్యుదయ కవులు కూడా అనుకరించేరు. క్రీస్తుపూర్వం 332లో ఎరిస్టోటిల్ "కవిత్వానికి పరీక్ష అనుకరణే" అంటూ "మెమిసిస్" అని వాడేడు. తనకంటే ముందు వచ్చిన కవులనే అనుకరించటం సహజమే; అలాగే ముందుకాలం వారి శక్తి సామర్థ్యాలను గుర్తించి అనుసరించటం కూడా సహజమే. పోతన కూడ తన పూర్వకవులను అనుసరించినా, ఆయన పద్యాల నడక, రమణీయతలకు, ఆయన గౌరవానికి, ప్రతిష్ఠకు ఏమీ లోటు లేదు. ఉదాహరణకు:

నన్నయ భారతం (2-94) "సహకార మత్ప్రియ, సహకారు పున్నాగ.." కు పోతన (10-1-1008)లో "పున్నాగ వందితు..."

కేతన కేయూర బాహు చరిత్ర (3-763)లో "అతుల సరస్వతీ.. బాలరసాల సాల.."కు పోతన "బాలరసాలసాల నవపల్లవ.."

పాల్కురికి బసవపురాణంలో "క్షీరాబ్ధిలోపల గ్రీడించు హంస గోరునే పడియల నీరు ద్రావంగ" అంటే పోతన "మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు బోవునే మదనములకు"

పాల్కురి కి" రాకామల జ్యోత్స్న ద్రావు చకోర.."కి

పోతన "పూర్ణేంద్రు చంద్రికా స్ఫురితచకోరకం.."

శ్రీనాధుడు భీమ ఖండంలో "శ్రీ భీమనాయక శివనామధేయంబు.. జిహ్వ జిహ్వ"కు పోతన "కమలాక్షునర్చించు కరములు.. అనాధు వర్ణించు జిహ్వే జిహ్వ"

నన్నెచోడుడు కుమార సంభవము (8-68), నాచన సోమని ఉత్తర హరి వంశంలోని (1-102) "అరిజూచున్, హరిజూచు.." పద్యానికి అనుకరణే పోతన "పరుజూచున్, వరుజూచు నొంపనలరింపన్ (10-198).

మహనీయులు ఒకే విధంగా ఆలోచిస్తారు, అదేవిధంగా నెరవేరుస్తారన్నదానికి ఈ అనుసరణ, అనుకరణ సంవాద రచనలు ఒక దృష్టాంతము. ఆ రోజుల్లో పరస్పరం తెలియకుండానే ఇలా జరిగిందంటే అది వారి విలక్షణమే, ప్రత్యేకతే. ఒకటి గుర్తుంచుకో తగ్గ విషయం పోతన అనుకరణలు నారయ పూరించిన పది, పదకొండవ స్కంధాల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నాయన్న రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారితో ఏకీభవించాలి. ముందు చెప్పినట్లు మత సామరస్యభావాన్ని తెలియజేసిన "తెలుగు శుకయోగి" పోతన. ఒకే భావాన్ని ఒకసారి రామపరంగా "నల్లనివాడు పద్మనయంబులవాడు మహాశుగంబులన్" (9-361), కృష్ణపరంగా "నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై" (10-1-1010) పద్యాలలో చెప్పారు.

స్థలాభావంచే వివరించదలచనుకాని "శారద నీరదేందు", "క్షోణితలంబునన్", "అంబనవాంబుజోజ్వల" "అమ్మలగన్నయమ్మ", ప్రహ్లాద చరిత్రలోని "చదివించిరి నను గురువులు," తనయందు నఖిల భూతములందు", "మందారమకరంద", కమలాక్షునర్చించు", "కంజాక్షునకు", "దిక్కులు గెలిచితి", గజేంద్ర మోక్షములో "ఎవ్వనిచేజనించు""ఒకపరిజగములు", "లోకంబులు లోకేశులు", "కలడందురు దీనుల యెడ", "కలుగడేనాపాలి", "లావొక్కింతయు లేదు" "సిరికింజెప్పడు" ఇలా ఎన్నో మచ్చుతునకలు పోతనగారి భిక్షే మనకు. అందుకే మడికి సింగన (1500) నుంచి నేటివరకూ పోతన మధురిమలను ఎంతగానో ఎందరో మహాకవులు ప్రస్తుతించారు.

ఇంకొక చిన్నవిషయం: పోతన కున్న ఊతపదాలు "వినుము", "యై" అన్నవి. మొదటి రెండు స్కంధాలలో , 715 పద్యాల్లో, 41 పర్యాయములు 'వినుము' అన్నది వ్రాసేరు. 'యై', "పరుడై, ఈశ్వరుడై." (2-58) ఆరుసార్లు, "ధర సింహాసనమై, నభంబు గొడుగై.." లో ఎనిమిది సార్లు, "రాకేందు బింబమై.."లో పదకొండు పర్యాయములు వాడేరు.

నన్నయ వలె పోతన కూడా సంప్రదాయంగా విభక్తులతో పద్యాల్ని ఉదహరించి వ్రాశాడు. ఉదాహరణకు 1) నల్లనివాడు (9-361-ప్రథం), 2. నీ పద్యావలు (ద్వితీయ), 3.తాటంకొచలనంబుతో (8-102-తృతీయ), 4.నీ కంటె నొండెఱుంగము (8-231-పంచమి, 5. వసుడుగ్రమొక్కెదన్ లవణ వార్ధి (9-360-షష్టి), 6. నీయంద సంభవించును (8-222, సప్తమే) 7. ఓకమలాప్త (8-92 - సంభోధన)

*(మిగతా వచ్చే సంచికలో)*




# పోతనగారి పోత

## డా.దూర్వాసుల వెంకట సుబ్బారావు

(వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పోటీల్లో బహుమతి పొందిన వ్యాసం)

(క్రిందటి సంచిక నుంచి)

_ప్రజాకవి పోతన: జాతీయాలు_

పోతన భక్తకవి. భక్తులు దైనంద జీవిత సమస్యలను వదలి పరమాత్మను చేరాలన్న ఒక మూల సూత్రంని నివేదించే ఆర్తిని చిత్రంచడం వలన పోతన ప్రజాకవి. ఈ ఆర్తులలో జన్మతః జ్ఞాని ప్రహ్లాదుడు, అర్ధజ్ఞానంతో విర్రవీగే గజేంద్రుడు, కటిక దరిద్రపీడితుడు కుచేలుడు ఉన్నారు.. "కలడు కలండనెడి వాడు కలడో లేడో" అన్నది గజరాజుకే కాదు; "ఇందుగలడందు లేడని సందేహము వలదు" ప్రహ్లాద భాషితమే కావలసిన ఆవశ్యం లేదు; "ఊరక రారు మహాత్ములు" గర్గమునే అనవలసిన ఆవశ్యంలేదు; "ఊరకరారు మహాత్ములు" గర్గమునే అనవలసిన అవసరంలేదు. ఇవ్వన్నీ మన దైనందిక సామాజ జీవితంలో ఉంటూనే ఉన్నాయి. మనం వెదకాలే కాని భాగవతంలో ఎన్నో ఇలాంటివి ఉన్నాయ్. రుక్మిణి తాను వరించిన వాడినే పెండ్లి చేసుకుంటానని ఒక పెండ్లి సమస్యని తెస్తే, పోతన ఎలా పరిష్కరించారో చూడండి.

"విచ్చేయుము, శత్రులన్ నుఱుము సేయుము, సేయము శోభనంబిలన్" అని (10-1-1712) సలహా ఇచ్చి రుక్మిణీ కృష్ణులకు పెండ్లి చేయిస్తాడు పోతన. ఇలాగే ఎన్నో కాచి వడబోసిన సత్యాలను తెలియజేశాడు పోతన"

"కారే రాజులు రాజ్యముల్ గలుగవే".. (8-590) లో రాజ్యాలు, రాజులు అస్థిరములని,

"వారి జాక్షులందు, వైవాహికములందు"---(8-585)లో ఏ సందర్భాల్లో బొంక వచ్చోనని,

"చుట్టాలు దొంగలు"---(8-648)లో క్షణికం, ఋణానబంధాల గురించి,

"బ్రతుకవచ్చుగాక"---(8-599)లో మాట దిరుగని మానధనుల గురించి,

"జయము లపజయములు"----(80-354)లో సంపదలు క్షణికములని,

"ఆడువారి చూపుటంపఱ"-----(8-405)లో ఆడవార్ని గెలవటం ఆ దేముడికైనా అసాధ్యం అని,

"వచ్చినయదియ జీవనము"----- (9-40)లో సంతృప్తితో బ్రతకటమే ధన్యమని,

"దురితము దలపరు"----(9-310)లో నిమిష ప్రాయమైన సుఖం కోసం పడే యాతలిని,

"పనుపక చేయుదు"---(9-558)లో అధములైన పుత్రుల గురించి,

"చెల్లుబడి--జననీజనకుల"----(10-1-1390-1391) లో తల్లితండ్రులను సేవించని వాడు జీవిస్తున్నా శవంతో సమానమని,

"శిష్యుడు బలాఢ్యులైన"-----(10-1-1414)లో గురువు కోర్కె శిష్యులు తీర్చాలని,

"నమినవారి ఓగ్గ విడువన్".. (10-1-1439)లో నమ్మినవారిని మోసపుచ్చకూడదని,

"విప్రతతి సొమ్ముకంటెను విషం మేలు"--(10-2-479-480) పరధనం పనికిరాదని,

"సిరియును వంశ రూపును"--(10-2-233)లో మంచి వివాహ సంబంధాల గురించి,

"ప్రాణేశుడెజిగిన"---(10-1-978-979)లో ఎట్టి పరిస్థితులలో నైనా పతిని భార్యవిడువరాదని

"వేఱతీర్థంబువనిపై"----(10-2-1119)లో కోటి నదుల్నీ వెదకనవసరం లేదని,

(ఇదే భావాన్ని త్యాగరాజస్వామి కోటినదులు---(తోడిరాగం) అన్న కీర్తనలో ఉదహరించేరు).

"సేవిమప్వారు దమకుం"(10-2-1235)లో కృతఘ్నుల గురించి

"గజతురగాది"... (11-7)లో ఐశ్వరాలన్నీ క్షణికం అని

వర్ణాశ్రమధర్మాలు కలియుగంలో ఎలా పాడవుతాయో (11-9-11,20) వివరించాడు. అలాగే తెలుగు వారు తఱచు వాడే "ఊరక రారు మహాత్ములు" (10-1-283) "మాట తిరుగలేరు మానధనులు" (8-599) కూడా ప్రభోదాత్మకాలే.

<u>*మరికొన్ని ప్రత్యేకతలు*</u>

అంతవరకూ తెలుగు సాహిత్యంలో లేనివి వివాహ సంబంధమైనవి; పోతన ఈ వివాహానికి సంబంధించిన విషయాల్ని తెలియజేసేరు. వీరభద్ర విజయంలో (3-27,3-126,2-216) సప్త ఋషుల్ని పిలిచి, వారిని పెండ్లి పెద్దలుగా చేసి "శీతా చలేంద్రుని కూతురు బార్వతి కన్యనతి మోదమున---నుంగ్రము పెట్టి" మంచి లగ్నము చూసి "ఘడియారం బొప్పగట్టించి", వధూవరుల మధ్య తెరకట్టడం, మధుపర్కాలు ఇయ్యటం, తలంబ్రాలు పోసుకోవటం, హోమము చేయటం, అప్పగింతలతో నాలుగురోజుల పెండ్లి చేయించేరు. ఇక్కడ మంగళ సూత్రధారణ ప్రసక్తి లేకపోయినా, రతి విలాపంలో (వీరభద్ర విజయం 2-216)లో "నా పెనిమిటిన్ దీర్ఘాయుషోపేతుగా, నీరే మంగళసూత్రబంధనము మీ కెంతేని పుణ్యంబగున్" అంటూ మంగళసూత్రం విశిష్ఠతని చెప్పేరు. ఇలాగే భాగవతంలో (8-239-241) పార్వతి మంగళసూత్రం మహిమని గుర్తుంచుకొని, ధైర్యంగా భర్త శివున్ని గరళం త్రాగమంటున్న సందర్భంలో: "మ్రింగెడి వాడు విభుండని,మ్రింగెడిది గరళమని యు మేలని ప్రజకున్

మ్రింగుమనె సర్వమంగళ - మంగళ సూత్రంబు నెంత మది నమ్మినదొ" అన్నారు. ఈ మంగళసూత్రం పవిత్రమని, దాన్ని ఎట్టి సమయంలోనూ మనస్త్రీలు తీయరంటూ" మెలత మంగళసూత్రంబు మినుకుదక్క" అని శ్రీరామచంద్ర ఘట్టంలో (9-342) సూచించారు.

పోతన "శరధి మదవిరామా---- సూర్యవంశాబ్దిసోమా "(10-1-1341) కాక సంస్కృతం వాడినవి: "నదైవంకేశవాత్పర", "జగద్విష్ణుమయమఖిల", "జితంతే పుండరీకాక్ష".

"మంగళం మధుసూధన" (భా2-22-107) "ఋతేణలోకాన్ జయతి"

(భా4-594), "సర్వధర్మాన్పరిత్యజ్యమమేకం శరణం వ్రజ" (భా 22 - 107). శాస్త్రజ్ఞానంతో సంబంధించినవి ఎన్నో విషయాలు భాగవతంలో ఉన్నాయి. మచ్చుకి: విమానం (2-227), "ఇనుమయస్కాంత సన్నిధి నెట్లు భ్రాంతమగు" (7-149). రమారమి న్యూటన్ మహాశయునికి 200 సంవత్సరాల ముందు పోతన ఈ అయిస్కాంత ఆకర్షణ గురించి చెప్పేడు. పిండోత్పత్తి, శిశుజననం (3), భూగోళ పరిమాణం, గ్రహములు వాటి మధ్యదూరముం ఏపరిధుల్లో తిరుగునో ఈ విషయాలన్నీ విపులీకరించేడు. ఇంకా ఉపయోగించిన

పదాలు: గౌను (10-1-355), అంగుళము (10-1-384), మనదేశంలో "ఆంధ్ర"తో కలిప "మాళవ, కొంకణ, ద్రవిడ.. సాళ్వ" ఇరవై ఆరు రాజ్యాలు (రాష్ట్రాలు) (10-1-348), దొరలు (10-1-838), శ్రీశైలం, వేంకటా చల పుణ్యక్షేత్రములు (10-1-951,1342). ద్వారపాలకులు కుచేల్ని

"ఎక్కడి విప్రుడవిందేల వచ్చెదవని యడ్డపెట్టిరే నపుడు వారికేమైన బరి దానమిచ్చి చొచ్చెద".. అని 'లంచము' గురించి వ్రాశాడు పోతన.

పోతన గణిత శాస్త్రం అభ్యసించి శ్రీమంతుని వద్ద గణకుడు (ఎకౌంటెంట్)గా పనిచేయాలనుకున్నాడట. గణితశాస్త్రంలో ప్రవేశం ఉందన్నడానికి నిదర్శనం గంగాప్రవాహ మహిభాబి వర్ణనములో (9-230)

"నిమ్నోన్నత సమవృత్తంబై వృత్తశాస్త్రంబు --- గణిత శాస్త్రంబుకొలది ఘన, ఘనమూల, వర్గమాల సంకలిత, భిన్న మిశ్రప్రకీర్ణ ఖాత భీష్మంబై" చెప్పేరు. స్వకీయాన్ని సహృదయులు చదువరులు మన్నించాలి. రమారమి ఏభై సంవత్సరాలుగా సముద్ర పరిశోధన చేస్తున్న నాకు చాలా నచ్చినది "బలములు గల మీనంబులు, బలవిరహిత మీనములను భక్షించు క్రియన్" (1-378). తెలుసుకోవాలేగాని, పోతన రచనలు విరబూసిన మందార మకరందాలు, నిధినిక్షిప్తాలు. నిరంతర ఆస్వాదనామృతము.

ఆకాలపు రాచరికాలు బహుమనీ సుల్తానుల దండయాత్రలకు గురియై, బలహీనమయాయి. సమకాలీన సమాజ పరిస్థితుల వలన ప్రజల్లో ఆధ్యాత్మిక దృష్టి సన్నగిల్లకుండ, భక్తి సంప్రదాయమే కైవల్య మార్గమని ప్రభోదాత్మకంగా

"రక్షకులు లేనివారల రక్షించెదననుచు చక్రిరాజై యుండన్
రక్షింపుమనుచు నొకనరు నక్షము ప్రార్థింపనేల ఆత్మజ్ఞులకున్" (2-23) పోతన శ్రీమదాంధ్ర భాగవతపురాణాన్ని తెనిగించేడు.

పోతన చెప్పినట్లు "కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతింబొందరే
వారేరి సిరిమూటగట్టుకుని పోవం జాలి రేభూమిపై"--- ఎందరో రాజులురావటం, పోవటం జరిగింది ఆంధ్రదేశంలో. కాని నరహరి భక్తసామ్రాజ్యాన్ని ఏలిన వినయ భూషణుడు, సకలాంధ్ర లక్షణ చక్రవర్తి పోతన. తెలుగు సాహిత్యలోకానికి తిక్కన సూర్యుడైతే, పోతన చంద్రుడు. ఆ చంద్రార్కం వందనీయుడు.

(నా జీవిత ప్రభాతంలో పోతన గారి పద్యాలు నేర్పిన నా తల్లిదండ్రులకు పాదాభివందనాలు చేస్తూ ఈ వ్యాసాన్ని సమర్పిస్తున్నాను)

*(అయిపోయింది)*




# నిష్కళంక కవితా తపస్వి కూచి నరసింహ కవిగారు

- డా. ఏల్చూరి మురళీధరరావు

నూరేండ్లక్రితం తెలుగువారికి శ్రీ రామకృష్ణ వివేకానంద మహనీయబోధామృతాన్ని పంచిపెట్టి, వైదేశికానుకరణతో వ్యక్తిత్వాన్ని కోల్పోతున్న యువజనులకు సనాతన సంప్రదాయాన్ని నేర్పిన గొప్ప ఆధ్యాత్మవిద్యాప్రచారకులు, మహాకవి, మహోపన్యాసకుడు, విద్యావేత్త శ్రీకూచి నరసింహంగారు. సాహిత్య పరమార్థం నీతిబోధ మాత్రమే అని నమ్మి, పుంఖాను పుంఖంగా రచనలు చేసినా స్వార్థనిర్ముక్తులై లౌకిక సుఖభోగాలకు, కీర్తికాంక్షకు, ప్రచార భేరీభాంకారాలకు దూరంగా ఉండిపోయిన ఆ మహాపురుషుని జీవితాన్నీ, జీవిత సందేశాన్నీ నవతరం పాఠకలోకానికి పరిచయం చేస్తున్న సుదీర్ఘ వ్యాసం ఇది.

అభ్యుదయ కవితాయుగంలో అచ్చయిన తొలికావ్యం "నయాగరా" కవి, "సోవియట్ భూమి" పత్రికా సంపాదకులు శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారి తనయుడు. సంస్కృతం, ప్రాకృతం, ఆంధ్రాంగ్ల హిందీ తమిళకన్నడాలు, కొంతకాలం రష్యన్ భాషలను అభ్యసించి వ్యాసాలు, కవితలు, రేడియో పాటలు, రూపకాలు, అనువాదాలు ప్రకటించారు. తెలుగులో "విష్ణుపురాణం", "శ్రీమద్భాగవతం", ఇంగ్లీషులో "దేవీసప్తశతి" మొదలైన వచనానువాదాలు; "తెలుగులో 150 వసంతాల వావిళ్ళ వాఙ్మయవైజయంతి", పిల్లల మఱ్ఱి పినవీరభద్రకవి "జైమిని భారతం", "సాంధ్ర పద్యానువాద శ్రీరామ కర్ణామృతం", "శ్రీ కృష్ణకర్ణామృతం", సంస్కృతంలో శ్రీవత్సాంకుల "యమకభారతం", శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి "కంకణబంధ రామాయణం"; ఆంగ్లంలో "Lure of the Yore & other poems", పెంగ్విన్ బుక్స్ ప్రచురించిన "The Tenth Rasa" (లో తెలుగు విభాగం) వంటి పరిష్కృత రచనలు; Essays on the History of Telugu Literature, సుబంధుని వాసవదత్తా పరిణయం వంటి వ్యాస సంపుటాలు; శివామృతలహరి, భుక్తశేషము పద్యకావ్యాలు, పత్రికలలో సాహిత్య వ్యాసాలు వీరి రచనలలో కొన్ని. మహాభారతంలో ద్రోణపర్వాన్ని అధికరించి ఎం.ఫిల్, గణపవరపు వేంకటకవి ప్రబంధజ వేంకటేశ్వర విజయ విలాసంపై పి.హెచ్.డి చేశారు. సాహిత్య చరిత్ర, చిత్రకవిత్వం అభిమానవిషయాలు. ఢిల్లీలోని వేంకటేశ్వర కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసరుగా ఉద్యోగం; ఢిల్లీ తెలుగు సాహితి కార్యదర్శిత్వం; ప్రస్తుతం శ్రీరామకృష్ణ మఠం కోసం పోతనగారి శ్రీమహాభాగవతాన్ని పునఃపరిష్కరించి, ఆయా స్కంధాలకు వివిధ విద్వాంసులు రచించిన తాత్పర్యాలతో సరికొత్త ముద్రణ పాఠాన్ని రూపొందిస్తున్నారు.





భారతదేశం ఆంగ్లేయదాస్య శృంఖలాబద్ధమై పాశ్చాత్య సంప్రదాయానుకరణ వ్యామోహంలో ఆత్మీయ సత్వాన్నీ, స్వత్వాన్నీ కోల్పోనున్న క్లిష్ట సమయంలో విద్యావ్యాప్తి మూలంగా, సాహిత్య ప్రచారముఖంగా తెలుగువారిని కర్తవ్యోన్ముఖులను చేసి, జాతి అభ్యుదయానికై సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని ప్రబోధించిన వాఙ్మయ తపస్వి, మహాకవి కూచి నరసింహంగారు.

కూచి నరసింహంగారనేవారట.. గురువులలో శిష్యవిత్తాపహారులూ శిష్యహృత్తాపహారులూ అని రెండు తెగలవారుంటారనీ, అందులో శిష్యుల విత్తాన్ని అపహరించే మొదటివారు గురువులలో లఘువులనీ. గొప్పగురువుల వద్ద చదువుకుని, తమకంటే గొప్ప కవికులగురువులను తీర్చి దిద్దిన సంస్కారం వారిది. ఎన్ని బిరుదాలున్నా

"పిఠికాపురోన్నత పాఠశాలా ప్రధమోపాధ్యాయుడు"

అని వ్రాసుకొనటమే గౌరవమని భావించిన మహామహోపాధ్యాయుడాయన. నిష్కళంక కవితాతపస్వి, భగవన్మయజీవనులు, విద్యార్థి జన శ్రేయోనిర్మాణకర్త. క్రమశిక్షణకు పెట్టినది పేరు. సాహిత్యం సమాజ సేవకు, నీతి బోధకు మాత్రమేనని నమ్మి, ఇహానికీ పరానికీ నిరుపయోగమైన కేవల కల్పనా శిల్పాన్ని పరిత్యజించి, తమ కవిత్వకళను ఆధ్యాత్మికోన్నత శిఖరాల వైపుకు నడిపించే మహా గ్రంథ రచనకే వినియోగించిన ధన్యజీవనులు.

నరసింహం గారి పూర్వీకులది కృష్ణాజిల్లా కుంచెనపల్లి అగ్రహారం. వారు కూచి వెంకయ్య, పుల్లమాంబా దంపతుల గర్భశుక్తిముక్తాఫలం. 1866లో డిసెంబర్ 17వ తేదీన జన్మించారు. తండ్రిగారి ఉద్యోగరీత్యా నరసింహంగారు రాజమండ్రికి వెళ్ళి, అక్కడ కందుకూరి వీరేశలింగంగారి పాఠశాలలో చేరేరు. ఎనిమిదవ తరగతిలో ఉండగా ఆటవెలదు ఛందస్సును నేర్పుతూ వీరేశలింగంగారు బోర్డుమీద ఈ పదాలను వ్రాశారట:

ఆటవెలఁది మీర లారసి చేయుఁడి
చేయకున్న మీకు సిగ్గుపాటు!

అని. ఆనాటి విద్యాబోధనల స్థాయి అది. ఆ పూపవయసులో నరసింహంగారు లేచి, ఆటవెలది తక్కిన రెండు పంక్తులను పూరించారు:

సిగ్గులెన్నియున్నఁ జెదిరిపోవునుగద
ఆటవెలదిఁ బొంత నార్యులార!!
అంటూ, పువ్వన్నాక పరిమళించకుండా ఉంటుందా?

నరసింహంగారికి ఆ సరసధోరణిలోనే కవనధార అలవడింది. అది గిరిశిఖరం మీదనుంచి నిరర్గళంగా క్రిందకి దూకే స్రవంతీ ప్రవాహాన్ని పోలిన మహాశుధార. సరస్వతీ కటాక్షం సిద్ధించి, పరిశుద్ధమైన కవిత్వధార అలవడిన తర్వాత యతిప్రాసల కోసం పదపంక్తులను సరిచూసుకోవటం ఉండదు. అందుకు అభ్యాసబలం తోడయింది. తండ్రిగారు ప్రోత్సహించారు. సంస్కృతాంధ్రకావ్యాలు చదవటం మొదలుపెట్టారు. రచనా వ్యాసంగం అవిచ్ఛిన్నంగా కొనసాగింది. ఆంగ్లభాషానైపుణిని సాధించారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో ఇ.పి మెట్కాఫ్ దొర ప్రిన్సిపాల్‌గా ఉన్న రోజుల్లో వారి వద్ద, పిళ్ళై గారి వద్ద చదువుకున్నారు. ఉత్తమాభిరుచి అలవడింది.

వీరేశలింగం గారి సుప్రభావం వల్ల, ఆంగ్ల సాహిత్యాధ్యయనం మూలాన నరసింహంగారు క్రమంగా అప్రతీత పద ప్రయోగాభిమానాన్ని పరిహరించి, ప్రత్యక్షర రసోదయమైన ప్రసాద గుణాన్ని అభిమానించారు. పాండిత్య ప్రకర్ష ఏ మాత్రం లేని గంభీరమైన శైలిలో రచనలు చేశారు కృతకమైన ఆలంకారితను పరిత్యజించి వాల్మీకి భావప్రసన్నతను, భాస కాళిదాసుల ప్రసన్న రమణీయతను ఆదరించారు. కవిత్వం ధర్మప్రభోధాత్మకమైన భగవద్విభూతి భేదమన్న చిత్తవృత్తి బాల్య వయోవస్థనాటికే కుదురుకున్నది. ఆ సంస్కార విశేషమే వారి జీవితంలోనూ సాహిత్యంలోనూ రమ్యోత్తరంగా ప్రతిఫలించింది.

*"సౌజన్యోత్తేజకములు, సౌశీల్య నిర్మాణదక్షములు అగు గ్రంథములు తోడి మానవులఁ బ్రేమించి సేవించు స్వహితపరాఙ్ముఖత్వప్రవృత్తిఁ గలిగించి, చక్కని వ్యక్తి ప్రకృతి యొక్కయు, జాతిప్రకృతి యొక్కయు నిర్మితిగావించుట యందెంతయుఁ దోడ్పడఁగలవు"*

అని నమ్మినవారు. ధర్మదీక్షాతత్పరులై దేశమంతటా సంచరించి ఆధ్యాత్మికతను, సాహిత్యాదర్శాన్ని తరుణ వయస్కులకోసం ప్రచారం చేశారు. విద్యావంతులకు సులభగ్రాహ్యమైన రీతిని నీతి నేర్పుతూ బహుజనాదరణ పాత్రమైన రచనలు చేశారు. అందువల్లనే వారి గ్రంథాలలో ఒకటి రెండు మార్లు పునర్ముద్రితం కానిది లేదంటే అతిశయోక్తి కాదు.

వారి చేతివ్రాతలో తుడుపులు, కొట్టివేతలు ఉండేవి కావు. అంతటి తడబాటులేని వాగ్ధోరణి అనభ్యస్తవిద్యగా అలవడింది. పెద్దయాక ఒకసారి సభలో ఉపన్యసిస్తుండగా ఎవరో విద్యార్థి మత్తేభానికి గణాలేమిటని అడిగాడట. ఆ సమయంలో వారికి ఛందోగ్రంథాలలో చదువుకున్న లక్షణం జ్ఞాపకానికి రాలేదు. తనదే, వనవాసి నాటకంలో రంగస్థలనతులు పాడుకునే "గృహదానాతిధి సత్రియా నిలయమన్ కీర్తిన్ సమార్జింపగా" అన్న ప్రసిద్ధమైన పద్యాన్ని శ్రావ్యంగా చదివి, "నాయనా! గణవిభాగం ఇదీ" అని చెప్పారట. కాకపోతే, ఆ వేగాతి వేగోక్తి నిపుడుడికి క్షణక్షణం గణయతి ప్రాసలు చూసుకోవటం జరుగుతుందా? వశవర్తినీ వాక్కు అంటే అదే కదా మరి!

1888లో నరసింహంగారు పట్ట పరీక్షలో కృతార్థులై బి.ఏ. డిగ్రీని పుచ్చుకున్నారు. యలమంచలి, నరసాపురం, నూజివీడు మొదలైన చోట్ల ఆంగ్లోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి, అక్కడినుంచి పిఠాపురానికి వచ్చారు. వారి బోధన విధానం, కార్యనిర్వహణ దీక్షత అత్యుత్తమాలని ఆనాటి అధికారులందరూ మెచ్చుకునేవారు.

జీవితంలోని సుఖదుఃఖాల వెలుగునీడలను, సంసారంలోని ఆశా వైఫల్యాలను పరిపూర్ణంగా చవిచూసిన ముప్పయ్యేండ్ల ప్రౌఢవయోవిపాకంలో నరసింహంగారికి కావ్యరచనాభిలాష కలిగింది. అప్పటికే తల్లిదండ్రులు పరమపదించారు. తన చేతులతో అల్లారుముద్దుగా పెంచి ప్రయోజకుణ్ణి చేసిన తమ్ముణ్ణి అకాల మృత్యువు పొట్టన పెట్టుకున్నది. ఉద్యోగవశాన ఊరూవాడా తిరిగి ఊరట కోల్పోయిన మనస్సుకు ఆ వయస్సులో పిఠాపురం వచ్చి చేరాక కుంతీ మాధవస్వామి కొలువులో రామకృష్ణ భక్తిజ్ఞానమార్గాల చరమ తీరం గోచరించింది.

*సీ. మాణిక్య మకుటంబు మౌళిపైఁ దులకింప, రాజ్యంబు నేలెడు రాజు కంటె*
*లలిత లావణ్య విలాసినీ వక్షోజ, పరిరంభ సౌఖ్యానుభవుని కంటె*
*సతతంబు నానంద సారాబ్ధిలోఁ దోఁగు, భర్మ్యహర్మ్యస్థసంపన్ను కంటె*
*ధనవయోరూపసంతానాది భాగ్యాళిఁ, దనరి సంతుష్టుఁడౌ ధన్యుకంటె*
*తే. మధుర మృదువాక్య సంపద మనసుఁ గరఁచు,*
*కవిత యల్లిన కవియె ఎక్కువ యటంచు*
*నెంచెదరు గాన, దత్సుఖ మెంత సుఖమె*

*స్వానుభవమునఁ గనుఁగొనఁ బూనవలదె?*

అని కుతూహలం జనించింది. ఇరవైయవ శతాబ్దిలో కర్మజ్ఞానరతులకు దైవతత్వాన్ని, బద్ధజీవులకు ముక్తిమార్గాన్ని, ఆర్తులకు భక్తియోగాన్ని ప్రబోధించిన మహాత్ముడు శ్రీ రామకృష్ణ పరమహంస జీవితమే అందుకు దారిదీపమై దీపించింది.

సీ. ఎవ్వాని విజ్ఞాన మేఁచు నవిద్యాంధ, కారంబునకు సూర్యకాంతి యయ్యె
నెవని బోధనముల నెందరో సంసార, దుఃఖాబ్ధిఁ దరియించి తుష్టి నొంది
రెవ్వని ప్రియశిష్యుఁ డేఁగి వేదమతాధి, కత్వంబు సాటించెఁ గడల నెల్ల
నేవాని చర్యలు, హితములౌ సూక్తులుఁ, గర్ణపేయంబులై కానిపించు

తే. నట్టి శ్రీమకృష్ణపూతాభిధాన
కలితుఁడు పరమ హంసుఁడీ కథకు మూల;
మతని చరితయు, బోధంబు లతివిచిత్ర
ములును, సుజ్ఞానదాయకములును జుండి.

అని పరమహంస జీవిత చరిత్రను పద్యకావ్యంగా మలిచారు. అంతకు మునుపే వారు శ్రీరామకృష్ణుల ఉపదేశామృతాన్ని నరసాపురం టేలర్ హైస్కూల్లో హెడ్ మాస్టరుగా ఉన్న రోజుల్లో అక్కడినుంచి వెలువడిన 'బ్రహ్మవాదిని' పత్రికలో సులభంగా గుర్తుంచుకోదగిన పద్యాలుగా ప్రకటించేవారు. ఆ తర్వాత ఉద్యోగార్థం కాకినాడకు వెళ్ళినప్పుడు పోలవరం జమిందారు కొచ్చెర్లకోట కృష్ణారావుగారు వెలువరిస్తుండిన 'సరస్వతి' పత్రికలో ఆ మధుధారను కొనసాగించారు. 1904లో పిఠాపురం శ్రీ రాజా చెల్లాయమ్మారావు బహద్దరుగారి హైస్కూలుకు వచ్చిన కొత్తలో శ్రీరామకృష్ణ పరమహంస చరిత్రయుఁ, దద్బోధములును అన్నపేరిట అచ్చువేస్తూ ఆ పద్యాలను శ్రీ రామకృష్ణ పరమహంస చరిత్ర భాగానికి అనుబంధంగా ముద్రించారు. ఆ మహిత మనోజ్ఞరచనను విద్యార్థులు, విద్యాధికులు, విద్వత్కవులు సనాతన ధర్మ దీపకమని మెచ్చుకున్నారు. కాకినాడ నుంచి సావిత్రి, చెన్నపురి నుంచి శశిలేఖ, ఆంధ్రప్రకాశిక, కంతేరు నుంచి దేశోపకారి, విజయనగరం నుంచి జనానా ప్రశంసలలో ముంచెత్తాయి. సావిత్రి పత్రికయితే 1904 నవంబరు సంచికలో,

*"తొల్లి రాముండు పూతచారిత్రము చేతను గృష్ణుడు బోధచేతను లోకమున కమితమగు మహోపకారం బొనర్చిరి. కాని శ్రీరామ కృష్ణపరమహంసయను నీయవతారపురుషుండు రామువలెఁబూతచారిత్రమును గృష్ణునివలె చక్కని బోధను గూడంజేసి లోకమునకు దారిచూపుటకైయవతరించినట్లు భక్తులు చెప్పుకుందురు. ఈ పరమసాధుని పావన చారిత్రమును ఖండాంతరులగు మోక్షు మూలరు దొరవారు మున్నగు వారు వ్రాయుటచేతనే ఈతఁడెంత ఘనుఁడో బోధపడగలదు. ఈతని బోధలు మధురములు సవజనాదరణీయములునై యున్నవి. ఇట్టివాని చారిత్రమును, నీతులను బద్యరూపముగా నొనర్చుట చాలా లోకోపకారమున పని."*

అని మెచ్చుకుని, కావ్యభాగంలో నుంచి కొన్ని ఆణిముత్యాలను పేర్కొన్నది. మహాకవి ఓలేటి పార్వతీశంగారైతే తమ మిత్రునివద్ద చూసి, ఆసాంతం చదివి, విషయగౌరవానికీ కావ్య గంభీరిమకూ ముగ్ధులయి, 6-2-1905న పిఠాపురం నుంచి 20 పాదాల ఉత్పలమాలికను పంపించారు:

ఉ. ధాత్రిసురాన్వయాంబుధిసుధాకర! కూచి నృసింహరాయ! తా
పత్రయమోచనుండు ఘనపాతకతూలదవానలుండు వా
క్యత్రయవేదియై పరమహంస యనంబడు రామకృష్ణు చా
రిత్రము పద్యకావ్యమగు రీతిని మీరొనరింప; దాని నా
మిత్రుని యొద్దఁగైకొని; తమిన్ జదువం, జదువంగ సద్దిరా!

శ్రోత్రములందు వాక్యసుధఁ జొన్పుచు హాళిని గూర్చు పద్యముల్,
గాత్రమునందు నిండఁ బులకల్ జనియింపఁగఁజేయు నర్థముల్
నేత్రపథంబునం దెదుట నిల్పినయట్టుల తోఁచు భావముల్
పాత్రములైన రీతులు సెబాసు! బలా! యనజేయు శైలియున్
బుత్రుల మిత్రులన్ సతుల భూముల గీముల నేమఱించి కాల
త్రయి దేవుపై మనసు లగ్నముగా నొసరించు బోధముల్
సూత్రమునందు ముత్యములఁ జొన్పిన పోలికనుండు కూరుపున్
జిత్రముగా గనంబడియె; నేనొకసారియె చూచి యంతలో
నాత్రముతోడ వ్రాసినదియా! ఇది; నిశ్చలమానసుండనై
ద్విత్రి చతుష్కవారములు వేదసమంబగు దీని జూచితిన్
గాత్రము సౌఖ్యవృత్తి బులకల్ చిలుకన్; బళిరయ్య! వర్ణనా
మాత్రము గాదు; దీని బలుమాఱులు చూడఁగఁ జూడ నెన్నియో
చిత్రములైన యూహలను జేయఁగఁ జాలుదునంచు నెంచితిన్
మిత్రమ! దీని మీ మదికి మెప్పునకుం బొనరించు నా ముఖ
స్తోత్రముగాఁగ నెంచకుండి! శుద్ధమనస్కుఁడనై వచించితిన్.

అని అభివందిస్తూ, కావ్యాన్ని "వేదసమం" అన్నారు!

1921లో శ్రీరామకృష్ణ పరమహంస చరిత్రము జిల్లా గ్రంథాలయాలకు ఎంపికై, పాఠ్యగ్రంథంగా నిర్ణయింపబడింది. 1930 నాటికి మూడు ముద్రణలకు నోచుకున్నది. చిట్టచివరి పరివర్ధిత ముద్రణలో 242 పద్యాల జీవితభాగం, 621 పద్యాలలో శ్రీరామకృష్ణ పరమహంస నీతిబోధావళి ఉన్నాయి. కావ్యాన్ని తమ కులదైవమైన శ్రీరామచంద్రునికి అంకితం చేశారు. శ్రీ రామకృష్ణుల జీవితంలోని సారళ్యం కావ్యమంతటా సరసపదసంవేశంతో పరచుకునిపోయింది. భక్తి వేదాంత సన్నివేశాలలో పద్యాలన్నీ చక్కెరలతోడి మావిముక్కల పోలికను పసందుగా ఉంటాయి.

క. పరమాత్మజ్ఞానంబును
బొరసి తరింపంగఁ దలచు పురుషుఁడు కాంక్షన్
గురు సరయఁ బిచ్చిపట్టిన
నరుపోలికఁ దిరుగవలయు నల్గడలందున్.

క. సుమమునఁ దేనెలు గ్రోలఁగ
భ్రమరంబులు చనునుగాని, ప్రసవం బళులన్
నెమకంగఁ బోదు; కావున
నమలత శిష్యుండె గురువు నరయఁగ వలయున్.

మ.నిరహంకారుఁడు, యోగివర్యుఁడు, సదానిర్లిప్తచిత్తుండు, దు
ర్భరసంసారలతాలవిత్రవిమలప్రజ్ఞాన సంపన్నుఁ, డీ
శ్వర చింతాపరతంత్రుఁ, డింద్రియముల న్బంధించి లోఁగొన్న నే

ర్వరి, శాంతాత్ముఁడు, రామకృష్ణునకు వారల్వీరలు న్సాటియే!

ఇత్యాది.

*(మిగతా వచ్చే సంచికలో)*




# నిష్కళంక కవితా తపస్వి కూచి నరసింహ కవిగారు

- డా. ఏల్చూరి మురళీధరరావు

నూరేండ్లక్రితం తెలుగువారికి శ్రీ రామకృష్ణ వివేకానంద మహనీయబోధామృతాన్ని పంచిపెట్టి, వైదేశికానుకరణతో వ్యక్తిత్వాన్ని కోల్పోతున్న యువజనులకు సనాతన సంప్రదాయాన్ని నేర్పిన గొప్ప ఆధ్యాత్మవిద్యాప్రచారకులు, మహాకవి, మహోపన్యాసకుడు, విద్యావేత్త శ్రీకూచి నరసింహంగారు. సాహిత్య పరమార్థం నీతిబోధ మాత్రమే అని నమ్మి, పుంఖాను పుంఖంగా రచనలు చేసినా స్వార్థనిర్ముక్తులై లౌకిక సుఖభోగాలకు, కీర్తికాంక్షకు, ప్రచార భేరీభాంకారాలకు దూరంగా ఉండిపోయిన ఆ మహాపురుషుని జీవితాన్నీ, జీవిత సందేశాన్నీ నవతరం పాఠకలోకానికి పరిచయం చేస్తున్న సుదీర్ఘ వ్యాసం ఇది.

అభ్యుదయ కవితాయుగంలో అచ్చయిన తొలికావ్యం "నయాగరా" కవి, "సోవియట్ భూమి" పత్రికా సంపాదకులు శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారి తనయుడు. సంస్కృతం, ప్రాకృతం, ఆంధ్రాంగ్ల హిందీ తమిళకన్నడాలు, కొంతకాలం రష్యన్ భాషలను అభ్యసించి వ్యాసాలు, కవితలు, రేడియో పాటలు, రూపకాలు, అనువాదాలు ప్రకటించారు. తెలుగులో "విష్ణుపురాణం", "శ్రీమద్భాగవతం", ఇంగ్లీషులో "దేవీసప్తశతి" మొదలైన వచనానువాదాలు; "తెలుగులో 150 వసంతాల వావిళ్ళ వాఙ్మయవైజయంతి", పిల్లల మఱ్ఱి పినవీరభద్రకవి "జైమిని భారతం", "సాంధ్ర పద్యానువాద శ్రీరామ కర్ణామృతం", "శ్రీ కృష్ణకర్ణామృతం", సంస్కృతంలో శ్రీవత్సాంకుల "యమకభారతం", శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి "కంకణబంధ రామాయణం"; ఆంగ్లంలో "Lure of the Yore & other poems", పెంగ్విన్ బుక్స్ ప్రచురించిన "The Tenth Rasa" (లో తెలుగు విభాగం) వంటి పరిష్కృత రచనలు; Essays on the History of Telugu Literature, సుబంధుని వాసవదత్తా పరిణయం వంటి వ్యాస సంపుటాలు; శివామృతలహరి, భుక్తశేషము పద్యకావ్యాలు, పత్రికలలో సాహిత్య వ్యాసాలు వీరి రచనలలో కొన్ని. మహాభారతంలో ద్రోణపర్వాన్ని అధికరించి ఎం.ఫిల్, గణపవరపు వేంకటకవి ప్రబంధజ వేంకటేశ్వర విజయ విలాసంపై పి.హెచ్.డి చేశారు. సాహిత్య చరిత్ర, చిత్రకవిత్వం అభిమానవిషయాలు. ఢిల్లీలోని వేంకటేశ్వర కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసరుగా ఉద్యోగం; ఢిల్లీ తెలుగు సాహితి కార్యదర్శిత్వం; ప్రస్తుతం శ్రీరామకృష్ణ మఠం కోసం పోతనగారి శ్రీమహాభాగవతాన్ని పునఃపరిష్కరించి, ఆయా స్కంధాలకు వివిధ విద్వాంసులు రచించిన తాత్పర్యాలతో సరికొత్త ముద్రణ పాఠాన్ని రూపొందిస్తున్నారు.





(క్రిందటి సంచిక నుంచి తరువాయి)

**శ్రీరామకృష్ణుల బాల్యవర్తనం, చిన్నప్పుడు రాణి రాచమణిదేవి** దక్షిణేశ్వరామంలో ఆయన చక్కపరచిన శ్రీకృష్ణవిగ్రహం సంగతి, అన్నగారు రామకుమార చతురోపాధ్యాయులు నేర్పిన సంస్కారగరిమ, చుట్టుప్రక్కలవారు *"పిచ్చివాఁడని కొందరు; పెద్దజ్ఞాని, పూజ్యుడని కొందరు"* భావించటం, లీలాదేహుడై *"బాలోన్మత్త పిశాచచర్యల నిలవ్వర్తించు ప్రజ్ఞాని"*కి శారదాదేవితో వివాహం, ఆ దంపతుల అలౌకిక భక్తితత్పరత, ధ్యానపరవశత్వం కాలక్రమేణ ప్రభోధోదయం, జిజ్ఞాసువులకు వారిరువురి మార్గనిర్దేశం, శ్రీరామకృష్ణులకు అప్రార్థితోపపన్నంగా లభించిన తోతాపురి ఉపదేశం, అప్పటినుంచి పరబ్రహ్మైక్య సాధన, నిర్వికల్ప సమాధిస్థితి, యోగాభ్యాసం, శ్రీరామకృష్ణుల అధ్యాత్మ రామాయణ శ్రవణం, త్రైలింగ స్వామితో సమావేశం సిద్ధించటం, మంత్ర సిద్ధి, విజ్ఞాన సంపన్నుడైన కేశవ చంద్రసేను గారితో శైష్యోపాధ్యాయిక, శరీరానికి అనారోగ్యం కలిగినప్పటి స్థితప్రజ్ఞత, ఆ మహాపురుషుని సర్వమత సిద్ధాంత దర్శనం, గురుదేవుల వద్దకు వివేకానంద సమాగమం, శ్రీరామకృష్ణుల జ్ఞానగురుత్వం మొదలైనవి ఈ కావ్యంలోని చిరస్మరణీయమైన సన్నివేశాలు. ఇక, రెండవ భాగంలోని నీతిసారమంతా భారతీయ వేదాంత శాస్త్రానికి, శ్రీరామకృష్ణుల జీవిత సందేశానికి సారనవనీతం. అందులోనుంచి ఎన్ని ఉదాహరణీయాలను ఉదహరించినా తక్కువే.

ఉ. జీవుడు దాను దేహము త్యజించుచు నేఁగెడు కాలమందునన్
భావ మెటుండు, నట్టి భవబద్ధకళేబర మొండు సొచ్చెడున్;
బావన పూర్ణభక్తుఁడటు వాంఛలఁజిక్కక బ్రహ్మలీనుఁడౌఁ;
గావున జన్మనిర్వృతికిఁగావలె భక్తియు, నీశ్వరార్చనల్.

తే. భక్తి దీటుకొనెడు వఱకును భక్తుండు
దూరముండవలయు దుష్టతతికి;
భక్తిపూర్ణమైనఁ బాప సంగతిఁదాను
జెడక, పాపులకును జేయు మేలు.

ఆ.వె. కర్త, రక్షకుండు, హర్తయు, భువి నెల్ల
కార్యములకు మూలకారణంబు,
నీశుఁడే యటంచు నెంచి, యహంకృతిఁ
జంపుకొనుట మోక్షసాధనంబు.

ఇందులోని నీతిబోధలన్నీ ఈ విధంగానే ఉంటాయి. ఆ రచన తమకు మనస్సంతోషిణిగా పరిణమించినదని గ్రంధానికి లభించిన నిశ్శేషప్రజాదరానికి పులకించి, వారే ఆ తర్వాత 1909లో చెప్పారు:

గీ. ఐహికార్థపరిశ్రమమందుఁ జిక్కు
మనము నపుడప్డలౌకిక మార్గమునకుఁ
ద్రిప్పి, నేనెట్లో శ్రీరామకృష్ణ పరమ
హంస చరితంబు వ్రాసి, ధన్యతను గంటి.

అని. గ్రంథాన్ని పునర్ముద్రించినప్పుడు ఈ విశేషాలన్నిటినీ చేర్చితే పాఠకులకు వారి సాహిత్య వివరాలనేకం తెలుస్తాయి.

తెలుగులో శ్రీ రామకృష్ణ వివేకానంద వాఙ్మయాలను తొలిసారి సాధికారంగా ప్రకటించినది నరసింహంగారే. శ్రీ రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రమును పైని చెప్పినట్లు పద్యకావ్యంగా నిండుతనం, గాంభీర్యం తొణికిసలాడే ఉదాత్తమైన శైలిలో రసోదంచితంగా వ్రాసి, రెండవ భాగంలో ఆ మహాత్ముని అనర్ఘమైన సూక్తులను తేటగీతులలో తెలుగు చేసిన ఆ కొన్నాళ్ళకు వారు రచించిన వివేకానంద స్వామి: ప్రాక్పశ్చిమములు, భక్తియోగోపన్యాసములు, ద్వాదశోపన్యాసములు, వివేకానందుల పురాణోపన్యాస చతుష్కము, శ్రీ వివేకానంద సందేశము - సాహిత్య విద్యార్థులు తప్పక చదవదగిన ఆధ్యాత్మిక పరిమళోల్లాసాలు. వీటిలో ముమ్మొదటిదైన వివేకానంద స్వామి: ప్రాక్పశ్చిమములు శ్రీ వివేకానంద స్వామి క్రీ.శే. 1897లో చికాగోలో జరిగిన విశ్వమత సమ్మేళనంలో చేసిన ఉదాత్తమైన ప్రసంగం పూర్వాపరాలను వివరిస్తూ, అద్భుతావహమైన శైలిలో రసకందాయంగా సాగింది. ఇక, భక్తియోగోపన్యాసములు ఒక అపూర్వమైన వ్యాససంకలనం. శ్రీవివేకానందుల సంపూర్ణ గ్రంథావళిలోని రాజయోగ, కర్మయోగ, భక్తియోగ ప్రకరణాల సారోద్ధారమా రూపొందించిన భక్తిప్రసంగావళి అది. అందులో నరసింహం గారొక ప్రౌఢ ప్రయోగం చేశారు. శ్రీ వివేకానంద స్వామి ఆంగ్లోపన్యాసాలను తెలుగు చేసేటపుడు అద్వైతాది శాస్త్ర గ్రంథాలలోని పరిభాషను పరిహరించి, రామకృష్ణ వివేకానంద భావధారతో పరిచయం ఉన్నవారికోసం ఒక సరిక్రొత్త పరిభాషను కల్పించారు. సరళమైన శైలిలోనే గహనమైన విషయాన్ని పాఠకులకు కరతలామలకం చేశారు.

వారి ఆత్మనివేదనము ప్రపంచంలోని అన్ని మతాల, దర్శనాల సారాన్ని వివరించే తొలి సమీక్షా గ్రంథం. మనిషి పుట్టుకకు కారణం ఏమిటి? జీవిత పరమార్థం ఏమిటి? పరలోకమనేది ఉన్నదా? ద్వంద్వభావాలను పరిహరించి మనశ్శాంతి సాధించటానికి తరుణోపాయం ఏమిటి? అన్న ప్రశ్నలకు విశ్వమానవుని అన్వేషణసారం ఈ గ్రంథంలో మనకు సాక్షాత్కరిస్తుంది.

**ఆగ్నేయాశుగములు** నరసింహంగారి వచన కృతులలో సుప్రసిద్ధం. మతప్రచారకునిగా శ్రీ అరవిందులను కలుసుకోవటానికి పాండిచ్చేరికి వచ్చి, హృదయ పరివర్తనం చెంది భారతీయధర్మాన్ని అభిమానించిన పాల్ రిచర్డ్ ఉపన్యాససారం అది. గుండెలలో పదికాలాలపాటు పదిలంగా నిలిచిపోయే భావశబలత వెల్లివిరిసింది. హిందూ ధర్మాన్ని ఇంత విశాలామైన ప్రాతిపదికపై క్షోదక్షమంగా పరిశోధించి, విశ్వమతాలతో సరిపోల్చి, సుధాకలశంపైని జిగితేరిన పచ్చిమీగడ వంటి సారాన్ని అందించే కృషిచేయగల విజ్ఞానావేశం ఎందరికుంటుంది?

విశ్వమతదర్శనాన్ని అధికరించిన తమ అధ్యయనసారాన్ని నరసింహంగారు ఆత్మనివేదనము అన్న గ్రంథంలో సంక్షేపించారు. ఇది 1926లో వెలువడింది. మాధవాచార్యుల సర్వదర్శనసారసంగ్రహం వెలుగులో పయనించిన ఉదాత్తమైన రచన. భారతీయ దర్శనాలలో ముఖ్యతరాలైన అద్వైత, ద్వైత, విశిష్టాద్వైతాలతో పాటు చార్వాకాది నాస్తికధర్మాలు ఇందులో పరిశీలనకు వచ్చాయి. పారశీకులు, యూదులు, క్రైస్తవులు, బౌద్ధులు ప్రతిపాదించిన భగవత్తత్వాన్ని; సాకార నిరాకారత్వాలను; ఏకేశ్వర, నిరీశ్వర వాదాలను చర్చించి నిగ్గుతేల్చే ప్రయత్నం చేశారు.

1929లో నరసింహంగారిని యలమంచలికి సమీపంలోని మార్కాపురం వివేకానంద సమాజం వారు తమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా రమ్మని ఆహ్వానించారు. అనారోగ్యకారణాన నరసింహంగారు ఆ కార్యక్రమానికి వెళ్ళలేకపోయారు. అయితే, సమితి అధ్యక్షుని ప్రార్థనను పురస్కరించుకుని ఆ సమావేశంలో చదివి వినిపించేందుకు గాను శ్రీ వివేకానంద సందేశం అనే లఘుప్రస్తావికను వ్రాసి పంపించారు. అది ఆ సంవత్సరమే వావిళ్ళ వారి త్రిలిఙ్గ పత్రికలో అచ్చయింది. దానిని 1930లో నరసింహంగారు ప్రత్యేక గ్రంథంగా ప్రకటించారు. అందులో శ్రీ వివేకానంద స్వామి జీవిత సందేశాన్ని వినిపిస్తూ, హిందూ ధర్మంలోని లోటుపాట్లపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సంప్రదాయానురక్తులైన హిందువులనందరినీ వారందులో 1)పూర్వాచారపరాయణులు 2) సంస్కరణాభిలాషులు 3) సర్వమతసమానధర్ములు అని మూడు తెగల వారిగా విభాగించారు. కేవల పూర్వాచారపరాయణులు కర్మసంగతులై పంచ మహాయజ్ఞాలు,

వర్ణాశ్రమధర్మాలు, స్నానం, మడి, భోజనం, జుట్టు, బొట్టు, కట్టు మొదలైన దేనిలోనూ మార్పు ఉండకూడదని, ప్రాచీనత్వమే పరమ ప్రమాణంగా వాదించటం వల్ల సమాజ పురోగతి కుంటుపడుతున్నదని వాదించారు. సంస్కరణాభిలాషుల ప్రతిపాదనలలో సమాజ సేవాభిలాష ఉన్నదనీ, గాఢతమోనిద్రలో మగ్గుతున్న భారతీయులను జాగ్రదవస్థకు తేవాలంటే సంస్కారం అవశ్యకమనీ అంగీకరించారు. అయితే ఈ ఆంగ్ల విద్యాసంపన్నుల దేశీయ ధర్మవైముఖ్యం మూలాన విదేశీయ చిత్తప్రవణత వర్ధిల్లి సమాజం విచ్ఛిన్నం కాగలదని వారు ఆందోళన చెందారు. అందువల్ల సర్వమత సమానధర్ములైన శ్రీరామకృష్ణ వివేకానందుల వంటి జ్ఞానసంపన్నుల కృషి మాత్రమే ముముక్షువులను అపవర్గసౌధానికి ఎక్కించటానికి సాధనమైన నిచ్చెనమెట్టు కాగలదని ఆకాంక్షించారు. ఆధునిక భారతం వారి ఆధ్యాత్మిక సందేశాన్ని ఆచరిస్తే సమాజం అభ్యుదయ పథంలో పురోగమిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. "సోపానచ్ఛేదముఁ జేసి క్రిందఁబడద్రోయుట సంస్కారము కాదు" అంటూ, సర్వమతసామరస్యాన్ని అభిలషించారు. అందుకు జాతిమతవిభేదాలు లేని విద్యావ్యాప్తి ఒక్కటే సత్యపరిష్కారమని ఉద్బోధించారు. దేహబలం, బుద్ధిబలం, ఆత్మబలం విద్యకు అవశ్యకాలనీ, ప్రస్తుతం ప్రచారంలో ఉన్న విద్యలో ఆ లక్షణాలు లోపిస్తున్నందువల్ల విదేశీ విద్యావిధానాన్ని జాతీయ లక్ష్యానికి అనుగుణంగా మలుచుకుంటూ ముందుకు సాగాలనీ వ్యాఖ్యానించారు. పాఠశాలలో ఆధ్యాత్మిక విద్యను బోధించాలని, ఆ విద్యావ్యాప్తి ద్వారా అన్ని కులాలవారు అభివృద్ధిని సాధింపగలరని వారన్న మాటను చూడండి:

"నిమ్న జాతులకు మేలుచేయుట కమోఘమైన సాధనము విద్యాదానము. వారిని విద్యావంతులఁ జేసినచో వారికిఁ గావలయు సదర్థములన్నియు వారే సంపాదించుకొనఁగలరు. వారికేమి కావలయునో మనము నిర్ణయించిపెట్టనక్కరలేదు.. విద్యాదీపమును మనము వారికడకే కొనిపోవలయును"

అని వ్రాశారు. గోధుమ గింజ భూమిలో పడి రూపుమారితేనే సస్యఫల ప్రాప్తి జరిగినట్లు అహం పదార్థం నశించిన కొద్దీ ఆత్మతేజస్సు అభివ్యక్తమవుతుందన్న వివేకానందోపదేశాన్ని అమేయ ప్రభావాత్మకంగా నరసింహంగారు దీనిలో విశదీకరించారు.

కూచి నరసింహంగారి యశోవల్లరి తెలుగునేల నాలుగంచులకు కలయప్రాకినది వారి శ్రీ గౌరాంగ చరిత్రము పద్యకావ్యంతోనే. భక్తమండలికి నిత్యారాధ్యుడైన ఆ చైతన్యమాయీ పుణ్యగాథను, వ్యాకరణాల కీకారణ్యాలలో నుంచి బైటపడి లోకసేవాతాత్పర్యంతో శ్రీకృష్ణభక్తిమార్గాన్ని జగత్తుకు ప్రబోధించిన ఆ మహాత్ముని దివ్యచరిత్రను - ఎంత తాదాత్మ్యంతో, ఎంత స్వచ్ఛమైన నిష్కామచిత్త విచ్ఛిత్తిలో వారు నిబంధించారో చెప్పలేము. ద్రాక్షారస మధురమైన మహాప్రబంధం అది. రామకృష్ణుల చరిత్రను నిబంధించే నాళ్ళలో వారి ప్రసంగాలలో తరచు వినవచ్చే ఆ మహాత్ముడెవరన్న కౌతుకం కొద్దీ శ్రీ చైతన్య చరితామృతాన్ని తెప్పించి, చదివి, శ్రీ గౌరాంగ లీలలకు పరవశించి, ఆ అతిమానుషతత్త్వాన్ని తెలుగుజాతికి తనివితీరా వినిపించారు.

చ. ఒక ఫలము స్సృజింప మఱియొక్క ఫలంబు మొసంగఁబుట్టు గో
రిక మనమందు నీగతి నివృత్తి మహాపథవర్తన ప్రబో
ధకుఁడగు నొక్క యోగి చరితంబు లిఖించి, ముగింప, నట్టివా
నికథ మఱొకండు వ్రాయఁగ జనించెను గోరిక నాకు నెమ్మదిన్.

అని, అపరకృష్ణావతారమైన ఆ మహనీయుని పావన కథను పద్యాత్మకంగా రచించి కృతార్థులయ్యారు.

గౌరాంగ చరిత్ర తెలుగువారికి పారమార్థిక శిక్షామృతం తీపిని పంచిపెట్టిన బృహత్కావ్యం. ఆంగ్లంలో పండిత శిశిర కుమార ఘోష్ రచించిన Lord Gauranga or Salvation for Allకు చేసిన స్వచ్ఛందానువాదం అది. ఒక ఆంగ్ల వచన గ్రంథాన్ని బృహత్పద్యకావ్యంగా పరివర్తించిన తొలిప్రయత్నం తెలుగులో అదేనేమో! ప్రథమభాగం ఇరవై ఆశ్వాసాలలో ఉన్నది. ద్వితీయ భాగం పధ్నాలుగు ఆశ్వాసాలు. నాలుగువేల పైచిలుకు పద్యాలున్న మహాగ్రంథం. 1909లో మొదలుపెట్టిన మూడేండ్లకు - 1912లో మొదటి భాగాన్నీ, ఆ తర్వాత 1914

లో రెండవ భాగాన్నీ ఎంతో అందంగా అచ్చువేశారు. ఆ రచనా దీక్ష, ఆ రచనా దక్షత మెచ్చదగినవి. ప్రథమ భాగంలో కొంత 1911లో తణుకు నుంచి ప్రకాశితమైన సువర్ణలేఖ పత్రికలో ధారావాహికగా వెలువడింది. దివ్యానంద ప్రదమైన భక్తిభావన ప్రేరేపించినందుననే గాని, లౌకికయశోలాభం కోసం తాను రచనకు ఉపక్రమింపలేదని పీఠికలో చెప్పుకున్నారు.

నరసింహంగారు ఆంగ్లవిద్యావిశారదులు. ఆనాటి కవులందరి కృతులలో వలె వారి గ్రంథాలన్నింటికీ రమ్యఫణితిలో కూర్చిన ఆంగ్లపీఠికలుంటాయి. వాటి శైలి సహృదయావర్జకం.

గౌరాంగ చరిత్ర కావ్యాన్ని నరసింహంగారు శ్రీరామచంద్ర పరబ్రహ్మానికే అంకితం చేశారు.

శా. కౌసల్యాలలనా్కాంబురుయుగ్మంబందుఁ జాంపేయడో
లాసమ్యఙ్మృదుశయ్యల న్నిదురసల్పంజాలి యెవ్వాఁడు స
త్యాసక్తి న్పితృవాక్యపాలనపరుండై వల్కలచ్ఛన్నుఁడై
త్రాసంబందక యేఁగెఁగానలకు నారాముండు నన్బోవుతన్.

అని మనఃపూర్వకంగా ప్రార్థన చేశారు. ప్రార్థనలోనూ లోకాచరణీయమైన సత్యవాక్యపాలనకు, పితృభక్తితత్పరతకు, సుఖనిరాసక్తికి తమ ఆరాధ్యదైవతాన్ని ప్రమాణీకరించారు.

గౌరాంగ చరిత్ర కావ్యమంతా రసనిర్భరం. అందులోని వంగీయ వాతావరణం, కల్పనలోని శిల్పధోరణి కొత్తగా ఉంటాయి. మహావిద్వాంసుడు, తర్కవ్యాకరణ పారదర్శి అయిన విశ్వంభర గౌరాంగుని బాల్యవిద్యావినోదాలు, శాస్త్రజ్ఞులతో వాదవివాదాలు, భక్తిపథాన్వేషణం, శ్రీకృష్ణ ప్రేమామృతపానందం, భగవదవతారమూర్తిగా గుర్తింపు, నిరతిశయ కారుణికపురుషుడైన శ్రీకృష్ణుని చారిత్రవిలాస ప్రచారం, చైతన్యుల జీవిత సందేశం - వీటితో ఒక అపురూపమైన భక్తిమయ వాతావరణం నిండి, ప్రతిసన్నివేశకల్పనలోనూ ఒక దివ్యతేజం వెల్లివిరిసింది.

ఇటువంటి కావ్యాలను చదివితే పాఠకులకు కలిగే ప్రయోజనం ఏముంటుంది? ఈ ప్రశ్నకు నరసింహంగారు ఆంగ్లపీఠికలో పెద్ద సమాధానమే చెప్పారు. "దీన్ని చదివినందువల్ల మీకు దమ్మిడీ ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందనుకోను. మీకేదో మీ వృత్తిలోనో మరొకదాంట్లోనో పురోగతి కలుగుతుందనీ చెప్పలేను. అయితే, జీవితంలో క్లిష్టపరిస్థితులెదురైనప్పుడు మీకు కొంత నమ్మకాన్నీ, భగవంతుని లీలపై కొంత విశ్వాసాన్నీ ఈ పుస్తకం మీకిస్తుంది. కర్కశమైన భౌతిక సమస్య లెదురైనప్పుడు అనుకోని ఒడిదుడుకులేర్పడినప్పుడు - మీకిది పరిష్కారాన్ని సూచింపగలుగుతుంది. ఇంద్రియ సుఖమే సుఖం కాదనీ, వ్యక్తిమాత్రులపై బంధాన్ని పెంచుకోక పరమాతం తత్త్వాన్ని తెలుసుకోవటం మేలని, ఈ లౌకిక సుఖాలకు అతీతమైన పారమార్థిక సుఖమొకటి ఉన్నదనీ, ఉన్నతోన్నతమైన ఆ చరమగమ్యాన్ని శ్రీ గౌరాంగుల వారి బోధ మీకు చూపగలదనీ నా విశ్వాసం. ఆ విశ్వాసంతోనే ఈ కావ్యాన్ని వ్రాశాను" అన్నారు. వారి జీవిత కావ్యాదర్శమూ అదే

గౌరాంగ చరిత్రములో నుంచి ఎన్ని పద్యాలను ఉదహరించినా తనివి తీరదు. అందులోనూ ఆశ్వాసాద్యంతాలలో వారు శ్రీరామచంద్రునికి నివేదించిన పద్యాలన్నీ విద్యార్థులకు వాచోవిధేయాలు కావాలి. ఆ పద్యాలన్నీ భక్తి జ్ఞాన కర్మ వైరాగ్యబోధకాలు. ఇక, ప్రధానేతివృత్తంలో గౌరాంగుని జీవితం దుర్గమ శాస్త్రవిద్యారణ్యం నుంచి అధ్యాత్మ గిరి శిఖరాలకు ప్రయాణించిన తీరు అద్భుతాస్పదంగా ఉంటుంది. నరసింహంగారి చిత్రణలో జీవితానికంటే జీవిత సందేశానికే అగ్రతాంబూలం లభించింది. ఇందులోని సార్వభౌముని కథ, ప్రకాశానందోపాఖ్యానం అద్వైతమతావలంబులకు కొంత అనిష్టాపాదకం కావచ్చునని ప్రథమదృష్టికి భాసింపవచ్చును. ఆ విచికిత్స కలవారు కేవలానుభవైకవేద్యమైన ముక్త్యవస్థాతారతమ్యం ఎలా ఉన్నప్పటికీ అద్వైతమతబోధకావతంసుడైన శ్రీమదాదిశంకరాచార్యులవారే మనస్సులను పారవశ్యామృతవార్ధిలో ఓలలాడించే వివిధ దేవతాస్తుతిపరక భక్తిశ్లోకాలను సంధానించిన సంగతిని తప్పక గుర్తుంచుకోవాలి. అందువల్ల

భక్తిభావభావన సహ్యమే గాక ముక్తిపరులకు అత్యావశ్యకమని వెల్లడవుతుంది. భక్తికీ అద్వైతముక్తికీ గల అభేదం తేటపడుతుంది. పూర్ణభక్తులైనవారికి ఉపాస్యము - ఉపాసకుడూ అనే భేదభావం ఉండదట. గౌరాంగ చరిత్రము పదకొండవ ఆశ్వాసంలో శ్రీకృష్ణనిమగ్నమైన తన చిత్తస్థితిని వర్ణించే రాధ వాక్యాలన్నీ ఈ బోధకే పరిపోషకాలు. ఏవంవిధమైన తాత్పర్యాన్ని ప్రతిపాదించి నరసింహంగారు శ్రీ గౌరాంగ చరిత్రం అత్యంత వందనీయమూ, భవదుఃఖసాగర నిస్తారకమూ అని భక్తలోకానికి నిరూపించారు. కర్మభక్తిజ్ఞానాలలో భక్తిమార్గం పరమాచరణీయమని ఉద్బోధించారు. తమ కావ్యరచన సార్థకమై అన్యకవులు నాటక హరికథారూపాలలో శ్రీ గౌరాంగ సంప్రదాయాన్ని ప్రచారం చేయగలరని అభిలషించారు.

ఇందులో నరసింహంగారు మరొక చిత్రమైన ప్రయోగం చేశారు. ప్రథమ భాగాంతంలో గౌరాంగుని సన్నిహితులందరూ కలిసి చంద్రశేఖరుని ఇంట అద్వైతాచార్యుని దర్శకత్వ పర్యవేక్షణలో అంధుమంగలమనే ఒక రంగస్థల నాటకాన్ని ప్రదర్శిస్తారు. అంతకంటే చిత్రమేమిటంటే, గౌరాంగుడు ఆ నాటకంలో ఎవరెవరు ఏయే పాత్రను ధరించాలో మాత్రమే నిర్ణయిస్తాడు. కథాగమనం మనందరికీ తెలిసినదే గనుక నాటక రచన అవసరం లేదనీ, రంగస్థలం మీద నటులు ఆ పాత్రలలో లీనమైతే సంభాషణలు వాటంతటవే స్ఫురిస్తాయనీ చెబుతాడు.

ఉ. అక్కర లేదు మీ నుడువునట్టి ప్రయత్నములేమి; వ్రాయఁగా
నక్కఱలేదు నాటకము; నాడుతఱిన్ బ్రతివేషధారి స
మ్యక్కృతవాక్ప్రసంగముల నందఱినున్ ముదమొందజేయు;నం
దొక్కఁడుఁ బూర్వపాతకలనోదితకష్టము వొందఁడింతయున్.

అంటాడు. ఆ విధంగా రంగస్థల నాటకచరిత్రలోనే అపురూపమైన "ఆశునాటకం" ప్రదర్శింపబడుతుంది. కూచి నరసింహంగారు ఆ నాటకాన్ని సంవాదాత్మకంగా, మధ్య మధ్య సూత్రధారకృత్యాన్ని నిర్వహిస్తూ, రమ్యంగా వినిర్మించారు. అందులోని రాధాకృష్ణుల పాత్రచిత్రణం, ఆ సంభాషణలు, వారి అలౌకికమైన ప్రణయతత్త్వం మనకు రూపగోస్వామి రచించిన ఉజ్జ్వల చంద్రికా సంస్కృత నాటకంలోని రాధాకృష్ణులను, ఆ సంభాషణలను జ్ఞాపకానికి తెస్తాయి. పైగా, పద్యకావ్యంలో ఒక ప్రదర్శనయోగ్యమైన రంగస్థల నాటకాన్ని ప్రవేశపెట్టటమనే అపూర్వమైన ప్రయోగమూ సాహిత్య చరిత్రలో మునుపెన్నడూ లేదు. ఇన్ని విధాల లక్షణ విచక్షణుల చిత్తాహ్లాదనార్థం గౌరాంగ చరిత్రముకు తెలుగులో ఎంతో విలువైన స్థానం ఉన్నది. చాపల్యాన్ని చంపుకోలేక నాలుగైదు పద్యాలను మాత్రం మీకు విన్నవిస్తాను.

మ. సిరి దూరంబయిపోవనీ! సుఖము నిశ్శేషంబుగా జాఱనీ!
పరిహాసంబులు నీ పడంబులు జనుల్భాషింపనీ! రక్తము
ల్దొరఁగన్వైఁబడిమోదనీ! యురువిపత్తుల్గమ్మి బాధింపనీ!
హరిదాసుల్ భవదంఘ్రిపద్మములఁ బాయన్లేరుగా! రాఘవా!

శా. న్యాయవ్యాకరణాదిశాస్త్రములఁ బూర్ణఖ్యాతి నార్జించి; దు
ర్జేయప్రజ్ఞ సమస్తసూరి తతికిం గైమోడ్పుఁ దెప్పించి త
ళ్యా! యెట్లీడగు నీదుపాండితికి నా యల్పాక్షరజ్ఞాన? మే
దో యుక్కించుక స్వోదరార్తిహరణోద్యోగుండనై నేర్చితిన్.

శా. ఈ యద్వైత! భవాబ్ధిలో బడితి; శ్వాసోత్తంభనంబయ్యె; న
త్యాయాసంబుననుంటి; జూడుమిటు! కృష్ణాభిష్ణవోపాయ సం
ధాయిన్, నిన్నడయంగ జాలితిని; నే ధన్యుండనైతిన్ మహా
త్మా! యాలస్యముసేయకా యఖిలలో కాధీశు జూపింపుమా!

ఉ. కోమలలోచనాంబుధరకోటుల నశ్రునదుల్ వెలార్చుచున్,
ప్రేమముదావహప్రథఁ ద్రివిష్టపమున్ హసియించుచున్, శుభా
రామవపుర్ద్యుతిన్ దెసలఁగ్రమ్ముచు, గైతవసమ్యమిత్వ మీ
భూమిని దాల్చి తేజరిలు ప్రోడకు శ్రీహరి కేసు మ్రొక్కెదన్.

గీ. వేదము సుబోధ మైయుండి, వేదభాష్య
మల్లకల్లోల మైయుండ, యతివరేణ్యా!
మూలమును వీడి వ్యాఖ్యను బుచ్చుకొనుట
యెప్పుగిది నెంచి చూచినఁ దప్పుసుమ్మ.

*(మిగతా వచ్చే సంచికలో)*




# నిష్కళంక కవితా తపస్వి కూచి నరసింహ కవిగారు

- డా. ఏల్చూరి మురళీధరరావు

*నూరేండ్లక్రితం తెలుగువారికి శ్రీ రామకృష్ణ వివేకానంద మహనీయబోధామృతాన్ని పంచిపెట్టి, వైదేశికానుకరణతో వ్యక్తిత్వాన్ని కోల్పోతున్న యువజనులకు సనాతన సంప్రదాయాన్ని నేర్పిన గొప్ప ఆధ్యాత్మవిద్యాప్రచారకులు, మహాకవి, మహోపన్యాసకుడు, విద్యావేత్త శ్రీ కూచి నరసింహంగారు. సాహిత్యపరమార్థం నీతిబోధ మాత్రమే అని నమ్మి, పుంఖానుపుంఖంగా రచనలు చేసినా స్వార్థనిర్ముక్తులై లౌకిక సుఖభోగాలకు, కీర్తికాంక్షకు, ప్రచార భేరీభాంకారాలకు దూరంగా ఉండిపోయిన ఆ మహాపురుషుని జీవితాన్నీ, జీవిత సందేశాన్నీ నవతరం పాఠకలోకానికి పరిచయం చేస్తున్న సుదీర్ఘ వ్యాసం ఇది.*

*అభ్యుదయ కవితాయుగంలో అచ్చయిన తొలికావ్యం "నయాగరా" కవి, "సోవియట్ భూమి" పత్రికా సంపాదకులు శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారి తనయుడు. సంస్కృతం, ప్రాకృతం, ఆంధ్రాంగ్ల హిందీ తమిళకన్నడాలు, కొంతకాలం రష్యన్ భాషలను అభ్యసించి వ్యాసాలు, కవితలు, రేడియో పాటలు, రూపకాలు, అనువాదాలు ప్రకటించారు. తెలుగులో "విష్ణుపురాణం", "శ్రీమద్భాగవతం", ఇంగ్లీషులో "దేవీసప్తశతి" మొదలైన వచనానువాదాలు; "తెలుగులో 150 వసంతాల వావిళ్ళ వాఙ్మయవైజయంతి", పిల్లలమర్రి పినవీరభద్రకవి "జైమిని భారతం", "సాంధ్ర పద్యానువాద శ్రీరామకర్ణామృతం", "శ్రీ కృష్ణకర్ణామృతం", సంస్కృతంలో శ్రీవత్సాంకుల "యమకభారతం", శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి "కంకణబంధ రామాయణం"; ఆంగ్లంలో* "Lure of the Yore & other poems", *పెంగ్విన్ బుక్స్ ప్రచురించిన* "The Tenth Rasa" *(లో తెలుగు విభాగం) వంటి పరిష్కృత రచనలు;* Essays on the History of Telugu Literature, *సుబంధుని వాసవదత్తా పరిణయం వంటి వ్యాస సంపుటాలు; శివామృతలహరి, భుక్తశేషము పద్యకావ్యాలు, పత్రికలలో సాహిత్య వ్యాసాలు వీరి రచనలలో కొన్ని. మహాభారతంలో ద్రోణపర్వాన్ని అధికరించి ఎం.ఫిల్, గణపవరపు వేంకటకవి ప్రబంధజ వేంకటేశ్వర విజయ విలాసంపై పి.హెచ్.డి చేశారు. సాహిత్య చరిత్ర, చిత్రకవిత్వం అభిమానవిషయాలు. ఢిల్లీలోని వేంకటేశ్వర కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసరుగా ఉద్యోగం; ఢిల్లీ తెలుగు సాహితి కార్యదర్శిత్వం; ప్రస్తుతం శ్రీరామకృష్ణ మఠం కోసం పోతనగారి శ్రీమహాభాగవతాన్ని పునఃపరిష్కరించి, ఆయా స్కంధాలకు వివిధ విద్వాంసులు రచించిన తాత్పర్యాలతో సరికొత్త ముద్రణ పాఠాన్ని రూపొందిస్తున్నారు.*





(క్రిందటి సంచిక నుంచి తరువాయి)

నరసింహంగారి " **రామచంద్ర ప్రభు శతకము**" ఆ రోజుల్లో భారతి మాసపత్రికలో ధారావాహికగా వచ్చిన భక్తిరత్నాకరం. మారుతున్న కాలంలో మారకూడని విలువలను బోధిస్తూ విద్యార్థుల జీవితాలకు కరదీపిగా వెలసిన ఉదాత్తమైన రచన అది. 1931లో మొదటి కూర్పు వెలువడింది. విస్తారమైన లోకానుభవానికి, భక్తిపరిపాకానికి, స్వార్థనిర్ముక్తమైన దేశసేవానిరతికి, ఆత్మతేజోలబ్ధికి, చిరమనశ్శాంతికి తప్పక చదువవలసిన శతకరాజం.

***శా. ఆయాసక్షమ, యైకమత్యము, దవీయశ్చింతయున్, ధైర్యమున్,***
***స్థేయోయత్నము, దేశభక్తియు, నకుంఠీభూతకౌశల్య, మాం***
***గ్లేయుల్బాపుదు; రవ్వి మాకెపు డిటన్లేవో? గతంబయ్యెనో!***
***యాయంగూడదె వాని మాకుఁగృపఁ? దండ్రీ! రామచంద్రప్రభూ!***

***మ. శమసంపత్తి, చి రాయు, వద్భుతమనీషాశక్తి, యారోగ్యతే***
***జముఁ, ద్వత్సుస్పష్టిరహస్యవేత్తృతయు, నిచ్ఛాసత్త్వపుం బెంపు, స***
***త్యముగా నిన్ను నెఱుంగఁజాలు మహితత్వంబున్, సదాబ్రహ్మచ***
***ర్యమునం గల్గు నమూల్యలాభములు దేవా! రామచంద్రప్రభూ!***

***శా. ప్రేమం బింతయు లేక, నీదెసను దుర్వృత్తంబుతో నుండి, ఇం***
***కామీద న్నదు వెంతగా జదివినన్ వ్యర్థంబె! యా పండితుల్***
***నీ మాన్యాఖ్యలు నోటఁబల్కు జిలుకల్; నీ గీతము ల్వాడు నా***
***"గ్రామోఫోను"లు, నవ్యమోదకరులేగా! రామచంద్రప్రభూ!***

ఈ చివరి పద్యంలో వర్ణించిన వారి "గ్రామోఫోను" పరికరం ఆనాటి 78 ఆర్ పి యం రికార్డులతో పాటు నలభైయేళ్ళ క్రితం దాకా వారింట ఉండేది. ఇప్పుడేమయిందో తెలియదు. పిఠాపురం మహారాజు రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరుగారు వారికి గౌరాంగ చరిత్ర రచనకు పురస్కారంగా "ఆత్మజాత్మజ జన్మదినోత్సవం" నాడు తొడిగిన సువర్ణ హస్తకంకణం వారి మరణానంతరం కూడా చాలాకాలం వారింటనే ఉండి, ఆ తర్వాత కరిగిపోయిందట.

పాఠశాలలో విద్యార్థులకు నాటకకళను బోధించిన దేశికునిగా వారు 1916లో రూపలత అనే శృంగారనిరాసక వైరాగ్యబోధక రూపకాన్ని రచించారు. అది ప్రదర్శనయోగ్యమైన మహానాటకం. భక్తిమార్గంలో ప్రవేశించిన సాధకుడు ఒక వనిత బాహ్య సౌందర్యలోలుపత వల్ల దారితప్పి, ఇంద్రియలాలసుడై, చివరికి తన గమ్యాన్ని తెలుసుకొంటాడు. ఇందులో స్త్రీ పాత్రలను పోషించటంలో నరసింహంగారు చాలా సంయమనం ప్రదర్శించారు. రూపలతపై దోషాన్ని నెట్టివేయక ఆమె కూడా ఆకర్షణలలోని నిస్సారతను గుర్తించి ఏవగించుకొనటం మూలాన తత్త్వదర్శనం స్త్రీ పురుషులిద్దరికీ సమానమేనన్న సత్యాన్ని చాటిచెప్పారు.

అప్పట్లో పాఠ్యపుస్తకంగా ఉండిన థామస్ పార్నెల్ ఆంగ్లనాటకం "హెర్మిట్"ను అక్షయచంద్ర చౌదరి బెంగాలీ కావ్యం "ఉదాసిని" తీరులో 1919లో యలమంచిలిలో ఉండగా నరసింహంగారు **"వనవాసి"** అన్న పేరిట గొప్పగా అనువదించారు. అది ఏడంకాల పద్యనాటకం. క్షణభంగురమైన జీవితంలో క్షణికసుఖాలకోసం ప్రాకులాడక, లోకసేవాతత్పరులై చరితార్థులు కావటమే కర్తవ్యమని బోధించిన ఉదాత్తకృతి. ప్రథమ ముద్రణ వెయ్యిప్రతులు మూడేండ్లకే చెల్లిపోతే, అభిమానుల కోరిక మేరకు 1922లో మళ్ళీ అచ్చువేశారు.

నరసింహంగారు నిత్యరచనాశీలి. పత్రికలలో అనేక ప్రసంగ వ్యాసాలను ప్రకటించారు. వాటిలో గ్రాంథి భాష - గ్రామ్య భాష; బడులలో పెట్టు తెలుగు పుస్తకములు; వర్ణవిభాగములు - వర్ణవిద్వేషములు మొదలైనవి ఈనాటికీ ఉపాదేయాలే. యోగ్యత; అప్పటి విద్యార్థి, ఇప్పటి విద్యార్థి పరిణామక్రమంలో కాలం తెచ్చిన పోగాలపుతనాన్ని విమర్శించే వ్యంగ్య రచనలు. 1923లో వాటిలో పెక్కింటిని సంకలించి, "ప్రహసనములు - పత్రికావిలేఖనములు" అన్న పేరిట ముద్రించారు. అందులో 1. క్రొత్త తెలుగు తమాషా 2. కుహనాప్రసంగ ప్రహసనము 3. సింధుదర్శనము అన్నవి ప్రహసనాలు. 4. గ్రాంథికభాష - గ్రామ్యభాష 5. బడులలో బెట్టు తెలుగు పుస్తకములు 6. ఆంధ్రభాష అన్నవి భాషా విషయకాలు. 7. వర్ణవిభాగములు - వర్ణవిద్వేషములు 8. శ్రీవివేకానందస్వామి అన్నవి ప్రకీర్ణవ్యాసాలు. గ్రాంథిక వ్యావహారిక భాషావాద సమీక్షకులకు ఆసక్తి గొలిపే విషయాలెన్నో ఆ వ్యాసాలలో ఉన్నాయి.

ఆధునిక జీవితంలో స్త్రీలెదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, అతివాదమూ ఛాందసమూ కాని సమన్వయపద్ధతిలో వారు వ్రాసిన "ఆంధ్ర మహిళామణుల కొకవిన్నపము"తో విభేదించేవారుండరు.

ప్రాణసఖులైన కూచి నరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం కవులను ఆ రోజుల్లో "సింహత్రయం" అనేవారు. మీలో ఎంతమంది చూశారో! కూచివారి "వనవాసి" నాటకానికి పానుగంటివారు నాందీ ప్రస్తావనలు వ్రాశారు. పానుగంటివారి "రాధాకృష్ణ", "శ్రీ విజయరాఘవం", రాతి స్తంభము వంటి నాటకాలకు కూచివారు వ్రాశారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఎంతో అపురూపమైన స్నేహమణికర్ణికాఘట్టం అది.

నరసింహంగారు తెలుగులో తొలి బాల విజ్ఞాన సర్వస్వాన్ని శాస్త్రీయ దృక్పథంతో ఆంగ్లంలో వెలువడిన పన్నెండు సంపుటాల బుక్ ఆఫ్ నాలెడ్జ్ పద్ధతిలో "బాల విజ్ఞాన తరంగిణి" పేరిట దేవులపల్లి వేంకటరామయ్య, ములుకుట్ల పేరి దీక్షితులు సహసంపాదకులుగా 1926లో ప్రచురించారు. అందులో 1. ప్రపంచ రాజ్యాల చరిత్ర, 2. షేక్స్పియర్ నాటక కథావళి, 3. మానవ జీవిత వృత్తాంతం మూడు భాగాలుగా ఉన్నాయి. గ్రంథపీఠికలో వారు

"నవలలు, నాటకములు, ప్రహసనములు, పలురకముల పద్యగ్రంథములు --- ఇవి ప్రస్తుతకాలపుటాంధ్రవాఙ్మయములో విశేషముగాఁగాన్పించుచున్నవి. కాని వాయుభూమ్యాకాశసముద్రములందు మనకు నిత్యానుభూతములై జరుగుచుండు సృష్టివ్యాపారములను, బ్రకృతివికారములను, జంతుతరుగుల్మలతాదుల యద్భుతజీవిత ధర్మములను సహేతుకముగఁ దెలుపుచు వ్రాసిన ప్రకృతి శాస్త్రగ్రంథములు మిక్కిలి తక్కువగా నున్నవి. అట్టి విషయములఁగూర్చి బాలురకును బాలికలకును సుబోధముగా, హృదయరంజకముగాఁ, జక్కని తేటతెలుఁగుమాటలతో వ్రాసిన పుస్తకము లంతకంటెను దక్కువగానున్నవి. బాలుర విద్యాగ్రహణకుతూహలమును జ్ఞానతృష్ణయును రేఁపుట కట్టి పుస్తకములేకదా కావలయును! సామాన్య ప్రకృతి సంబంధ విషయములఁగూర్చియు విపరీతాభిప్రాయములతోనున్న ప్రజల యజ్ఞతామూఢతాంధకారములను విరియఁగొట్టజాలునవియును అట్టిపుస్తకములేకదా!

కేవల ప్రకృతి శాస్త్రవిషయములనే యంటిపెట్టుకొని యుండక, పిల్లలకు రుచించు కథలు, వివిధ దేశచరిత్రలు మున్నగు నితరవిషయములకుఁగూడ వానితోపాటు మాపుస్తకములలోఁ దావొసంగెదము. రసగ్రహణశక్తి నుద్బోధించి పెంచి పిల్లలను మృదులహృదయులుగను ఉదారచిత్తులనుగను జేయుటకై, సుప్రసిద్ధకవీంద్రుల గ్రంథములనుండి చక్కనిపద్యముల నేటి మా పుస్తకములలోఁ బ్రకటింతుము. పుస్తకములిట్లు నానావిషయకములై యుండుటవలనఁ బఠితలకు విసుగుపుట్టదు. వారలలవఱచుకొనుజ్ఞానము సర్వతోముఖమై యుండును."

అని వ్రాసిన వాక్యాలు బాలవాఙ్మయరచయితలు ఏనాటికీ ఆదర్శంగా నిలుపుకొనదగిన వెలలేని విలువైన కట్టాణి ముత్యాల మూటలు. ఉపాధ్యాయతల్లజుడైన ఒక ఉపదేష్ట రచనాజీవితాదర్శం ఆ లక్ష్యనిర్దేశంలో ప్రతిధ్వనిస్తున్నది.

అచిరకాలంలోనే బాల విజ్ఞాన తరంగిణికి ప్రజాదరణ విరివిగా లభించింది. మళ్ళీ 1928లో ముద్రణకు నోచుకున్నది. నరసింహంగారు అందులోని షేక్స్పియర్ నాటక కథావళిని ఆ తర్వాత మరింత పెంపుచేసి రెండు సంపుటాలుగా ప్రచురించారు.

1930లో నరసింహంగారు జానపదవాఙ్మయం వైపు దృష్టిసారించి, బొకాషియో రచించిన గ్రిసెల్డాను మరియా ఎడ్జ్‌వర్త్ నవల ఆధారంగా 'గ్రిసెల్డా' అన్నపేరుతో ఆంగ్లంనుంచి అనువదించారు. మహాభారతంలో గంగాశంతనుల గాథను గుర్తుకుతెచ్చే చిత్రమైన మలుపులతో కూడిన అందమైన ప్రణయవృత్తాంతకథనం అది. ప్రేమ, త్యాగం, ఆత్మాభిమానం, అసూయ, పురుషాహంకారం, స్త్రీ సంయమనధోరణి మొదలైన భావాల లీలాఖేలనం ఆకర్షణీయంగా అమరింది. ఏదో అవిస్మరణీయమైన జీవనసందేశం ఉంటేనే తప్ప నరసింహంగారు రచనకు ఉపక్రమింపరని దీనివల్ల మరొక్కసారి విశదమయింది.

చివరి రోజులలో నరసింహంగారు నానావిషయకవిరచనములు అన్న వికీర్ణ వ్యాససంపుటిని ప్రకటించారు. దానికి గురుశిష్యసంవాదము అని ఉపశీర్షిక. 1936లో ముద్రితమయింది. పతనోన్ముఖ మవుతున్న విద్యావ్యవస్థను చూసి చింతాగ్రస్తుడైన ఒక ఉపాధ్యాయుని మనోధర్మం, యుగయుగాంతరానుగత కర్కశసమస్యల నుంచి పరిష్కారం కోసం పరివేదన ఆ వ్యాసాలలో ధ్వనిస్తాయి. నరసింహంగారి లలితమైన హాస్యధోరణికి కూడా ఈ సంపుటి నిదర్శకం.

విద్యాబోధనలోని ప్రమాణాలను భవిష్యద్దర్శనంతో పరికించినవారు కనుక నరసింహంగారు ఆనాటి గ్రాంథిక భాషావాదులలో అగ్రశేణికులయ్యారు. సారస్వత పరిషత్తుకూ, సూర్యరాయాంధ్ర నిఘంటువు నిర్మాణానికీ మూలస్తంబమై నిలిచారు. సంస్కారశుద్ధమైన గ్రాంథికమే తప్ప వ్యావహారికభాష ఆదర్శప్రాయం కాదని భావించినవారు కాబట్టి గిడుగు వారి బాలకవి శరణ్యం వ్యాసాలలో కొన్ని బాణాలు వీరిపైకీ దూసుకునివచ్చాయి. "ప్రహసనములు - పత్రికావిలేఖనములు" అన్నపేరిట వారు ప్రకటించిన సంపుటంలోని మొదటి వ్యాసం క్రొత్త తెలుగు తమాషాలో గిడుగు వారి వాదంపైని అధిక్షేపం, వారి **ప్రాఁదెనుఁగుఁ గమ్మ** వ్యాసాన్ని అధికరించిన వ్యంగ్య విమర్శ ఉన్నాయి. ఇందులోని సన్నాయి నొక్కులన్నీ వ్యావహారిక భాషావాదులను ఉద్దేశించినవి కావటం విశేషం కాగా ఈ గ్రాంథిక - వ్యావహారిక వాదాలను పక్కనొపెడితే, భాషాభిమానులకు మాత్రం ఇంత చక్కటి వ్యావహారికంలో వీరు రచనలు సాగించి ఉంటే ఎంతబాగుండేదో! అని అనిపించటం సహజం. ఈ ప్రహసనం ఉపక్రమణికే -

**దేఁవుడికి దణ్ణాలు! దేఁవుడికి దణ్ణాలు!**
**కొత్తతెనుగొచ్చింది! కోత్తెనుగు సచ్చింది!**
**దిక్కుమాలిన పాతతెనుగు పోతూ ఉంది**
**బతికాఁవ్‌రా! బాబు! బతికాఁవ్**
**"ఉప్మాలు"లే విహను "ఉత్తపీచు"ల్లేవు**
**బతికాఁవ్‌రా! బాబు! బతికావ్ రా!**
**చదవకుండా తెనుగు చచ్చినట్లొస్తుంది**
**రా కేం జేస్తుంది! రావడంలేదా!**
**ప్రాఁదెనుఁగుఁగమ్మంటి పాత్తెనుగు తొంగుంది**
**బతికాఁవ్ రా! బాబు! బతికాఁవ్ రా!**
**సంధులూ గిందులూ చచ్చుసూత్రాలన్ని**
**పోయాయ్! పోయాయ్! పోయాయ్‌రా!**
**మనభాషలో ఫెయిలు మాఁయఁవైపోయింది**

**మార్కులన్నీ మనవె! మరేఁవిటున్నాది!**
**బూతుమాటల్లేని పొస్తకా లన్నిన్ని**
**బారతా లవ్తాయి! పాఠాల కొస్తాయి!**
**చూడడం, చదవడం, చూపించడం, దిద్ది**
**తన్నడం, తిట్టడం, తప్పిపోయిందిరా!**
**ఇంత సులభబ్బాష యిహయెక్కడున్నాది?**
**దాన్ని తెచ్చిన వాళ్ళు దైవాలు! దైవాలు!**

అన్న అధిక్షేపంతో మొదలవుతుంది. "ఉప్మా" అంటే ఉపమ, "ఉత్తపీచు" అంటే ఉత్ప్రేక్ష అన్నమాట!

కొన్ని అక్షింతలు రాబోయే దురాగతపు రోజుల్లో తెలుగు భాషాబోధకుల దుఃస్థితిని కళ్ళకు కడతాయి:

"ఇహ తెనుగుదిద్దే మహానుభావులు, యీపంచకూళకషాయపు అవకతవకలన్నీ చూశి అనుభవించి తేలుకుట్టిన దొంగ ల్లాగు ఊరుకొంటారు. ఆ కాశిని తెల్లబిళ్ళలకోసంగాబోలు, యేవి తప్పులకింద తోశిపారెయ్యాలో, యేవి మంచివి కింద యెంచి మార్కులివ్వాలో తెలియకుండానే 70%, 80%, 90% మార్కుల వర్షము పిల్లలపైనిన్నీ, పిడుగుల వర్షము అమాయకపు తెలుగుభాషపైనిన్నీ కురిపిస్తారు.

మన తెలుగువాళ్ళ స్థితి ఇందులోకి దిగింది ఆఖరికి! యేమ్చెప్మన్నావు నాయనా!"

అని వరహాల్రావు బాధపడతాడు. ఈ వాక్యజాతంలోని క్రాంతదర్శిత పరిశీలనీయం. హాస్యపోషణకే అయితేనేమి గాక, ఇందులో ఆంగ్లాంధ్రాల మణిప్రవాళంలో యతిప్రాసలు లేని పద్యాలను వ్రాశారు. చివర ఉన్న "భలశ్రుతి" ఇది:

**శా, స్కూల్ఫైనల్తెలుగందు మార్కులు ఘనఁవ్, ఇంటర్ప్రవేశఁవ్ ధ్రువఁవ్**
**తప్పుల్రాశిన తప్పులంటు యెవడూ నోరెత్తకుం డుండడఁవ్,**
**పూర్వగ్రంథఁవులన్ని మూలబడడఁవ్, రావంటు - ఊమూల్గడఁవ్,**
**భాషంతా చెడదీశి కూచుని లబో లబ్బోయటం చేద్వడఁవ్.**

అని! ఈ క్రొత్త తెలుగు తమాషా ప్రహసనంలో వారు సంధించిన పదునైన బాణాలు కొన్ని గిడుగువారి భుజాలమీది నుంచి దూసుకుని వెళ్ళి గురజాడనూ, చివరికి సి.పి.బ్రౌను దొరను కూడా తాకటం విశేషం. విద్యాలయాలలో పతనోన్ముఖమవుతున్న తెలుగుభాష దుఃస్థితిని చూసి వారుపడ్డ ఆందోళనంతా ఇప్పుడు నిజమైనట్లే సంప్రదాయవాదులంటారేమో. దానిని గురించి ఎంతైనా వ్రాయవచ్చును. అధిక్షేపరచన కాబట్టి సరసమైన వ్యావహారికంలో వ్రాశారు.

నరసింహంగారి పట్టుదల గట్టిది. ఉపన్యాసాలిచ్చీ, వ్యాసాలు ప్రకటించీ వ్యావహారిక భాషావాదులకు సరిజోడుగా తమ సిద్ధాంతాన్ని తామూ సుస్పష్టంగా ప్రచారం చేశారు. దురత్యయమని తెలిసీ, లోకక్షేమార్థం కాలస్రవంతి కెదురీదారు.

కూచి నరసింహంగారు పాఠశాలా పదవీ విరమణ చేసిన తర్వాత పిఠాపురం రాజావారి ఆదరాన గౌరవవేతనం పుచ్చుకుంటూ శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాణంలో పాల్గొన్నారు. అనారోగ్యం పైకొని చేయాడనంత వరకు, ఆ సంపుటాలలో మొదటి భాగానికి పూర్తిగానూ, రెండవ భాగంలో కొంతమేర దాకానూ పనిచేశారు.

వారి సౌహృద్య సౌజన్యాలూ గొప్పవే. సమకాలికుల రచనావళికి పీఠికలు వ్రాసి, తప్పులు దిద్దిపెట్టి, ముద్రణకు సహకరించి, ఎంతగానో ప్రోత్సహించేవారు. వర్ణనరత్నాకరాది గ్రంథకర్త దాసరి లక్ష్మణస్వామిగారికి స్వీయచరిత్ర రచనలో తోడ్పడ్డారు. వ్యక్తి శీలం లాగానే భాష కూడా నిర్దుష్టంగా ఉండాలని పట్టుదల కలవారు వారు. ఆ విధంగానే తమ రచనా సర్వస్వాన్ని వెలయించారు.

ఆయన శిష్య సంపద దాచినా దాగేది కాదు. వారిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు అగ్రగణ్యులు. గురుదేవులను ఎంత గౌరవంతో కీర్తించేవారో!

పాపం! నరసింహంగారి జీవన హరివిల్లులో సంతాన వర్ణం లేకపోయింది. బంధువర్గంలో ఒక పిల్లవాడిని దత్తత తీసుకుని, గౌరాంగ మూర్తి అని పేరు పెట్టుకున్నారు. ఆ కుటుంబం గుమ్మడితీగెలా నలుదిక్కులకు కలయబ్రాకింది. ఆ కుటుంబ సభ్యులలో వారి మనుమల సౌజన్యం మూలాననే మునుపెన్నడూ లభింపని, 1914 నాటి అరుదైన వారి ఛాయాచిత్రాన్ని సంపాదించి, ప్రకటించే అవకాశం ఇప్పుడు సిద్ధించింది. నరసింహం గారి విశేషాలన్నీ తెలిసిన మనుమరాలు శ్రీమతి మైత్రేయి గారిని నా చిన్నప్పుడు, 1968లో చూశాను. ఆ కుటుంబం ఇప్పుడెక్కడున్నదో తెలియరాలేదు.

1940 అక్టోబరు 7వ తేదీనాడు వారు పరమపదించినప్పుడు కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు తమ పత్రికలో నాలుగు పుటల "శ్రీ కూచి నరసింహరాయ నిర్యాణస్మృతి"ని ప్రకటించి, వారి ఋణాన్ని కొంత తీర్చుకున్నారు. సంస్మరణ సభ రోజున చిత్తడి జల్లులు కురిశాయి. కావ్యకలానిధి పిశుపాటి చిదంబరశాస్త్రి గారు -

**చ. "ఒకనియమంబునందఁ దలయొగ్గుట నేర్చిన దాది గాఁగ నొం**
**డొక పథమందు వర్తిలక యుండెడివాఁడును, గూచి వంశవా**
**ర్ధికి శశియైనవాఁడును గతించె నృసింహుఁడు నా సుతుం"డటం**
**చకట! ధరిత్రి వర్షమను నశ్రువు లుప్పతిలంగ నేడ్చెడిన్.**

అని గుండెనీరుగా మిత్రస్మృతికి అంజలి ఘటించారు.

తక్కిన ఋణాన్ని పాఠకులే తీర్చాలి. వారి సేవాహేవాకాన్ని గురించి సమగ్రమైన విమర్శ ఇంతవరకు వెలువడలేదు. ఆంధ్ర రచయితలులో మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారొక వ్యాసం వ్రాశారు. జనమంచి సీతారామశర్మ గారు వీరి జీవితచరిత్రను ప్రకటించారట; నాకు లభింపలేదు. వారి ముద్రితగ్రంథాలనైనా సేకరించి ఎవరైనా విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేయిస్తే గతశతాబ్దిలోని ఎన్నో చారిత్రిక సాహిత్య విశేషాలు వెలుగులోకి వస్తాయి. ఆ నిష్కళంక కవితా తపస్విని తెలుగువారు మరచిపోకూడదని, వారి దివ్యస్మృతికి నివాళిగా ఈ వ్యాసాన్ని మీకు నివేదించాను.

***(అయిపోయింది)***




# మహాకవి శ్రీ గురజాడ

-డా.దూర్వాసుల వెంకట సుబ్బారావు

*(వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 2009 ఉగాది పోటీల్లో*

*ప్రథమ బహుమతి పొందిన వ్యాసం)*

**శ్రీ గురజాడ అప్పారావు గారు** (1862-1915) ఒక ద్రష్ట, సాహిత్య స్రష్ట, తాత్వికుడు. వీరిపై ఎన్నో ఆంగ్ల, తెలుగు రచనలున్నాయి. ఈ మహాకవి, మహాపురుషుని గురించి శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర, రమణారెడ్డి, సెట్టి ఈశ్వరరావు, డా.ఏటుకూరి ప్రసాద్, ఆచార్య మొదలి నాగభూషణ శర్మ, శ్రీ రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, డా.ఎస్వీ సత్యనారాయణగార్లు ఎంతో వ్రాసారు. సంఘ సంస్కరణలకు, స్త్రీ సమస్యలకు, దేశభక్తి ప్రభోదానికి, అందరికీ గ్రాహ్యమయ్యే వ్యావహారిక భాషోద్యమానికి శ్రీ గురజాడది గురుపీఠం. అనేక సాంఘిక సమస్యలకు, సంకల్పాలకు, పోరాటాలకు గురజాడ ప్రత్యక్ష సాక్షి. ఆయన చేపట్టిన మహత్తర సాంఘిక విప్లవాలకు సమరోత్సాహ సాహసి. తనదైన శైలిలో, నూతన ఛందస్సుతో ముత్యాల సరాల్ని ప్రసాదించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, సంస్థ శ్రీ గురజాడ. శ్రీ గురజాడ రచనలు భూత భవిష్యత్ వర్తమాన కాలాల్ని అధ్యయనం చేయించేయి. శ్రీ గురజాడ వారు మహనీయునిగా చిరకాలం వెలుగొందుతారు. వీరి సాహిత్యంలోని మచ్చుకి కొన్ని ఉదహరిస్తూ, శ్రీ గురజాడని శ్లాఘించి, వారి మహోన్నత భావాలను సింహావలోకనం చేసుకోవాలన్నదే ఈ వ్యాసం యొక్క ఉద్దేశం.

**జీవిత విశేషాలు**

కృష్ణాజిల్లా, గురజాల గ్రామవాసులగుటచే గురజాడ వారయేరు. అప్పారావుగారు విశాఖ జిల్లా, ఎలమంచిలి తాలూకా, రాయవరంలో, మాతామహుల ఇంట 1862, సెప్టెంబరు 21న జన్మించారు. తండ్రి వెంకట రామదాసు, తల్లి కౌశల్యమ్మ. రామదాసుగారు విజయనగరాధీశుల వద్ద రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసారు, వీరికి సంస్కృత భాషలో మంచి ప్రవేశముంది. అప్పారావుగారు చీపురుపల్లిలో కొంతకాలం చదివి, 1882లో మెట్రిక్యులేషన్ చేసి యఫ్.ఏ. 1882-1884లో విజయనగరం మహారాజ కాలేజీలో, తరువాత బి.ఏ. (1884-1886), ప్రాణమిత్రులు శ్రీ గిడుగు రామమూర్తిగారితో చదివేరు.

"కుక్కు" అన్న ఇంగ్లీషు పద్యం 1882లో, "సారంగధర" అన్న ఇంగ్లీషు పద్యకావ్యం 1883లో, "ఇండియన్ లీజర్ అవర్"లో, "చంద్రహాస్" అన్న వేరొక ఇంగ్లీషు కావ్యం రాశారు. వీటిలో "కుక్కు", "చంద్రహాస్"లు అలభ్యం. కలకత్తా నుంచి వెలువడే "రీస్ అండ్ రయ్యత్" పత్రికా సంపాదకులు శంభుచంద్ర ముఖర్జీగారు "సారంగధర"ని మెచ్చుకుని తన పత్రికలో రెండోసారి ప్రచురిస్తూ, అప్పారావు గార్ని మెచ్చుకున్నారు. "దేశ శ్రేయస్సు కోసరమూ, ప్రపంచ శ్రేయస్సు కోసరమూ పాటు పడడానికి సిద్ధపడాలి, మీరు రాద్దామనుకున్న

రాజకీయ పద్యకావ్యాన్ని.. జానపదగేయాలు వివిధ ఛందస్సులలో పద్యాలు రాయడానికి ప్రయత్నించండి" అని ఉత్తరాల్లో వ్రాసారు. ఇవి అప్పారావు గారి జాతీయభావాలకు, దేశాభిమానానికి, వ్యక్తిత్వానికి ప్రాతిపదిక వేశాయి. విజయనగరం కళాశాలలో 1884 ఏప్రిల్ నుంచి 1887 ఏప్రిల్ వరకు ఉపాధ్యాయులుగా, తదుపరి డిప్యూటి కలెక్టరు ఆఫీసులో హెడ్ క్లర్కుగాను, 1887 విజయదశమి నాడు విజయనగరం కళాశాలలో నాల్గవ లెక్చరరుగా చేరారు. ఇంగ్లీషు, వ్యాకరణం, సంస్కృతం, గ్రీకు, రోమను చరిత్రలు బి.ఏ, యఫ్.ఏ, విద్యార్ధులకు బోధించేవారు. అప్పారావుగారి ప్రతిభను ప్రిన్స్‌పాల్ శ్రీ చంద్రశేఖర శాస్త్రిగారు గుర్తించి చాలా ప్రోత్సహించేరు.

వీరికి 1885లో అప్పల నరసమ్మతో వివాహం జరిగింది. కుమార్తె లక్ష్మి నరసమ్మ 1887లో, కుమారుడు వెంకట రామదాసు 1890లో, కుమార్తె కొండయ్యమ్మ 1902లో జన్మించారు. తమ్ముడు శ్యామలరావు.

కాలేజీలో పనిచేస్తున్నప్పుడే శ్రీ ఆనందగజపతి మహారాజుగారితో అప్పారావుగారికి పరిచయమవటం, 1887లో కాంగ్రెస్ సభలో ఉపన్యాసన, 1889లో శ్రీ ఆనంద గజపతుల డిబేటింగ్ క్లబ్బులో ఉపాధ్యక్ష పదవి రావటం జరిగేయి. గ్రీకు రోమన్ గ్రంథ పఠనం వల్ల ఐరోపా దేశాల్లో సారస్వత విజృంభణము జరిగినా, హిందూ దేశంలో స్వభాషలలో ఎందుకు జరుగలేదని అప్పారావుగారు మధనపడ్డారు. దీనికి కారణం ఈ ఆంగ్ల బోధన, బోధనాపద్ధతి మనలోని స్వతంత్ర యోజనా శక్తికి దోహదం చేయటం లేదని, వాడుక భాష ప్రయోజనాలెన్నో ఉంటాయని గుర్తించారు. "కన్యాశుల్కం" మొదటి కూర్పు 1892లో ప్రదర్శించేరు. సంస్థానపు శాసన పరిశోధకునిగా 1896 జూన్ 5న నియమింపబడ్డారు. అంతకు ఇరవై రోజుల ముందు మహారాజుల భార్య వియోగం వల్ల, ఆంతరంగికులుగా శ్రీ అప్పారావుగార్ని వారు ఆదరించటం జరిగింది. వీరి సాన్నిహిత్యం వలన ఆనాటి సంఘాన్ని, ముఖ్యంగా వేశ్యా సమస్యలను, స్త్రీల సమస్యలను శ్రీ అప్పారావుగారు నిశితంగా పరిశీలించగలిగారు. వాటి ప్రాబల్యమే వారి మున్ముందు రచనల్లో ద్యోక్తమగును. వాడుక భాష మహోద్యమం శ్రీ జె.ఎ.ఏట్సు, పి.టి. శ్రీనివాస అయ్యంగారు, గిడుగు రామమూర్తిగారితోనూ 1906 లో "కొండు భట్టీయం", 1907లో "నీలగిరి పాటలు", 1909లో "కన్యాశుల్కం" రెండో కూర్పు, 1910లో సకల కులాలలతో సహపంక్తి భోజనం, 1910లో "ముత్యాల సరములు" ప్రచురణ, 1911లో "బిల్హణీయం" రెండవ అంక ప్రచురణ, "లవణ రాజుకల" ప్రచురణ, 1911లో మద్రాసు విశ్వవిద్యాలయం బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యత్వం, 1911లో వాడుక భాష గురించి ఆంధ్ర సాహిత్య పరిషత్తు స్థాపన, 1912లో "కన్యక", 1913లో "లంగరెత్తుము" రచనలు వీరి జీవితంలో ముఖ్యాంశాలు. శ్రీ గురజాడ సంగీత ప్రియులు. వీణ వాయించేవారట. వారి పాటలకు 'నాటిమాట' (అఠాణ, రూపక), 'లేవొకో మంత్రములు' (శంకరాభరణము, ఝంపె), 'చిత్తరువని చూడ' వారే స్వరాలు కూర్చుకున్నారు. వీరు 1915 నవంబరు 30ని స్వర్గస్థులయారు.

<u>విజయనగరాధీశులు, బాల్యవితంతులు, వేశ్యలు</u>

విజయనగర మహారాజు వారు అభినవ కృష్ణరాయలనబడే ఆనంద గజపతులు సంగీత సాహిత్యాల పక్షపాతి. కాలేజీ లెక్చరరుగా అప్పారావుగారు ఆనందగజపతులకు పరిచయమై, వారి ప్రతిభ వల్లనే ప్రభువులకు ఆంతరంగికులైనారు. విజయనగర సంస్థానపు డిబేటింగు క్లబ్ ప్రారంభించి దానికి ఉపాధ్యక్షులుగా అప్పారావుగారిని ఎన్నుకున్నారు. కన్యాశుల్కం పేరిట నరమాంస విక్రయం జరుగుతున్నదని, వీరేశలింగంగారు 1880లో స్పష్టీకరించేరు. ఇట్టి కన్యాశుల్కాన్ని మాపవలెనన్న దీక్షతో శ్రీ మహారాజావారు విశాఖ జిల్లాలో బ్రాహ్మణ కన్యాశుల్క వివాహాల పట్టీని తయారుచేయించారు. ఈ విషయంపై నిఘాయించి పరిశీలించిన అప్పారావుగారి పరిశీలనలో తేలినది: నమోదయిన వివాహాల సంఖ్య 1034 అందులో ఏడాది శిశువులుండటం, ఒక్కొక్కరికి 350-400 రూపాయలు చెల్లించటం అప్పారావుగారి పదాల్లో "ఘోరమైన పరిస్థితి, సమాజానికే సిగ్గుచేటు". మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబరుగా శ్రీ గజపతులు ఈ అవినీతిని అరికట్టాలి, స్త్రీలను ఈ బాధాకరమైన దాస్యం నుంచి విముక్తులను చేయాలని సంకల్పించి, బాల్య వివాహాలు నిషేధిస్తే కానీ కన్యాశుల్క వివాహాలు జరగవు అని ఒక బిల్లుని ప్రవేశపెట్టారు. అది వీగిపోయింది. కానీ శ్రీ అప్పారావుగారు అందరకూ తెలియు,

ఇండ్లలో వాడుకునే తేట తెనుగులో 1897కి మొదటి "కన్యాశుల్కం" ప్రచురించారు. ఈ అత్యుత్తమ నాటకం గురించి వేరే విన్నవించుకుంటా.

1896 జూన్ 5 న 'ఎస్టేటు శాసన పరిశోధకుని'గా అప్పారావుగారిని నియమించటంతో, అంతకు ముందుగా ఇరవై రోజుల ముందే భార్యావియోగంతో బాధపడుతున్న ఆనంద గజపతులకు అప్పారావు గారు సన్నిహితులయ్యారు. రాజావారి ఆశ్రయంలో నున్న వేశ్యలను వీరు నిశితంగా పరిశీలించారు. ఆనంద గజపతులు చేరదీసిన రామస్వామి రాజా వారితో జీవించటం, రాజావారి ఆదేశంగా రామస్వామి, ఆవిడ చెల్లెలు వెంకట స్వామిల యోగక్షేమాల బాధ్యత అప్పారావుగారు స్వీకరించారు. ఇది అప్పారావుగారి దృక్పథంలో పెద్ద మలుపు ప్రవేశపట్టింది. వేశ్య సమస్యల సంస్కరణకు అప్పారావుగారితో ప్రోద్బలం కలిగి డైరీలో "గడచిన ఆరేడు సంవత్సరాలలో నాకు పర్యాలోకన శక్తి, జీవన పరిజ్ఞానమూ అధికమయ్యాయి నా అయిష్టాలు, విరోధాలు, విద్వేషాలూ అదుపులో పెట్టుకొనడం నేర్చుకున్నా. అందరినీ సానుభూతితో చూడడానికి ప్రయత్నించాను. సాహితీపరునిగా జీవించదలచిన వాడికి సానుభూతే పునాది" అని వ్రాసుకున్నారు.

ఆనంద గజపతిగారికే కాక, వారి తల్లి అలక రాజేశ్వరి మహారాణి, రాజుగారి సోదరి రీవా మహారాణిగార్లకు అప్పారావుగారు రాజభక్తి పరాయణతో తలలో నాల్కగా సుమారు 25 సంవత్సరాలు సేవ చేసారు. అప్పారావుగారి సేవని గుర్తించి మహారాజుగారు "చర్మం కోసి ఇచ్చినా మీ ఋణం తీర్చుకోలేను. మా తల్లిగారికీ, అక్కగారికి తమరంటే పరిపూర్ణ విశ్వాసం ఉన్నది" అన్నారట. రాజదర్శనానికి వేచి ఉండే స్థలంలో సమావేశమైన పండితులు, కళావేత్తలతో శ్రీ గురజాడ చర్చించేవారు. అందుచే వారిని "కింగ్ ఆఫ్ బంక్" అని పిల్చేవారు.

**గురజాడ సాహిత్యం**

వీరి సాహిత్యానికి సంఘ సంస్కరణ, వ్యావహారిక భాష అన్నవి రెండు చక్రాలు. సుగమంగా చక్కని రాజమార్గంలో నడిచాయి. శ్రీ గురజాడ ఉద్ఘోషించిన "సాంఘిక అవినీతి క్రిములతో నిండిన దుర్భర దాస్యం నుండి మహిళలను కాపాడడానికి", "సమాజాన్ని అప్రతిష్టపాలు చేసే పరిస్థితిని కళ్ళ ఎదుట పెట్టి, నైతిక భావాల ఉన్నత ప్రమాణాన్ని, ప్రాచుర్యానికి తేవటం కంటే, సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేదీ ఉండదు" వారి రచనలన్నింటిలోనూ ప్రతిబింబిస్తుంది. అందుకే ఈ మహాకవి సంఘంలోని గుణదోషాలను పరిశీలించిన, సంఘ సంస్కర్త, ద్రష్ట. ఈ విషయాన్ని చర్చిద్దాము. "తెలుగు సాహిత్యానికి సంకెళ్ళు వేసి కడుపు మాడ్చడమా, లేక దానికి జవసత్వాల నిచ్చి, దాన్ని ఒక గొప్పనాగరిక శక్తిగా చేయడమా అనేది మనపై ఆధారపడి ఉంది" అని మద్రాసు విశ్వవిద్యాలయం నియమించిన సంఘంలో (1911-1915) సభ్యునిగా శ్రీ గురజాడ అభిప్రాయపడ్డారు. ఈ సంఘ తీర్మానం విద్యాభివృద్ధికి మేలు కాక కీడే చేస్తుందని తన అసమ్మతిని శ్రీ గురజాడ తెలియజేసేరు.

శ్రీ గురజాడ రచనలు సంఘ సంస్కరణకు, వాడుక భాషకు నాంది పలికేయి. "గ్రామ్యభాష దిక్కుమాలిన స్త్రీ. ఆమెను పండితులు నిష్కారణంగా దూషించి, అవమానించగా, కనికరించి ఫీజు లేకుండా వకాల్తా పట్టితిని", "నాది ప్రజల ఉద్యమం దానిని ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను" అని వాడుక భాష పట్ల తమ గౌరవాన్ని రచనల ద్వారా ప్రకటించిన భాషా ప్రవక్త శ్రీ గురజాడ. ఈ సందర్భంలో ఎన్నో వాగ్యుద్ధాలు జరిగాయి. దాంట్లో కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి, వావిల కొలను సుబ్బారావు, భోగరాజు నారాయణమూర్తిగార్లు సమరయోధులు. వ్యావహారిక భాషను "గ్రామ్య"మని, "కులట" అని, "లంజ సంతతి" అని భోగరాజు వారు మొదట్లో దూషించినా, తరువాత "తెనుగు శృంఖము లూడి, సుఖంబుగ మేడ మీద గూర్చున్నది, నూత్నకాంతి గనుచున్నది, హాయిగ నేడు సంచరిస్తున్నది" అని మెచ్చుకున్నారు. ఈ సాహిత్య సమరంలో "పాయక పాకశాసనికి భారత ఘోరరణంబు నందు నారాయణునట్లు" శ్రీ గురజాడకి శ్రీ గిడుగు రామమూర్తి గారి ప్రోత్సాహం వేయి ఏనుగుల బలాన్ని చేకూర్చింది.

శ్రీ గురజాడ రచనల్ని 1.నాటకీయం 2.కథానాత్మకం 3. విమర్శనాత్మకం 4. వ్యక్తిగతం గా శ్రీ శ్రీ విభజించారు వీరి రచనలు కన్యాశుల్కం(1897,1909ముద్రణలు), బిల్హణీయం(1910-11 అసంపూర్ణం), కొండు భట్టీయం(1934-35 అసంపూర్ణం). ముత్యాల సరములు (1910 దేశభక్తి, పూర్ణమ్మ, డామన్ పితియస్ వగైరాలు), లవణ రాజుకల (1911), కన్యక (1912), సుభద్ర (1913), కాసులు, మిణుగురులు, వాడుక భాష గురించి విమర్శన అసమ్మతి పత్రం (1914), నీలగిరి పాటలు (1907), దించు లంగరు (1914), లంగరెత్తుము (1915), వ్యక్తిగతమైన చెల్లా చెదిరిన డైరీలు, లేఖలు, నోట్సులు (అముద్రితాలు), శ్రీరామ విజయం (1901), రాజభక్తి ప్రదీపమ్ (1901) అన్న సంస్కృత కావ్యాలకు పీఠికలు, సారంగధర, చంద్రహాస, కుక్క, స్టూపింగ్ టు రైజు అన్న అలభ్యమైన ఇంగ్లీషు రచనలు ముఖ్యం.

ఇవ్వన్నీ ఈ మహాకవే ఆధునికాంధ్ర కవిత్వానికి మూలపురుషుడని, గద్యవాఙ్మయ ప్రవర్తకుడని నిర్వివాదంగా నిర్ణయిస్తాయి. పోగా పేటకో విగ్రహం, ఊరికో బాబా, స్వామీ, గురూజీ, అమ్మలతో కూడిన మూఢమత విశ్వాసాలు, స్వార్థమే అవతారంగా పుట్టిన నాయకులు, జాతిమత కుల విభేదాలని స్వలాభంకి ఉపయోగించుకుంటూ దేశ భక్తులమని ప్రగల్భాలు చెప్పే దాదాలు, వరకట్న పిశాచపు గుప్పిట్లో ఉన్న చదువుకున్న మూర్ఖులు నేడు మన సమాజాన్ని క్రుంగదీస్తుంటే, శ్రీ గురజాడ సాహిత్యం పునర్జీవితం చేయగలిగే పరమౌషధం. డా.ఎస్వీ సత్యనారాయణగారు అభిప్రాయపడ్డట్టు శ్రీ గురజాడ సాహిత్యం నేటికి రాబోయే తరాలకి ఆదర్శప్రాయం, అమూల్యం.

***(ఇంకావుంది)***




# మహాకవి శ్రీ గురజాడ

## -డా.దూర్వాసుల వెంకట సుబ్బారావు

*(వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 2009 ఉగాది పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన వ్యాసం)*

***వ్యావహారిక భాష***

"తెనుగు భాషను పెద్ద నాగరికతా సాధనంగా చెయ్యాలంటే, అనవసరంగా వ్యవహరింపబడుతున్న సంస్కృత పదాల నుండి తెలుగు భాషకు విముక్తి కలిగించాలి. పరిపూర్ణ వ్యవహారిక భాషను ప్రవేశపెట్టాలి.. ఒక గొప్ప రచయిత దాన్ని రాసి సృష్టించాలి. ఆ గొప్ప రచయిత కోసం మనం పునాదులు వేద్దాం" అని గురజాడ అభిప్రాయపడుతూ శ్రీ గిడుగు రామమూర్తి గారి నైతిక బలంతో వ్యావహారిక భాషోద్యమం చేపట్టుతూ "నాది ప్రజల ఉద్యమము. దానిని ఎవరిని సంతోష పెట్టడానికైనా వదులుకోలేను" అని తన ఆదర్శాన్ని అప్పారావుగారు డైరీలో వ్రాసుకున్నారు. ఈ విషయంలో తనను వ్యతిరేకిస్తూ, తూలనాడు పండితుల నుద్దేశించి ఇలా అన్నారు శ్రీ గురజాడ.

"పుస్తకంబులోని మాటలు
విస్తరించుచు, ననుభవ వమ్ముల
తత్వమెరుగక, శుకములగుదురు
వొట్టి శాస్త్రజ్ఞుల్."

శ్రీ గురజాడకి గ్రాంధిక భాష రానందువల్లనే రవీంద్రనాధ ఠాగూరుగారితో వ్యావహారిక భాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు వ్రాసేరని, ఆక్షేపించిన వారిని ఎదుర్కోటానికా అన్నట్లు ప్రబంధ శైలిలో 'సుభద్ర' అన్న పద్యకావ్యాన్ని 1913లో వ్రాశారు శ్రీ గురజాడ. సగర్వంగా "తెలుగులో నవ్యరీతులకు నూతన ప్రమాణాలకు ప్రయత్నించిన మొదటి కవిని నేనే. నా కావ్య కళ నవీనం, కావ్యయితి వృత్తాలు భారతీయం. కవితలో నేను ఉత్తమ ప్రయోజనాలను ఉపలక్షించాను, జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి, కథా, కవితా రూపంలో దాని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను" అని చెప్పుకున్నారు.

***కన్యాశుల్కము***

శ్రీ గురజాడ వారి మొదటి రచన కన్యాశుల్కము. నా దేవుడు గురజాడ అని వ్రాస్తూ, శ్రీ పతంజలిగారు ఆధునిక తెలుగు సాహిత్యానికి 'కన్యాశుల్కం' అమ్మ అన్నారు. ఇది ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆదికావ్యం, పెద్ద సంచలనం కలిగించింది. ఆచార్య మొదలి నాగభూషణ శర్మ, డా.ఏటుకూరి ప్రసాద్‌గార్ల సంపాదకత్వంలో కన్యాశుల్కము, నూరేళ్ళ సమాలోచన (933 పేజీలు, 183 విభాగాలు) వెలువడింది. కన్యాశుల్కము "అవినీతికరమైన విష్కిములతో కూడుకున్న దుర్భర బానిసత్వము నుండి దిక్కులేని మన స్త్రీలను కొందరిని రక్షించడానికి" కృతిభర్త ఆనందగజపతి మహారాజుగారి సౌజన్యంతో తమ "అల్పశక్తిని వినియోగించి" "ప్రజాస్వామ్యానికి గ్రాహ్యమయ్యే నాటకం"గా వ్రాశారు గురజాడ. "కన్యాశుల్కం వంటి నాటకం అంతర్జాతీయ భాషల్లో ఎందులోనూ లేదు; ఇంత మహత్తరమైన నాటక కర్త నభూతో నభవిష్యతి" అన్న అభిప్రాయాల్ని తెలియపరచేరు డా.ప్రసాద్. శ్రీశ్రీ "జీవితంలో లేనివి కన్యాశుల్కములో ఏవిలేవు? సంఘంలో ఎన్ని రకాల మనుష్యులు, మనస్సులూ ఉంటే అన్ని రకాలు కన్యాశుల్కంలో చూస్తామని", "కన్యాశుల్కం గొప్పది, జీవితమంత గొప్పది. సాహిత్యంలో వాస్తవికతను ఇంత సమగ్రంగా ప్రదర్శించిన నాటకం ఈనాటి మన దేశంలో లేనేలేదు. ఇతర దేశాలలో చాలా తక్కువగా ఉన్నాయి" అని ఉద్ఘాటించేరు. "గోథే, ఇబ్సన్ లాంటి రచయితాలో తులతూగే మేధావి. శూద్రకుని "మృచ్ఛకటికం" తరువాత వేయి సంవత్సరాలకు అలాంటి సృజనాత్మకమైన వాస్తవికతతో నాటకాన్ని ఇచ్చినవాడు గురజాడ అదే "కన్యాశుల్కం" అని శ్రీ శ్రీ నిర్ణయించారు. సార్వజనీన సార్వకాలీన విశిష్టత్వంతో రచ్చగెలిచిన వేమనవలె శ్రీ గురజాడ ఆధునిక సాహిత్య ప్రపంచంలో తెలుగు వారి తరపున ప్రతినిధిగా, ధ్రువతారగా నిలువగలిగినవాడు గురజాడ అని శ్రీ శ్రీ అభిప్రాయం.

కన్యాశుల్కంలోని మధురవాణి, బుచ్చెమ్మ, వెంకమ్మ, పూటకూళ్ళమ్మ మీనాక్షి, యోగిని, గిరీశం, కరటక శాస్త్రి, అగ్నిహోత్రావధాన్లు, వెంకటేశం సజీవపాత్రలు. సాంఘిక రంగంలో వాస్తవిక వ్యక్తులు వీరు. బాల్యవివాహాలు, పసిపిల్లల్ని వితంతువులుగా చెయ్యటం, కన్యాశుల్కం పైనే కాని కన్న బిడ్డ జీవితం పట్టించుకోని నరమాంసపు విక్రయదారులైన తల్లిదండ్రులు, తెలుగు దేశపు సాంఘిక పరిస్థితులను తెలియజేయు హాస్యప్రధానమైన వచన నాటకం ఇది. ఆనాటి సమాజంలోని కుళ్ళుని, జీవితాన్ని ఆధునికము చేయటం, నాగరికం చేయటం, దానికోసం సాహిత్యాన్ని ఉపయోగించటంలో అందె వేసిన చేయి శ్రీ గురజాడ. అందుకే వారిని రాచపాలెం చంద్రశేఖర రెడ్డిగారు "దీపధారి"గా గౌరవించేరు.

"కన్యాశుల్కము" సినిమా తీసేరు; ఆంధ్రలో ప్రతీ ఊర్లో ప్రజలు చూసేరు. కళాతపస్వి క్రియేషన్సు వారు మా టీవీలో 42 పాత్రలతోనున్న ఈ నాటకాన్ని 26 వారాలు చూపించేరు. కన్యాశుల్కంని ఇంగ్లీషులో యస్.యన్. జయంతి (1964), కన్నడంలో కె.కృష్ణయ్యంగార్ (1927), రష్యన్‌లో జడ్ యన్. పెత్రుని పేవా (1962), తమిళంలో ముదునూరు జగన్నాధరాజు (1964) తర్జుమా చేసేరు. తెలుగుదేశంలో వచన నాటకాలకు కన్యాశుల్కము శ్రీకారం చుట్టింది. ఆ తరువాతే "వరశుల్కం","కంఠాభరణం", "వరవిక్రయం" నాటకాలు వచ్చేయి.

కన్యాశుల్కము 1892లో మొదటి కూర్పు; 1909లో మలి కూర్పు. ఈ రెండింటికి చాలా తేడా ఉంది. ఈ సాధనలో దివినుండి భువికి భాషా సాహిత్యాలను అవతరనం చేసిన అపర బగీరధుడు శ్రీ గురజాడ అని శ్రీ సెట్టి ఈశ్వరరావుగారు పోల్చేరు. సుప్రసిద్ధ రచయితలు, ఆలోచనా పరులు శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు, శ్రీ అబ్బూరి రామకృష్ణరావు, శ్రీ శ్రీ పాద సుబ్రహ్మణ్యం, శ్రీ ఆరుద్ర, శ్రీ ఏటుకూరి ప్రసాద్, శ్రీ మొదలి నాగభూషణ శర్మగారు కన్యాశుల్కం నాటకం ఒక మకుటం అని భావించేరు. "భావంలో, భాషలో, రచనలో, రామణీయకంలో (అప్పారావుగారు) పాల్కుర్కి వానిని తలపిస్తున్నారు" అన్నది గుర్తుచేసేరు శ్రీ నిడదవోలు వెంకట రావుగారు.

కన్యాశుల్కంలో"మధురవాణి" పాత్రని వర్ణించలేం. కన్యాశుల్కంలో "హీరో ఎవరంటే మధురవాణే. శ్రీ గురజాడ అపూర్వ మనీషకు (మేధస్సు)కి తార్కాణం. ఆమెని ప్రవేశపెడుతూనే, ఆమెచే ఒక ఆణిముత్యంలాంటిది. "మొగాడికయినా ఆడదానికయినా నీతి ఉండాలి" అనిపిస్తారు శ్రీ గురజాడ. అలాగే వేరే చోట "చెడని వారిని చెడగొట్టకూడదు, మంచివారి ఎడల మంచిగానూ, చెడ్డవారి ఎడల

చెడ్డగానూ ఉండమని" ఉపదేశం చేయించారు శ్రీ గురజాడ. మధురవాణి పాత్ర ఎలా ఇంత చక్కగా రచించారన్నది గుర్తించి ఒకసారి గిడుగువారు అప్పారావు గార్ని "వేశ్య ఇంటికి ఎప్పుడైనా వెళ్ళావా నిజం చెప్పు?" అని ప్రశ్నిస్తే "వెళ్ళాను.. మూడు నాలుగుసార్లు... వెళ్ళకపోతే నాకెట్లా తెలియగలదు? వారి ప్రసంగరీతి, వారి అభినయం, వారి పరియాచకం అవీ తెలుసుకోడానికే వెళ్ళేను. అంతేకాని మరో అందుకు కాదు.. ఒక వేశ్య "వేశ్యకు మాత్రం నీతి లేదనుకున్నారా?" అందిట. అప్పుడే నా మధురవాణి పాత్ర ఎట్లా పోషించాలో ఆలోచించాను" అన్నారట అప్పారావుగారు. కన్యాశుల్కములో గిరీశం పాత్ర కూడా చాలా విశిష్టమైనది. "నెపోలియన్ ఆఫ్ యాంటినాచ్" అని "స్త్రీ సుఖముల ఎడల విముఖత" ఉన్నట్లు నటిస్తాడు. కానీ మధురవాణిని ఉంచుకుంటాడు, పూటకూళ్ళమ్మని కూడ మరిగాడు. అబద్ధాలు, గొప్పలు చెప్పుకుంటూ బండివాడికి సహితం నేషనల్ కాంగ్రెసుపై రెండు గంటలు లెక్చరిస్తాడు. బాల్య వితంతువు బుచ్చెమ్మని (ఆస్తికోసం) పెండ్లి చేసుకుంటాననటంతో తన నిజస్వరూపాన్ని సౌజన్యారావు తెలుసుకోగా "కథ డామిట్ అడ్డం తిరిగింది".

***బిల్హణీయం***

ఇది సంస్కృతములోని "బిల్హణ చరిత్రమ్"ని తెనిగించి, దానిలోని కర్ణ మహారాజునకు ఆనందగజపతుల సజ్జత్వం, వినయం, శాంత స్వభావము, నిగర్వము, మృదుభాషణం అమర్చారు శ్రీ గురజాడ. ఈనాటకంలో విదూషకునిచే "హద్దుమీరిని మనిషి ఒకడుంటేనే కాని హద్దు యొక్క గుణాగుణములు తెలియవు. మనవలె ఉచ్చావస్థలో నున్న వారిని, స్వేచ్ఛగా తిట్టగలిగిన వారిని వకరిని, అచ్చుబోసి వదలితే గాని మనసు గూర్చి లోకం ఏమనేదీ మనకు తెలియబోదు" అనిపించారు గురజాడ. ఇందులో 12 వ శతాబ్దివాడైన బిల్హణుని, ప్రబంధ బాణీలో కాక ప్రస్తుత కాలం వానిగాను, "ఉదాత్త గంభీర భావాల వ్యక్తీకరణకు వాడుక భాష అన్ని విధాల యోగ్యమైనదని" శ్రీ గురజాడ నిరూపించేరు. ఈ నాటకంలో రెండంకాలే ప్రచురించేరు (1910, 1911). అలాగే అసంపూర్ణంగా ఉండిపోయింది ఈ రచన.

***కొండు భట్టీయం***

శ్రీ గురజాడ వ్రాసిన మూడు నాటకాల్లో "కొండు భట్టీయం" "కన్యాశుల్కా"నికి కవలబిడ్డ. ఇందులో కొండుభట్లు వైదిక సాంప్రదాయకుడైనా, చేసే పనులు హీనాతి హీనాలు. కొండుభట్లు తనకి అనుగుణంగా వర్తించే సూక్తులు వర్ణిస్తాడు "దేవతలు, బ్రాహ్మలు చేసే పనులు తప్పు పట్టకూడదు. ఈ రోజుల్లో మంత్రోపదేశాలకు తపిస్తున్న వారిలాగున మంత్రోపదేశంతో "విద్యా ఐశ్వర్యములు, ముక్తి కూడా లభిస్తాయి. పాపాలు ఎగిరిపోతాయి" అని మహోపదేశం చేస్తాడు. స్వార్థం కోసం తన మేనకోడల్ని (పార్వతి విధవ) ఒక వ్యభిచారికి సేవకి నియోగిస్తాడు. ఇతని అన్నకొడుకు వెంకన్న మూఢ విశ్వాశాలకు పుట్ట. బ్రహ్మ సమాజం, దివ్యజ్ఞాన సమాజం, హిందూమత ధర్మం వారి పోకడలు సంఘసంస్కర్త గిరీశం చేత చెప్పిస్తారు గురజాడ. ఈ గిరీశం చేత "డామిట్! ప్రాణమైనా ఇచ్చెయ్యాలి గాని రిఫారం విషయమై నదురూ బెదురూ ఉండకూడదు. లేకుంటే మనదేశం బాగుపడేదెట్లు. మనకి బంగళీ వాళ్ళలాగా పరువు ప్రతిష్ఠ వచ్చేదెట్లు"? "నిష్కల్మషమయిన మనస్సు అవ్యాజమయిన భూతదయా ఉంటే ఏ మతమైనా సమ్మతమే" నని, మతాలు అంతర్భేదాలు, ఆధునిక షణ్మతాలు గురించి ఒక గట్టి ఉపన్యాసం ఇప్పించేరు. ఇందులో దివాన్ బహద్దూర్ రాజారాం చేత హిందూమతంలోని మూఢనమ్మకాలు, అవక తవక ఆచారాలను చెప్పించి వారిని సంస్కార నిర్వాహకులుగా చిత్రించారు శ్రీ గురజాడ. వీరేశలింగంగారిని దృష్టిలో నుంచుకుని మాధ్వయ్య అనే ఒక సంస్కర్తను, శ్రీ రఘుపతి వెంకట రత్నం నాయుడుగారిని స్ఫురింపజేసే లాగున కేశవరా(నా)యుడు పాత్రల్ని సృష్టించారు.

ఈ కొండు భట్టీయంలో మంజువాణి అనే వేశ్య పాత్ర ఉంది. కన్యాశుల్కంలో మధురవాణిలాగే మాటకారి. విటుడిగా వేంచేసిన భీమారావు పంతులతో "ముక్కోటి దేవతలు స్వర్గంలో ఉంటే భూమ్మీద దేవతలు బ్రాహ్మలని.. వేశ్య ఇంటికి అనుగ్రహించి వేంచేసిన భూసురోత్తముల్ని కొలుస్తున్నాను" అంటుంది. అలాగే "వేశ్యల ద్రవ్యం పాపిష్టిది" అంటూ తన వృత్తిమీద విరక్తి వ్యక్తపరుస్తుంది. "సంస్కర్తహృదయం" కథానికలో గురజాడ ఇదే విరక్తిని సరళ ద్వారా సూచించేరు.

<u>ముత్యాల సరములు</u>

ప్రకృతి సత్యాలను తనదైన శైలిలో శిల్పంలోనూ, ఛందస్సులోనూ, భాషలోనూ మార్చుచేసిన వర్డ్స్‌వర్తు, పద్యనడకలో సంగీత మాధుర్యాన్ని స్ఫురింపజేసే టెన్నిసన్, మానవుడే తనకు మానవనీయుడని, మానవ నైజంలో స్వతంత్రేచ్ఛను కీర్తించిన రాబర్టు బర్న్స్ కవులు అప్పారావుగారికి అభిమాన కవులు. శంభుచంద్ర ముఖర్జీగారి 1884 సూచనతో ఈ ఆంగ్లకవుల ప్రయోగాల్ని దృష్టిలో ఉంచుకుని, ఒక నూతన ఛందస్సు యక్షగానం, పార్సీ గజల్ నడకలోను తెలుగు కవితల త్రోవని మార్చి సొంపైన ముత్యాల సరములను 1910లో ప్రచురించేరు. ప్రతి పద్యంలోని 4 చరణాలలో, మొదటి మూడింటిలో 14 మాత్రలు, ఆఖరి చరణంలో వీనుల విందుగా ఉండటానికి పార్సీ గజల్ వలె ఏడు నుంచి పధ్నాలుగు మాత్రలున్నాయి. ఉదాహరణకు గుత్తునా ముత్యాల సరములు (u1u uu1 11 11= 212 2214)14 మాత్రలు. దేశమును ప్రేమించుమన్నా (14 మాత్రలు). ఆఖరి చరణంలో 12 మాత్రలు. పుత్తడి బొమ్మ పూర్ణమ్మలో మొదటి మూడు చరణములలో 14 మాత్రలు, ఆఖరి పాదంలో 9 ఉన్నాయి.

ఆదికాలంలో తిక్కన, మధ్య కాలంలో వేమన, ఆదునిక కాలంలో గురజాడ మహాకవులని శ్రీశ్రీ అభిప్రాయపడ్డాడు. ఆధునికాంధ్ర కవిత్వానికి మూలపురుషుడు, మహాకవి గురజాడ. ముత్యాల సరములలో క్రొత్త ఛందస్సుని దేశానికి ప్రసాదించిన దాత. ఈ క్రొత్త ఛందస్తులో కొన్ని మచ్చు తునకలు ఉదహరిస్తాను. ఆనాడు తిక్కనగారు

"తెలుగు కవిత్వం జెప్పం
దలచిన కవి యర్థమునకు దగియుండెడు
మాటలుగొని వళులుం బ్రాసలం
బోలు నిలువక యొగిని పులిమ చొచ్చుట చదువే".

అంటే శ్రీ గురజాడ తన క్రొత్త ఛందస్సుని మెచ్చుకోనివారి గురించి

"మెచ్చనంటూ వీవు నీవిక
మెచ్చకుంటె మించి పాయెను
కొయ్య బొమ్మలె మెచ్చు కళ్ళకు
కోమలుల సారెక్కునా?"

అని ప్రశ్నించారు. అలాగే వేమన సూచించిన

"ఉర్విజనుల కెల్ల నొక్క కంచము బెట్టి
పొత్తు గలిపి కులము పొలయజేసి
తలను చేయిపెట్టి తగునమ్మ జెప్పరా
విశ్వదాభిరామ వినురవేమ.

వర్ణ భేదాలను మాపు చేయాలంటే, గురజాడ ఇలా అన్నారు.

"మొన్న పట్టణమందు ప్రాజ్ఞులు
మొట్టమొదట మెట్టు యిది యని
పెట్టినారొక విందు జాతుల
జేర్చి వినవైతే"!

"మీ పేరేమిటి"లో అప్పారావుగారడిగిన ప్రశ్న గుర్తించండి.

"దేవుడు చేసిన మనుషుల్లారా
మనుషులు చేసిన దేవుళ్ళారా
మీ పేరేమిటి?
దేవుడెకడొ దాగెనంటూ
కొండకోనల వెతుకులాడే
వేలా?
కన్ను తెరిచిన కానబడడో?
మనిషి మాత్రుడి యందు లేడో
ఎరిగి కోరిన ఈడో
ముక్తి"!

మానవుడే మహనీయుడన్న ఇదే తత్వాన్ని విశ్వకవి వేమన ఈ విధంగా ఉద్భోదించేరు.

"దేవుడనగ వేరు దేశమందున్నాడె?
దేహితోడ కలసి దేహమందు
వాహనంబులైదు వడితోలుచున్నాడు
విశ్వదాభిరామ వినురవేమ".

***దేశభక్తి***

ఆ రోజుల్లో ప్రజల్లో ఆంగ్లపాలన పట్ల నిరసన, స్వాతంత్ర్యకాంక్ష, దేశభక్తి కలిగించటంలో చాలామంది కవులు కృషి చేసేరు. సంస్కరణాభిలాషి శ్రీ గురజాడ సాహిత్యం ద్వారా మానవతావాదంతో కూడిన దేశభక్తి నుద్భోదిస్తూ శ్రీ గురజాడ, సామాజిక స్పృహని ఇలా బోధించేరు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
ఒట్టిమాటలు కట్టిపెట్టోయి
గట్టిమేల్ తలపెట్టవోయి"

"దేశాభిమానం నాకు కద్దని
ఒట్టి గొప్పలు చెప్పుకోకోయి
పూనియే దైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయ్."

"దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్"
"ఎల్లదేశాల్ కమ్మవలెనోయ్,

దేశి సరుకుల నమ్మవలెనోయ్"

మహాకవి శ్రీశ్రీ ఈ దేశభక్తి గేయం సమస్త ప్రపంచ మానవుల జాతీయ గీతం, రామాయణ భారతాది ఇతిహాసాలకున్న విలువ ఈ ఒక్క గీతానికే ఉందనిన్నీ, "భగవద్గీత"కు గల ప్రత్యేకస్థానం ఉంది గురజాడ "దేశభక్తి" గీతానికి, ఒక కాలానికి, ఒక స్థలానికి పరిమితం కాని సందేశం ఇచ్చేది ఈ గీతం అన్నారు. ఈ గీతమే తరువాతి కాలం వారైన శ్రీ చిలకమర్తి నరసింహంగారిలో విదేశ పాలనలోని కష్టాలను ఇలా స్ఫురింపజేసింది.

"భరత ఖండంబు చక్కని పాడయావు! తెల్లవారలు గడుసరి గొల్లవారు హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ! బతుకుచున్నారు మూతులు బిగియగట్టి"

ఆల్ థీయస్టు కాన్ఫరెన్సులో సరోజినీ దేవి ఉపన్యాసం విని శ్రీ గురజాడ దేశభక్తితో ఇలా స్పందించేరు. "రాజకీయ విముక్తికి ఏది వాస్తవికమైన ప్రాతిపదికో, ఆ ఆదర్శాన్ని ఆమె విప్పి చెప్పింది. అదే సోదరత్వమనే ఆదర్శం"

***<u>సంఘసంస్కర్త</u>***

స్త్రీ ఉద్యమంతో పాటు మహాకవి గురజాడ ఆనాటి సమాజాన్ని నాశనం చేస్తున్నది. కులభేదాలని గుర్తించి, తెలుగు వారిలో యుగపురుషుడు వీరేశలింగం పంతులుగారి వలె సంఘ సంస్కారానికి నడుం కట్టేరు. 1910లో నానా వర్ణ సహపంక్తి భోజనంలో పాల్గొనటమే కాక, ఇలా వ్రాశారు.

"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచియన్నది మాలయైతే
మాలనే అగుదున్"
"కులము లేదట ఒక్క వేటున
పసరముల హింసించు వారికి
కులము గలదట నరుల వ్రేచెడి
క్రూర కర్ములకున్"

మన వర్ణ ధర్మం ఎంత అధర్మమైనదోనని ఇలా ప్రశ్నించారు గురజాడ.

"మలిన దేహుల మాలలనుచును
మలిన చిత్తుల కథిక కులముల
నెసవొసంగిన వర్ణ ధర్మ
మధర్మ ధర్మంబే"

దురహంకారంతో ప్రవర్తించే పురుషులకు బుద్ధి చెప్పేలా "స్త్రీలు మేలుకోవాలి, ఎదిరించాలి, తిరగబడాలి, మానవత్వం ఆమెలో అధికం. ఆడది అబలకాదు.. ఫిడేలో, వీణో వాళ్ళ చేతికిచ్చి వినండి. మిమ్మల్ని గంధర్వ లోకాలు తిప్పి తీసుకు వస్తారు" అని 'మాట మంతి'లో క్రిందటి శతాబ్దములోనే ఉత్తేజ పరచేరు ఈ మార్గదర్శి.

పూర్ణచంద్ర ఛటోపాధ్యాయుల (1877) "మధుమతి" తొలి భారతీయ కథ.

గురజాడవారి "దిద్దుబాటు" మన భారతీవనిలో రెండవది; తెలుగు భాషలో మొదటిగా ప్రసిద్ధి పొందటం, శ్రీ తల్లావఝుల శివశంకరశాస్త్రిగారు చెప్పినట్లు తెలుగులో వెలుగు బయల్దేరటం ప్రారంభమైంది. "తలుపు తలుపు" అంటూ ఈ కథని ప్రారంభిస్తూ

తెలుగులో ఆధునిక కథానికకు తలుపుల్ని శ్రీ గురజాడ తెరిచారు. ఈ కథలో వేశ్యాలోలుడైన తన భర్తకు బుద్ధివచ్చేటట్లు కమలుని చేసింది. ఈ కథపై వ్యాఖ్యానిస్తూ డా. వేదగిరి రాంబాబు "ప్రాచీన సాహిత్యానికి నన్నయ్య ఎలాంటివారో, ఆధునిక సాహిత్యానికి గురజాడ అలాంటివారని" గుర్తించేరు.

"పుత్తడిబొమ్మ పూర్ణమ్మ"లో కాసుకులోనై తల్లీ తండ్రీ నెనరూ న్యాయం విడనాడి" కాటికి కాళ్ళు చాచుకున్న ముసలి వాడికిచ్చి ముడివేయటానికి ప్రయత్నిస్తారు. పూర్ణమ్మ దుర్గపూజకు వెళ్ళి

"కన్నుల కాంతులు కలువలు చేరెను
మేలిమి జేరెను మేనిపసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ"

ఇది ఆనాటి అప్రతిష్ఠపాలైన హిందూ సమాజంని కరుణ రసాత్మక గేయంగా చిత్రించారు. ఈ కథ చదివిన ప్రతీవారు "బలబల కన్నీ" రోడిస్తారు.

ఇలాగే "కన్యక"లో రాజు ముధాంతకు బలి కాబోతూ సెట్టి కూతురు

"పట్టమేలే రాజు అయితే
రాజునేలే దైవముండడొ?
పరువు నిలపను పౌరుషము మీ
కేల కలగదొకొ?

అని హెచ్చరించి, కడకు మంటలో దూకుని.

"కాసులు" అన్న ఖండకావ్యంలో నవ్య సాహిత్యంలో ప్రేమ గురించి

"ప్రేమనిచ్చిన, ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును"

శ్రీ గురజాడ కవిత్వం అగాధమనీ, వారి రచనలన్నీ పోయినా భగవద్గీతకు సాటియైన "దేశభక్తి" గీతం ఆయన్ని ప్రపంచ కవుల్లో ఒక్కడుగా లెక్కింపజేసి మహాకవి అని ఋజువు చేస్తుందని శ్రీ శ్రీ అభిప్రాయపడ్డారు. శ్రీ శ్రీ ఉద్దేశంలో శ్రీ గురజాడ మహాకవి రవీంద్రుని కన్న గొప్పవాడు. ప్రేమచందు, నల్లతోళు కవులు శ్రీ గురజాడ ముందు నిలువలేరని శ్రీశ్రీ అన్నారు. ప్రపంచ సాహిత్యంలో శ్రీ గురజాడ నోబెల్ బహుమతికి ఎంతో అర్హులని వెనుకటికి నేనొక వ్యాసం వ్రాశా.

శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రులు వారు, శ్రీ గురజాడను 'గురజాడ వాల్మీకి' అని, శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు 'స్వయం జ్యోతి', 'ప్రథమాంధ్ర రచనాబ్రహ్మ' అని పరిగణించేవారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అప్పారావుగారి గురించి "మనం మరచిపోతే అది చాలా దౌర్జన్యంలో చేరిపోతుంది"

శ్రీ శ్రీ ఇలా వ్రాస్తే

"అడుగుజాడ గురజాడది
అది బావికి బాట
మనలో వెధవాయత్వం
మరపించే పాట"

శ్రీ ఆరుద్ర

"అడుగుజాడ గురజాడది
అది మరచిన పూట
వెధవాయత్వం తమలో
వేసుకొనును పీట"

అడిగిన వెంటనే ఆంధ్రభూమిలో ప్రచురించబడ్డ కొన్ని వ్యాసాలను దయతో పంపిన పత్రికా సంపాదకులు శ్రీ డాక్టరు ఎమ్.వి.ఆర్ శాస్త్రి గారికి అనేక ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

***(సమాప్తం)***




# నాకు తెలియని నా 'నారు'

ఎమ్వీయల్‌గారి అబ్బాయి

## ప్రోలోగ్



స్వర్గీయ ఎమ్వీఎల్

**"వీడి పుస్తకాలకి అట్టలు వేసి పరుపు కింద పెట్టాగానీ** – కాస్త పేరూ క్లాసూ రాసిపెడుదురూ.." ఓ రోజు పొద్దున్నే నన్ను స్కూల్‌కి బట్వాడా చేసే హడావిడిలో అమ్మ నానారికి చెప్పిన పని!

వేసంగి శలవల తర్వాత, భళ్ళున బళ్ళు తెరిచే రోజుల్లో వచ్చే ఈ 'అట్టల'తద్ది హడావిడీ అందరికీ సుపరిచితమే!

కొత్త పుస్తకాలకి అట్టలు వేసి రాత్రంతా పరుపుల కింద బజ్జో పెట్టి నిద్దర్లేచాక ఎంచక్కా పేర్లు రాసి వగైరా కార్యక్రమాలతో అందరూ ఈ పండగని ఆనందోత్సాహాలతో జరుపుకున్నవారే.

అంచాత ఆ పూట పండగ అదీ!

అమ్మ చెప్పిన పనికి – నానారి నుంచీ 'సరే' అని గానీ 'కాదూ' అని గానీ సమాధానం రాలేదు. 'రాదూ' అని మా అందరికీ తెలుసు.

ఎంచాతంటే –

నానారు ఇంటో ఉన్నంతసేపూ మా ఇల్లు 'శంకరాభరణమే'! (ఆనక 'యమగోల' అది వేరే సంగతి) మిగిల్న కారెక్టర్ల డైలాగులే తప్ప –

శంకరశాస్త్రి డైలాగులు సినిమా అంతా కలిపి ఓ పుంజీడే! మహా అయితే తల తాటించడం లేపోతే – ఓ పాట ఎత్తుకోడం! గంధర్వలోకంలో విహరించడం!

నాదైతే అల్లురామలింగయ్య కన్నా యమా ధైర్యస్థుడి కారెక్టరు! అంచాత వణికిపోడానికి ఓ వీసం తక్కువగా ఉన్న రసం వెలగబెడుతూ – పుస్తకాలు పట్టుకుని నానారి దగ్గిరకెళ్ళాను. పెన్ను తీసుకుని దాదాపు రాసేయబోతూ – చిన్న సందేహం వచ్చి – నానారు నన్నడిగిన ప్రశ్న –

"అవునూ – నీ పేరేంటీ?"

"......."

అదీ నానారితో నా పరిచయం!!

నానారికి బతకడం చేతకాదని నా ప్రగాఢ విశ్వాసం!!

పైసలు మిగల్చని పాతాల పంతులుజ్జోగం -

సినిమాల్లో ఉచిత సేవలూ -

గాల్లో కలిసిపోయిన ప్రసంగాలూ -

మిత్రులకీ శిష్యులకీ ధారాదత్తం చేసిన థీసిస్సులూ యశస్సులూ -

ఆరోగ్యం పట్టించుకోకుండా సాహిత్య కార్యక్రమాలంకారాలూ -

వీటికి పై సంగతి..

పెళ్ళాం పిల్లలతో గడిపేంత తీరికలేని విశ్రాంతీ -

(మన్లో మన మాట.. నా ఒళ్ళు యావత్తూ మండుటకు అసలు కారణం చివరాఖరి పాయింటే!)

ఆయన గంధర్వ లోకానికి హడావిడిగా పెట్టే బేడా కట్టే సమయానికి - అదేదో సిన్మాపాటలా

"అప్పటికింకా నా వయసు నిండా పదహారే.."

ఏం అంచాత -

"కుడుకూ బయం బత్తీ ఉండక్కరా!

మిగిల్న గోపాళాల్ని చూశావా!

బడికి తీసికెళుతూ, హోం వర్కు చేసి పెడుతూ నడ్డిమీచ్చంపేసి చదివిస్తూ -

(వాస్తుది డేంజరనుకో.. వాపోతేనే బెష్టు)" అని బుడుగు భాషలో - లోపల్లోపలే ధైర్యంగా సణుక్కుంటూ ఉండేవాడిని!

నా పదోతరగతిలో నానారు పోయాక -

చదివిన పుస్తకాల వల్లో -

బట్టీ పట్టిన సినిమాల వల్లో -

ఘబా ఘబా ఉజ్యోగం సంపాయించేయాలన్న నిశ్చయానికొచ్చేశాను. మా ఊళ్ళో ఉన్న బోధి చెట్టుకింద కూచోగా కూచోగా -

ఓ సాయింత్రం పూట జ్ఞానోదయం అయింది. తొందరగా ఉజ్యోగం రావాలంటే - పాలిటెక్నిక్ చదివేడవే అని!!

(ఓ పెద్దాయన చెప్పినట్టు 'జ్ఞానోదయం' అంటే - తెలుగులో 'తెలివి తెల్లార్టంట'!!)

దేవతలూ వాళ్ళూ బాగ్రుండ్‌లో కూడా చెప్పేశారు!

మరంచాత -

రేయింబగళ్ళూ చదివేసి (నవల్సులూ, సినిమాల్సులూ) ఎంట్రన్సు గేటు దూకి తణుకు పాలిటెక్నిక్‌లో చేరిపోయా - ఎవరూ చూడకుండా!

మేం చేరేప్పటికి వెళ్ళిపోవాల్సిన ఫైనలియర్ వాళ్ళు కాలేజ్ మీన బెంగెట్టుకుని -

"పోనీ ఇంకో ఆర్నెల్లుంటాం లెద్దూ" అన్నార్ట - పుట్టిల్లొదల్లేని కొత్త పెళ్ళికూతుళ్ళలాగా! అంచాత ప్రేమలు ఎక్కువై, రూములు తక్కువై - మా కొత్త కొత్త గొర్రెల మందకి కామన్ హాలే మకాన్ అన్నారు అందాకా.

ఇంకేవుందీ - సీనియర్లకి పండగన్నర. ఓలుసేలుగా అందరూ ఒకే చోట దొరుకుతారు - 'రాగింగ్ చేసుకుందాం రా' అని మా విడిదికి విచ్చేశారు

ఈ ప్రక్రియ కూడా సినిమా తల్లి పుణ్యావా అనితెలుసుకున్నదే గాన -

ఆ యొక్క పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టయి -

"దేవుడా! రక్షించు నా దేహాన్ని" అనుకున్నా (తణుకులో తిలకామృతం కురవడం సహజమేగా) ఇంతలో ఓ గ్రూపు నాకేసి రానేవచ్చారు -

"ఏ ఊరు తమ్ముడూ మంది?"

"నూజివీడు" భయం + వణుకూ +తణుకూ

"శామ్యూలూ - మీ ఊరోడ్రోయ్", గుంపులోనున్న ఓ అన్న - మరో మూలనున్న ఇంకో అన్నకి గావుకేకేసి వార్తా ప్రసారం చేశాడు.

సదరు శామ్యూలు - "జననీ జన్మ భూమిశ్చ..." అని ఎంటీవోడిలా పాడుకుంటూ నా దగ్గరకొచ్చేశాడు.

"ఎవరి తాలూకూ?"

"ఎమ్వీయల్ గారబ్బాయిని"

"మా గురువుగారబ్బాయిరోయ్! ఎవరూ ఏమనకండి! నువ్వు పెట్టే బెడ్డింగూ పట్టుకు నా వెనకొచ్చేయ్"

అంటూ నేనెవరి పాలాబడకుండా - మరో సీనియరు లక్ష్మీనాధుడి గదిలోకి నా మకాం మార్చేశాడు.

కొత్త వాతావరణం బెరుకుని సీనియర్ల నీడన చల్లగా దాటేశాను. తృట్టిలో రాగింగ్ అనే ఘోర ప్రమాదం తప్పిపోయిన ఆ నిమిషాన్నించీ - నానారు గొప్పోరేమోనన్న అనుమాన బీజం మనసులో పడింది.

ఆనక - ఇంజినీరింగ్ చదువుకి - కాకినాడ్లో - 'తివిరి ఇసుకను తైలంబు తీయవచ్చు' అని నమ్మే ఆయిల్ ఇండస్ట్రీ ఉద్యోగ నావలో అమలాపురం టు నార్వే వయా చెన్నై మరియు గుర్గావ్ మజిలీల్లో - కలిసిన నానారి మిత్రులూ శిష్యులతో నానారి జ్ఞాపకాలు మెమరేసుకుంటే నెమరేసుకుంటే - ఈ అనుమానం - కొలమానం అయింది!

"ఓల్డాన్ తమ్ముడూ ఓల్డాన్ - నే రాయమంది మీ నానారి కథ - నీ సొదగాదు" అన్నారు కిరణ్‌ప్రభగారు.

"ఆయ్! మరేనండయ్యా -

నేనెంత పండిత పుత్రుడ్నో జెప్తే -

మా నాన్నెంత పండితుడో జెప్పినట్టే గదండయ్యా!

అదీగాక - మనోడొ గురించీ సెప్పటాకి మందగ్గర సరుకు నిల్లు. కసింత ఇంటరడక్షను తక్కువ గదా మా ఇద్దరికీ!

అంచాత - బెస్టు క్వాలిటీ.. ఎక్సుపోర్టు రకం.. అచ్చుగొట్టించేద్దాం!

సెగ్రటీ.. నువ్వేం సెగ్రటీవయ్యా.. మల్లా ఇదో కరుసా! ఆ సిక్ష్టీపూర్తి సావనీరో ఏదో ఉంది గదా - అందులోంచి గొప్పగొప్పోళ్ళు రాసిన మాంఛి ముక్కలు ఏరి... ఏటీ.. నీటుగా పాకింగు జేసి.. దానిమీద మన పేరు ప్రింటంగం జేసి.. పెద్దచ్చరాలు సావుకారుగారికిచ్చేయ్!

మిగతా యవ్వారం మా సెగ్రటీ జూసుకుంటాడండీ! ఆయ!" అన్నా ముత్యాలముగ్గు కాంట్రాక్టర్ భాషలో

# ఎమ్వీయల్ అనే ముద్దాలి వెంకట లక్ష్మీనరసింహారావు

జననం : 21-09-1944

తల్లి : సీతారావమ్మ

తండ్రి : మద్దాలి వెంకటేశ్వరరావు

అమ్మమ్మ : వీరరాఘవమ్మ

తాత : గురజ వేంకటేశ్వరరావు

జన్మస్థలం : గూడూరు, (మచిలీపట్నం దగ్గర) కృష్ణాజిల్లా,

బాల్యం : మగ సంతానం ముచ్చట మనవడిలో చూసుకున్న అమ్మమ్మ గారాబంలో సాగింది ! గూడూరు నుంచి బండి కట్టించి మరీ బందరు తీసికెళ్ళి సినిమాలు చూపించి 'సినిమా ప్రాసన' చేసిన ఘనత అమ్మమ్మ గారిది !

చదూసంజెలు : మాధవస్వామి గుడి, వేంకటేశ్వర స్వామి గుళ్ళో ధనుర్మాసం ఉత్సవాలు, జతగాళ్ళతో ఆటలు, అమ్మమ్మ గారాబం నేపథ్యంలో గూడూరులో S.S.L.C. వరకూ చదువు అమ్మమ్మ గారాబం సినిమా ప్రస్థానానికి బండి కట్టిస్తే, తాతగారి పాండిత్యం 'చిట్టి గూడూరు సంస్కృత కళాశాల'కి ప్రయాణం కట్టించి, సంవత్సరం పాటు సంస్కృతం అధ్యయనం చేయించింది. సాహితీ వాతావరణం, కొత్త మిత్రుల పరిచయం, తాతగారి పాండిత్యం నేపథ్యంలో బందరు హిందూ కాలేజీలో ప్రీ యూనివర్శిటీ డిగ్రీ చదువులు. (1964) భాగ్యనగరం 'ఉస్మానియా విశ్వవిద్యాలయం' లో డా॥ సినారె, డా॥ దివాకర్ల వేంకటావధాని గార్ల వంటి దిగ్గజాల శిష్యరికంలో ఎం.ఎ తెలుగు (1966). చదువుతో 'నవత' పత్రిక నడిపారు.

ఉద్యోగం : 1966లో నూజివీడు 'ధర్మ అప్పారాయ కళాశాల' తెలుగు శాఖలో అధ్యాపకునిగా ప్రవేశం. చివరి వరకూ అదే కళాశాలలో శాఖాధిపతిగా సాగిన అనుబంధం

వివాహం : 8, నవంబర్ 1967న చి॥ల॥సౌ॥ వరలక్ష్మితో తెల్లదేవరపల్లి గ్రామంలో వివాహం. ఇద్దరు సంతానం - అనూరాధ, రామప్రసాద్

సద్యోగం : ఉడుగర, యులిసిన్, కవనకదనం (కవితా సంకలనాలు) ప్రతిబింబం, మిథ్యాబింబం (నాటకాలు) మలుపు - మెరుపు, నిన్న స్వప్నం - నేడు సత్యం (నవలలు) కవితాహారతి - కానుక, (పరిశోధనలు) ఆం.ప్ర.సాహిత్య ఎకాడమీ వారి తెలుగు పంచకావ్యాల సంపాదకత్వ పరిచయాలు (పారిజాతాపహరణం, ఆముక్తమాల్యద, మనుచరిత్ర, వసు చరిత్ర, పాండురంగమహాత్మ్యం)

పుస్తకాలలోలోపల : తెలుగులో తిట్టు కవిత్వం, తెలుగు నవలా రచయిత్రులు, తాళ్ళపాక వారి పలుకుబళ్ళు, తెలుగు వ్యుత్పత్తి పదకోశం,

ఫీచర్స్ : ఆణిముత్యాలు, వాణిముత్యాలు, యువజ్యోతి, తాగుడు మూతలు, వెండితెర వెలుగులు, అధిక ప్రసంగం - గట్రా - ఎక్స్ట్రా !

రేడియో ప్రసంగాలు : నన్నయ నాటకీయత, హంపీక్షేత్రం, తెలుగు సాహిత్యంలో హాస్యం, స్వప్న సందేశం.

వెండితెర వెలుగులు : ముత్యాలముగ్గు(నిర్మాత), స్నేహం, గోరంతదీపం, ఓ ఇంటి భాగోతం.

ప్రవృత్తి : నచ్చిన ప్రతి కవితనీ, మెచ్చిన ప్రతి విషయాన్నీ పదిమందికీ పంచడం....

ప్రసంగాలు : తెలుగునాట ప్రసంగాల పన్నీటిజల్లులు బళ్ళారి నుండి బరంపురం వరకు....

సాహచర్యం : మిత్రులతో, శిష్యులతో, పెద్దలతో, పిన్నలతో..... మరెందరితోనో... చివరకు దేవుడితో (23-01-1986)

# నానారి కథ

## యువజ్యోతి

డెబ్బయ్యో దశకం ఉద్యమాల కాలం. యువతరం అంతా ఆ వెర్రి ఆవేశంలో కొట్టుకుపోతోంది. కుర్రాళ్ళలో ఆవేశాన్ని తమ స్వార్థానికి వాడుకునే రాజకీయ నాయకులు హమేషా ఉంటారు. వాళ్ళ మాయలో పడకుండా యువతరాన్ని ఎలా కాపాడాలా అని నానారి ఆవేదన. తెలియని దారుల్లో నడిచి యువతరం తమ జీవితాల్ని ముళ్ళబాట చేసుకోకుండా చూడాలని ఆయన తపన.

అధ్యాపక వృత్తి చేపట్టినా, ఆంధ్రదేశం నలుమూలలా ప్రతి కళాశాల వార్షికోత్సవంలో ప్రసంగాలు చేసినా, ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'యువజ్యోతి' వెలిగించినా, ఎక్కడ ఏ మంచిపని జరిగినా అక్కడ వాలి బాధ్యత భుజాన వేసుకున్నా -

అంతర్వాహిని యువతరం గురించీ వేదనే!

మంచి సాహిత్యం మీదకి కుర్రాళ్ళ దృష్టి మరలిస్తే, అది వారి ఆలోచనా పరిధి పెంచి, వాళ్ళు నడవాల్సిన మార్గం వాళ్ళే ఎన్నుకుని మంచి భవిష్యత్తుకి కారణం అవుతుందని ఆయన నమ్మకం!

తన ఎం.ఏ అవగానే వరించిన ఉద్యోగం రేడియోలో ఆలిండియా రేడియో బ్రహ్మాండంగా వెలిగిపోతున్న'67లో అందులో ఉద్యోగం కాదని - నూజివీడు కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు. దరిమిలా బోలెడు సంపాదించాక - ఎక్కువ జీతంతో చాలా ఉద్యోగాలు వరించినా -

రోజా పలికే బడికే తెలుగు పలుకుబడికే తన ఓటు వేశారు.

మద్రాసులో సెటిలైపోమని ముళ్ళపూడివారు అడిగినా - "కాలేజీ ఉద్యోగమే తనకు ఇష్టమన్నార"ని నానారి జ్ఞాపకాలు మెమరీసుకుంటూ నెమరేసుకుంటూ రమణగారు నాతో అన్నారు.

అమితంగా ప్రేమించే అధ్యాపకవృత్తినీ యువతరానికి దగ్గరగా ఉండి, తన పరిధిలో, మార్గదర్శకత్వం చేసే అవకాశాన్ని - నానారు ఏనాడూ వదులుకోదల్చుకోలేదు.

నీతి బీరకాయలు వడ్డిస్తే కుర్రాళ్ళెవరూ ఖాతరీ పెట్టరు. 'యువజ్యోతి' ప్రశ్న జవాబుల శీర్షిక నడుపుతున్నపుడు - ఆయన వాడిన టెక్నిక్ - రొటీన్ ప్రశ్నలకి సరదా చమక్కులూ రాజకీయ చురుక్కులూ జవాబులుగా - ఎట్రాక్ట్ చేసి - మంచి విషయాలూ మంచి పుస్తకాల గురించీ చెప్పడం. ఈ ఫీచర్ 1975-80లలో Much awaited column గా - ప్రజలలో విశేషాభిమానం సంపాదించుకుంది.

అదే టెక్నిక్ ఆయన ప్రసంగాలలోనూ గుబాళించింది. గుంటూరు జేకేసీ కళాశాల. వార్షికోత్సవ సభలో రెండువేల మంది విద్యార్థులకి 'ఆముక్తమాల్యద' కావ్యం అందచందాలు వివరించి హర్షధ్వానాలందుకున్నారు. తన పాఠాలలో ప్రసంగాలలో సామాజిక సాంఘిక విశేషాలు చొప్పించి విద్యార్థులకి ఆసక్తి అవగాహన కలిగించేవారు.

## మా అనక్క చెప్పిన కథ -

మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి

నానారు ఇష్టపడి పిలిచే 'అనక్క'నయాను కానీ - అందరూ ఇష్టపడే ఆయన పాఠాలు ఎక్కువ వినలేకపోయాను. నేను ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరినపుడు తన క్లాసెస్ సీనియర్ ఇంటర్‌కి మార్చుకున్నారు నానారు. నేను సీనియర్ ఇంటర్ చేరేసరికి - మళ్ళీ తను జూనియర్ ఇంటర్ లెక్చెరర్‌గా వెళ్ళారు - ఎందుకనో!

ఈ దారుణం నేపథ్యంలో -

నేను నానారి నుంచీ విన్న పాఠాలు సత్యంగా ముత్యంగా మూడు. ఆ మూడు ముత్యాల హారం ఇది!!

మా క్లాస్‌కి వచ్చే తెలుగు మాష్టారు ఎం.ఫిల్ చేస్తూండడం వలన క్లాసు తక్కువగా తీసుకునేవారు. అంచాత ఓ రోజు నానారు క్లాస్ తీసుకోవాల్సి వచ్చింది - ఆయన బదులు.

మా కిష్కింధలోకి మెల్లగా సుందర వదనారవింద రామునిలా ప్రవేశించి, - అత్యద్భుతంగా 'సాక్షి వ్యాసాలు' చెప్పటం నా మొదటి ప్రత్యక్షానుభూతి.

ఇదయ్యాక -

"నువు మా క్లాస్‌మేట్ అయిన పాపానికి - ఎమ్వీయల్‌గారి పాఠాలు మేమందరం మిస్ అవుతున్నాం" - అని నా స్నేహబృందం నిత్య దూషణ భూషణాలంకారం!! ఇందుకు పరిహారంగా నానారితో ప్రైవేట్ క్లాసెస్ ఏర్పాటు చేయాలని వారి తీర్మానం. అదీగాక - మా మాస్టారి ఎం.ఫిల్ వలన - మా సిలబస్ అవలేదు కూడా.

అన్ని కారణాలూ కలిపి - ఆ పైన అమ్మనుంచీ కుంచెం ధైర్యం అప్పడిగి -

"వచ్చే శనివారం. శివరాత్రి - శెలవు ఆనక ఆదివారం. రెండ్రోల్లో ముఖ్యమైన పాఠాలు చెబుతారా కాస్త" అనడిగా "పరీక్షలు దగ్గిర పడుతోంటే ఇప్పుడా? ఇంత తేలికా తెలుగంటే" అని బాఘా కోంబడ్డారు ముందు - ఆనక "సరే" లెమ్మన్నారు. రెండురోజులు రెండుగంటలు చెబుతానన్నారు. అలాంటిది పదింటికి మొదలుపెడితే - ఏకబిగిన రెండింటి దాకా పాఠం చెప్పారు. మధ్యలో ఓసారి లోపలికి వెళ్ళి, మా వాళ్ళకి ఇళ్ళకి వెళ్ళే ఓపిక ఉండాలని - అమ్మతో పలహారం తయారు చేయించి అందరికీ పెట్టించారు.

'శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం' - శివరాత్రి పండగ రోజు "ఎంత మంచి పాఠం చెప్పించావయ్యా" అని కంటనీరు పెట్టుకున్నారు.

అసలు పాఠం చెప్పటమే పండగ -

ఆయనకీ విన్నవాళ్ళకీ కూడా!

మా మిత్రబృందం సాధింపులు మెచ్చుకోళ్ళుగా తర్జుమా అయిన ఆ పాఠాలు నా రెండో ప్రత్యక్షానుభూతి!

ముత్యంగా మూడోది నేను విన్న పరోక్ష పాఠం! ఆరో తరగతిలో ఉండగా నేను ఓ సారి జ్వరం వచ్చి స్కూల్‌కెళ్ళలేదు. ఆ రోజు ఇంట్లో 'బి.ఏ స్పెషలు తెలుగు' విద్యార్థులకి ప్రైవేట్ క్లాస్ చెబుతున్నారు నానారు. ఆ పాఠం వింటూ - మెల్లిగా నేనూ ఓ పద్యం నేర్చుకుంటుంటే - అమ్మ తర్వాత బాగా వచ్చేలా వల్లె వేయించింది ఈ మాత్రం జ్ఞానం అమ్మ మూలాన వచ్చిందే. అమ్మకి కోరిక - నేను పద్యాలు నేర్చుకుని నానారికి వినిపించాలని. నాకున్న పరిజ్ఞానం మేరకు - ఆనాడు మనసులో హత్తుకున్న ఆ పద్యం - ఇవాళ తలుచుకుంటే చాలా వరకూ ఆయనకీ వర్తిస్తుందా అనిపిస్తుంది.

"ఆపురిబాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి
భాషాపర శేషభోగి వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీక్షా పరతంత్రుడు
అంబరుహ గర్భ కులాభరణంబు అనారతాధ్యాపన తత్పరుండు"

ఛందస్సు తప్పుతుందేమో గానీ నేను అనుకున్న ఆఖరి పాదం -
"నారసింహు వెల్గె సాహితీ ప్రకాశుడై"
ప్రవరుడు కాలికి లేపనం పూత వల్ల హిమాలయాలకు వెళ్ళినట్టు -
నానారు ఆంధ్రదేశమంతా తానై తిరిగారు
ప్రసంగాలు పరిమళిస్తూ!!

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*



ఎమ్వీఎల్ గారబ్బాయి
రామ్‌ప్రసాద్

●●●




# నాకు తెలియని నా 'నారు'

## ఎమ్వీయల్‌గారి అబ్బాయి

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)



**సామర్థ్యం సౌజన్యం సరిపాళ్ళలో** రంగరించుకున్న విశిష్ట వ్యక్తిత్వం ఎమ్వీయల్‌ది. రచయితగా, వ్యాఖ్యాతగా సినీ నిర్మాతగా ఎమ్వీయల్ అత్యంత సమర్థ భూమికలను నిర్వహించాడు. మార్దవం ఒక మనిషిగా రూపొందితే, భావుకత ఒక మూర్తిగా మన ఎదుట నిలబడితే అది ఎమ్వీయల్ ప్రతిరూపమే."

*- డా.సినారె*

"ఆంగ్లకవి కీట్సును అన్ని విధాలా పుణికిపుచ్చుకున్న జీవితం అతనిది. స్వగతంలో నేపథ్య కవితాలాపన అతనిది. ప్రకాశమానమైనదల్లా ఇతరుల రచనలకు స్పందించిన అతని సాహితీ పక్షపాతం. అతని కంఠస్వరం, వ్యాఖ్యానావధానం, సమీక్షా సౌందర్యం చిరకాలం ఉంటాయి - అతనూ అంతే.. చిరంజీవి"

*- శ్రీ వేటూరి సుందరమూర్తి*

"అందగాడు. ముఖంలో చిరునవ్వు మాయనివాడు. ఎంత వ్యతిరేక భావాన్ని కూడా అంత మృదువుగా తిరస్కరించగలిగినవాడు. తెలుగు సాహిత్యంలో ఎం.ఏ వరకూ మాత్రమే చదివాడు. కానీ ప్రపంచ జ్ఞానంలో, సినిమా రంగంలో ఇంతింత అనరాని అవగాహన కలిగిన వాడు.

తనకి నచ్చే పని ఎవరు తల పెట్టినా - వారు ఆ పని పూర్తి చేసేవరకూ ఆ పని అంతా తన బాధ్యతే నన్నంతగా శరీర శ్రమా, మనోవేదనా అన్నిటినీ తన సహజ మందహాసంతో భరించినవాడు. ఎక్కడ మంచిరకం సంగీతం ఉంటే అక్కడ - ఉద్యోగానికి సెలవులు పెట్టి, ప్రయాణాలకి డబ్బులు పెట్టుకుని వాలి సుగ్రీవుడయేవాడు.

దట్ వజ్ ఎమ్వీయల్"

*- శ్రీ భరాగో*

"హృదయము తోడ పల్కు; గుణ
మెచ్చుట నున్నను మెచ్చి వ్యాప్తి జే
యుదనుక నిద్రపోడు; నెనరొత్తిన
చిత్తము తోడ ఆపదన్
జెదరిన వాని దేర్చు; నవశిల్ప
విశిష్ఠ వరిష్ఠ రీతులన్
విదిత మొనర్చి కూర్చు సువివేకము
కావ్య పథాను వర్తియై!
తిట్టు కవిత్వమందు శిత
దృఙ్ఞ్వ శోధన ముంబొనర్చెందా
బట్టిన దీక్ష అన్నమయ పల్కుల
చక్కగ పోహలించె మిన్
ముట్టిన సాహితీ గరిమమున్
బ్రసరించె ప్రసంగ సంగతిన్
వట్టి ఛలోక్తి కారునిగ వానిని
కించ యొనర్ప వచ్చునే?

**- శ్రీ అత్తిలి వేంకట రమణ**
**లెక్చరర్ నూజివీడు**

"ఎమ్వీయల్ కు ఇతరులకు ఉపయోగపడటమే గానీ ఇతరులను ఉపయోగించుకోటం అలవాటులేదు.

పరిచయమయిన కొద్ది రోజుల్లోనే నాకూ మా సంస్థకూ ఆత్మీయుడయ్యాడు. అతనితో అనుబంధం పెంచుకున్నాను. నా వృత్తి సాహిత్యానికి సంబంధించింది. నాకున్న సాహితీ పరిజ్ఞానం చాలా పరిమితం. అలాంటి సందర్భంలో నాకు సాహిత్యపరంగా సలహాలూ, సహాయమూ అవసరపడేవి. నా వ్యాపారానికి సంబంధించిన అనేక విషయాలలో అతని సలహాలూ సహాయమూ తీసుకున్నాను. తన ఇష్టాలూ పరిచయాలూ తన వరకే పరిమితం చేసుకోకుండా, వాటిని మిత్రులందరికీ జాతీయం చేయటం అతనికున్న మరో లక్షణం. అందువల్లనే ఎంతో మంది అతని స్నేహితులు ఇప్పటికీ నాకు స్నేహితులుగా ఉన్నారు.

మిత్రులందరూ ఎవరికి వారు అతను లేకపోవడం వల్ల తాము ఎక్కువ నష్టపోయామని అనుకుంటున్నారంటే ప్రతి వారితో తాను ఎంత అన్యోన్యంగా కలవిడిగా ఉండేవాడో అర్థమవుతుంది."

**- శ్రీ నవోదయ రామమోహనరావు**

1967లో "బుద్ధిమంతుడు" శతదినోత్సవం విజయవాడలో జరుపుతున్న సమయంలో ఆంధ్రజ్యోతి పత్రిక వారు ఆ చిత్ర విజయాన్ని గురించి ఒక సప్లిమెంట్ వేయాలని ఆఖరు నిమిషంలో నిర్ణయించుకోడం జరిగింది. కొన్ని గంటల వ్యవధిలో రెండు పేజీలకు

సరిపడే వ్యాసాలు సమకూర్చే పనిని రమణగారు ఎమ్వీయల్ గారికి అప్పగించారు. ఒక హోటలు రూములో కూర్చుని నిమిషాలో వ్యాసాలే కాకుండా ఫోటోలతో సహా 'లేఔటు' యావత్తూ అద్భుతంగా తయారు చేశారు ఎమ్వీయల్ గారు. అది నేను కళ్ళారా చూశాను. అప్పుడే నాకర్థమయింది - ఆయన పర్సనాలిటీ. అందులో ఆయన సమకూర్చిన వ్యాసాల శైలి చూశాక సాహిత్యలోకానికి ఒక హైబ్రీడు రచయిత పుట్టుకొచ్చాడు అనుకున్నాను."

***- శ్రీ బి.వి.ఎస్.రామారావు కథారచయిత***

***హైదరాబాద్***

"Seven stars syndicate (sss) ముఖ్యవార్షిక కార్యక్రమం అంతర్ కళాశాలల సాంస్కృతికోత్సవాలు - ఇందులో హైదరాబాదు జంట నగరాలలోని 40 కళాశాలలు భాగం పంచుకునేవి. sssకి, 'నవత' పత్రికకి ఎమ్వీయల్ చేసిన సహాయం వివరించాలంటే సముద్రాన్ని చెంచాతో కొలవడమే! sss ఆఖరి ముఖ్య కార్యక్రమం 'అఖిలాంధ్ర అభ్యుదయ సాహిత్య సదస్సు'. ఈ సదస్సులోనే ఆంధ్రదేశంలో ఆధునిక సాహిత్యం 'అరసం' 'విరసం'గా రెండు చీలికలు వచ్చాయి. ఎమ్వీయల్ ఈ అభ్యుదయ సాహిత్య సదస్సుకి చాలా సహాయం చేశాడు.

***- శ్రీ శిష్టా జగన్నాథరావు***

***Rtd. అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్, దూరదర్శన్, గోవా.***

"ఎమ్వీయల్ గారు మా ఊరు వచ్చి నా బొమ్మలూ గట్రా చూసి 'గో ఎ హెడ్' 'కీపిటప్' అని వెన్ను సద్దారు'. ఆయనంతే నండీ బాబూ... ఇంతవుంటే.. అంత మెచ్చుకుని ఇంతింతగా పెరగటానికి హోహదం చేసేవారు - ఇహకణ్నించీ మేమూ 'స్నేహలత' మేగజైన్ పెట్టి ఎడాపెడా కథలూ, కవిత్వాలూ, కార్టూన్స్‌తో 200 పేజీల లిఖిత పత్రిక ఆట ఆడుకునేవాళ్ళం -

అదే మా జీవితానికి ఓ టర్నింగ్ పాయింట్‌ని ఫిక్స్ చేసింది.

వీడు రాస్తాడు. రాయగలడు - అనే వాళ్ళందర్నీ జట్టు కట్టించి, వాళ్ళ గొప్పదనాల్ని సీమటపాకాయల గుత్తిలా పేర్చి రెచ్చగొట్టి ముట్టిస్తారు. అలిసెట్టి ప్రభాకర్, వసీరా, కొల్లూరి, రామసూరి. ఇలా ఎందరెందరి యువకవుల కవిత్వాలని వేమన పద్యాల్లా బట్టీ పట్టి ప్రాచుర్యంలోకి తెచ్చింది ఎమ్వీయల్ గారే. ఇలా ఎన్నో యువజ్యోతులు వెలిగించారు."

***- శ్రీ బ్నిం***

***రచయిత, చిత్రకారుడు, హైదరాబాద్***

"ఎమ్వీయల్‌కి ఆధునిక కవిత్వం మీద ఎంత అభిమానముండేదో ప్రాచీన కవిత్వం మీద అంత పట్టు ఉండేది. అందుకు ఆయన రాసిన కావ్య పరిచయాలు, 'ఆణిముత్యాలు' పేరుతో పాత పద్యాల మీద చేసిన వాఖ్యానాలు నిదర్శనం.

మనుచరిత్రకు పరిచయం రాస్తూ -" ఇద్దరూ ప్రతిమనిషి హృదయంలోనూ సంఘర్షించే ధర్మాధర్మాలకు ప్రతిరూపాలు' అని వరూధినీ ప్రవరాఖ్యుల గురించీ ఎంత గొప్పగా చెప్పారు! వసుచరిత్ర చరిత్రలో ద్వితీయమైనా కొన్ని విషయాల్లో అద్వితీయమట! ఇలా అతని వాక్యాల విరుపుల గురించీ మెరుపుల గురించీ ఎన్నైనా చెప్పుకోవచ్చు! ఆయనకు నూజివీడంటే ఎంత ఇష్టమో నూజివీడుకు ఆయనంటే అంత ఇష్టం. ఆయన పోయినపుడు దుకాణాలన్నీ స్వచ్ఛందంగా బంద్ చేసి 'ఎమ్వీయల్ అమర్ రహే' అని రాసిన గౌరవం - ఎంతటి వాళ్ళకు దక్కుతుంది?" ***- డా.పైడిపాల, అమలాపురం***

"ఎమ్వీయల్ 1967 నుంచీ శిష్టా జగన్నాధంతో కలిసి ఓ అరుదైన పని ప్రారంభించారు. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని వాక్యాలకి అనుగుణమైన ఫోటోలు దాదాపు 25దాకా రకరకాల ఇంగ్లీషు పత్రికల నుంచి సంపాయించారు. వీటిని 1970లో శ్రీ శ్రీ షష్టిపూర్తి నాడు హైదరాబాదులో ప్రదర్శించారు..

వాటిల్లో కొన్ని పోగా, జగన్నాథంగారు ట్రాన్స్ఫరై పోగా మళ్ళీ తను ఒక్కడే ఓపిగ్గా శ్రీశ్రీ తిలక్ కవితా వాక్యాలకు ఓ వంద ఫోటోలు సంపాయించి పాతిక ప్రదర్శనల దాకా ఏర్పటు చేశారు.

ఎమ్వీయల్కి ఉపాధ్యాయుడిగా పాఠ్యగ్రంధాల విషయంలో ఆలోచించదగ్గ ఆమోదింపతగ్గ అభిప్రాయాలు ఉన్నాయి. శ్రవ్య, దృశ్య లక్షణాలు లేని నాటకాలనీ, చార్రితిక విషయాల్ని తారుమారు చేసే రమణీ ప్రియదూతికలాంటి రచనలనీ పాఠ్యగ్రంధాలుగా పెడుతున్నారని విసుక్కుంటూ ఉండేవారు. మంచి ఎంపిక, ఎడిటింగూ లేకుండా సంప్రదాయ కవిత్వాన్ని పెడుతున్నారని సణుగుతూ ఉండేవారు."

*- డా.అత్తలూరి నరసింహారావు*

*తెలుగు ప్రొఫెసర్, ఆంధ్రాయూనివర్శిటీ విశాఖ.*

"నూజివీడులో వార్షికంగా జరిగే చెడుగుడు పోటీలకు నన్ను పిలిచారు. ఎమ్వీయల్ని ఎరగా చూపి పిలిచారని గుర్తు. ఆ ఒక్క కారణానికే వెళ్ళిన గుర్తు. మైకు ముందుకు వచ్చి ఖంగుమనే గొంతుతో మాట్లాడాడు ఎమ్వీయల్ - "నాకీ మధ్య ఓ కల వచ్చింది. మారుతీరావు మారుతీకార్ల కంపెనీ మీద కేసు పెట్టాడట. మీ కార్లకి నా పేరు పెట్టుకుని నాకు ఒక కారయినా ఇవ్వలేదని. మారుతీ కార్ల కంపెనీ నుంచీ సమాధానం వచ్చింది - 'ఇచ్చే వాళ్ళమే కానీ ఓ యస్వీ రంగారావూ, ఓ రమణారెడ్డీ, ఓ సీయస్సార్ పట్టేంత కారు మా దగ్గర లేదు' "అని.

ఒక్క ఎమ్వీయల్ మాత్రమే ఇంత హృద్యంగా, క్లుప్తంగా, తన మనస్సుని సమగ్రంగా చెప్పగలడు.

*- శ్రీ గొల్లపూడి మారుతీరావు.*

"తెలుగు సాహిత్యంలో భారతం చెప్పినా, భాగవతం చెప్పినా, ఆధునిక కవిత్వం చెప్పినా, ఆయన స్టైలే వేరు. దృశ్య సాక్షాత్కారం చేయించేవారు. సాహిత్య విద్యార్థులకు మాస్టారు చెప్పిన పాఠ్యాంశాలు .. ఇప్పటికీ చెవుల అరల్లో, మనసు పొరల్లో ఇన్నేళ్ళైనా, ఇంకెన్నాళ్ళైనా భద్రంగానే ఉంటాయంటే అతిశయోక్తి కాదన్నది ఆయన శిష్యులందరికీ అనుభవ సిద్ధమే. మా ధర్మ అప్పారావు కళాశాల వార్షికోత్సవాలకూ, నూజివీడు ప్రజానీకానికి పరిచయం చేశారు. నూజివీడులో ఏ సభ జరిగినా మాస్టారు లేకుండా జరిగేది కాదు. ప్రతి సంవత్సరం తెలుగునాట చిన్నపాఠశాల నుండి విశ్వవిద్యాలయాల వరకూ ఆయన ఉపన్యాసాల పన్నీరు జల్లులు కురిసేవి. ఆయన ఉపన్యాసం పండితుల నుండి సామాజిక విషయాల దాకా - విషయమేదైనా ఆయన తీరు అందరికీ ఆమోదయోగ్యం. ఆనందదాయకం.

*- శ్రీ ఎస్.టి.పి శ్రీ వెంకటేశ్వర్లు*

*తెలుగు లెక్చరర్, DAR Collage నూజివీడు*

"మితంగా, హితంగా, మధురంగా, సకల జన మనోహరంగా ప్రసంగించడం మాటలు కాదు. కావ్యాలు చదివి, జీర్ణించుకుని, తాను పొందిన అనుభవాన్ని అందమైన మాటలలో అందరికీ అర్థమయేలా వ్యక్తం చేసి ఔననిపించుకోడం అందరికీ సాధ్యమయే పనికాదు.

భిన్నతరాలకి చెందిన వాళ్ళని ఏకకాలంలో ఆనందింపజేసేలా ప్రసంగించాలంటే, వక్తకి పదప్రయోగంలోని మెలుకువలు తెలియాలి. సభని బట్టి హృదయాన్ని స్పందింపజేసే రీతులని సమకూర్చుకోవాలి. చతురోక్తితో ప్రారంభించాలా? పిట్టకథతో ప్రారంభించాలా? ఈ

కిటుకులన్నీ ఎమ్వీయల్ గారికి కొట్టిన పిండి ఆయన ప్రసంగాలలో ఎంత ప్రాచీనకవైనా సరే అప్పుడే చిగిర్చిన చెట్టులా నవనవలాడుతూ కనిపిస్తాడు. ఊనిక, స్వరం ఆయన ప్రసంగాలకి ప్రాణం.

చలనచిత్ర కళకి సంబంధించిన ఒడుపులు ఆయనకి కరతలామకం. అంచాత ఆయన ప్రసంగాలు వింటుంటే శబ్దాలు వింత సమ్మేళనంతో దృశ్యంగా మారి శ్రోతకి మిక్కిలి ఆనందాన్ని కలిగిస్తాయి.

- ***డా. రామసూరి, లెక్చెరర్, విజయనగరం.***

-

"ఎమ్వీయల్ ఉపన్యాసం యువతరాన్నే కాదు పెద్దల్ని కూడా అలరించేది. రెండువేల మంది విద్యార్థులకు - జెకెసి కాలేజీ వార్షికోత్సవ సభలో - శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద'లో అందచందాలని అందరినీ ఆకట్టుకునేలాగా చెప్పిన అతని ప్రజ్ఞ నాకు ఎప్పటికీ మరుపురాదు.

చంద్రసేన్, అలిసెట్టి ప్రభాకర్‌లాంటి యువకుల మినీ కవితల్ని శ్రోతలకు వినిపిస్తూ ఊరూరా దండోరా వేసినట్టు శివమెత్తినట్లు తిరిగాడు.

ఎమ్వీయల్‌కి రాజకీయ, తాత్విక సిద్ధాంతాలు వేటిమీదా పెద్దగా నమ్మకం లేదు. స్థూలంగా చెబితే, సామాన్యుడి జీవితం బాగుపడాలనీ, కష్టజీవికి న్యాయం జరగాలనీ అతని అభిలాష"

- ***డా.కడియాల రామమోహనరాయ్***

***సాహితీ విమర్శకులు గుంటూరు.***

*<u>ఎలిజీ</u>*

విద్యార్థిగా విజ్ఞులకు సద్యో శిష్యుడైనవానికోసం సాధ్యమైనంత మంది సాహచర్యానికి వశ్యుడైన వానికోసం తీరుబాటు లేని విశ్రాంతి వో తీయని కబుర్ల పోగుకోసం పేరు పడవలసిన పిచ్చికవుల కేరాఫ్ చిరునామా దారుని కోసం ఏడు నక్షత్రాల కన్నా వేడుకగా వెలిగిన పుంభావ అరుంధతి కోసం తాడూ బొంగరమన్నా తనకు తాను ఉపయోగపడని సుమతి కోసం ఊపిరి సలపని సాహిత్య కార్యకలాపాల ఉమేదువారీ కోసం.

- ***శ్రీ ఆరుద్ర***

ఎమ్వీయల్ సాహితీ సమాఖ్య వారు ప్రచురించిన ఎమ్వీయల్ 61 వ జయంత్యుత్సవ సంచిక - నాకు నిత్యపఠనీయం. అందులో నానారి గురించి రాసిన వారందరికీ నా శతకోటి వందనాలు అందులో కొన్ని మంచిమాటలే ఇక్కడ పొందుపర్చగలిగాను.

చివరగా - శ్రీ అత్తిలి వేంకటరమణగారు నానారిపై రాసిన 'స్నేహశీలి శ్రీ ఎమ్వీయల్' స్మృతి కావ్యంలోని ఈ పద్యం - శ్రీ ఎస్పీబాలసుబ్రమణ్యంగారి స్వరంలో ఇక్కడ. **Click Here**

***<u>ఎపిలోగ్</u>***

నానారు పోయిన ఇరవై ఏళ్ళకి - ఆయన మిత్రులూ శిష్యులూ కలిసి ప్రేమగా మనస్ఫూర్తిగా ఆయన అరవయ్యో పుట్టినరోజు వేడుక నూజివీడులో చేసుకున్నారు.

ఆయనంత అందమైన సావనీరు ముద్రించి - ఆయన ముద్రపదిలపరిచారు.

బతకడం చేతకాదు అని నేను భ్రమపడ్డ మనిషి పోయిన ఇరవై ఏళ్ళ తర్వాత కూడా చిరంజీవిగా ఉన్నాడు.

చేసిన మంచి - కలికాలంలో కూడా కలకాలం నిలుస్తుందని, లోకం తలుస్తుందనీ - అమ్మ 'తోడు'గా - తెలుసుకున్నా. ఆ రోజు!!

చిన్నతనంలో ఆయన నాతో లేరనుకున్నాను. అదే నా 'చిన్నతనం' అని అర్థమవటానికి నా సగం జీవితం పట్టింది!

నీటిలో కలిసి తీయదనం పంచడం చక్కెర లక్షణం!

పంచదార పలుకులు ఏవీ అని వెదకడం అవివేకం!

●●●

నా జీవితం అంతా అల్లుకున్న పరిమళం నానారు నా బతుకు పుస్తకం మీద అందమైన కవర్ పేజీ నానారు!

దానిమీద రాయటానికి -

**"అవునూ నీ పేరేంటీ" అనడిగితే -**

**"ఎమ్వీయల్ గారి అబ్బాయి" అంటాను గర్వంగా!**

*(సమాప్తం)*

●●●



ఎమ్వీఎల్ గారబ్బాయి

రామ్‌ప్రసాద్

# వ్యాస కౌముది



## భారతీయ సంగీతంలో మహిళల పాత్ర - ఒక పరిశీలన

డా.వై.కృష్ణకుమారి

కళ అన్నది పరమేశ్వరుని చిదంశం. అందువలన అది అమృతమయమైనది కూడా. సంగీత కళ పరమేశ్వర చిత్కళావిశేషమే తప్ప ఇంకొకటి కాదు. ప్రణవ స్వరూపమైన సంగీత్ కళ వేదాల నేపథ్యంలో భూమి మీదికి సాక్షాత్కరించి, ఋషులు, వాగ్గేయకారుల ద్వారా లౌకిక సమాజానికి పరిచయమైనది. అయితే ఇక్కడ ఒక చమత్కారముంది. మన దేశంలోని సమస్త విద్యలు కూడా ఆధ్యాత్మిక, అది దైవిక, అది భౌతిక రూపాలలో పరిణితిని పొందాయి. వాఙ్మయ ప్రపంచం వైఖరీ రూపంలో అది భౌతిక ప్రయోజనాలను సాధించింది. ఈ వైఖరీ సంపద వల్లఏర్పడిన ఆది దైవీ భావన శివశక్త్యాత్మక రూపాన్ని ధరించి సర్వ విద్యలకు మూలమైన ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకుంది. ఈ విధంగా మూడు మార్గాలలో సంగీత విద్యకూడా సమాజాన్ని సుభిక్షం చేసింది. 'నాభీహృత్కంఠరసన నాసాదుల' యందు పరిఢవిల్లి సప్తస్వర విద్యగా శోభిల్లింది. కాబట్టే సంగీత విద్యద్వారా లభించిన జ్ఞానం భక్తి ముక్తి ప్రదమై మోక్షానికి దారి చూపింది. 'గీతం శ్రావయామి' అన్న పూజా విధానం దీనినే వివరిస్తుంది. సంగీతం స్వయం రంజకములైన స్వరాలతో ఏర్పడింది. స్వరములు అంటే ప్రాణములని కూడా అర్థం ఉంది. కనుక దీనిని మించిన జీవ చైతన్య సుందర రూపమైన విద్య, కళ, శాస్త్రం ఇంకొకటి లేదు. అందుకే 'దీపిక' రాగం జ్యోతులను వెలిగిస్తే, 'అమృతవర్షిణి' రాగం సుధా ధారలను కురిపించింది. నాదస్వరూపుడైన శంకరునికి 'శంకరాభరణ'మే నిజమైన ఆభరణమైంది. సర్వమంగళమైన ఆ జగన్మాతకు 'కల్యాణి' రాగం పాదపీఠమైంది. అందుకే 'శిశుర్వేత్తి పశుర్వేత్తి గాన రసం ఫణిః' అన్నారు.

ఇంత మహత్తరమైన సంగీతాన్ని తమ ఊపిరిగా చేసుకున్నారు తెలుగువారు. మొదటిసారిగా 'పదం' రచించిన వారు తెలుగువారు. 'కీర్తన' రచించినవారు తెలుగువారు. 'సంకీర్తన' రచించిన వారు తెలుగువారు. 'భజన' సంప్రదాయానికి నాంది పలికిన వారు తెలుగువారే. 'జావళి' రచించి కొత్తమార్గానికి పునాది వేసినవారు తెలుగువారే. అనూచానంగా వస్తున్న భక్తి రచనలైన భజనలు ఒకవైపు రక్తి సహిత జావళి రచనలను ఇంకొకవైపు సమానంగా నిర్వహించింది తెలుగువారే.

వాస్తవానికి భారతీయ సంస్కృతిలో నృత్యాలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తాయి. దేశ సంస్కృతి ఏకీకరణకు ఈ కళలు చేసిన, చేస్తున్న కృషి గణనీయమైనది. అసలీ నృత్య సంగీతాలంటే ఏమిటి? అని ప్రశ్న వేసుకుంటే మనిషి మనసులోని వినోద విషాదాల బాహిర రూపం అని చెప్పాలి. మనస్సులో ఆనందం పెల్లుబికినపుడు, అనుకోకుండా ఒక కొత్త విషయం స్ఫురించినపుడు, ఊహించని కష్టం ఎదురైనప్పుడు, ఆ సంతోషంగాని, దుఃఖం గాని కేవలం ముఖంలోనే గాకుండా శరీరావయాల ద్వారా బహిర్గతమవుతుంది. అదే నాట్యం. బహిర్గతమవుతున్న సంతోషాన్ని ప్రకటించడంలో శరీరావయవాలు వివిధ రకాలుగా కదులుతాయి. ఉన్నచోటు నుండి ముందుకో, నాల్గు అడుగులు వెనుకకు వేయడమో, లేదా పక్కకి జరగడమో అప్రయత్నంగా జరుగుతుంది. ముఖంలో వివిధాలైన హావభావాలు ప్రకటింపబడతాయి. చేతులకి, ఒకొక్కసారి వేళ్ళకికూడా కదలిక వస్తుంది. సంతోష వ్యక్తీకరణలో మాటలు లేదా కూనిరాగాలు

వెల్వడతాయి. వీటన్నింటి సమాహారం నాట్యం లేదా అభినయం అనిపించుకుంటుంది. వ్యక్తిగతంగా మొదలైన ఈ అభినయం కాల్రకమేణా సామూహికంగా మారింది. క్షణికమైన మనోభావాల దగ్గర్నించి ఒక జీవితాన్ని సూచించే కథాకథన ప్రక్రియ వరకు కొనసాగిందీ అభినయం. నిజానికి దీని ఆవిర్భాం ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో అంటే సమాధానం దొరకదు. కానీ ఆవిర్భవించిన ఈ ప్రక్రియ ఎవరి ద్వారా వ్యాపించింది అంటే కొంతవరకు సమాధానం చెప్పవచ్చు. కవులు రచించిన కావ్యాల ద్వారా, నర్తకులు చేసిన సామూహిక నాట్యాల ద్వారా, శిల్పాలలో ప్రతిబింబించిన నాట్యభంగిమల ద్వారా ఈ అభినయ విద్య బాగా ప్రచారం అయ్యింది. ముఖ్యంగా శిల్పాల గురించి చెప్పుకోవాలంటే మొదటి స్థానం బౌద్ధమతానిదే. ఎందుకంటే బౌద్ధమత విస్తరణకు ముఖ్యకారణం స్థానిక భాష అయిన 'పాలి'. నృత్యగానాల సహకారంతో బౌద్ధభిక్షుకులు మత సిద్ధాంతాలను వ్యాప్తి చేసేవారిని తెలుస్తోంది. బౌద్ధమతం కన్నా ముందు మనకు ఆలయాలు ఉన్నప్పటికి శిల్పసంపద గురించి సమాచారం చాలా తక్కువ. నాట్యసంగీతాల గురించి మనకు అధికారమైన సమాచారం బౌద్ధశిల్పంలోనే లభిస్తుంది. కాబట్టే సంగీత నృత్యాల ప్రాచీనతను సాహిత్యం ద్వారా తెలుసుకున్నప్పటికీ అంతకంటె ముందు కనిపిస్తున్న శిల్పాల ద్వారా ఈ కళల ప్రాచీనత మరింత స్పష్టంగా తెలుస్తుంది. ఇక్కడొక విషయం గమనించాలి. శిల్పం ద్వారా అభివ్యక్తీకరింపబడిన నాట్యం గాని సంగీతం గాని నేడు మనం అర్థం చేసుకోవాలంటే ఆనాటి సామాజిక జీవనం ఎటువంటిదో తెలుసుకోవాలి. నాడు తెలుగుదేశాన్ని పరిపాలించిన రాజులు, వారి రాజ్యవిస్తీర్ణం, పాలితులైన ప్రజలు మాట్లాడే భిన్నమైన భాషలు, వారి సాంస్కృతిక నేపథ్యం, స్థానిక సంగీత నృత్యాలు, ప్రజలలో వాటిపట్ల గల ఆదరన మొదలైన వాటి గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి. ఎందుకంటే ఈ రోజు ప్రదర్శింపబడుతున్న నృత్యం మనం అనుకుంటున్నంత ప్రాచీనమైంది కాదు. అదే విధంగా వాయిద్య పరికరాలలో కూడా స్పష్టమైన తేడా కనిపిస్తుంది. మౌఖికమైన సంగీతంలో మాత్రం చోటు చేసుకున్న మార్పుల గురించి చెప్పటం కష్టమైన పని. అయినప్పటికి నాటి సంగీత నృత్యాలకు నేడు ప్రదర్శింపబడుతున్న సంగీతంలో మాత్రం చోటుచేసుకున్న మార్పుల గురించి చెప్పటం కష్టమైన పని. అయినప్పటికి నాటి సంగీత నృత్యాలకు నేడు ప్రదర్శింపబడుతున్న సంగీత నృత్యాలకు తేడా ఉందని మాత్రం చెప్పవచ్చును. ప్రాచీన కాలానికి సంబంధించిన విషయ వివేచన చేయటానికి మనం మానసికంగా ఆ కాలానికి వెళ్ళి విశ్లేషించాలి, కాని నేటి దృక్పథంలో విశ్లేషణ చేయటం సముచితంగా ఉండదు. అయితే ఈ సందర్భంలోని అంశం భారతీయ సంగీతం, అందులో ముఖ్యంగా మహిళా వాగ్గేయకారుల పాత్రను విశ్లేషించటం మాత్రమే. ఈ సందర్భంలో నృత్యసంగీతాలలో స్త్రీల పాత్ర ఏమిటి అన్నది కొంత లోతుగా వెళ్ళి చర్చించాలి.

ప్రపంచంలో భారత మహిళలకు ఒక ప్రత్యేకత ఉంది అని పదే పదే చెప్పటం కంటే ఆ ప్రత్యేకత ఏంటో మనం అధికారంగా చూపించగలగాలి. చరిత్రకెక్కక పోయినా చరిత్ర సృష్టించిన స్త్రీలు అనాదిగా మనదేశంలో ఉన్నారు అన్న విషయం ప్రపంచానికి తెలియటం చాలా అవసరం. స్త్రీ శక్తి స్వరూపిణిగా విగ్రహరూపంలో పూజలందుకోవడం మాత్రమే కాదు, సంఘ సంస్కరణ దృష్టిగల ఒక మానవతామూర్తిగా కన్పించాలి. ప్రాచీన కాలంలో విధుషీమణులైన స్త్రీలు మనకిట్లా దర్శనమిచ్చారు. ఆ స్ఫూర్తిని తీసుకుని నేటి సమాజంలోని స్త్రీలు మరింత ముందుకు పోవాలి. ఈ భావనతో నేను మానవతా మూర్తులైన విదుషీమణులైన, నిర్భీతితో తమదైన దారిలో ముందుకు పోతూ తర్వాతి తరాల వారికి మార్గదర్శకులైన స్త్రీల రచనలను విశ్లేషించడం ఈ వ్యాసంలో జరుగుతుంది.

భారతదేశమంతటా ఎల్లలులేని సంగీత రసధుని ఎప్పుడూ ప్రవహిస్తున్నప్పటికీ ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క సంగీత ప్రక్రియ ఉంది. నది ఉద్గమస్థానం నుండి ముందుకు ప్రవహిస్తూ నేల గుణాన్ని బట్టి రంగుభేదం చూపిస్తుంది. కానీ మౌలికంగా పుట్టిన దగ్గరినుండి సాగర సంగమం వరకు ప్రవహించే నీటి సహజ గుణం ఒకటే. ఆ నీటి ప్రయోజనం ఒక్కటే. అదేవిధంగా భారతీయ సంగీతాత్మ మౌలికంగా ఒక్కటే. నీటి దగ్గరకి ఎవరు ఏ పాత్ర తీసుకెళితే అంతే నీరు దొరుకుతుంది. అది వారి ప్రాప్తం. ఈ విధంగా ఒక్కటైన సంగీతం భిన్నరూపాలు దాల్చింది. సుందర కళాకృతులుగా మారింది. సంగీత భేదం ఏదైనా ఆస్వాదించే రసహృదయమే సంగీతాభివృద్ధికి పునాది అయ్యింది. సంగీతాన్ని తమకర్థమైన రీతిలో గ్రహించాయి విశాల భారతదేశంలోని ఒక్కొక్క ప్రాంతం. తమ

భాషకనుగుణంగా ఆ సంగీతాన్ని మలుచుకున్నాయి, దానిని తమదైన రీతిలో ప్రదర్శించాయి. హృదయానుభూతిని వైయుక్తిక పరిధి నుంచి విశ్వజనీనతగా విస్తరింపచేయటానికి చేసిన ప్రయత్నమే గానం ఒక కళగా రూపొందింది. కాలక్రమేణా గానకళ ఒక విద్యగా మారి ఎన్నెన్నో మార్పులకు లోనైంది. నాదోపాసకులైన గానమూర్తులు తమ విద్యతో సమాజానికి సులభరీతిలో మోక్షమార్గం చూపించారు.

సమాజంలో సగభాగమైన స్త్రీ ఈ విషయంలో ఏ మాత్రం వెనకబడలేదు. పురుషునితో సమానంగా తాను రచనలు చేసింది. సాటి జనుల మెప్పును పొందింది. ఏ సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలు స్త్రీలను అడ్డుకున్నాయో గాని తర్వాతి కాలంలో స్త్రీల రచనలు వెలుగు చూడలేదు. వేదాలలో ఎన్నో ఋక్కులు స్త్రీల రచనలుగా కనిపిస్తున్నాయి. ఆ తర్వాత కూడా క్వచిత్తుగా స్త్రీ రచనలు కనిపిస్తూనే వచ్చాయి. స్త్రీల రచనలు విరివిగా కనిపించనంత మాత్రాన వాళ్ళు రచనలు చేయలేదని తీర్మానించలేము. పేరు పొందిన ఎందరో మహాకవుల రచనలు ఎన్నో నేటికి వెలుగు చూడలేదు కదా!

దక్షిణ భారతదేశ భాషలైన తెలుగు, కన్నడం, తమిళ, మలయాళాలలో ప్రతిభావంతులైన స్త్రీలు ఎందరో సాహితీ మూర్తులుగా కనిపిస్తున్నారు. కారణాంతరాల వలన మరుగున పడిన వాగ్గేయకారిణులను, వారి రచనలను వెలుగులోనికి తీసుకుని రావాలని, ఆ రచనలకు తగిన విలువా, స్థానం కల్పించాలని నా సంకల్పం. దక్షిణ భారత భాషలన్నీ ఒకే భాషా కుటుంబానికి చెందిన భాషలు. ధాతు రూపాలు, క్రియా రూపాలు కొద్దితేడాలతో ఒకే విధంగా ఉంటాయి. ఇక్కడి ప్రజల ఆహార విహారాలు, ఆచార వ్యవహారాలు కొద్ది మార్పులతో ఒకే రీతిలో ఆచరింపబడతాయి. ఇక్కడి స్త్రీలు - వారి మనోభావాలు, ఆలోచనలు, అభిరుచులు చాలా సాత్వికమైనవి. భారతీయ ప్రతిబింబాలుగా వీరు కనిపిస్తారు. అటువంటి సున్నిత మనస్కులు రచించిన గేయాలు లలితమైన భావాలతో నిండి ఉంటాయనడంలో విప్రతిపత్తి లేదు. భాషలో కొద్దిపాటి మార్పులు ఉన్నప్పటికీ, భావంలో ఒకే రకంగా పెనవేసుకొనిపోయిన ఈ స్త్రీ వాగ్గేయకారులను ఒకే త్రాటిపై నిలబెట్టాలని, జాతీయతా సూత్రాన్ని ఈ రకంగా మరొక్కసారి నిరూపించడం అవసరం. అయితే ఈ వ్యాస పరిధిని దృష్టిలో ఉంచుకుని కేవలం తెలుగు స్త్రీ వాగ్గేయకారిణుల గురించి ముచ్చటించుకుందాం.

గానం సమ్మోహనకరమైన విద్య. గానానికి లొంగని శక్తి ఏదీలేదు. దేవ మానవ తిర్యగ్జాతులు కూడా గానానికి వశీకరించబడగలవని శాస్త్రకారుల తీర్మానం. "కలౌ గాన ప్రియో హరిః" అన్న సూక్తి సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు కూడా కలియుగంలో గానమంటే ఆసక్తి చూపిస్తాడని తెలుస్తోంది. మందంగా వీచేగాలి, గలగలా పారే ఏరు, ఎగిరే పులుగులు, ఝుంకారం చేస్తూ పూలమీద తిరిగే తుమ్మెదలు, ఆకుల చాటున దాగి కూసే కోయిలలు - ఈ విధంగా సకల ప్రకృతిలో అపురూపమైన లయాన్వితమైన శక్తి దాగి ఉన్నదన్నది సర్వులకు తెలిసిన విషయమే. ఈ అంతర్గత శక్తియే ఒక విద్యగా, ఒక కళగా రూపుదిద్దుకుంది. ఆ పాత మధురమైన సంగీతం ఉపాసకునకు, శ్రోతకును జీవన్ముక్తుని కలిగిస్తుంది. భావకులైన వాగ్గేయకారులు భగవద్భక్తి తత్పరులై, తమ జ్ఞాన భక్తి వైరాగ్యాలను తమ రచనలలో పొదిగి, తద్వారా తమ అనుభవాలను లోకానికి అందించారు. సంగీతాన్ని తమ రచనలలో ఇమిడ్చి చక్కటి గేయాలు సమాజానికి అందించిన ఈ విధుషీమణుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

ఋగ్వేదం, యజుర్వేదం కాలం నాటికి సంగీతం ప్రచారంలో ఉన్నప్పటికీ సామవేదం ప్రత్యేకించి సంగీతాభివృద్ధి చేసింది. ఎందుకంటే ఈ కాలం నాటికే సప్తస్వరాలతో గానం చేసే పద్దతి ప్రచారంలో ఉంది. అసలు 'సాము' అంటేనే సంగీత సంబంధి. సా అంటే గద్యమని, మ అంటే స్వరమని అర్థము. వేదకాలం సంగీత సాహిత్యాల సమ్మేళన కాలం. వేదాలలోని ఋక్కులందు గల సాహిత్య విలువలు ఎంత ఉన్నతమైనవో అందులోని సంగీతపు వైశిష్ట్యత కూడా అంతే ఉనతమైనది. సంగీత సాహిత్యాలు రెండు కలిసినప్పుడే సమగ్రమైన రూపం ఏర్పడుతుంది. ఒక కీర్తన యందు సాహిత్య భావం, ఆ రాగ భావంతో మిళితమైనపుడే ఒక పరిపూర్ణత ఏర్పడి దానికి లయ తోడై శ్రోతల మనస్సులను అలరింపచేయగలదు. సాహిత్యం లేని స్వరసంపుటి గాని, విస్తారమైన రాగం ప్రస్తారం మాత్రమే గల

స్వల్ప సాహిత్యపు తునక గానీ శోభించవు. రాగభావం, సాహిత్య భావం సరిసమానంగా జత కూడినప్పుడే ఆ గానం శ్రోతల చిత్తాన్ని రంజింపచేయగలదు.

రఘువంశంలో కాళిదాసు ఈ అభిప్రాయమును అత్యద్భుతంగా వివరించారు చూడండి.

'వాగర్థావివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే

జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరః

శబ్దం లేని అర్థం, అర్థం రాని శబ్దం అసమగ్రమైనవి. అర్థనారీశ్వర తత్వాన్ని ఈ విధంగా భావించాడు కవి కులగురువు కాళిదాసు. ఈ అభిప్రాయాన్ని సంగీత సాహిత్యాలకు అన్వయించవచ్చును. సంగీత సహాయము లేని సాహిత్యం, సాహిత్యావలంబన లేని సంగీతం అసమగ్రమైనవి. ఈ భావన మనకు వేదాలలో కూడా కనిపిస్తుంది. మొదట మంత్ర రచన జరిగి, ఆ తర్వాత సంగీతపు కూర్పు ఏర్పరచుట అన్నది జరగలేదు. ఈ రెండు సమాంతరంగా జరిగాయి.

"సీతావర! సంగీత జ్ఞానము ధాత వ్రాయవలెరా!

గీతాధ్యఖిలోప నిష్తార భూత! జీవన్ముక్తుడౌటకు

అని త్యాగరాజు అంటారు. ఇటువంటి దైవనాగ్రహం గల వారే మన ప్రాచీన వాగ్గేయ కారులందరూ. భగవద్దత్తమైన ఈ నాద యోగాన్ని తిరిగి భగవదర్పణం చేసిన ధన్యులు. "కెరయ నీరద కెరిగె జల్లి వరవ పడెదవ రంతి కాణిరో" - అని పురందర దాసు అంటారు.

శబ్ద రూపమైన సాహిత్యాన్ని, స్వర రూపమైన వర్ణమెట్టునందు, పరిణత జ్ఞానాన్ని పొంది పొందికగా రెండింటిని సమన్వయ పరచి సహృదయ మనోరంజకంగా రచనలు చేసేవారు వాగ్గేయకారులని అర్థం. అయితే కేవల ధాతుమాతుకూడికతో ఏర్పడిన గీతం సంపూర్ణమైంది కాదు. మనోహర భావ సంపన్నతతో, ప్రసన్నమైన పద సముదాయంతో కూడిన సాహిత్యం సంగీతంతో సమ్మిళితమైనపుడు, అది ఆపాతమధురమై, అలౌకిక భావ పరంపరలను కల్గిస్తుంది. ఈ అనుభవం ఉత్తమ వాగ్గేయకారుల రచనలలో కనిపిస్తుంది.

భారతీయ అపూర్వ దార్శనికతకు వేదాలు చక్కని ఉదాహరణలు. జీవన వేదాన్ని కవితాత్మకంగా వెలయించిన రచనలవి. ప్రాచీన నాగరిక సమాజపు సంగీత సాహిత్యాలు తెలుసుకోవాలంటే, నాగరికపు విలువను అర్థం చేసుకోవాలంటే సంస్కృత వాఙ్మయం, ముఖ్యంగా వేదాలు చదవవలసిందే. ఈ సాహిత్యమంతా సర్వాంగ సుందరమైనది. అంబరాన్ని చుంబించే రసగంగా ప్రవాహంతో భూతలాన్ని పునీతం చేసిన సాహితీ ధార అది. ఆ సాహితీ ధారలో మృదుమధురంగా వినిపించే జల తరంగిణుల సంగీతం మనలనొక రసప్రపంచానికి తీసుకునిపోతుంది. ఈ అమరవాణిలో తమ బాణీలను సహజ సుందరంగా పలికించారు నాటి విదుషీమణులు. వీరిని ఆ కాలంలో 'ఋషిక'లన్నారు. సాహిత్య విలువలు కలిగి ఉన్న ఈ ఋక్కులు ఛందో భరితమైనవి, గానానుకూలమైనవి. ప్రతిభకు స్త్రీ పురుష భేదం లేదని నిరూపించారు ఋగ్వేదం నాటి ఋషికలు. ఈ కాలంలోని స్త్రీలు సంగీత సాహిత్యపు విలువలతో ఉన్న కవిత్వం సంస్కృతంలో చెప్పారు. ఆ తర్వాతి కాలంలో ఏర్పడిన అనేక ప్రతికూల పరిస్థితులకు తల ఒగ్గిన కారణంగా స్త్రీల రచనలు మనకు కన్పించలేదు. కానీ ఈ ప్రతికూల పరిస్థితులను కొందరు స్త్రీలు ఎదిరించి, సామాజిక సాహిత్య స్పృహతో రచనలు చేసి విదుషీమణులనిపించుకున్నారు. నాటి ఋషికలకు వీరు నిజమైన వారసులన్పించు కున్నారు. అటువంటి ఉత్తమ వాగ్గేయకారిణుల గురించి తెలుసుకుందాం.

చరిత్రకందని కాలం నుండి తెలుగు ప్రజలు, తెలుగు భాష ఉన్నప్పటికీ అధికారికంగా ఆధార సహితంగా మనం చెప్పుకోవలసింది 11వ శతాబ్దం నుండి మాత్రమే. అంతకంటే పూర్వమే తెలుగు భాష జనం వ్యవహారంలోనూ, సాహిత్య పరంగానూ కూడా ఉన్నది, కానీ వెలుగు చూడలేదని మాత్రం చెప్పవచ్చును.

మొదటిసారిగా 15వ శతాబ్దంలో అన్నమాచార్యుని భార్య తాళ్ళపాక తిమ్మక్క వెలుగులోకి వచ్చింది. అప్పటి నుండి దాదాపు 200 సంవత్సరకాల పాటు స్త్రీలు సాహిత్య రంగంలో తమదైన స్థానాన్ని నిల్పుకున్నారు. వారి సంగీత సాహిత్య సేవ చూద్దాం. తాళ్ళపాక తిమ్మక్క తొలి తెలుగు కవయిత్రి. తిమ్మక్క సహజంగా సంగీత సాహిత్యాలలో నిపుణురాలు. కాబట్టి తన రచనయైన సుభద్రా కళ్యాణం చక్కటి లయతో కొనసాగించింది. చిన్నతనంలో పుట్టినింటిలో సంగీత సాహిత్యాల  నిరంతర గోష్ఠి తిమ్మక్కకి ఆయా విషయాల పట్ల ఆసక్తిని పెంచింది. తర్వాతి కాలంలో భర్తయైన తాళ్ళపాక అన్నమాచార్యుల వారి సాహచర్యంలో అందులో పరిణతిని సాధించింది. అందుకే సుభద్రా కళ్యాణంలో ఆ పరిణతి అడుగడుగునా కనిపిస్తుంది. తిమ్మక్క సంగీత సాహిత్య పరిజ్ఞానానికి ఈ రచన చక్కని ఉదాహరణ. ఈమె సాహితీ జగత్తును తన కుసుమ కోమల కవితతో ఉర్రూతలూగించింది. సాహిత్య పరంగా సంగీత పరంగా ఎన్నదగిన ఈ వర్ణన చూడండి.

"యెగు భుజమ్ముల వాడు... చెలుగు పాదములు.."

చక్కటి లయతో కొనసాగుతుందీ గేయం.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*




## *భారతీయ సంగీతంలో మహిళల పాత్ర - ఒక పరిశీలన*

*డా.వై.కృష్ణకుమారి*

*(గత సంచిక తరువాయి)*

**రామకథపైని మక్కువతో,** భక్తితో తెలుగు కవులెందరో రామాయణాన్ని కావ్యంగా మలిచారు. అందులో ఆతుకూరి మొల్ల విశిష్ఠ స్థానాన్ని ఆక్రమిస్తుంది. తానేమీ చదువుకోలేదని, శ్రీకంఠ మల్లేశ్వరుని వరం చేతనే కవిత్వం చెప్పగలిగానని ఎంతో వినయంగా చెప్పుకుంది మొల్ల. కానీ మొల్ల రామాయణం చదివితే ఆమె పాండిత్యపు లోతు, గాంభీర్యం, కవిత్వపు సున్నితత్వం అర్థమవుతాయి. కొన్ని వందల రామాయణాలు రచింపబడిన నేపథ్యంలో మొల్ల రామాయణం నేటికీ నిలిచి ఉండటమే ఆ కావ్యానికి గల విశిష్టత. వర్ణన ద్వారా వ్యక్తిని మన కళ్ళముందర నిల్పగల నైపుణ్యం మొల్ల లేఖినికి తెలుసు. ఈ పద్యం చూడండి.

**"కట్టిన వస్త్రంబు కట్టుకొంగే తక్క...**

**..నిత్యమును మిమ్ము మదిలోన నిల్పియుడు"**

దిగులుతో కృశించిన సీతాదేవి రూపం మనకు కళ్ళెదుట ప్రత్యక్షమవుతుంది ఈ వర్ణన ద్వారా. ఈ వర్ణనకు సీసపద్యం ఎన్నుకోవడంలోనే ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. ధారగా ప్రవహించే కన్నీటిలో, ఎడతెగని బాధతో బెంగటిల్లుతున్న సీత మానసిక స్థితి - ఎక్కడా ఆగక నడిచిపోయే సీసపద్య నడకలో గోచరిస్తుంది. ఇది ఏకతాళంలో లేదా రూపకతాళంలో గానం చేయవచ్చును. ఇది ఆమె లయ పరిజ్ఞానాన్ని సూచిస్తున్నది. సంగీత పరిజ్ఞానం లేకుండా ఇంత లయాత్మకత సాధించటం అసాధ్యం. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మొల్ల అభినందనీయురాలు.

దక్షిణాంధ్ర సాహిత్యంలో మనకు విదుషీమణులెందరో కనిపిస్తున్నారు. అందులో తంజావూరి రఘునాథరాయని కాలంలో విలసిల్లిన ప్రఖ్యాత కవయిత్రి రామభద్రాంబ, పసుపులేటి రంగాజమ్మ మొదలైన వారెందరో కనిపిస్తున్నారు.

తెలుగుభాషలో బాలసాహిత్యమనే ప్రక్రియ ఉంది. బాలగేయాలు గాని, వాటి కర్తలు గాని ఏ కాలం నాటివో చెప్పలేము. పిల్లల మనసెరిగిన తల్లులు, తల్లి ప్రేమకు పాత్రమైన బిడ్డలు తొలి కవులుగా పరిగణింపబడాలి. "తీయని పెదవులతో బిడ్డను మనసారా స్పృశిస్తుంది తల్లి. బిడ్డ కళ్ళనిండా తల్లి మొగమే కనిపిస్తుంది. ఆ మధుర హృదయం నుంచి ఏవో పిలుపులు, గుసగుసలు మాటలుగా, పాటలుగా పొంగాయి. తల్లి బిడ్డల మధ్య ఆ నిముషంలో కాలాన్ని స్థంభింప చేసిన ఆ నిముషంలో వెలువడిందే బాలసాహిత్యానికి ఆలంబనం. ఆ మాటలే, ఆ పాటలే ఏ నాటికీ చెరగని తరగని మధుర నిధులు" అంటారు నార్ల చిరంజీవిగారు. నిజానికి వీరే తొలి

వాగ్గేయకారులు నా దృష్టిలో. తన కంటిపాపను ఆప్యాయంగా హృదయానికి హత్తుకున్న తల్లి నోట అప్రయత్నంగా అవ్యక్తమైన రాగం దానివెంట ఏవేవో పదాలు దొర్లుతాయి. కాల్రక్రమేణా అవే బాలగేయాలుగా రూపాంతరం చెంది ఉంటాయి. ఈ బాలగేయాలు ముఖ్యంగా తల్లి బిడ్డలకు సంబంధించినవి కావటం చేత ఈ గేయాల కర్తలు స్త్రీలే అనటంలో సందేహం లేదు. ఈ ఉగ్గుపాట గమనించండి.

"ఊం ఉం ఉంగన్న
ఉగ్గుపాలు ఇందన్న
గంటెడు ఉగ్గు కమ్మన్న
ఉమ్మక కక్కక మింగన్న"

అంటూ తనకు తెలిసిన పదాలతో ఒక చిన్నగేయం కల్పించిందా తల్లి. ఇందులోని భావం, రాగం బిడ్డకు అర్థమయే అవసరం లేదు. తల్లికే బిడ్డ జీర్ణశక్తి పెరగాలన్న తపన తప్ప. ఇంకా ప్రత్యేకించి అర్థం లేదు కూడా. విద్యాబుద్ధులు, సంప్రదాయాలను నేర్పడంలో తల్లికి సాటిలేరెవ్వరు. పసితనంలోనే తన పాపకు ఎవరెవరి పట్ల భక్తి ప్రదర్శించాలో తల్లి ఇట్లా చెబుతుంది.

"లాలను పోసి, పాలను తాపి
జోలను పాడే, అమ్మకు జేజే..
..గురువుకు జేజే"

ఈ బాలగేయాలు, రాగాలు కూడా అతి సున్నితమైనవి. ఎక్కువ గమకాలు ఇత్యాదులు లేనివి. అందుకే ఎంతకాలం గడచినా ఆయా రాగాలలో చెప్పుకోదగ్గ మార్పులు రాలేదు. ఆ లాలిపాట, దానిరాగం, తల్లి నెమ్మదిగా జోకొట్టే విధానం పాపాయిని వెంటనే నిద్రపుచ్చుతాయి. ఈ గేయాలు కల్పించిన ఆ తల్లులెవరో గాని ఆ రాగ విచక్షణ, తాళ పరిజ్ఞానం గమనిస్తే వారి ప్రతిభ మనకు అబ్బురమనిపిస్తుంది. ఈ గేయాల ద్వారా తమకొక స్థానం ఏర్పడాలని, తద్వారా సమాజం తమని ప్రత్యేకంగా సంభావించాలని ఆశించలేదా తల్లులు. అజ్ఞాత వాగ్గేయ కారులైన ఈ మాతృమూర్తులకు తలవంచి ప్రణామం చేయటం ద్వారా మన కృతజ్ఞతలు తెల్పుకుందాం.

దేశానికి స్వతంత్ర్యం వచ్చాక అన్ని రంగాలలో స్త్రీలు ముందుకు వచ్చారు. తమ తమ రంగాలలో చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించారు. ఈనాడు వీరికున్న అవకాశాలు ఆ కాలంలో వారికి లేవు. కానీ వారి ఉత్సాహం, వారి కార్యదీక్ష, పట్టుదల నేటి స్త్రీలోకానికి ఆదర్శం కావాలి. ఆ ప్రేరణతో జాతీయతా భావాన్ని మరింత పటిష్టం చేసుకుని నేటి మహిళా లోకం ఆకాశమే తమ సరిహద్దుగా ముందుకు సాగాలి. కారణాలు ఏమైనా నేడు స్వతంత్ర భారతదేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలతోపాటు కళారంగం కూడా ప్రశ్నార్థకమై పోయింది. మనస్సుకు ఆహ్లాదం కలిగించవలసిన సంగీతం అగమ్యగోచరంగా మారిపోయింది. ఇక్కడొక ఆసక్తికరమైన విషయాన్ని వివరిస్తాను.

వినటానికి, నమ్మటానికి కొంత విచిత్రంగా ఉన్నప్పటికీ ఈ మధ్యకాలంలో జరుగుతున్న విశేష పరిశోధనలు ఈ వాదాన్ని బలపరుస్తున్నాయి. యక్షులు, కిన్నరులు, కింపురుషులు, గంధర్వులు మొదలైన వారందరు ఒక ప్రత్యేకమైన జాతి. వీరిది సంచార జీవనం. స్థిరమైన జనావాసాలు ఇంకా మొదలు కాని కాలమది. ఈ జాతులను విశ్లేషిస్తున్నప్పుడు నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. యక్షులకు అధిపతియైన కుబేరుని అలకాపురి భారతదేశానికి సరిగ్గా పైపైపు ఉత్తర దిశలో ఉండేదన్న విషయాన్ని పురాణాలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని యక్షులు మొదలైన ఇతర సమూహాలన్నీ జీవనార్థం సంచారం జరుపుతుండేవి అని కూడా చారిత్రక గ్రంథాలు అంగీకరిస్తున్నాయి. పురాణాల ప్రకారం యక్షులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు

మొదలైన వారంతా సంగీత నాట్యాలను ప్రదర్శించే జాతికి చెందిన వారు. వీరంతా కుబేరుని ఆధిపత్యాన్ని అంగీకరించినవారు. చారిత్రకంగా చూస్తే కూడా వీరు నాట్యం, గానం జీవనోపాధిగా గల సంచార జాతి అని తెలుస్తున్నది. సంచార జీవులైన యక్షులు తామున్న ప్రాంతాన్నుంచి ఇంకా ముందుకు అంటే వాయువ్యదిశగా వెళ్ళినట్లు, కొంతకాలం తర్వాత అక్కడ నివాసం ఏర్పరచుకొన్నట్లు తెలుస్తోంది. అదే నేటి జకోస్లొవేకియా దేశం. నేటి జకోస్లొవేకియా రాజధాని యైన 'ఫ్రాగ్' యొక్క పూర్వపు నామం 'ప్రాహ'. ప్రాహః అన్న పదం సంస్కృత పదం. 'నాట్యకళలో శిక్షణ' అన్న అర్థం కల ఈ పదం క్రమేపీ 'ప్రాగ్'గా మారింది. అంతేగాదు. అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న యక్షులు క్రమేపి జక్కులుగా వ్యవహరింపబడ్డారు. వర్ణవ్యత్యయం వలన 'య' కారం 'జ' కారంగా మారుతుందని మనకు తెలుసు. కాబట్టి యక్షులు జక్కులుగా మారి తర్వాతి కాలంలో జెక్ రూపం ఏర్పడింది. నేటికి జెకోస్లోవికియాలో అనేక నగరాల పేర్లు, నదుల పేర్లు శివసంబంధులుగా కనిపిస్తాయి. ఇంత వివరంగా ఈ విషయం చర్చించటానికి ఒక కారణం ఉంది. మధ్య ఆసియాలో బౌద్ధమతం బాగా వ్యాప్తిలో ఉన్న కాలంలో అక్కడ నిర్మింపబడిన అనేక ఆరామాలలో బుద్ధునికి రెండువైపులా యక్షప్రతిమలు ఉన్నాయి. వీరు బుద్ధునికి వ్యక్తిగత సేవకులుగా మనకు దర్శనమిస్తున్నారు. ఇక్కడి బౌద్ధ ఆరామాలలో కనిపించే నాట్య భంగిమలు విగ్రహాలన్ని యక్షిణులవే. దేవతల ప్రీత్యర్థం యక్షులు లేదా జక్కులు సంగీత నాట్యాలను ప్రదర్శించేవారుట. తర్వాత ఎంతోకాలానికి మనదేశంలో ప్రాచుర్యం పొందిన యక్షగాన ప్రక్రియ వీరి ద్వారా వచ్చినదే. వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామంలో 'జక్కుల పురంధ్రి' వర్ణన బౌద్ధ శిల్పాల ననుసరించి చేసినదే. అనంతర కాలంలో యక్షగానాన్ని కూచిపూడి వారు స్వీకరించి అభివృద్ధి చేసారు. ప్రస్తుతం భరతనాట్యం, కూచిపూడి నాట్యాలలో ప్రముఖంగా కనిపించే 'కైశికీ వృత్తి'కి పునాదులు ఈ యక్షగానంలో కనిపిస్తాయి. కైశికీ వృత్తి అంటే సుకుమారమైన శృంగార హావభావాలు. ఇది లాస్యప్రధానమైన నృత్యం. ఆలయాలలో కనిపించే భంగిమలలో వీటికే ప్రాధాన్యత కనిపిస్తున్నది.

ఇతర దేశాలకు వలస వెళ్ళిన మన కళాకారుల వలన భారతీయ సంగీత నృత్యాలవారు నేర్చుకోవడమే కాకుండా నేటికి కూడా ఆయాదేశాలలో కొద్దిమార్పులతో కొనసాగిస్తున్నారు. ఆ కాలంలో విదేశీయులను సహితం ఆకర్షించిన మన సంగీత నృత్యాలు నేడు ఏ కారణంగా స్వదేశీయులను ఆకట్టుకోవడం లేదు. దేశీయ కళలను చిన్నచూపు చూసి విదేశీయ కళలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వమూ, దానికి వత్తాసు పలుకుతున్న ఎలక్ట్రానిక్ మీడియావాళ్ళు కారణమా? ఎవరి మెప్పుకోసమో ప్రాకులాడుతున్న విద్యాసంస్థలా? తమ పిల్లల అర్థం లేని ఒళ్ళు విరుపుల నృత్యాలు చూసి మురిసిపోతున్న తల్లిదండ్రులా? ఎటువైపు వెళుతున్నదో తెలియని సమాజాన్ని చూసి మాటలాడలేని మేధావి వర్గానిదా?

సంగీతం విశ్వజనీన భాష, ప్రాంతీయ భేదాలుగాని, భాషాభేదాలు గానీ, ఖండాంతర భేదాలుగానీ ఉత్తమ సంగీత వ్యాప్తికి అడ్డుకాకూడదు. ఉత్తమ సంగీతమంటే విశ్వవ్యాప్తంగా ఏ భాషకు సంబంధించినదైనా కావచ్చు. ప్రపంచ విఖ్యాతి పొందిన మైఖేల్ జాక్సన్ పాటలు శ్రద్ధగా వినండి. శరీరాన్ని మాత్రమే ఊపించడం కాదు, ఆ సాహిత్యం మనస్సుని కదిలిస్తుంది, మేధ ఆలోచించడం మొదలుపెడుతుంది. ఇటువంటి సంగీతాన్ని అనుకరించినా నష్టంలేదు. కానీ అటు సంగీతంలో గానీ, ఇటుసాహిత్యంలోగానీ ఏ మాత్రం ఉదాత్తత లేకుండా మనశ్శరీరాలను తప్పుత్రోవ పట్టించే నేటి పాటలు ఇప్పటి తరాన్నే గాకుండా రాబోయే తరాల వారిలోకూడా విషయం నింపుతామన్నది నిజం.

ఇంటిని అన్ని విషయాలలో సరిదిద్దగల నేర్పుపటిమ ఉన్న స్త్రీలు ఈ విషయంలో ఉదాసీనంగా ఉండటం ఔచిత్యంకాదు. ముఖ్యంగా సంగీత సాహిత్యాలలో ప్రతిభగల స్త్రీలు సమాజం పట్ల తమ బాధ్యతను గుర్తించడం లేదనిపిస్తుంది. ఒక కాలంలో తమ రచనల ద్వారా సమాజాన్ని తట్టిలేపిన స్త్రీ వాగ్గేయకారులు నేడు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? తమ ప్రతిభను తామే గుర్తించటం లేదా? తమ కృషికి తగినంత గుర్తింపు, విలువా లేదన్న నిస్సహాయతనా? నలుగురితో బాటు తాముకూడా నడవాలి అన్న నిర్లిప్తత

కొనసాగితే విదేశీయులకు మనమేం సాంస్కృతిక రంగంలో విదేశీయత బలంగా పాదుకుని ఉంది. ఇప్పటి ఈ నిర్లిప్తత కొనసాగితే విదేశీయులకు మనేం సాంస్కృతికంగా బానిసలం అయ్యే ప్రమాదం ఉంది. ముందుగా ఇంటినుంచే పరివర్తన రావాలి. అందులోనూ తల్లి పిల్లలకు మన సంస్కృతిని నేర్పించాలి. ఇంటిలో లభించే ఈ పునాది రేపటి రోజున సమాజంలో దేశీయతను పెంచుతుంది. పెరిగిన దేశీయత దేశంపట్లా, స్వదేశీయమైన సాంస్కృతిక రంగంపట్లా గౌరవాభిమానాలను పెంచుతుంది. శారీరకంగా సున్నితత్వం ఉన్నప్పటికి మానసికంగా దృఢమైన స్త్రీలు సాంస్కృతిక రంగాన్ని కాపాడగలుగుతారు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. వెయ్యి అడుగుల దూరాన్ని కూడా మొదలు పెట్టిన మొదటి అడుగే గమ్యాన్ని చేరగలమన్న ధైర్యాన్ని కలిగిస్తుంది. కాబట్టి క్రమంగా నీరసిస్తున్న సంగీత రంగాన్ని కాపాడగలిగి తిరిగి పూర్వపు ఔన్నత్యాన్ని తీసుకుని రాగల సత్తా నేటి మహిళలకు ఉంది.

పసిపిల్లల నోటినుంచి ముద్దు ముద్దు పలుకులు రావాలిగాని ముదురు మాటలు రాకూడదు. అటువంటి పరిస్థితి నేడు మీడియాలో చూస్తున్న ఎందరో బాలగాయకుల ద్వారా మనం వింటున్నాం. వింత సంస్థల నుండి డబ్బులు తిన్న కక్కుర్తి ఎలక్ట్రానిక్ మీడియా కబంధ హస్తాల నుండి మన రేపటితరం బాలలని రక్షించే నేర్పు, ఓర్పు నేటి తరం స్త్రీలు అందిపుచ్చుకోవాలి. ప్రతి స్త్రీ తనలోని తల్లితనాన్ని పైకి తెస్తే బిడ్డలు ఆ ప్రేమలో కరిగిపోయి బంగారు బొమ్మలవుతారు. ఈ బంగారు బొమ్మలే సంస్కృతిని ఒంటబట్టించుకుని పూవుకు తావి అబ్బినట్లు సమాజాన్ని సువాసన భరితం చేయగలుగుతారు. ఏ పని మొదలుపెట్టినా విశ్వాసంతో చేయాలి. సాంస్కృతిక రంగాన్ని ముఖ్యంగా అపూర్వమైన సంగీతాన్ని కాపాడగలమన్న ప్రగాఢ విశ్వాసంతో నేటి మహిళలు తమ కార్యక్రమాన్ని మొదలుపెడితే ఫలితం ఎందుకు ఉండదు? కృషితో నాస్తి దుర్భిక్షం అన్న నానుడి నిజం కాదా? మంచి పనికి ముహూర్తాలు చూసే అవసరంలేదు. ప్రతిఘడియ అమృత ఘడియే. పదండి. కలిసి అడుగు ముందుకు వేద్దాం. దేశాన్ని కాపాడుకుందాం.

***(సమాప్తం)***